www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

59 జీవో భూముల లావాదేవీలు బంద్



- అక్రమ క్రమబద్ధీకరణపై ప్రభుత్వం చర్యలు
- రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్‌కు కలెక్టర్ ఆదేశాలు
- గోపనపల్లిలో 12,879 గజాల ధారాదత్తం
- నానక్‌రాంగూడలో ఐదెకరాలు హాం ఫట్
- ఈ వ్యవహారంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు
- ఆదేశాల్లో ఆ అంశాలను ప్రస్తావించిన కలెక్టర్

14

మంగళవారం | 6-2-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 64 | సంచిక (Issue) : 292

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి సా. 4.09 తదుపరి ద్వాదశి; నక్షత్రం: జ్యేష్ఠ ఉ. 7.36, మూల తె. 6.27 వరకు; వర్జ్యం: మ.3.13-4.44, తె.4.56-6.27; దుర్ముహూర్తం: ఉ.9.06-9.51, రా.10.19-11.08; అమృతఘడియలు: రా.12.22-1.53; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.50, సూర్యాస్తమయం: 6.09

హైదరాబాద్ సిటీ *

Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

మాకు 370 సీట్లు

బీజేపీ సొంతంగా గెలుస్తుంది.. ఎన్‌డీఏకు 400 దాటుతాయ్

- 100 రోజుల్లో నా మూడోదఫా షురూ
- ఈసారి వెయ్యేళ్లు గుర్తుండేలా పాలన
- 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారత్
- దేశానికి బలమైన ప్రతిపక్షం అవసరం
- కాంగ్రెస్ ఆ పనిచేయదు, ఇతరుల్ని చేయనివ్వదు.. ఆ పార్టీకి ఇక తాళమే
- దశాబ్దాలు అధికారంలో ఉంది.. అంతేకాలం ప్రతిపక్షంలో ఉంటుంది
- ఓబీసీలు లేరంటారేంటి?.. నేనే ఓబీసీని
- లోక్‌సభలో ప్రధాని నరేంద్రమోదీ



పార్లమెంటు వద్ద వివిధ మతాల ప్రతినిధులతో మోదీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సొంతంగా 370 సీట్లను కచ్చితంగా గెలుస్తుందని, ఎన్‌డీఏ కూటమి 400కు పైగా సీట్లను సాధిస్తుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ధీమా వ్యక్తం చేశారు. తన మూడో దఫా ప్రభుత్వంలో భారతదేశానికి వచ్చే వెయ్యేళ్లకు అవసరమైన పునాది వేసేలా చాలా పెద్ద నిర్ణయాలు తీసుకుంటామని చెప్పారు. తన మూడో దఫా పాలన ఎంతో దూరంలో లేదని, 100-125 రోజుల్లో ప్రారంభమవుతుందన్నారు. రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై జరిగిన చర్చకు సమాధానమిస్తూ మోదీ సోమవారం లోక్‌సభలో మాట్లాడారు. దాదాపు 100 నిమిషాలపాటు కొనసాగిన ఆయన ప్రసంగంలో విపక్షాలను ముఖ్యంగా కాంగ్రెస్‌ను దునుమాడారు. దేశంలో ప్రతిపక్షాల దుస్థితికి కాంగ్రెస్ పార్టీనే కారణమని, కాంగ్రెస్ దుకాణానికి తాళం వేసే పరిస్థితి వచ్చిందన్నారు. ఇండియా కూటమి గాడి తప్పిందని, ఆ కూటమి పక్షాల మధ్య ఐక్యత లేదని.. వారిపై వారికే విశ్వాసం లేనప్పుడు ప్రజలకు వారి మీద విశ్వాసం ఎలా ఉంటుందని ప్రధాని

మిగతా 2వ పేజీలో...



2

ఇండియా కూటమి గెలిస్తే.. రిజర్వేషన్లపై 50% పరిమితి ఎత్తేస్తాం

దళితులు, ఆదివాసీల కోటా తగ్గించం

మోదీ ఓట్లడిగేటప్పుడే ఓబీసీ.. రాహుల్ ధ్వజం



సోనియాజీ.. తెలంగాణలో
పోటీ చేయండి

- ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన తల్లిగా ప్రజలు భావిస్తున్నారు
- బీసీ కులగణనకు సన్నాహాలు.. 2 గ్యారెంటీల అమలు
- త్వరలోనే మరో రెండు గ్యారంటీలను ఇవ్వనున్నాం
- సీపీపీ చైర్‌పర్సన్ సోనియాగాంధీతో సీఎం రేవంత్
- పోటీపై సరైన సమయంలో నిర్ణయం: సోనియా
- రాహుల్ భారత్ న్యాయ్ యాత్రలో పాల్గొన్న రేవంత్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ నుంచి పోటీ చేయాలని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ (సీపీపీ) చైర్‌పర్సన్ సోనియా గాంధీకి.. రాష్ట్ర ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు పీసీసీ తీర్మానం కూడా చేసిందని.. ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన తల్లిగా రాష్ట్ర ప్రజలు ఆమెను గుర్తిస్తున్నందున తెలంగాణ నుంచి పోటీ

మిగతా 13వ పేజీలో...

13

సగటు ఆడబిడ్డ రూపమే తెలంగాణ తల్లి విగ్రహం

రాచరికపు పోకడలు లేని రాష్ట్ర అధికారిక చిహ్నం

ప్రజల ఆకాంక్షల మేరకే కేబినెట్ నిర్ణయాలు: సీఎం



పేపర్ లీక్ చేస్తే కోటి జరిమానా

మూడు నుంచి పదేళ్ల వరకు జైలు శిక్ష

పోటీ పరీక్షల్లో అక్రమాలకు అడ్డుకట్ట..

లోక్‌సభలో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ బిల్లు

2



ప్రజాస్వామ్య ఖూనీని
సహించబోం

అపహాస్యంగా చండీగఢ్ మేయర్ ఎన్నిక.. పరిస్థితి భయం కలిగిస్తోంది

బ్యాలెట్ పేపర్ మీద గుర్తులను రిటర్నింగ్ అధికారి చెరిపేసినట్టుంది

రికార్డులు సమర్పించండి: సుప్రీం

2



హెచ్-4 వీసా ఉంటే.. వర్క్ ఆథరైజేషన్
ఆటోమేటిక్..

హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములు, పిల్లలకు చాన్స్.. ఏటా లక్ష మందికి లబ్ధి

ఐ1, ఐ2, ఐ3 వీసాలున్నవారికీ చాన్స్

ఏడాదికి 18 వేల మందికి గ్రీన్‌కార్డులు

కీలక బిల్లు ఆమోదించనున్న అమెరికా



విద్యార్థినుల మృతిపై.. వీడని మిస్టరీ!

హత్యా? ఆత్మహత్యా? అనేది సస్పెన్స్

ఆటోడ్రైవర్ జోక్యమే ప్రాణాలు తీసిందా?

అతడు, వార్డెన్ సహా ఆగురిపై అనుమానం

తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు

14



'అవిశ్వాసం'లో కిడ్నాప్

అట్టుడికిన 'ఇల్లందు' మునిసిపాలిటీ

చివరకు కోరం లేక వీగిన వైనం

'ఖానాపూర్'లో అవిశ్వాసానికి ఓకే

మాజీలైన చైర్మన్, వైస్ చైర్మన్

నల్లగొండ పీఠం కాంగ్రెస్ కైవసం

3



గట్టెక్కిన సోరెన్

ఝార్ఖండ్‌లో విశ్వాస పరీక్షను 47-29 ఓట్లతో నెగ్గిన చంపయి

అవినీతిని నిరూపిస్తే తప్పుకొంటా.. బీజేపీకి హేమంత్ సోరెన్ సవాల్

కోర్టు అనుమతితో బలపరీక్షకు రాక

2

గృహజ్యోతికి శ్రీకారం




గాంధీభవన్ వద్ద మహిళా కాంగ్రెస్ నేతల సంబరాలు

- 200 యూనిట్లలోపు విద్యుత్తు ఇక ఫ్రీ
- ఫిబ్రవరి నుంచే అమలు.. మార్చి బిల్లు జీరో
- ఒక కుటుంబానికి ఒక కనెక్షన్‌కే అమలు
- 2022-23లో 2181 యూనిట్లలోపు ఉండాలి
- బిల్లు జారీ టైంలోనూ 200లోపు ఉండాలి
- రేషన్ కార్డుకు ఆధార్ లింక్ అయి ఉండాలి
- ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకుంటేనే పథకం
- తొలి విడతలో 34,59,585 మందికి అమలు
- ఏటా సర్కారుపై రూ.4,164 కోట్ల భారం

3

ఆరోగ్యశ్రీకి పునర్వైభవం

- ఎక్మో, రోబోటిక్ సర్జరీలు సహా 65 ప్రొసీజర్ల చేర్పు
- ఆయుష్మాన్ భారత్‌లో లేని చికిత్సలు ఇందులోకి
- ధరల సవరణ.. ప్రాంతాలవారీ వ్యాధుల మ్యాపింగ్
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్సలు తెలిపేలా ప్రచారం
- బడ్జెట్ భేటీల్లో సమావేశాల్లో ప్రకటించనున్న సర్కారు



13

రేవంత్ ఝూటా సీఎం

- ప్రాజెక్టుల అప్పగింతపై చెప్పినవన్నీ అబద్ధాలే
- ఈ అంశంపై కేసీఆర్ ఎక్కడా సంతకం చేయలే
- పోతిరెడ్డిపాడు, సీమ లిఫ్టును వ్యతిరేకించాం
- ఎవర్ని చెప్పుతో కొట్టాలో రేవంతే జవాబివ్వాలి
- రేవంత్‌ది సంస్కారం లేని భాష, అహంకారం
- ప్రాజెక్టులిచ్చి భవిష్యత్తు తాకట్టు పెట్టొద్దు: హరీశ్
- మాకూ ముతక కూతలొచ్చు: జగదీశ్, ప్రశాంత్
- కేసీఆర్‌నే దూషిస్తావా.. బుద్ధి ఉందా?: కడియం
- చెత్త సీఎంను చెప్పుతో కొడతా: బాల్క సుమన్
- చెప్పు చూపిస్తూ పరుష పదజాలంతో దూషణ



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా బోర్డుకు ప్రాజెక్టులను అప్పగించేందుకు కేసీఆరే సంతకం చేశారంటూ సచివాలయం వేదికగా సీఎం రేవంత్‌రెడ్డి అబద్ధాలు మాట్లాడారని మాజీ మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. ప్రజలకు ఏం చెప్పాలో తెలియక, బూతులతో బుల్డోజ్ చేసేందుకు రేవంత్ యత్నించారని, అబద్ధాల పునాదులపై పాలన సాగించేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణ భవన్‌లో సోమవారం హరీశ్ మాట్లాడారు. 'కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నట్లు జనవరి 17న జరిగిన

మిగతా 12వ పేజీలో...

కేసీఆర్, జగన్ కుట్రతోనే సాగర్ ఆక్రమణ

12

పోలింగ్‌ను ప్రభావితం చేసే ప్రయత్నం

హరీశ్.. ఉద్యమంలో మీరు బ్లాక్‌మెయిలర్లు

కృష్ణా ప్రాజెక్టుల్ని బోర్డుకు ఇవ్వం: ఉత్తమ్

గ్రామీ అవార్డుల్లో మనోళ్ల 'శక్తి'

- ఐదుగురు భారతీయులకు పురస్కారాలు
- ఫ్యూజన్ బ్యాండ్ 'శక్తి'కి గ్లోబల్ మ్యూజిక్ అవార్డు
- ఆ బ్యాండ్ సభ్యుల్లో.. ప్రముఖ తబలా మ్యాస్ట్రో జాకీర్ హుస్సేన్, గాయకుడు శంకర్ మహదేవన్
- జాకీర్‌కు 3, వేణుగాన విద్వాంసుడు రాకేశ్‌చౌరాసియాకు 2 అవార్డులు

2



గ్రామీ అవార్డుల్లో మనోళ్ల 'శక్తి'

ఐదుగురు భారతీయులకు పురస్కారాలు



అవార్డును అందుకున్న శంకర్ మహదేవన్, గణేశ్ రాజగోపాలన్, జాకీర్‌హుస్సేన్, సెల్వ గణేశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: సంగీత రంగంలో ఆస్కార్లుగా భావించే గ్రామీ అవార్డుల్లో మనోళ్లు సత్తా చాటారు! అమెరికాలోని లాస్ ఏంజెలెస్‌లో అంగరంగ వైభోగంగా జరిగిన 2024 గ్రామీ వేడుకల్లో.. ఐదుగురు భారతీయులు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారాలను దక్కించుకున్నారు. ఆ ఐదుగురూ.. తబలా మ్యాస్ట్రో జాకీర్‌హుస్సేన్, ప్రముఖ గాయకుడు శంకర్ మహదేవన్, వేణుగాన విద్వాంసుడు రాకేశ్ చౌరాసియా, వాయులీన విద్వాంసుడు గణేశ్ రాజగోపాలన్, పెర్క్యూషనిస్ట్ సెల్వగణేశ్ వినాయక్‌రామ్ ఉన్నారు. వీరిలో జాకీర్ హుస్సేన్ ఏకంగా మూడు గ్రామీలు సాధించగా.. రాకేశ్ చౌరాసియా రెండు పురస్కారాలు అందుకున్నారు. ఉత్తమ గ్లోబల్ మ్యూజిక్ విభాగంలో మనదేశానికి చెందిన ప్రముఖ ఫ్యూజన్ బ్యాండ్ శక్తి రూపొందించిన 'దిస్ మూమెంట్'.. పురస్కారాన్ని గెలుచుకుంది. బ్రిటిషర్ జాన్ మెక్‌లాఫ్లిన్ నేతృత్వంలోని ఈ బ్యాండ్‌లో జాకీర్ హుస్సేన్, శంకర్‌మహదేవన్, సెల్వగణేశ్, గణేశ్ రాజగోపాలన్ ఉన్నారు. జాకీర్‌హుస్సేన్‌కు ఈ పురస్కారంతోపాటు.. బెస్ట్ గ్లోబల్ మ్యూజిక్ పెర్ఫార్మెన్స్ (పష్తో), బెస్ట్ కాంటెంపరరీ ఇన్‌స్ట్రుమెంటల్ ఆల్బమ్ (యాజ్ వియ్ స్పీక్) విభాగాల్లో మరో రెండు గ్రామీలు వచ్చాయి. కాగా.. గ్రామీ అవార్డు సాధించిన ఐదుగురినీ ప్రధాని మోదీ ట్విటర్ ద్వారా అభినందించారు. తమ అత్యద్భుతమైన ప్రతిభతో, సంగీతం పట్ల అంకితభావంతో వారు గ్రామీ వేదికపై భారతదేశానికి గర్వకారణంగా నిలిచారని, ప్రపంచప్రజల హృదయాలను గెలుచుకున్నారని కొనియాడారు. ఈ అవార్డులు వారి శ్రమకు ఒక గుర్తింపు అని.. సంగీత రంగంలో ఎంతో సాధించాలనే కలలతో వచ్చే భవిష్యత్తు కళాకారులకు వీరు స్ఫూర్తిగా నిలుస్తారని ప్రశంసించారు. కాగా.. జాకీర్‌హుస్సేన్ 1991, 1996, 2008 సంవత్సరాల్లో కూడా గ్రామీ అవార్డులు గెలుచుకున్నారు. ఇక, 2008లో స్లమ్‌డాగ్ మిలియనీర్ చిత్రానికి అందించిన సంగీతానికిగాను రెండు గ్రామీలు అందుకు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రహ్మాన్.. జాకీర్ హుస్సేన్, శంకర్ మహదేవన్, సెల్వగణేశ్‌తో తీసుకున్న గ్రూప్ సెల్ఫీని ఇన్‌స్టాలో పోస్ట్ చేశారు. గ్రామీ విజేతలను ఆయన అభినందించారు.

ఇండియా కూటమి గెలిస్తే.. రిజర్వేషన్లపై 50% పరిమితి ఎత్తేస్తాం

- దేశవ్యాప్తంగా కులగణన చేపడతాం: రాహుల్
- హేమంత్ సోరెన్ సతీమణికి పరామర్శ



రాంచీ, ఫిబ్రవరి 5: లోక్‌సభ ఎన్నికల్లో ఇండియా కూటమి విజయం సాధిస్తే.. కేంద్రంలో ఏర్పాటయ్యే ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన నిర్వహిస్తుందని, రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేస్తుందని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ హామీ ఇచ్చారు. దళితులు, ఆదివాసీల రిజర్వేషన్లను తగ్గించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఆయన చేపట్టిన భారత్ జోడో న్యాయ యాత్ర ఝార్ఖండ్ రాజధాని రాంచీలో కొనసాగుతోంది. మనీ లాండరింగ్ కేసులో అరెస్టయిన ఝార్ఖండ్ మాజీ సీఎం హేమంత్ సోరెన్ భార్య కల్పనా సోరెన్‌ను రాహుల్ సోమవారం పరామర్శించారు. అనంతరం రాంచీలోని షహీద్ మైదానంలో నిర్వహించిన బహిరంగ సభలో రాహుల్ మాట్లాడారు. ఝార్ఖండ్ ముఖ్యమంత్రి గిరిజనుడు కావడం వల్లే జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వాన్ని కూలదోసేందుకు బీజేపీ ప్రయత్నించిందని మండిపడ్డారు. 'ప్రజాస్వామ్యంపైనా, రాజ్యాంగంపైనా బీజేపీ దాడి చేస్తోంది. ప్రజల గొంతు నొక్కేస్తోంది. ఇండియా కూటమి అలా జరగనివ్వదు. ఝార్ఖండ్ ప్రభుత్వాన్ని కాపాడేందుకు కాంగ్రెస్, జేఎంఎం నిలబడ్డాయి. ప్రతిపక్ష పార్టీల పాలిత రాష్ట్రాలన్నింటిలోనూ వారు(బీజేపీ) ధనబలాన్ని, దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తున్నారు' అని రాహుల్ మండిపడ్డారు. కాగా, ప్రజల్ని ఓట్లు అడిగే సందర్భంలో తాను ఓబీసీనని చెప్పే ప్రధాని మోదీ.. కులగణన డిమాండ్ రావడంతో 'రెండే కులాలున్నాయి.. ధనిక, పేద' అంటున్నారని విమర్శించారు. దళితులు, గిరిజనులు, ఓబీసీల హక్కుల విషయానికి వచ్చేసరికి కులాలు లేవని ప్రధాని అంటున్నారని రాహుల్ మండిపడ్డారు.

పేపర్ లీక్ చేస్తే రూ.కోటి జరిమానా

- లోక్‌సభలో పబ్లిక్ ఎగ్జామినేషన్స్ బిల్లు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ప్రభుత్వ నియామక పోటీ పరీక్షల్లో అవకతవకలకు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్ర ప్రభుత్వం కఠిన నిర్ణయం తీసుకుంది. ప్రశ్నపత్రం లేదా జవాబులు లీక్ చేయడం, అభ్యర్థులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించడం, నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి మోసగించడం వంటి నేరాలకు పాల్పడిన వారికి కనీసం మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. కోటి వరకూ జరిమానా విధించేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) బిల్లు-2024ను సోమవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఒక వ్యక్తి లేదా వ్యక్తులు, లేదా సంస్థలు.. ప్రశ్నపత్రాలు లేదా జవాబులు లీక్ చేయడం, పబ్లిక్ పరీక్షల సమయంలో అభ్యర్థికి ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించడం, కంప్యూటర్ ఆధారిత పరీక్షల్లో ట్యాంపరింగ్‌కు పాల్పడడం వంటి వాటిని ఈ బిల్లు నేరాలుగా పరిగణిస్తుంది. నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి పరీక్షలు నిర్వహించడం, డబ్బు కోసం నకిలీ అడ్మిట్ కార్డులు లేదా ఆఫర్ లెటర్లు జారీ చేయడం, పరీక్షల్లో అక్రమాలకు పాల్పడేందుకు వీలుగా అభ్యర్థుల సీటింగ్‌ను తారుమారు చేయడం, తేదీలు, షిఫ్ట్‌లను మార్చడం వంటి వాటిని కూడా ఈ చట్టం ప్రకారం శిక్షార్హమైన నేరాలుగా పరిగణిస్తారు. ఎవరైనా వ్యక్తి లేదా వ్యక్తులు, సంస్థలు అక్రమాలకు పాల్పడితే.. ఈ చట్టం కింద మూడేళ్లకు తగ్గకుండా ఐదేళ్ల వరకూ జైలు శిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించవచ్చని బిల్లులో పేర్కొన్నారు. ఒకవేళ పరీక్షల నిర్వహణ కోసం పబ్లిక్ ఎగ్జామినేషన్ అథారిటీ నియమించిన సర్వీస్ ప్రొవైడర్ ఇలాంటి నేరాలకు పాల్పడితే రూ.కోటి వరకూ జరిమానాతోపాటు పరీక్ష నిర్వహణ ఖర్చులు వసూలు చేయాలని నిబంధనలు చెబుతున్నాయి.

రాష్ట్రాలకు నిధులపై కర్ణాటక వర్సెస్ కేంద్రం

- రేపు ఢిల్లీలో కాంగ్రెస్ మంత్రులు, ఎమ్మెల్యేల ధర్నా

బెంగళూరు-ఆంధ్రజ్యోతి/న్యూఢిల్లీ,ఫిబ్రవరి 5: కర్ణాటకపై కేంద్రం సవతి తల్లి ప్రేమ చూపుతోందని.. నిధుల్లో కోత పెడుతోందని.. విపత్తు నిధుల వ్యయం లేదని సిద్దరామయ్య సర్కారు ఆరోపిస్తోంది. దీనిపై బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో పార్టీ ఎమ్మెల్యేలు, ఎంపీలతో ధర్నాకు పిలుపిచ్చింది. ఈ విషయాన్ని సోమవారం లోక్‌సభ ప్రశ్నోత్తరాల సమయంలో కాంగ్రెస్ పక్ష నేత అధీర్ రంజన్ చౌధురి ప్రస్తావించారు. ఆరు నెలల కిందట కర్ణాటకలో బీజేపీ ప్రభుత్వం ఉన్నప్పుడు అంతా బాగానే ఉందని.. ఇప్పుడక్కడ కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాష్ట్రానికి కేంద్రం నిధులు ఆపుతోందని, దక్షిణ భారతంపై వివక్ష చూపుతోందని ఆరోపించారు. ఈ ఆరోపణలను కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ ఖండించారు. దక్షిణాదికి.. ముఖ్యంగా కర్ణాటకకు నిధులు ఆపామనడం స్వార్థ శక్తుల పన్నాగమని.. రాజకీయ ప్రేరిత ఆరోపణలని.. అలా ఎప్పటికీ జరగదని అన్నారు.

కర్ణాటకలో ట్యాక్సీలకు ఏకరూప చార్జీల విధానం

బెంగళూరు, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఓలా, ఉబెర్ తదితర ప్రైవేట్ ట్యాక్సీ సేవలకు, యాప్ ఆధారంగా పనిచేసే ట్యాక్సీలకు ఏకరూప చార్జీల విధానాన్ని అమలులోకి తీసుకొచ్చారు. రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి ఈవిషయాన్ని బెంగళూరులో ఆదివారం మీడియాకు తెలిపారు. ట్యాక్సీల నిర్వాహకులు వాతావరణం, రద్దీ సమయాలకు అనుగుణంగా చార్జీలు వసూలు చేస్తుండటంతో ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు.

పిల్లలను ప్రచారానికి దూరం పెట్టండి

- అభ్యర్థులు వారిని ఎత్తుకోవడమూ ఉల్లంఘనే: ఈసీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: లోక్‌సభ ఎన్నికలకు సమయం దగ్గరపడుతున్న క్రమంలో రాజకీయ పార్టీలకు ఎన్నికల సంఘం కీలక మార్గదర్శకాలు జారీ చేసింది. ఎన్నికల ప్రచారంలో ఏ విధంగానూ పిల్లలను ఉపయోగించుకోవద్దని సూచించింది. పోస్టర్లు, కరపత్రాల పంపిణీ, నినాదాలివ్వడం, ర్యాలీల్లో తిప్పడం వంటి ప్రచార కార్యక్రమాల్లో పిల్లలను వాడుకోవద్దని తెలిపింది. అభ్యర్థులు పిల్లలను ఎత్తుకోవడం, వాహనాల్లో తిప్పడంతో పాటు తమకు అనుకూలంగా పాటలు/పద్యాలు పాడించడం, డ్యాన్సులు చేయించడం, మాట్లాడించడం ఉల్లంఘన కిందకే వస్తాయని పేర్కొంది.

జ్ఞానవాపి మిగతా సెల్లార్లలోనూ.. ఏఎస్ఐ సర్వేకు ఆదేశించండి: కోర్టులో పిటిషన్

వారాణసి, ఫిబ్రవరి 5: జ్ఞానవాపి కాంప్లెక్స్‌లోని మిగతా సెల్లార్లలోనూ సర్వే నిర్వహించేందుకు ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (ఏఎస్ఐ)కు ఆదేశాలివ్వాలని కోరుతూ వారాణసిలోని ట్రయల్ కోర్టులో ఓ హిందువు పిటిషన్ వేశారు. ఆవరణ మతపరమైన స్వభావాన్ని నిర్ధారించేందుకుగాను ఈ సెల్లార్లను సర్వే చేయడం చాలా కీలకమని తెలిపారు. జిల్లా కోర్టులో దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. జ్ఞానవాపి ఆవరణలో ఇటీవల నిర్వహించిన సర్వే సందర్భంగా దర్యాప్తు చేపట్టని సెల్లార్లలో ఏఎస్ఐ సర్వే చేపట్టాలని కోరారు.

లఖ్‌నవూ జైలులో 63 మంది ఖైదీలకు హెచ్ఐవీ

లఖ్‌నవూ, ఫిబ్రవరి 5: ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూ జిల్లా జైలులో 63 మంది ఖైదీలకు హెచ్ఐవీ పాజిటివ్ రావడం కలకలం రేపుతోంది. డిసెంబర్‌లో వైద్య పరీక్షలు నిర్వహించినప్పుడు దాదాపు 36 మందికి సోకినట్లు తేలగా.. తాజాగా ఆ సంఖ్య మరింత పెరిగింది. హెచ్ఐవీ కిట్‌లు అందుబాటులో లేకపోవడం వల్లే టెస్టింగ్ ఆలస్యమైనట్లు తెలుస్తోంది. కాగా, హెచ్ఐవీ సోకిన వారిలో చాలా మందికి డ్రగ్స్ తీసుకునే అలవాటుందని, సిరంజీలను ఎక్కించుకునే క్రమంలోనే వారు మహమ్మారి బారిన పడ్డారని అధికారులు తెలిపారు. జైలులోకి రాకముందే వారికి హెచ్ఐవీ ఉందని వెల్లడించారు.

సోరెన్ సర్కారు ఘన విజయం

47-29 ఓట్లతో నెగ్గిన విశ్వాస పరీక్ష.. దర్యాప్తు సంస్థల దుర్వినియోగం ప్రజాస్వామ్యానికి ముప్పు

- నియంత అహంకారాన్ని ఝార్ఖండ్ బద్దలు కొట్టింది: కాంగ్రెస్
- అవినీతిని నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకొంటా: హేమంత్



సీఎంగా ఎన్నికైన చంపయి సోరెన్‌ను అభినందిస్తున్న మాజీ సీఎం హేమంత్ సోరెన్

రాంచీ, న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఝార్ఖండ్‌లో సీఎం చంపయి సోరెన్ ప్రభుత్వం విశ్వాస పరీక్షలో ఘన విజయం సాధించింది. అసెంబ్లీలో 81మంది సభ్యులు ఉండగా సోమవారం నిర్వహించిన బలపరీక్షకు 77మంది హాజరయ్యారు. వారిలో జేఎంఎం నేతృత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతుగా 47మంది, వ్యతిరేకంగా 29మంది ఓటు వేశారు. స్వతంత్ర అభ్యర్థి సరయు రాయ్ ఓటింగ్‌కు దూరంగా ఉన్నారు. సంకీర్ణ కూటమిలో జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ భాగస్వామ్య పార్టీలు కాగా, సీపీఐఎంఎల్(ఎల్) పార్టీకి చెందిన ఒక ఎమ్మెల్యే బయటి నుంచి ప్రభుత్వానికి మద్దతుగా ఓటు వేశారు. ప్రతిపక్ష బీజేపీకి చెందిన 26మంది, ఏజేఎస్‌యూ పార్టీకి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓటు వేశారు. జేఎంఎం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ సీఎం హేమంత్ సోరెన్‌ను జనవరి 31న మనీలాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అరెస్టు చేయడంతో ఆ పార్టీ సీనియర్ నేత చంపయి సోరెన్ ఈనెల 2న సీఎంగా ప్రమాణం చేశారు. బల నిరూపణకు 10 రోజులు గడువిచ్చినా ప్రభుత్వం సోమవారమే బల పరీక్షను ఎదుర్కొంది. విశ్వాస పరీక్ష సందర్భంగా సీఎం చంపయి సోరెన్ మాట్లాడుతూ ప్రజాస్వామికంగా ఎన్నికైన ప్రభుత్వాన్ని అస్థిర పరిచేందుకు బీజేపీ ప్రయత్నించిందని, హేమంత్ సోరెన్‌ను తప్పుడు కేసుల్లో ఇరికించేందుకు కేంద్ర దర్యాప్తు సంస్థలను ఉపయోగించుకుందని మండిపడ్డారు. ఈడీ, సీబీఐలను కేంద్రం దుర్వినియోగంచేయడం ప్రజాస్వామ్యానికి ముప్పుగా ఆయన అభివర్ణించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ మార్గంలో ప్రతి ఒక్కరూ ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు. కాగా అరెస్టయిన మాజీ సీఎం హేమంత్ సోరెన్ కూడా కోర్టు అనుమతితో బలపరీక్షకు హాజరై ప్రభుత్వానికి అనుకూలంగా ఓటు వేశారు. తనపై మోపిన అవినీతి ఆరోపణలను నిరూపించాలని హేమంత్ బీజేపీకి సవాల్ విసిరారు. అవినీతి ఆరోపణలను నిరూపిస్తే రాజకీయాల నుంచి వైదొలగుతానని ప్రకటించారు. తనపై బీజేపీ పన్నిన కుట్రలో రాజ్‌భవన్ పాత్ర ఉందని ఆరోపించారు. 'దేశ చరిత్రలోనే జనవరి31 ఒక చీకటి అధ్యాయం. రాజ్‌భవన్ ఆదేశంతో ఒక సీఎంను అరెస్టు చేశారు. ఝార్ఖండ్‌లో ఒక గిరిజన సీఎం ఐదేళ్లు పాలించడం బీజేపీకి ఇష్టంలేదు. గిరిజనులను బీజేపీ అంటరానివారిలా చూస్తోంది. కేంద్రంలోని బీజేపీ పాలనలో గిరిజనులు, దళితులకు రక్షణ లేదు'అని హేమంత్ సోరెన్ అన్నారు. కాగా ఈడీ తనను అరెస్టు చేయడాన్ని సవాలుచేస్తూ హేమంత్ సోరెన్ దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణను ఝార్ఖండ్‌హైకోర్టు ఈనెల12కు వాయిదా వేసింది

విశ్వాస పరీక్షలో చంపయి సోరెన్ ప్రభుత్వం ఘన విజయం సాధించడంపై కాంగ్రెస్ పార్టీ హర్షం వ్యక్తం చేసింది. 'నియంత అహంకారాన్ని ఝార్ఖండ్ బద్దలు కొట్టింది. ఇది ప్రజల గెలుపు. ఇండియా సంకీర్ణ కూటమి ఈరోజు అసెంబ్లీలో విశ్వాస పరీక్ష నెగ్గింది' అని ఆ పార్టీ ట్వీట్ చేసింది. ఝార్ఖండ్‌లో ఆపరేషన్ లోటస్ విఫలమైందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ పేర్కొన్నారు.

సీఎం అరెస్టు సరికాదు: కేజ్రీవాల్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: ఝార్ఖండ్‌లో సీఎంగా ఉన్న హేమంత్ సోరెన్‌ను అరెస్టు చేయడాన్ని ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ తప్పుబట్టారు. ఇది ప్రజాస్వామ్యానికి మంచిది కాదన్నారు. మద్యం విధానం కేసులో ఈడీ విచారణకు కేజ్రీ గైర్హాజరవుతున్న సంగతి తెలిసిందే. మనీలాండరింగ్ ఆరోపణలపై ఇదే తరహాలో పలుమార్లు విచారణకు హాజరవని సోరెన్‌ను ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. ఢిల్లీలో సోమవారం ఓ కార్యక్రమానికి హాజరైన కేజ్రీ.. దేశంలో ప్రభుత్వాలను కూల్చుతున్నది, పార్టీలను చీల్చుతున్నది ఎవరో అందరికీ తెలుసని పరోక్షంగా బీజేపీని ఉద్దేశిస్తూ వ్యాఖ్యలు చేశారు. ఝార్ఖండ్‌లో ప్రభుత్వం పడిపోతుందేమోనని రెండు రోజుల పాటు వేచి చూశారని.. జేఎంఎం ఎమ్మెల్యేలు చెక్కుచెదరకుండా ఉండడంతో ఆ ప్రయత్నాలు విఫలమయ్యాయని పేర్కొన్నారు. మరోవైపు ఆప్ ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందన్న ఆరోపణలపై ఢిల్లీ క్రైం బ్రాంచ్ పోలీసులు తనకు జారీ చేసిన నోటీసులను కేజ్రీవాల్ తప్పుబట్టారు. వాటిలో ఎఫ్ఐఆర్ ప్రస్తావనే లేదన్నారు. తమను తాము అవమానించుకుంటూ రాజకీయ నేతలు చెప్పినట్లుగా పోలీసులు వ్యవహరిస్తున్నారని కేజ్రీ ఆరోపించారు.

లోకం తీరు



హామీలు నెరవేర్చకపోతే ఏంటి? రాముడున్నాడుగా పదండి సార్!

పెళ్లిళ్ల పేరమ్మలా చాట్‌జీపీటీ!

రష్యన్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ వినూత్న ఆలోచన

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: మాయల ఫకీరు దుర్భిణి వేసి గాలిస్తే బాలనాగమ్మ దొరికింది! కానీ అది కథ. కల్పన. నిజజీవితంలో అసాధ్యం. ఈకాలంలో మనకు అన్ని విధాలా సరిపోయే సరిజోడును కనిపెట్టడం ఎలా? అందుకే ఆ పనిని కృత్రిమ మేధకు అప్పజెప్పాడో రష్యన్ కుర్రాడు అలెగ్జాండర్. వయసు 23. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అయిన అలెగ్జాండర్.. ప్రపంచానికి చాట్ జీపీటీ గురించి తెలియకముందే వృత్తిరీత్యా తన వద్దకు వచ్చిన జీపీటీ3 (అప్పటికి అది చాట్‌జీపీటీ కాదు) సాఫ్ట్‌వేర్‌ను ప్రముఖ డేటింగ్ సైట్ టిండర్‌కు అనుసంధానంచేసి తనకు సరిపోయే అమ్మాయిల ప్రొఫైళ్లను జల్లెడ పట్టే బాధ్యత అప్పగించాడు! జీపీటీ3, మరికొన్ని ఏఐ బాట్స్‌నూ ఈ పని కి ఉపయోగించాడు. జీపీటీతో నిత్యం మాట్లాడుతూ తన ఇష్టాయిష్టాలు, మనస్తత్వం గురించి దానికి సరిగ్గా అర్థమయ్యేలా చేశాడు! డేటింగ్ సైట్లలో తన అభిరుచులకు అనుగుణంగా ఉన్న అమ్మాయిలను వెతికేందుకు కొన్ని సూచనలు ఇచ్చాడు. ఉదాహరణకు.. ప్రొఫైల్‌లో కనీసం రెండు ఫొటోలైనా ఉన్న అమ్మాయిలనే వెతకాలి. ఆ అమ్మాయి దేవుణ్ని నమ్మే వ్యక్తి అయి ఉండాలివంటి పలు సూచనలు ఇచ్చాడు. వీటి ఆధారంగా జీపీటీ, ఏఐ బాట్లు.. టిండర్, టీజే అనే డేటింగ్ వెబ్‌సైట్లలో 5,239ప్రొఫైళ్లను జల్లెడపట్టి చివరకు 12 మందిని ఎంపిక చేశాయి. వీరితో డేటింగ్‌కి వెళ్లి.. కరీనా అనే అమ్మాయిని ఎంచుకున్నాడు అలెగ్జాండర్. ఈ ప్రక్రియకు ఏడాదికిపైగా సమయం పట్టింది. ప్రస్తుతం వారిద్దరికీ పెళ్లయ్యింది. కరీనాను ఎంపిక చేసుకోవడానికి తాను కృత్రిమ మేధను వాడినట్లు అలెగ్జాండర్ పెళ్లికి ముందే ఆమెకు చెప్పాడు.

ప్రజాస్వామ్య ఖూనీని సహించబోం

- అపహాస్యంగా చండీగఢ్ మేయర్ ఎన్నిక
- ఆర్వోను ప్రాసిక్యూట్ చేయాలి: సుప్రీం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: చండీగఢ్ కార్పొరేషన్ మేయర్ ఎన్నిక నిర్వహించిన తీరుపై సోమవారం సుప్రీం కోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తుంటే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించింది. గత నెల 30న జరిగిన చండీగఢ్ మేయర్ ఎన్నికకు ఓటింగ్ హక్కు లేని నామినేటెడ్ సభ్యుడు అనిల్ మాసీ రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించారు. మొత్తం 36 మంది కౌన్సిలర్లు ఉండగా, ఆప్-కాంగ్రెస్ కూటమికి 20 మంది సభ్యుల బలం ఉంది. ఆ కూటమిదే విజయమని అంతా భావించారు. కానీ, గుర్తులు సక్రమంగా లేకపోవడంతో ఆప్-కాంగ్రెస్ కూటమికి చెందిన ఎనిమిది ఓట్లు చెల్లవని రిట్నరింగ్ అధికారి ప్రకటించారు. దాంతో ఆ కూటమికి చెందిన కులదీప్‌సింగ్‌కు 12 ఓట్లు, బీజేపీ అభ్యర్థి మనోజ్ సోంకర్‌కు 16 ఓట్లు వచ్చినట్టు తెలిపారు. బీజేపీ అభ్యర్థి విజయం సాధించినట్టు వెల్లడించారు. ఓట్లు చెల్లవని ప్రకటించి రిటర్నింగ్ అధికారి అక్రమాలకు పాల్పడ్డారని, అందువల్ల ఆ ఎన్నికను రద్దు చేయాలని ఓడిపోయిన ఆప్ కౌన్సిలర్ కులదీప్ సింగ్ తొలుత పంజాబ్-హరియాణా హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ తిరస్కరణ ఎదురుకావడంతో సుప్రీంకోర్టులో అప్పీలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి.వై.చంద్రచూడ్, జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. ఎనిమిది ఓట్లను రద్దు చేసే విషయంలో రిటర్నింగ్ అధికారి ప్రవర్తించిన తీరును తప్పుపట్టింది. బ్యాలెట్ పేపర్లలో ఆయన మార్పులు చేసినట్టు కనిపిస్తోందని, ఆయనను ప్రాసిక్యూట్ చేయాల్సి ఉందని అభిప్రాయపడింది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వీడియోను చూసిన ధర్మాసనం, బ్యాలెట్ పేపర్లపైన ఉన్న గుర్తులను ఆయన చెరిపివేస్తున్నట్టు గమనించింది. ఈ ఎన్నికలకు సంబంధించిన మొత్తం రికార్డులు, బ్యాలెట్ పేపర్లు, వీడియోగ్రఫీ, ఇతర పత్రాలన్నింటినీ అందజేయాలని అందజేయాలని పంజాబ్-హరియాణా హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌ను ఆదేశించింది.

భారత బలగాలు వెళ్లాల్సిందే

- మాల్దీవుల అధ్యక్షుడు ముయిజ్జు

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 : తమ దేశ సార్వభౌమత్వం విషయంలో రాజీ లేదని, అందులో జోక్యం చేసుకొనేందుకు ఏ దేశాన్ని అనుమతించేది లేదని మాల్దీవుల అధ్యక్షుడు మహమద్ ముయిజ్జు ఆ దేశ పార్లమెంటులో సోమవారం స్పష్టం చేశారు. ఇప్పటికే రెండు దేశాలు.. భారత బలగాలు మే 10నాటికి మాల్దీవులను వీడేందుకు అంగీకారానికి వచ్చాయని చెప్పారు. ఈ విషయంలో భారత్‌తో ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ముయిజ్జు ప్రసంగాన్ని అక్కడి ప్రధాన ప్రతిపక్షాలయిన ఎండీపీ, డెమొక్రాట్స్.. రెండూ బహిష్కరించాయి. కాగా, 87 మంది భారత సైనికులు మాత్రమే ఆ దేశంలో ఉన్నారు. మానవతా సాయం, అత్యవసర వైద్య చికిత్సకు బాధితుల తరలింపులో సహకరించడమే వీరి పని. ముయిజ్జు అధ్యక్షుడు అయినప్పటి నుంచి భారత బలగాలను పంపించడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నారు.

హెచ్-4 వీసా ఉంటే.. ఆటోమేటిక్‌గా వర్క్ ఆథరైజేషన్

- హెచ్-1బీ వీసాదారుల భాగస్వాములు, పిల్లలకు అవకాశాలు
- ఏటా సుమారు లక్ష మందికి లబ్ధి
- ఐ1, ఐ2, ఐ3 వీసాలున్నవారికీ చాన్స్
- కీలక బిల్లును ఆమోదించనున్న సెనేట్



వాషింగ్టన్, ఫిబ్రవరి5: అమెరికాలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న హెచ్-1బీ వీసాదారులకు శుభవార్త.! హెచ్-1బీ వీసాదారులపై ఆధారపడే వారికి (భాగస్వామి, పిల్లలు) అమెరికాలో ఉద్యోగాలు చేసుకోవడానికి అడ్డంకులు తీరిపోనున్నాయి. హెచ్-4 వీసా ఉన్న డిపెండెంట్లకు ఆటోమేటిక్‌గా 'వర్క్ ఆథరైజేషన్' వర్తించేలా కీలక బిల్లు 'జాతీయ భద్రత ఒప్పందం'ను ఆదివారం అమెరికా సెనేట్లో ప్రవేశపెట్టారు. రిపబ్లికన్లు, డెమొక్రాట్ల మధ్య సుదీర్ఘంగా జరిగిన చర్చల్లో ఈ బిల్లు ఆమోదానికి ఇరువర్గాలు అంగీకరించాయి. దీంతో ఈ బిల్లు ఆమోదం పొందడం లాంఛనమే.! ఈ బిల్లు వల్ల సుమారు లక్ష మందికి లబ్ధి చేకూరుతుందని అంచనా. అమెరికాలో ఉద్యోగం చేస్తున్న వృత్తి నిపుణులకు హెచ్-1బీ వీసాలివ్వడం తెలిసిందే. వారిపై ఆధారపడే భాగస్వాములు, పిల్లల కు హెచ్-4 వీసాలను జారీ చేస్తారు. 21ఏళ్లు దాటాక హెచ్-4 వీసా లేకుంటే అలాంటి పిల్లలు డీపోర్ట్ (తిరిగి స్వదేశానికి పంపడం) అయ్యే ప్రమాదముంటుంది. అలాంటి వారు ఎనిమిదేళ్లకు పైగా డిపెండెంట్‌గా అమెరికాలోనే ఉంటే హెచ్-4 జారీకి మార్గం సుగమమవుతుంది. ఒకవేళ హెచ్-4 వీసా జారీ అయినా అమెరికా హోమ్‌ల్యాండ్ సెక్యూరిటీ నిబంధనల ప్రకారం ఎంప్లాయ్‌మెంట్ ఆథరైజేషన్ డాక్యుమెంట్(ఈఏడీ), ఐ-765 కోసం దరఖాస్తు చేసుకోవాలి. ఈ ప్రక్రియ పూర్తై.. ఆథరైజేషన్ వస్తే తప్ప హెచ్-4 వీసాదారులు ఉద్యోగాలు చేసుకోవడానికి వీల్లేదు. ఈఏడీ రావడానికి కనీసం ఆర్నెల్ల పాటు నిరీక్షించాల్సిందే.! "హెచ్-4 వీసాదారుల ఇబ్బందులను దూరం చేస్తూ ఆటోమేటిక్‌గా ఈఏడీ లభించేలా రూపొందించిన బిల్లుకు ఆమోదముద్ర పడనుంది. ఈ బిల్లు ఆమోదం పొందితే ఏటా 18 వేల మందికి ఉపాధి ఆధారిత గ్రీన్ కార్డులు జారీ అవుతాయి. ఇప్పటికే ఉన్న దరఖాస్తులకు ఇవి తోడైతే ఐదేళ్లలో 1.58 లక్షల మందికి లబ్ధి చేకూరుతుంది. పర్యాటకం, వైద్యం, వ్యాపారం వంటి తాత్కాలిక పనుల నిమిత్తం అమెరికాకు వచ్చేవారికి జారీచేసే వలసేతర వీసా (ఐ1, ఐ2, ఐ3)ఉన్న వారిలో ఏడాదికి 25వేల మందికి కూడా తాజా బిల్లుతో ఉద్యోగం చేసుకోవడంలో అడ్డంకులు తొలగిపోతాయి" అని వైట్‌హౌస్ వర్గాలు ఓ ప్రకటనలో తెలిపాయి. దీనిపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ కూడా స్పందించారు. "కొత్తగా తీసుకొస్తున్న బిల్లు వలసదారుల భాగస్వాములు, పిల్లలకు అవకాశాలను మెరుగుపరుస్తుంది. ఈ నిర్ణయం మన దేశాన్ని బలోపేతం చేస్తుంది. సరిహద్దులను సురక్షితం చేస్తుంది. చట్టబద్ధంగా వలసలకు అవకాశం కల్పిస్తుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. 2015లోనే ఒబామా సర్కారు ఈ తరహా నిర్ణయం తీసుకుంది. దాంతో శాస్త్రసాంకేతిక రంగాల్లో నైపుణ్యం ఉన్న భారతీయులకు కొంతఊరట కలిగింది. తర్వాత అధికారంలోకి వచ్చిన ట్రంప్ ఈ నిర్ణయంపై ఆంక్షలు విధించారు. ఇప్పుడు హెచ్-4 వీసాదారులకు అవకాశాలు కల్పించేందుకు బైడెన్ సర్కారు సిద్ధమవుతుండడం పట్ల హెచ్-4వీసాదారులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాకు 370 సీట్లు

(మొదటి పేజీ తరువాయి)

ప్రశ్నించారు. ప్రతిపక్ష నేతల ప్రసంగాలు విన్నప్పుడల్లా వారు చాలా కాలం ప్రతిపక్షంలోనే ఉంటారన్న తన విశ్వాసం మరింత బలపడిందని ఎద్దేవా చేశారు. పార్లమెంటు చివరి సమావేశాల్లో సైతం విపక్షాలు ఎటువంటి నిర్మాణాత్మక సూచనలు ఇవ్వలేకపోయాయన్నారు. వారిని ప్రజలు కూడా అదే రకంగా ఆశీర్వదిస్తారని తెలిపారు. దశాబ్దాలపాటు దేశాన్ని పాలించిన కాంగ్రెస్.. ఇకపై దశాబ్దాల పాటు ప్రతిపక్షంలో ఉండాలని నిశ్చయించుకున్నట్లుందని ఎద్దేవా చేశారు.

బలమైన ప్రతిపక్షం అవసరం

దేశానికి బలమైన, ఆరోగ్యవంతమైన ప్రతిపక్షం అవసరమని ప్రధాని మోదీ చెప్పారు. కానీ, మంచి ప్రతిపక్షంగా బాధ్యతలు నిర్వర్తించే అవకాశం కాంగ్రెస్ కోల్పోయిందని, ఆ పార్టీ పనిచేయదు, ఇతరులను పనిచేయనివ్వదని ఆరోపించారు. పలువురు యువనేతలతోపాటు ఎంతోమంది నాయకులు ఉన్నప్పటికీ, వారు ఎక్కడ తమను మించిపోతారో అన్న భయంతో వారికి అవకాశాలు దక్కకుండా కాంగ్రెస్ అడ్డుకుందని ఆరోపించారు. ఆ పార్టీ.. రాచ కుటుంబాన్ని మించి చూడదంటూ గాంధీ కుటుంబంపై విమర్శలు సంధించారు. ఒకే ఉత్పత్తిని మాటిమాటికీ మార్కెట్‌లో ప్రవేశపెడుతున్నారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీని ఉద్దేశించి మోదీ పరోక్షంగా వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ వారసత్వ రాజకీయాలతో యావత్ దేశం నష్టపోయిందన్నారు. కాంగ్రెస్ యూపీఏ పదేళ్ల హయాంలో చోటు చేసుకున్న అనేక అవకతవకలను తన తొలి దఫా ప్రభుత్వంలో అరికట్టామని, రెండో దఫాలో నూతన భారత్‌కు పునాది వేశామని మోదీ చెప్పారు. మూడో దఫాలో వచ్చే వెయ్యేళ్లకు అవసరమైన పటిష్ఠమైన పునాది వేస్తామని, అతిపెద్ద నిర్ణయాలు తీసుకుంటామని తెలిపారు. ఈసారి బీజేపీ 400 సీట్లను లక్ష్యంగా పెట్టుకొందని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే చేసిన వ్యాఖ్యలను మోదీ ప్రస్తావిస్తూ.. బీజేపీ 370 సీట్లను, ఎన్డీఏ 400కిపైగా సీట్లను గెల్చుకుంటుందన్నారు. కాంగ్రెస్ హయాంలో అవినీతి విచ్చలవిడిగా ఉండేదని, తన ప్రభుత్వం దానికి అడ్డుకట్ట వేసిందని తెలిపారు. కాంగ్రెస్ హయాంలో ఈడీ కేవలం రూ.ఐదు వేల కోట్లే స్వాధీనం చేసుకున్నదని, తమ పాలనలో రూ.లక్ష కోట్లకుపైగా స్వాధీనపరుచుకున్నామని ప్రధాని మోదీ వెల్లడించారు.

నెహ్రూపై విమర్శలు

భారతీయులు సోమరులని, తెలివితక్కువ వారని, వారికి కష్టపడే తత్వం లేదని దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ బహిరంగంగా ఎర్రకోట మీది నుంచే చెప్పారని, ఇందిరాగాంధీ కూడా ఆయన కంటే భిన్నమైన నేత ఏమీ కారని మోదీ చెప్పారు. ఇది రాచకుటుంబాల మనస్తత్వమని, నెహ్రూ చేసిన తప్పులకు కశ్మీర్ ప్రజలు మూల్యం చెల్లించారని దుయ్యబట్టారు. ఒక కుటుంబం నుంచి పలువురు నాయకులుగా ఆవిర్భవించటం కుటుంబ పాలన కిందికి రాదని, ఒక కుటుంబం కేంద్రంగా ఒక పార్టీ నడవటం కుటుంబ పాలన అవుతుందని మోదీ చెప్పారు. బీజేపీలో కూడా పలువురు నేతల పిల్లలు రాజకీయాల్లో ఉండటాన్ని విపక్షాల సభ్యులు ప్రశ్నించినప్పుడు సమాధానంగా ఆయన ఈ వివరణ ఇచ్చారు. ప్రతిపక్షాలు ఓబీసీల ప్రాతినిధ్యం గురించి ప్రస్తావిస్తున్నాయని పేర్కొంటూ, వివిధ ప్రభుత్వ విభాగాల్లో ఓబీసీలు ఎంతమంది ఉన్నారని అడుగుతారేగానీ, అతిపెద్ద ఓబీసీని చూడరేమిటి? అంటూ ప్రధానినైన తానే స్వయంగా ఓబీసీనని పరోక్షంగా చెప్పుకొన్నారు. నెహ్రూ, ఇందిరలను మోదీ విమర్శించిన సమయంలో కాంగ్రెస్ సభ్యులు ప్రధాని ప్రసంగానికి అడ్డు తగిలారు.

4 కోట్ల ఇళ్లు నిర్మించాం

పేదల కోసం తాము నాలుగు కోట్ల ఇళ్లు కట్టించామని, ఈ పని చేయటానికి కాంగ్రెస్‌కు వందేళ్లు పట్టేదని మోదీ విమర్శించారు. కొవిడ్ చెలరేగినప్పటికీ ద్రవ్యోల్బణాన్ని అరికట్టగలిగిందని చెప్పారు. తన హయాంలో భారత్ ప్రపంచ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో 11వ స్థానం నుంచి 5వ స్థానానికి చేరుకుందని, తాను మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత, భారత్ మూడవ అతిపెద్ద ఆర్థికశక్తిగా మారుతుందని పేర్కొన్నారు. తన హయాంలో దేశం డిజిటల్ ఆర్థిక వ్యవస్థగా మారిందని.. స్టార్టప్‌లు, డిజిటల్ సంస్థలు, యునికార్న్‌లు, గిగ్ ఆర్థిక వ్యవస్థ.. నూతన భారతదేశంలో ఇవన్నీ కొత్త పదజాలంగా మారాయని చెప్పారు. దేశంలో మహిళలకు ఉపాధి పెరిగిందని, ఒలింపిక్స్ నుంచి సశస్త్రబల్, పార్లమెంటు వరకు మహిళా సాధికారికత వెల్లివిరుస్తోందని ప్రధాని చెప్పారు. గతంతో పోలిస్తే యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరిగాయని అన్నారు. ప్రపంచాన్ని భారతదేశం ప్రభావితం చేస్తోందని, జీ-20 అందుకు ఉదాహరణ అని పేర్కొన్నారు.

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో జైలులో ఉన్న ఆప్ నేత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు కోర్టులో ఊరట లభించింది. అనారోగ్యంతో బాధపడుతున్న తన భార్యను, వైద్యులను వారానికోసారి కలిసేందుకు ఆయనకు ఢిల్లీ రౌజ్ అవెన్యూ కోర్టు సోమవారం కస్టడీ పెరోల్ మంజూరు చేసింది.

హెచ్ఎండీఏ కార్యాలయాల్లో కొనసాగుతున్న ఏసీబీ సోదాలు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ కస్టడీ విచారణ ఓవైపు సాగుతుండగా.. మరోవైపు హెచ్ఎండీఏ కార్యాలయాల్లో ఏసీబీ సోదాలు కొనసాగిస్తోంది. అమీర్‌పేటలోని స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లో ఉన్న హెచ్ఎండీఏ ఆఫీసులో సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు తనిఖీలు జరిగాయి. ప్రధానంగా హెచ్ఎండీఏ ప్లానింగ్ విభాగంలోని శంకర్‌పల్లి, శంషాబాద్, ఘట్కేసర్ జోన్ల పరిధిలో భవన నిర్మాణ అనుమతులపై ఆరా తీశారు. అలాగే భారీ లేఔట్ల అనుమతుల వివరాలను సేకరించారు. ముఖ్యంగా 'చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్' అనుమతులు ఏయే ప్రాంతాల్లో జరిగాయి. ఆయా ప్రాంతాల్లో నిబంధనల ప్రకారం అనుమతులిచ్చారా.. లేదా.. అన్న వివరాలను సేకరించారు. 26 మందితో కూడిన ఏసీబీ బృందం హెచ్ఎండీఏ కార్యాలయంలో మూడు చాంబర్లలో తిష్ట వేసి అధికారులకు పలు ప్రశ్నలను సంధించినట్టు సమాచారం. ఈసోదాలు మంగళవారం కూడా జరిగే అవకాశం ఉంది.

భక్తజనసంద్రం.. రాజన్న క్షేత్రం!

- వేములవాడకు 80 వేల మందికి పైగా రాక
- మేడారంలోనూ రద్దీ.. ముందస్తు మొక్కులు

వేములవాడ/మేడారం, ఫిబ్రవరి 5: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజరాజేశ్వరస్వామి దేవస్థానం సోమవారం భారీగా తరలివచ్చిన భక్తజనంతో జాతరను తలపించింది. మేడారం సమ్మక్క-సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజన్నను దర్శించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఈక్రమంలోనే ఆదివారం తెల్లవారు జామున ప్రారంభమైన రాజన్న దర్శనం సోమవారం రాత్రి వరకు నిరంతరాయంగా సాగింది. ఆదివారం రాత్రి నుంచి సోమవారం రాత్రి వరకు సుమారు 80 వేల మందికిపైగా భక్తులు స్వామిని దర్శించుకున్నట్లు అంచనా.. భక్తుల రద్దీ తో గర్భాలయ ప్రవేశం నిలిపేసి స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్నపూజ నిలిపేయడంతో క్యూలైన్లు వేగంగా కదిలాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించారు. ఆలయ ప్రాంగణంతోపాటు ప్రధాన వీధులు కిటకిటలాడాయి. భక్తుల వాహనాలతో గుడిచెరువు పార్కింగ్ ప్రదేశం పూర్తిగా నిండిపోయింది. ఇటు మేడారంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. 50 వేల మందికి పైగా భక్తులు వనదేవతల గద్దెలను దర్శించుకున్నారని దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణకట్టల్లో తలనీలాలు సమర్పించారు. అనంతరం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల గద్దెలను చేరుకొని పసుపు-కుంకుమ, ఒడి బియ్యం, నిలువెత్తు బంగారం (బెల్లం) సమర్పించి భక్తులు మొక్కులు తీర్చుకున్నారు.


భక్తులతో కిక్కిరిసిన రాజన్న ఆలయ పరిసరాలు

గృహజ్యోతికి శ్రీకారం

200 యూనిట్లలోపు విద్యుత్తు ఇక ఫ్రీ

- ఫిబ్రవరి నుంచే అమలు.. మార్చి బిల్లు జీరో
- ఒక కుటుంబానికి ఒక కనెక్షన్‌కే అమలు
- 2022-23లో 2,181 యూనిట్లలోపు ఉండాలి
- రేషన్ కార్డుకు ఆధార్ లింక్ అయి ఉండాలి
- తొలి విడతలో 34,59,585 మందికి అమలు
- ఏటా సర్కారుపై రూ.4,164 కోట్ల భారం



హైదరాబాద్, ఫిబ్రవ రి 5 (ఆంధ్రజ్యోతి): ఉచిత విద్యుత్తు కావాలంటూ ప్రజా పాలనలో దరఖాస్తు సమర్పించారా!? రేషన్ కార్డుతోపాటు ఆధార్ కార్డు, యునీక్ సర్వీస్ కనెక్షన్ (యూఎస్సీ) నంబర్లు పొందుపరిచారా..? గత (2022-23) ఆర్థిక సంవత్సరం 12 నెలల కాలంలో సగటున నెలకు 200 యూనిట్లలోపు కరెంట్ వినియోగించారా..? అయితే, ఈనెల నుంచే మీకు ఉచిత విద్యుత్తు పథకం (గృహజ్యోతి) అమల్లోకి వచ్చింది. వచ్చే నెల నుంచి మీరు కరెంటు బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు. ఫిబ్రవరి నెలలో వినియోగించిన కరెంటుకు మార్చి తొలి వారంలో రీడింగ్ తీసి బిల్లులు జారీ చేస్తారు కదా! గృహజ్యోతి పథకానికి అర్హులు ఎవరూ అప్పుడు కరెంటు బిల్లు చెల్లించాల్సిన అవసరం లేదు. అప్పటి నుంచి వారికి జీరో బిల్లు జారీ చేస్తారు. కాకపోతే, ఉచిత విద్యుత్తు పొందే వినియోగదారులంతా తప్పనిసరిగా బకాయిలన్నీ చెల్లించేయాలి. రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆరు హామీలను అమలు చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఇందులో గృహజ్యోతి పథకం ఒకటి. దీని కింద 200 యూనిట్లలోపు వినియోగదారులకు కరెంట్‌ను ఉచితంగా అందిస్తామని ప్రకటించింది. అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఆరు హామీల అమలుకు ఇటీవల దరఖాస్తులను స్వీకరించిన విషయం తెలిసిందే. వివిధ పథకాల అమలుకు 1,09,01,255 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో రేషన్ కార్డు/ ఆధార్ కార్డులు కలిగిన వారి దరఖాస్తులు 64,57,891. వారిలోనూ గృహవిద్యుత్తు సబ్సిడీ కోసం దరఖాస్తు చేసుకున్నవారు 34,59,585 మంది ఉన్నట్లు గుర్తించారు. తాజాగా ఆదివారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో పథకం అమలుకు సర్కారు ఆమోద ముద్ర వేసింది. పథకం అమలుకు ఏటా రూ.4,164 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేశారు. మరోవైపు, రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీలకు 101 యూనిట్ల వరకూ ఇప్పటికే ఉచిత విద్యుత్తును అందిస్తున్న విషయం తెలిసిందే. తాజాగా, వారిని కూడా గృహజ్యోతి పథకంలో కలిపేస్తారు. అంటే, వారికి కూడా ఇకనుంచి 200 యూనిట్ల దాకా ఉచితంగా విద్యుత్ అందించనున్నారు. ఇక, వీరికి సంబంధించి రూ.222.60 కోట్ల బకాయిలు ఉండగా.. వాటిని ఏకకాలంలో డిస్కమ్‌లకు విడుదల చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంతేనా.. ప్రతి నెల 20లోపు గృహజ్యోతి వినియోగదారుల వివరాలను డిస్కమ్‌లు ప్రభుత్వానికి అందించాలి. సంబంధిత చెల్లింపులను ఆ తదుపరి నెల ప్రభుత్వం చేస్తుంది.

పథకం అమలుకు మార్గదర్శకాలు ఇలా..

- 200 యూనిట్లలోపు వినియోగించే గృహ విద్యుత్తు వినియోగదారులు అర్హులు.
- ఒక కుటుంబంలో ఒక్క కనెక్షన్‌కే పథకం అమలు
- రేషన్ కార్డుకు ఆధార్ కార్డును తప్పనిసరిగా అనుసంధానం(లింక్) చేసుకుని ఉండాలి.
- ప్రజా పాలన దరఖాస్తులో యునీక్ సర్వీస్ కనెక్షన్ (యూఎస్సీ) నంబర్‌ను పొందుపరిచి ఉండాలి.
- డిస్కమ్‌లు ఎట్టి పరిస్థితుల్లోనూ కనెక్షన్‌పై పేరు మార్పిడి చేయరాదు. ఏ వినియోగదారుడి పేరు ఉంటుందో అతడి పేరుతోనే బిల్లు జారీ అవుతుంది.
- 2022-23 ఆర్థిక సంవత్సరంలో వినియోగం ఆధారంగా అర్హులను నిర్ణయిస్తారు. అప్పట్లో వార్షిక వినియోగం 2160 యూనిట్లు ఉందని అనుకుందాం. దానికి 10 శాతం అదనంగా కలుపుతారు. అప్పుడు వార్షిక వినియోగం 2,376 యూనిట్లు అవుతుంది. దానిని 12తో భాగించి నెల సగటు తీస్తారు. ఇలా చేసినప్పుడు నెలకు సగటున 198 యూనిట్లు వస్తుంది. వారికి ఉచిత విద్యుత్తును అమలు చేస్తారు. అంటే, 2022-23 ఆర్థిక సంవత్సరంలో 2,181 యూనిట్లలోపు విద్యుత్తును వినియోగించినవారే ఇప్పుడు ఈ పథకానికి అర్హులు అవుతారు. దీనికితోడు, బిల్లు జారీ సమయంలో కూడా వారు ఆ నెలకు 200లోపు విద్యుత్తును వినియోగించి ఉండాలి. పథకంలో చేరిన తర్వాత బకాయిలు చెల్లించకపోతే గృహజ్యోతిని అమలు చేయరు.

ఈనెల 15లోగా వివరాలన్నీ సేకరించాలి

రాష్ట్రంలో 200 యూనిట్లలోపు విద్యుత్‌ను వినియోగిస్తున్న గృహజ్యోతి లబ్ధిదారుల నుంచి ఆధార్ కార్డుతోపాటు రేషన్ కార్డు (ఆహార భద్రత కార్డులు) వివరాల సేకరణ ప్రక్రియను ఈనెల 15లోగా పూర్తి చేయాలని ఇంధన శాఖ ముఖ్య కార్యదర్శి సయ్యద్ అలీ ముర్తుజా రిజ్వీ అధికారులను ఆదేశించారు. పథకం అమలుపై సోమవారం ఆయన అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. దరఖాస్తులను పరిశీలించడంతోపాటు వారి ఆధార్, ఆహార భద్రత కార్డులను సేకరించాలని నిర్దేశించారు. ప్రతి కనెక్షన్‌కు ఫోన్ నంబర్‌ను నవీకరించాలని చెప్పారు. యజమాని పేరును కనెక్షన్ నుంచి తొలగించడానికి వీల్లేదని స్పష్టం చేశారు. వివరాల సేకరణ ఐచ్ఛికమేనని, 200 యూనిట్లలోపు కరెంట్ వినియోగించే వారు ప్రజాపాలనలో దరఖాస్తు పెట్టకపోయినా... వారి ఆధార్, ఆహార భద్రత కార్డుల వివరాలు తీసుకోవాలని సూచించారు.

విచారణకు కవిత హాజరు కావటం లేదు

- ఢిల్లీ మద్యం కేసులో సుప్రీంకోర్టుకు ఈడీ వెల్లడి
- ఇతర పిటిషన్లతో కలిపి 16న విచారణ: ధర్మాసనం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఢిల్లీ మద్యం పాలసీకి సంబంధించిన కేసులో తాము జారీ చేసిన సమన్లకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత స్పందించడం లేదని, విచారణకు హాజరు కావడం లేదని ఈడీ సుప్రీంకోర్టుకు తెలిపింది. దీనిపై కవిత తరఫు న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ, ఈడీ సమన్లను సవాల్ చేస్తూ కవిత పిటిషన్ వేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఆ పిటిషన్‌పై ధర్మాసనం విచారణ చేపట్టేవరకూ కొత్తగా సమన్లు జారీ చేయబోమని ఈడీ గతంలో సుప్రీంకోర్టుకు తెలిపిందని గుర్తు చేశారు. ఈడీ తరఫు న్యాయవాది అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు జోక్యం చేసుకుంటూ.. ఆ మినహాయింపు ఆ ఒక్కసారికే పరిమితమని చెప్పారు. కవిత దాఖలు చేసిన పిటిషన్ సోమవారం ధర్మాసనం ముందుకు వచ్చింది. అయితే ఈ పిటిషన్ నళిని చిదంబరం, అభిషేక్ బెనర్జీల పిటిషన్లతో ట్యాగ్ అయి ఉన్నందున ఆ కేసుల స్టేటస్‌ను ధర్మాసనం ఆరా తీసింది. ఈ సందర్భంగా ఈడీ తరఫున ఎస్వీ రాజు.. ఈడీ నోటీసు ఇచ్చినా కవిత హాజరు కావడం లేదని బెంచ్‌కు నివేదించారు. దీనిపై కవిత తరఫు న్యాయవాది కపిల్ సిబల్.. ఈడీ సమన్లనే కవిత సవాలు చేసినందున, విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. కవిత తరఫున సీనియర్ న్యాయవాదులు విక్రమ్ చౌదరి, నితీశ్ రానా కూడా కోర్టులో హాజరయ్యారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, ఈ నెల 16వ తేదీన అన్ని పిటిషన్లు కలిపి విచారిస్తామని తెలియజేసింది.

నేపథ్యం ఇదీ..

కవితకు ఈడీ గత ఏడాది సెప్టెంబరు 4న సమన్లు జారీ చేసింది. అదే నెల 15న ఢిల్లీలోని తమ ఆఫీసులో విచారణకు హాజరు కావాలని పేర్కొంది. అయితే, ఈడీ సమన్లను సవాల్ చేస్తూ కవిత సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మనీలాండరింగ్‌నిరోధక చట్టంతోపాటు ఇతర క్రిమినల్ చట్టాల్లో మహిళలకు మినహాయింపులు ఉన్నాయని, వాటి దృష్ట్యా.. తనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా ఈడీని ఆదేశించాలని కవిత విజ్ఞప్తి చేశారు. తన పిటిషన్‌పై తేల్చే లోపు ఈడీ సమన్లపై స్టే విధించాలని కోరారు. దీనిపై సుప్రీంకోర్టు.. తాము విచారణ జరిపే వరకూ కవితకు మళ్లీ సమన్లు జారీ చేయవద్దని ఈడీని అప్పట్లో ఆదేశించింది.

అసభ్య పోస్టింగ్‌లపై సునీత ఫిర్యాదుపై కేసు నమోదు

దర్యాప్తు ప్రారంభించిన హైదరాబాద్ పోలీసులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తనతో పాటు సోదరి వైఎస్ షర్మిల, చిన్నమ్మ వైఎస్ విజయమ్మపై అసభ్య పదజాలంతో వ్యక్తిగత దూషణలకు పాల్పడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని వైఎస్ వివేకానందరెడ్డి కూతురు సునీతారెడ్డి చేసిన ఫిర్యాదుపై హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 2న ఆమె ఫిర్యాదు చేయగా.. సైబర్ క్రైం పోలీసులు ఎఫ్ఐఆర్ (నంబర్ 589/2024) నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. తనకు భద్రత కరువైందని, తనను మానసిక వేదనకు గురి చేస్తున్నారని, సమాజంలో పరువు తీస్తున్నారని ఫిర్యాదులో ఆమె పేర్కొన్నారు. బాబాయికి పట్టిన గతే షర్మిలకూ పడుతుందని బెదిరిస్తున్నారని తెలిపారు. "సమాజంలో గొప్ప పేరున్న కుటుంబ నేపథ్యం, రాజకీయ పలుకుబడి ఉన్న కుటుంబం నుంచి వచ్చిన నేను ప్రైవేట్ జీవితం గడుపుతున్నాను. గత కొన్ని రోజులుగా వర్రా రవీంద్రరెడ్డి అనే వ్యక్తి ఫేస్‌బుక్ అకౌంట్ నుంచి నాపై వ్యక్తిగత దూషణలు చేస్తున్నాడు. బెదిరింపులకు పాల్పడే ధోరణిలో నాతో పాటు సోదరి వైఎస్ షర్మిల, చిన్నమ్మ వైఎస్ విజయమ్మపై అసభ్య పదజాలంతో వ్యక్తిగత దూషణలకు పాల్పడుతున్నాడు. గత నెల 29న ఇడుపులపాయలో షర్మిలను కలిశాను. ఈ విషయంపై సోషల్ మీడియాలో నా సన్నిహితులు పోస్ట్ చేయగా విస్తృత ప్రచారం జరిగింది. ఆ పోస్టును తెరిచి చూడగా... వర్రా రవీంద్రరెడ్డి ఫేస్‌బుక్ ఖాతా నుంచి వీడియోను పోస్ట్ చేశాడు. శత్రుశేషం ఉండకూడదని పెద్దలు చెప్పినట్లు అందులో పేర్కొన్నాడు. వాళ్లను కూడా చంపేస్తే ఎన్నికల్లో పనికొస్తుందని పోస్టులో ఉంది. వీడియో చూడగా.. వైఎస్సార్ ఘాట్ వద్ద నేను, షర్మిల వైఎస్సార్‌కు శ్రద్ధాంజలి ఘటించిన దృశ్యాలున్నాయి. ఆ వ్యక్తి ఫేస్‌బుక్ పేజీని చూడగా అందులో వైఎస్ విజయమ్మ, షర్మిలకు సంబంధించి బెదిరింపు పోస్టులున్నాయి. నన్ను, షర్మిలను కించపరుస్తూ, వైఎస్ విజయమ్మ గౌరవానికి భంగం కలిగించేలా పోస్టులున్నాయి' అని సునీతారెడ్డి ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఆధారాలతో సహా పోలీసుల ముందుంచారు. వర్రా రవీంద్రరెడ్డి గురించి వివరాలు సేకరించగా గతంలో అతనిపై ఎన్నో కేసులున్నట్టు గుర్తించారు. రవీంద్రరెడ్డి యూట్యూబ్ చానళ్లకు ఇచ్చిన పలు ఇంటర్వ్యూల్లో తనను, తన తండ్రిని కించపరిచినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. తనను వేధిస్తున్న అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నాలుగేళ్ల చిన్నారిపై వృద్ధుడి అఘాయిత్యం

- దేహశుద్ధి చేసి, పోలీసులకు అప్పగింత
- రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ ఘటన

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 5: మానవత్వం మంటకలిసేలా అభం శుభం తెలియని ఓ నాలుగేళ్ల చిన్నారిపై 66 ఏళ్ల వృద్ధుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. ఈ దారుణ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్‌లో చోటుచేసుకుంది. పట్టణంలోని ఓ అద్దె ఇంట్లో ఉంటున్న దంపతులకు నాలుగేళ్ల కూతురు ఉంది. ఆదివారం ఉదయం తోటిపిల్లలతో ఆడుకుంటున్న ఆ చిన్నారిని వారి పక్క ఇంట్లో నివాసముంటున్న విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగి పెంటయ్య మాయమాటలు చెప్పి ఇంట్లోకి తీసుకెళ్లాడు. కొద్దిసేపటికి బాలిక ఏడవటం మొదలుపెట్టింది. ఆ సమయంలో రోడ్డుపై ఆడుకుంటున్న మరో బాలిక పెంటయ్య ఇంట్లోకి వెళ్లి ఆ చిన్నారిని బయటకు తీసుకువచ్చింది. రాత్రి తల్లిదండ్రులు నిద్రకు ఉపక్రమించాక.. చిన్నారి మాత్రం నిద్రపోకుండా ఏడుస్తూనే ఉంది. గమనించిన తల్లి ఎందుకు ఏడుస్తున్నావని ప్రశ్నించగా.. మర్మావయవాల వద్ద నొప్పి వస్తుందని చెప్పింది. చిన్నారిని ఆరా తీయడంతో జరిగిన దారుణం బయటపడింది. దీంతో సోమవారం తెల్లవారుజామున చిన్నారి కుటుంబసభ్యులు పెంటయ్య ఇంటికి వెళ్లి, అతడికి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేయగా... వారు పెంటయ్యను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఇల్లందు 'అవిశ్వాసం'లో కిడ్నాప్!

- దాడులతో దద్దరిల్లిన మున్సిపల్ ఆఫీసు
- చివరికి కోరం లేక వీగిపోయిన అవిశ్వాసం
- 'ఖానాపూర్'లో అవిశ్వాసానికి ఓకే

ఇల్లెందు, ఖానాపూర్, నల్లగొండ టౌన్, ఫిబ్రవరి 5: అవిశ్వాస సమావేశం సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మునిసిపల్ కార్యాలయం రణరంగంగా మారింది. దాడులు, కిడ్నాప్‌లు సినిమా దృశ్యాలను తలపించాయి. ఇల్లెందు బీఆర్ఎస్ నేత కొండపల్లి గణేష్ నాయకత్వంలో నిర్వహించిన క్యాంపు నుంచి 17 మంది కౌన్సిలర్లు సోమవారం ఉదయం మునిసిపల్ ప్రత్యేక సమావేశంలో పాల్గొనేందుకు తరలివచ్చారు. ఈ సమయంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఆయన అనుచరులు బీఆర్ఎస్ కౌన్సిలర్ కొక్కు నాగేశ్వరావును ఎంపీపీ కార్యాలయంలో నిర్బంధించారు. అదే సమయంలో సీపీఐ కౌన్సిలర్ కుమ్మరి రవీందర్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడి చేశారు. అనంతరం ఇరువర్గాలు ఎంపీపీ కార్యాలయం వద్దకు చేరుకొని బాహాబాహీకి తలపడడంతో పాటు, ఎంపీపీ సమావేశ మందిరం అద్దాలను ధ్వంసం చేశారు. ఇదే సమయంలో కౌన్సిలర్ నాగేశ్వరావును ఎమ్మెల్యే కనకయ్య తన కారులో రహస్య ప్రాంతానికి తరలించారు. కాగా, దాడికి గురైన కుమ్మరి రవీందర్ అవిశ్వాస సమావేశంలో పాల్గొనకుండా అదృశ్యమయ్యారు. అనంతరం ఆర్డీవో శిరీష ఆధ్వర్యంలో జరిగిన ప్రత్యేక సమావేశానికి 17 మంది హాజరు కావల్సి ఉండగా 15 మంది కౌన్సిలర్లు మాత్రమే హాజరు కావడంతో కోరం లేక అవిశ్వాసం వీగిపోయింది. కాగా, తన భర్త నాగేశ్వరావును ఎమ్మెల్యే మునిసిపల్ చైర్మన్‌లు కిడ్నాప్ చేశారని, తన భర్తకు రక్షణ కల్పించలేదని పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ కౌన్సిలర్ భార్య వెంకటలక్ష్మి బంధువులతో మునిసిపల్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా, ఎమ్మెల్యే కోరం, మరో 16 మందిపై పోలీసులు కిడ్నాప్ కేసు నమోదు చేశారు. కాగా, నాగేశ్వరావును సాయంత్రం విడుదల చేసినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు.


బీఆర్ఎస్ కౌన్సిలర్ నాగేశ్వరరావును బలవంతంగా తీసుకెళ్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, కాంగ్రెస్ కార్యకర్తలు

ఏడాదిగా వాయిదా పడుతూ...

ఏడాదిగా వాయిదా పడుతూ వచ్చిన నిర్మల్ జిల్లా ఖానాపూర్ మున్సిపల్ అవిశ్వాస ప్రక్రియ ఎట్టకేలకు సోమవారం ముగిసింది. బీఆర్ఎస్‌కు చెందిన మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్‌పై అవిశ్వాస తీర్మానం నెగ్గింది.

నల్లగొండ మునిసిపల్ పీఠం కాంగ్రెస్ కైవసం

నల్లగొండ మునిసిపల్ చైర్మన్ పీఠాన్ని కాంగ్రెస్ పార్టీ దక్కించుకుంది. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్, 38వ వార్డు కౌన్సిలర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ ఎన్నికకు ఎక్స్‌అఫీషియో మెంబర్‌గా ఉన్న స్థానిక ఎమ్మెల్యే, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరయ్యారు. బీఆర్ఎస్‌కు చెందిన చైర్మన్ మందడి సైదిరెడ్డిపై జనవరి 8న నిర్వహించిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో ఆ పార్టీ చైర్మన్ పీఠాన్ని కోల్పోయింది. ఈ క్రమంలో చైర్మన్ ఎన్నిక కోసం సోమవారం మునిసిపల్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఇతర పార్టీల నుంచి ఎవరూ చైర్మన్ స్థానానికి పోటీకి ముందుకు రాకపోవడంతో శ్రీనివాస్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి, మిర్యాలగూడ ఆర్డీవో చెన్నయ్య ప్రకటించారు. కాగా, బీఆర్ఎస్ నుంచి వైస్ చైర్మన్‌గా ఎన్నికైన అబ్బగోని రమేష్ ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌లో చేరారు. అవిశ్వాసం నెగ్గిన నాటి నుంచి ఆయనే ఇన్‌చార్జి చైర్మన్‌గా కొనసాగుతున్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

జార్ఖండ్ పరీక్ష

జార్ఖండ్‌లో చంపయి సోరేన్ ప్రభుత్వం విశ్వాసపరీక్షలో బలంగా నెగ్గింది. మాజీ ముఖ్యమంత్రి హేమంత్ సోరేన్ అరెస్టు అనంతరం, మూడురోజుల క్రితం బాధ్యతలు స్వీకరించిన ఆయన ఈ తొలిపరీక్ష దాటగానే ఓ ట్వీట్ చేస్తూ, తమ ప్రభుత్వాన్ని అస్థిరపరచాలన్న కుట్రలను జేఎంఎం, కాంగ్రెస్, ఆర్జేడీ కూటమి సంఘటితంగా ఛేదించిందన్నారు. న్యాయస్థానం అనుమతితో ఈ విశ్వాసపరీక్షలో పాల్గొన్న హేమంత్ సోరేన్ చర్చ సందర్భాన్ని వినియోగించుకొని బీజేపీమీద తీవ్ర విమర్శలు చేశారు. జార్ఖండ్‌ను ఆదివాసీ ముఖ్యమంత్రులు పాలించడం ఆ పార్టీకి గిట్టదని, చివరకు దాని పాలనలో కూడా అదే విషయం రుజువైందని అంటూ, తనపై ఆరోపణలు రుజువుచేయగలిగినపక్షంలో రాజకీయాలనే కాదు, రాష్ట్రాన్నే వదిలిపోతానని ఓ భీకర ప్రతిజ్ఞచేశారు. పార్టీలో అత్యంత సీనియర్ నాయకుడు, శిబూ సోరేన్‌కు విశ్వాసపాత్రుడు అయిన చంపయిని సీఎం కుర్చీలో కూచోబెట్టడంవల్లనే ఈ గండంనుంచి జేఎంఎం బయటపడగలిగిందని చాలామంది నమ్మకం.

హేమంత్‌ను అరెస్టుచేసిన తరువాత, అక్కడి కూటమి ప్రభుత్వాన్ని కూల్చేయడం సులభమని బీజేపీ భావించిందో లేదో తెలియదు కానీ, జెఎంఎం నాయకులు మాత్రం చాలా జాగ్రత్తలు పడ్డారు. తమ ఎమ్మెల్యేలందరినీ హైదరాబాద్‌లో దాచి, ఆఖరునిముషంలో సభలో ప్రవేశపెట్టారు. చంపయిని ఆహ్వానించడం, ప్రమాణస్వీకారం, విశ్వాసపరీక్ష ఇత్యాది ఘట్టాల్లో జాప్యం, కుట్రలు జరిగాయని, వాటిని సంఘటితంగా ఎదుర్కొన్నామని జేఎంఎం వాదన. అయితే, హేమంత్ స్థానాన్ని ఎవరు భర్తీచేయాలన్న చర్చ పార్టీలో ఇంకా మొదలుకాకముందే, ఆయన భార్య కల్పన ముఖ్యమంత్రి కాబోతున్నారని రాష్ట్ర బీజేపీ నాయకులు ప్రచారం చేశారు. ఆ తరువాత శిబూ సోరేన్ పెద్దకోడలు, జెఎంఎం ఎమ్మెల్యే సీతాసోరేన్ బహిరంగంగానే కల్పనను వ్యతిరేకించడం, పార్టీలో తనతో సహా ఎంతోమంది సీనియర్లు ఉన్నారని గుర్తుచేయడం తెలిసినవే. హేమంత్ మీద ఈడీ దూకుడు పెంచుతున్నకొద్దీ ఆయన స్థానంలోకి కల్పన వస్తారన్న ప్రచారం బీజేపీ విస్తృతంగా చేసింది. విద్య, పారిశ్రామిక రంగాలకు పరిమితమైన కల్పన రాజకీయాలకు దూరంగా ఉన్నట్టు కనిపించినా, ఒడిశా మూలాలున్న ఆమెకు రాజకీయాలమీద ఆసక్తి ఉన్నదని, వ్యవహారాలు చక్కబెట్టగల సమర్థత ఉన్నదని చాలామంది అంటారు.

హేమంత్ అరెస్టు విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ చూపిన పట్టుదల ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ఫోర్జరీ పత్రాలతో భూమి కాజేశాడన్న ఆరోపణ తప్ప, ఆయనేమీ హంతకుడు కాదు, బ్యాంకులకు కోట్లు ఎగవేసి విదేశాలకు పారిపోతున్న పారిశ్రామికవేత్తా కాదు. ఆయనను ప్రశ్నించడం ముఖ్యం కావచ్చు కానీ, అది ఆలస్యం కావడం వల్ల వచ్చిపడే నష్టమేమీ లేదు. ఇంతకంటే తీవ్రమైన ఆరోపణలున్న నాయకులు, ముఖ్యమంత్రులు కేంద్రంలోని పెద్దల ఆశీస్సులతో చల్లగా ఉన్న దేశం మనది. హేమంత్ విషయంలో అవినీతిమీద పోరాటం కంటే విపక్షనేతల వేటకే బీజేపీ ప్రాధాన్యతనిస్తోందని అనిపించకమానదు. ఆయన కనిపించడం లేదని ఈడీ అనడం, బీజేపీ రాద్ధాంతం చేయడం చూసినప్పుడు ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తితో వ్యవహరించాల్సిన తీరు ఇదా అని విస్మయం కలుగుతుంది. ఈ పరిణామాల్లో హేమంత్ వ్యవహరించిన తీరు కూడా ఆశ్చర్యం కలిగించేదే. తనను అరెస్టుచేయడం ఖాయమని తేలిపోవడంతో, ఇంటిపోరును చక్కదిద్దుకోవడానికి, అధికార కూటమి ఎమ్మెల్యేలతో మంతనాలు జరపడానికి ఆయన ఈ సమయాన్ని వాడుకున్నట్టుంది. ముఖ్యమంత్రిగా అరెస్టువారెంట్ మీద సంతకం చేస్తే, రాజ్యాంగ సంక్షోభం పేరిట రాష్ట్రపతిపాలన విధించే అవకాశం ఉన్నందున, రాజీనామా తరువాతే దానిపై సంతకం చేసి ఆయన తన ప్రభుత్వాన్ని తెలివిగా కాపాడుకున్నాడని కొందరు అంటారు. హేమంత్‌బాబు మళ్ళీ రాష్ట్రాన్ని పరిపాలిస్తారు అంటూ విశ్వాసపరీక్ష సందర్భంగా చంపయి హామీ ఇచ్చారు. మరో మూడునెలల్లో పార్లమెంటు ఎన్నికలు, ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలు ఉండగా, హేమంత్ అరెస్టు రాష్ట్రంలోని 28శాతం ఆదివాసీ జనాభాకు ఏ అభిప్రాయం కలిగిస్తుందో చూడాలి. ఈడీ విచారణ అదేపనిగా సాగుతూ, అసెంబ్లీ ఎన్నికలయ్యేవరకూ హేమంత్ జైల్లోనే ఉండాల్సివస్తే, చంపయ్‌కు అది విషమపరీక్షే. ఎంతకాదనుకున్నా, ఏదో విధంగా హేమంత్ లేని జార్ఖండ్‌ను కైవసం చేసుకోవడం సులభమే.

భారత యాత్రికుడు, హిందూ ధర్మయోధుడు

అయోధ్యలో శ్రీరాముడి ప్రాణ ప్రతిష్ఠ జరిగిన పక్షం రోజులలోనే బీజేపీ సంస్థాపక సభ్యుడైన లాల్‌కృష్ణ అడ్వాణీకి దేశ అత్యున్నత పౌర పురస్కారం 'భారతరత్న' ప్రదానం చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం భారత జాతీయవాదులందర్నీ ఎంతో ఆనందపరిచింది. అయోధ్యకూ, అడ్వాణీకి అవినాభావ సంబంధం ఉన్నది. అయోధ్య రథయాత్రకు ఆయన పూనుకోకపోయి ఉంటే రామమందిర పునర్నిర్మాణం కోసం స్వతంత్ర భారత చరిత్రలో అతి పెద్ద ప్రజా ఉద్యమం ప్రారంభమయి ఉండేదే కాదు. ఈ దేశ ప్రజల్లో అంతర్లీనంగా ఉన్న జాతీయవాద భావాలను పెల్లుబుకేలా చేసి ఇవాళ 500 సంవత్సరాల బానిసత్వం నుంచి దేశం విముక్తి అయ్యేందుకు అడ్వాణీయే నాంది పలికారన్న విషయంలో ఎవరికీ ఏ మాత్రం సందేహం లేదు.

హిందూ మత భావోద్వేగాలను రెచ్చగొట్టి రాజకీయ ప్రయోజనాలు సాధించుకునేందుకే భారతీయ జనతా పార్టీ రామ జన్మభూమిని తెరమీదకు తీసుకువచ్చిందని కుహనా లౌకిక పార్టీలు, మేధావులు ఇప్పటికీ విమర్శిస్తుంటారు



■ వై. సత్యకుమార్

సత్యకాలమ్

అయితే బీజేపీతో నిమిత్తం లేకుండా ఈ దేశ ప్రజలందరూ శ్రీరాముడిని ఆరాధిస్తారని, అయోధ్యతో వారు చారిత్రకంగా, ఆధ్యాత్మికంగా, మానసికంగా మమేకం అయ్యారనే సత్యాన్ని వారు గ్రహించలేదు. లేకపోతే అయిదు దశాబ్దాలుగా రామజన్మభూమి కోసం ప్రజలు పోరాడేవారే కాదు. భారత ప్రజల మనోభావాలను తెలుసుకునేందుకే అయోధ్యలో 1990 సెప్టెంబర్– అక్టోబర్ నెలల్లో సోమనాథ్ నుంచి అయోధ్య వరకూ అడ్వాణీ రామ్ రథయాత్ర జరిపారు. ఆనాడు ఎవరూ ఊహించని విధంగా ఈ యాత్రకు ప్రజాస్పందన లభించింది. హిందూ ధర్మం భారతీయ ఆత్మ. ఈ ధర్మం పట్ల ప్రజలకున్న మమేకతను ఒక సానుకూల శక్తిగా మళ్లించినట్లయితే దాన్ని జాతీయ పునర్నిర్మాణం కోసం ఉపయోగించుకోవచ్చని స్వామీ వివేకానంద చెప్పిన మాటల్లో ఎంత సత్యం ఉన్నదో బీజేపీ తెలుసుకుంది. ఇవాళ అయోధ్యలో రామమందిర నిర్మాణంలో ప్రాణప్రతిష్ఠ జరిగినప్పుడు కోట్లాది ప్రజలు సానుకూలంగా స్పందించి వాడవాడలా సంబరాలు, ప్రార్థనలు జరుపుకోవడాన్ని చూస్తుంటే నాడు అడ్వాణీ రథయాత్రకు లభించిన ప్రతిస్పందన ఎంత సహజమైనదో అర్థమవుతోంది. అడ్వాణీ చేపట్టిన ఉద్యమం పట్ల ప్రజల ప్రతిస్పందన గమనించి నాడు కుహనా లౌకిక పార్టీలన్నీ ఏకమై ఆయనను 1990 అక్టోబర్ 23న బిహార్‌లోని సమస్తిపూర్‌లో అరెస్టు చేసి దాదాపు ఐదు వారాల పాటు నిర్బంధించాయి. ఆ రోజు అడ్వాణీతో పాటు వేలాది బీజేపీ కార్యకర్తల, కోట్లాది ప్రజల మనోభావాలను తొక్కిపెడితేనేం వారిలో ఉన్న అంతర్లీన జాతీయ వాద భావనల్ని అణిచివేయలేకపోయారు. నిప్పురవ్వ దావానలమైనట్లు ఆ తర్వాత కూడా అయోధ్యకోసం ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, బలిదానాలు జరిగాయి.



ప్రజలతో సంబంధాలే ప్రజాస్వామ్యానికి ప్రాణం అని అడ్వాణీ రుజువు చేశారు. ఆయన లాగా భారతదేశంలో విస్తృతంగా పర్యటించి జన నాడి తెలుసుకున్న నాయకుడు మరొకరు లేరు. నిత్యం ప్రజల్లో ఉంటూ, సామాన్యులనే నేతలుగా రూపొందిస్తూ భారతీయ జనతా పార్టీని ఆయన పటిష్ఠం చేశారు. ఈ నిరంతర యాత్రికుడికి 'భారతరత్న' ప్రదానం చేయడం చంద్రుడికి ఓ నూలుపోగు మాత్రమే.


తమ ఆకాంక్షలను నెరవేర్చుకునేందుకు ప్రజలు భారతీయ జనతా పార్టీని పూర్తి మెజారిటీతో రెండుసార్లు అధికారంలోకి తీసుకువచ్చారు.

రామజన్మభూమి కోసమే కాదు, దేశాన్ని సమైక్యం చేసేందుకు అడ్వాణీ అనేక యాత్రలు జరిపారు. 1993లో ఆయన తన జనాదేశ యాత్రను మైసూరు నుంచి ప్రారంభించి భోపాల్ వరకు 14 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించారు. ప్రజల జీవితాల్లో మతాన్ని నిర్మూలించేందుకు, మైనారిటీలను కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లును, ప్రజాప్రాతినిధ్య చట్టం సవరణ బిల్లును వ్యతిరేకించేందుకు ఆయన ఈ యాత్ర చేపట్టారు. నక్సలైట్ పీడిత ప్రాంతాలతో పాటు దేశ వ్యాప్తంగా నలుమూలలా ఆయన యాత్రకు అమోఘమైన ప్రతిస్పందన లభించింది. ఆ తర్వాత ముఖ్యమైనది 1996లో ఆయన కొచ్చిన్ నుంచి జరిపిన సురాజ్ యాత్ర. రామరాజ్యం భావన గురించి వివరిస్తూ అధికార పార్టీ అవినీతిని ఎండగడుతూ నెలరోజులకు పైగా ఆయన ఈ యాత్ర రాజస్థాన్‌లో ప్రవేశించే సమయానికి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడింది. ఈ యాత్రను నిర్వహించిన వారిలో ఒక కార్యకర్తగా నేను అడ్వాణీ తన ప్రసంగాల ద్వారా దేశభక్తిని ఎలా పురిగొల్పారో, ప్రజల్లో అద్భుతమైన ప్రతిస్పందన ఏ విధంగా లభించిందో ప్రత్యక్షంగా తెలుసుకున్నాను 1997లో దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యోద్యమ భావాలను పురికొల్పేందుకు, స్వరాజ్యం నుంచి సురాజ్యం సాధించే దిశగా దేశ ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించేందుకు ఆయన స్వాతంత్ర్య స్వర్ణజయంతి యాత్ర. నిర్వహించారు. దేశవ్యాప్తంగా స్వాతంత్ర్యోద్యమ వీరులు, అమరులకు నివాళులు అర్పించేందుకు వారి ప్రాంతాలను సందర్శించారు. వారు త్యాగాలు జరిపిన ప్రాంతాలకు వెళ్లడం ఒక తీర్థయాత్రగా అడ్వాణీ అభివర్ణించారు. నిజానికి స్వాతంత్ర్యం సాధించామని చెప్పుకుంటున్న కాంగ్రెస్ నేతలు కూడా స్వర్ణజయంతిని జరుపుకోలేదు. కాని అడ్వాణీ తన స్వర్ణజయంతి యాత్ర ద్వారా స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి అయిదు దశాబ్దాల్లో దేశం సాధించిన విజయాలు, వైఫల్యాలను సమీక్షించి ప్రజల్లో చర్చను లేవనెత్తారు. భారతీయ జనతా పార్టీయే దేశానికి మంచి పాలనను అందించగలదని వివరించారు. దేశాన్ని ఆకలి, అవినీతి, భయం నుంచి విముక్తి కావాలంటే బీజేపీ అధికారంలోకి రావల్సిన చారిత్రక అవసరాన్ని ఆయన వివరించారు. అటల్ బిహారీ వాజపేయి ప్రభుత్వాన్ని 13 రోజుల్లో పడగొట్టడంపై ప్రజల్లో అసంతృప్తి నెలకొన్న సమయమది. దాదాపు 15వేల కిలోమీటర్ల మేరకు నాలుగు దశల్లో జరిపిన ఈ స్వర్ణజయంతి రథయాత్రలో 59 రోజుల పాటు 21 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఆయన ప్రయాణించి 759 సభల్లో ప్రసంగించారు. స్వాతంత్రోద్యమాన్ని జాతీయ వాదంతో సమ్మిళితం ఎలా చేయాలో, దేశం ఎదుర్కొంటున్న వివిధ సవాళ్లపై ఏ విధమైన దృక్పథాన్ని అలవరుచుకోవాలో ఆయన ఈ యాత్ర ద్వారా తెలిపారు. నాడు అడ్వాణీ జరిపిన స్వర్ణ జయంతి యాత్ర 1998లో అటల్ బిహారీ నాయకత్వంలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు దోహదం చేసింది.

అధికారంలో ఉన్నప్పుడు కూడా అడ్వాణీ యాత్రలు జరపడం ఆపలేదు. 2002లో భారత్ ఉదయ్ యాత్ర పేరుతో 33 రోజుల పాటు 8500 కిలోమీటర్ల మేరకు రెండు దశలుగా 16 రాష్ట్రాల్లోని 121 లోక్‌సభ నియోజకవర్గాల్లో ఆయన పర్యటించారు. మళ్లీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు 2006లో భారత సురక్షా యాత్ర జరిపి ఉగ్రవాదం, మైనారిటీ బుజ్జగింపు రాజకీయాలు, అవినీతి, రాజకీయాల్లో నేరచరిత్రుల వల్ల జరిగే ప్రమాదాల గురించి ప్రజలకు వివరించారు. 2011లో జనచేతనా యాత్ర పేరుతో బిహార్ నుంచి ప్రారంభించి 40 రోజుల పాటు దేశ వ్యాప్తంగా పర్యటించారు. యూపీఏ హయాంలో అవినీతిని ఆయన ఎండగట్టారు. ఈ యాత్ర ప్రజల్లో చైతన్యాన్ని రేకెత్తించి 2014లో బీజేపీ అఖండ మెజారిటీతో అధికారంలోకి రావడానికి మార్గాన్ని సుగమం చేసింది. తన జీవితమంతా ప్రజలను కలుసుకునేందుకు ఏ ఒక్క అవకాశాన్నీ అడ్వాణీ వదిలిపెట్టలేదు. ప్రజలతో సంబంధాలే ప్రజాస్వామ్యానికి ప్రాణం అని ఆయన రుజువు చేశారు. ఆయన లాగా భారతదేశంలో విస్తృతంగా పర్యటించి ప్రజల నాడి తెలుసుకున్న నాయకుడు మరొకరు లేరు. నిత్యం ప్రజల్లో ఉంటూ, సామాన్యులనే నేతలుగా రూపొందిస్తూ భారతీయ జనతా పార్టీని ఆయన పటిష్ఠం చేశారు. దేశం కోసం ఈ నిరంతర యాత్రికుడు చేసిన త్యాగాలను గౌరవించేందుకు 'భారతరత్న' ప్రదానం చేయడం చంద్రుడికి నూలుపోగు సమర్పించడం మాత్రమే.

భారత రాజ్యాంగం విప్లవకరమైనదే కానీ...

వర్తమాన భారత రాజకీయ రంగంలో రెండు పరస్పర విరుద్ధ వాస్తవాలు ఒకేసారి కొనసాగుతున్నాయి. మొదటిది: ఒక ప్రజాస్వామిక రాజ్యాంగం అమలులో వున్నది. కొందరు దీన్ని లౌకిక, సామ్యవాద రాజ్యాంగం అని కూడ అంటున్నారు. రెండోది: దేశ పాలన ఫాసిస్టు శక్తుల చేతుల్లోకి పోయింది. ప్రజాస్వామిక రాజ్యాంగం అమలులో ఉన్న కాలంలోనే రాష్ట్రపతి ఉత్తర్వులతో దేశంలో అత్యవసర పరిస్థితిని ప్రకటించడాన్ని మనం చూశాం. ప్రజాస్వామిక, లౌకిక, సామ్య వాద రాజ్యాంగం అమల్లోవున్న కాలంలోనే ఫాసిస్టు శక్తులు రాజ్యాధికారాన్ని చేజిక్కించుకోవడాన్నీ ఇప్పుడు చూస్తున్నాం.



ఇన్ని విశాల సమూహాలు రాజ్యాంగాన్ని నమ్ముతున్నప్పుడు వాళ్ళను కటువుగా 'రాజ్యాంగవాదులు' అనడం ఒక చారిత్రక తప్పిదం అవుతుంది. నిస్సందేహంగా భారత రాజ్యాంగం ఒక సామాజిక విప్లవ దస్త్రం. అంతకన్నా మేలైన సమాజాన్ని నిర్మించాలనుకున్నవారు అంతకన్నా మేలైన, ఆచరణ సాధ్యమైన, రాజ్యాంగాన్ని ప్రతిపాదించాలి.

రాజ్యాంగం అమాయికంగా ఫాసిజాన్ని ప్రమోట్ చేస్తున్నదా? ఫాసిస్టులు రాజ్యాంగాన్ని తెలివిగా వాడుకుంటున్నారా? అనే ప్రశ్న ఈ సందర్భంగా తలెత్తడం సహజం. ఎలా చూసినా భారత రాజ్యాంగం విప్లవకరమైనది. మనువు విధించిన సామాజిక నిబంధనలతో, చాణుక్యుడు/ కౌటిల్యుడు / విష్ణుగుప్తుడు రూపొందించిన ఆర్థిక విధానాలతో నడిచే వ్యవస్థలో నలిగిపోతున్న కోట్లాది మంది ప్రజానీకానికి అది కొత్త జీవితాన్ని ఇచ్చింది. మరోమాటలో చెప్పాలంటే, కుల–మత ప్రధాన ఫ్యూడల్ వ్యవస్థను పెట్టుబడీదారీ వ్యవస్థగా మార్చడంలో రాజ్యాంగం కేటలిస్ట్ పాత్రను నిర్వహించింది. సమాజంలో వచ్చిన ఆ గుణాత్మకమార్పును మనం స్పష్టంగా చూస్తున్నాం. అందుకు రాజ్యాంగాన్ని మెచ్చుకోవాలి.

రాజ్యాంగ సభలోని దాదాపు డజను కమిటీల్లో కీలకమైన డ్రాఫ్టింగ్ కమిటీకి చైర్మన్‌గా వ్యవహరించిన బిఆర్ అంబేద్కర్ తన చివరి ఉపన్యాసంలో (నవంబరు 25, 1949) రాజ్యాంగం పరిధి–పరిమితుల గురించి ప్రస్తావించాడు. 'ప్రతి మనిషికీ ఒక ఓటు; ప్రతి ఓటుకూ సమాన విలువ ఇవ్వడం ద్వారా రాజకీయరంగంలో సమానత్వాన్ని సాధించాం. అయితే, ఇది సరిపోదు. సాంఘిక, ఆర్థిక రంగాల్లోనూ సమానత్వాన్ని సాధించి తీరాలి. భవిష్యత్తు పాలకులు అందుకు కృషి చేయాలి. వాళ్ళు సాధ్యమైనంత త్వరగా సాంఘిక, ఆర్థిక రంగాల్లో సమానత్వాన్ని సాధించకపోతే ఆ రంగాల్లోని పీడితులకు ప్రజాస్వామ్యం మీద నమ్మకం పోతుంది. అప్పుడు వాళ్ళు తిరగబడి ఇన్నేళ్ళుగా మనం కష్టపడి నిర్మించిన ఈ ప్రజాస్వామిక భవనాన్ని పేల్చి పడేస్తారు' అని హెచ్చరించాడు. ప్రతిదానికీ వున్నట్టు రాజ్యాంగాలకూ ఒక ఎక్స్‌పైరీ డేట్ వుంటుంది; అది పెట్టుబడిదారుల రాజ్యాంగం కావచ్చు, సోషలిస్టుల రాజ్యాంగం కావచ్చు. దేనికీ మినహాయింపు లేదు. రాజ్యాంగాలు ఎల్లకాలం తొలినాటి ఆదర్శాలతో కొనసాగలేవని వివిధ దేశాల చరిత్ర మనకు చెపుతున్నది.

స్వాతంత్ర్యానంతర భారతదేశంలో ముస్లింలను ఒక పథకం ప్రకారం 'నయా అస్పృశ్యులు'గా మార్చారు. 2019 లోక్‌సభ ఎన్నికల్ని పీష్వా బాలాజీ బాజీరావు, అహమద్ షా దుర్రానీ అబ్దాలీల మధ్య పోటీగా జరిపారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు ఛత్రపతి శివాజీ, ఔరంగజేబ్‌ల మధ్య పోటీగా జరిగాయి. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు రాణి అబ్బక్క, టిప్పూ సుల్తాన్‌ల మధ్య పోటీగా జరిగాయి. రేపు లోక్‌సభ ఎన్నికలు శ్రీరామునికీ శంభూకునికి మధ్య జరపడానికి పూర్తి సన్నాహాలు చేస్తున్నారు.

పోటీలో వున్న ఏ అభ్యర్థీ తమకు నచ్చలేదని చెప్పడానికి పోలింగ్‌లో 'నోటా'ను వాడడం ఒక ప్రజాస్వామిక హక్కుగా మనం భావిస్తున్నాం. 'ముస్లింల ఓట్లు మాకు వద్దు' అనడం కూడా ఎన్నికల్లో ఒక ప్రజాస్వామిక హక్కుగా చెలామణీ అయిపోతున్నది. ఐదేళ్ళకొకసారి ఎన్నికలు జరగడమే కొలమానం కనుక దీన్ని వామపక్షాలు సహితం ప్రజాస్వామ్యం అనక తప్పడంలేదు. పైగా, ఇవన్నీ రాజ్యాంగబద్ధంగా, దేశ అత్యున్నత న్యాయస్థానం ఆశీస్సులతోనే జరుగుతున్నాయి.

భూస్వామ్య వ్యవస్థ కన్నా పెట్టుబడీదారీ వ్యవస్థ విప్లవకరమైనదని కార్ల్ మార్క్స్ – ఫ్రెడరిక్ ఏంగిల్స్ స్వయంగా మెచ్చుకున్నారు. లెనిన్‌కూ అలాంటి అభిప్రాయమే వుంది. పెట్టుబడీదారీ వ్యవస్థను మించిన సోషలిస్టు, కమ్యూనిస్టు సమాజాలను నిర్మించాలంటే పెట్టుబడీదారీ రాజ్యాంగాన్ని మించిన రాజ్యాంగాలను రూపొందించుకోవాలని వాళ్ళు సమంజసంగానే ఆలోచించారు. మహాత్మా గాంధీజీ మరణం తరువాత 1948 ఫిబ్రవరిలో కలకత్తాలో జరిగిన ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ జాతీయ మహాసభల్లో అప్పటి పార్టీ ప్రధాన కార్యదర్శి బిటి రణదివె స్వాతంత్ర్యాన్ని 'అధికార మార్పిడి'గా పేర్కొన్నాడు. దాదాపు అదే సమయంలో రాజ్యాంగ సభ లక్ష్య ప్రకటన తీర్మానాన్ని (ఆబ్జెక్టివ్ రిజల్యూషన్) ఆమోదించింది. 'న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం' వంటి ఆదర్శాలు ఆ తీర్మానంలో వున్నాయి. ఉమ్మడి కమ్యూనిస్టు పార్టీ అప్పటికి వాటిని నమ్మలేదు సాయుధ పోరాటానికి పిలుపిచ్చింది. లక్ష్య ప్రకటన తీర్మానమే తరువాత రాజ్యాంగ ప్రవేశిక (preamble)గా మారింది.

రాజ్యాంగం మీద చర్చను ఒక విధంగా అంబేద్కరే మొదలెట్టాడు అనవచ్చు. రాజ్యాంగం ఒక నిబంధనావళి కనుక అందులో ప్రకటించుకున్న ఆదర్శాలకన్నా వాటిని అమలు చేసేవారే ముఖ్యం. 'అమలుపరచేవారు చెడ్డవారయితే మంచి రాజ్యాంగం కూడ చెడ్డదయిపోతుంది. అమలుపరచేవారు మంచివారయితే చెడ్డ రాజ్యాంగం కూడ మంచిదయిపోతుంది' అన్నాడు. అంతటితో ఆగలేదు; 'గొప్ప ఆదర్శంతో దేవాలయాన్ని నిర్మిస్తే దాన్ని ప్రారంభించడానికి ముందే దెయ్యాలు ఆక్రమించుకున్నాయి' అన్నాడు. రాజ్యాంగం అమల్లోకి వచ్చాక కూడా సమాజంలో పీడన కొనసాగుతుంటే దాన్ని ఇతరులకన్నా ముందు తనే తగలబెడతాననీ అన్నాడు.

'ఆలోచనాపరులు ప్రపంచాన్ని రకరకాలుగా వ్యాఖ్యానించారు; కానీ చెయ్యాల్సిందేమంటే దాన్ని మార్చడం అన్నాడు' కార్ల్ మార్క్స్. లెనిన్ మరింత స్పష్టంగా 'నిర్దిష్ట పరిస్థితుల, నిర్దిష్ట విశ్లేషణ' అన్నాడు. విశ్లేషించడం అంటే ఆ వ్యవస్థలో పీడకులు ఎవరో, పీడితులు ఎవరో తేల్చడం. భారత సమాజ నిర్దిష్ట పరిస్థితుల, నిర్దిష్ట విశ్లేషణను భారత కమ్యూనిస్టు పార్టీలు ఏవీ ఇప్పటి వరకు చేయలేదు. ముఖ్యంగా, అప్పట్లో కుల వ్యవస్థనూ, ఇప్పట్లో మత వ్యవస్థను నిర్దిష్టంగా విశ్లేషించలేదు. సాంస్కృతిక మ్యాపింగ్ విధానాలు (Cultural Cartography) అభివృద్ధి చెందిన కాలంలో అలాంటి విశ్లేషణలు చేయకుండా కమ్యూనిస్టు పార్టీలు చేపట్టిన పోరాటాలు లక్ష్యాలను సాధించలేదు. పైగా, పెట్టుబడీదారీ వ్యవస్థ బలపడడానికే అవి దోహదపడ్డాయి. పీడిత ప్రజలు ఆర్థిక ప్రయోజనాలకు ఆశపడేమాట నిజమేగానీ వాళ్ళు అంతకన్నా తమ సాంస్కృతిక ఉనికినే బలంగా కోరుకుంటారు. కమ్యూనిస్టు పార్టీలు ప్రజాదరణను క్రమంగా కోల్పోతుండడానికి ఇది ప్రధాన కారణం.

వ్యవస్థ భూస్వామ్యం నుండి పెట్టుబడీదారీ దిశగా, అక్కడి నుండి కార్పొరేట్ దశగా మారే క్రమంలో ఎస్టీ ఎస్సీ బీసీలకు చాలా మేళ్లు జరిగాయి. పట్టణీకరణ – నగరీకరణ జరిగేకొద్దీ బహుజనుల ఆత్మగౌరవం పెరిగింది. వాళ్ళ ఉనికిని కాపాడే అనేక చట్టాలు వచ్చాయి. కనీసం మనుషులుగానే పరిగణించని సమూహాలకు వ్యక్తిగత ఆస్తిహక్కు వచ్చింది. వ్యక్తిగత ఆస్తిహక్కు వల్ల కార్పొరేట్లకే ఎక్కువ మేలు జరుగుతున్నదనేది నిజమే. సంపద ఒక చోట పోగవుతూ మరోవైపు పేదరికం పెరుగుతున్నదనేదీ వాస్తవమే. అయినప్పటికీ, సాంస్కృతికంగా అణగారిన సమూహాలకు ఇప్పటి స్థితి కొంచెం ఊపిరి పీల్చుకునేలా చేస్తున్నది. దీనికి కారణం రాజ్యాంగమేనని వాళ్ళు నమ్ముతారు. ఈ ఘనత అంబేడ్కర్‌దేనని వాళ్ళు భావించడమూ సహజం.

మరోపక్క మార్క్సిస్టు – లెనినిస్టు పార్టీలకు పెట్టుబడీదారీ రాజ్యాంగం మీద ఎన్నడూ నమ్మకం లేదు. రాజ్యాంగ ఆదర్శాలను ప్రభుత్వాధినేతలు పాటించరు అనే అభిప్రాయం వారిలో బలంగా వుంటుంది. వాళ్ళే ప్రకటించుకున్న రాజ్యాంగాన్ని వాళ్ళే పాటించడం లేదు అనేది వాళ్ళ ప్రధాన విమర్శ ప్రాతినిధ్య పార్లమెంటరీ ప్రజాస్వామ్యాన్ని మొత్తంగా కార్పొరేట్లు హైజాక్ చేసినపుడు ప్రత్యామ్నాయం ఏమిటీ? అనేది సమంజసమైన ప్రశ్న. ఇటీవల విజయవాడలో జరిగిన విప్లవ రచయితల సంఘం (విరసం) మహాసభలో ఇదే ప్రధాన చర్చనీయాంశం.

ముస్లిం మతమైనారిటీల ఉనికి అంతరించిపోయే సందర్భం వచ్చినపుడు తలెత్తిన షాహీన్ బాగ్ ఉద్యమం భారత రాజ్యాంగాన్నే ఆశ్రయించింది. నిరాశ్రయులు, నిస్సహాయులకు అది పెద్ద దిక్కుగా కన్పించింది. 'స్వేచ్ఛ, సమానత్వం, సోదర భావం' నినాదాలతో ఢిల్లీ నగర శివార్లు ప్రతిధ్వనించాయి. ఆ తరువాత సాగిన రైతాంగ ఉద్యమం షాహీన్ బాగ్ నుండే స్ఫూర్తి పొందింది. ఉమ్మడి పౌరస్మృతి అంశం ముందుకు వచ్చినప్పుడు ఈశాన్య భారతదేశంలోను ఆదివాసులు షాహీన్ బాగ్ మార్గాన్నే అనుసరించారు. రాజ్యాంగాన్ని హృదయాలకు హత్తుకున్నారు.

కార్పొరేట్ వ్యవస్థను, అది రాజ్యాంగ ఆదర్శాలను కాలరాస్తున్న తీరునూ విరసం విమర్శించడంలో తప్పులేదు. విమర్శించాలి కూడా. పనికి రానపుడు రాజ్యాంగాన్నీ తిరస్కరించవచ్చు. కానీ, రాజ్యాంగంవల్ల తమ జీవితాలు బాగుపడ్డాయని నమ్ముతున్న పీడిత సమూహాలతో సున్నితంగా వ్యవహరించాలి. మతోన్మాదాన్ని ఆశ్రయించి బలపడుతున్న కార్పొరేట్ వ్యవస్థలోని పీడితుల్ని, అస్పృశ్యుల్ని, నయా అస్పృశ్యుల్ని ఏకం చేయడానికి ప్రయత్నించాలి. ఇన్ని విశాల సమూహాలు రాజ్యాంగాన్ని నమ్ముతున్నప్పుడు వాళ్ళను కటువుగా 'రాజ్యాంగవాదులు' అనడం ఒక చారిత్రక తప్పిదం అవుతుంది. నిస్సందేహంగా భారత రాజ్యాంగం ఒక సామాజిక విప్లవ దస్త్రం. అంతకన్నా మేలైన సమాజాన్ని నిర్మించాలనుకున్నవారు అంతకన్నా మేలైన, ఆచరణ సాధ్యమైన, రాజ్యాంగాన్ని ప్రతిపాదించాలి.

■ డానీ

ప్రపంచమంతా మంటగలుస్తున్న మానవ హక్కులు!

ప్రపంచ మానవ హక్కుల నివేదిక 2024 జనవరి 11న న్యూయార్క్‌లో విడుదలైంది. హ్యూమన్ రైట్స్ వాచ్ అనే అంతర్జాతీయ ప్రభుత్వేతర సంస్థ ప్రతి సంవత్సరం ఈ నివేదికను రూపొందిస్తుంది. ప్రస్తుత నివేదిక ముపె[illegible]నాలుగవది. మొత్తం 740 పేజీల ఈ నివేదిక ఆఫ్ఘానిస్తాన్ నుంచి జింబాబ్వే వరకు 105 దేశాల్లో 2023 మానవ హక్కుల పరిస్థితిని సమీక్షించింది. యుద్ధకాల దురాగతాలు పెరుగుతున్నాయని, మానవ హక్కుల కార్యకర్తలపై అణచివేతలు, హక్కుల చట్టాలపై ప్రభుత్వాల దాడి పెరుగుతున్నదని నివేదిక వివరించింది. ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల సూత్రాలను వర్తింపజేయడంలో ప్రభుత్వాల ద్వంద్వ ప్రమాణాల వల్ల లెక్కలేనన్ని జీవితాలు ప్రమాదంలో పడుతున్నాయని నివేదిక పేర్కొంది.

ఉక్రెయిన్, మయన్మార్ మాదిరిగానే ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య తిరిగి నెలకొన్న పోరాటం అక్కడి సామాన్యులకు ప్రాణసంకటంగా మారింది. హమాస్ యుద్ధ నేరాలను ఖండించిన అనేక ప్రభుత్వాలు, గాజాపై ఇజ్రాయెల్ దాడులకు అంతగా స్పందించడం లేదు. అఫ్ఘనిస్థాన్‌లో మానవ హక్కుల పరిస్థితి క్షీణిస్తూనే ఉంది. తాలిబాన్ విస్తృతంగా మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడింది– ప్రత్యేకించి మహిళలు, బాలికలకు వ్యతిరేకంగా. బాలికలకు మాధ్యమిక, ఉన్నత విద్యపై నిషేధం; మహిళలకు పలు రంగాలలో ఉద్యోగాలపై నిషేధం; మహిళల సంచారం, వాక్ స్వాతంత్ర్యంపై పలు కట్టుబాట్లు; మహిళలు, బాలికలపై పలు ఆకృత్యాల తీరును నివేదిక నిర్ధారించింది. 2024 జాతీయ ఎన్నికలకు ముందు బంగ్లాదేశ్ అధికారులు అణచివేతను కఠినతరం చేశారు. భద్రతా దళాలు ప్రతిపక్ష సభ్యుల మూకుమ్మడి అరెస్టులు చేశాయి. లీకైన పోలీసు అధికారుల సమావేశాల మినిట్లను బట్టి విపక్ష సభ్యులను పోటీకి అనర్హులు చేసే నెపంతో నేరారోపణలు జరిగినాయి. ప్రధాన ప్రతిపక్షమైన బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీకి చెందిన ఐదు లక్షల సభ్యులు రాజకీయ ప్రేరేపిత నేరాలను ఎదుర్కొంటున్నారు. బంగ్లాదేశ్‌లోని మహిళలకు గృహ హింస నుండి న్యాయం పొందేందుకు చాలా తక్కువ అవకాశాలు ఉన్నాయి. 51 శాతంతో ప్రపంచంలో అత్యధిక బాల్య వివాహాల రేటు బంగ్లాదేశ్ కలిగి ఉంది. బాల్య వివాహాలను చట్టబద్ధం చేసిన ఒకే ఒక్క దేశంగా బంగ్లాదేశ్ ఇటీవల అవతరించడం సిగ్గు చేటు.



దేశంలోని అనేక ప్రాంతాలలో మతపరమైన హింసాత్మక సంఘటనలు జరిగినాయి. మణిపూర్‌లో జాతి ఘర్షణల్లో వందల సంఖ్యలో ప్రజలు చనిపోయారు. జమ్మూ, కశ్మీర్‌లో ఏడాది పొడవునా భద్రతా బలగాలు జరిపిన చట్టవిరుద్ధ హత్యల నివేదికలు వచ్చాయని హ్యూమన్ రైట్స్ వాచ్ తెలిపింది.

జిన్‌పింగ్ పాలనలో చైనాలో అణచివేత తీవ్రమైంది. చైనా ప్రభుత్వం జిన్‌జియాంగ్‌లోని ఉయ్‌ఘర్‌లు, ఇతర టర్కిక్ ముస్లింలకు వ్యతిరేకంగా అణచివేత కొనసాగిస్తోంది. టిబెట్, జింజియాంగ్‌లలో విదేశాలలో కుటుంబ సభ్యులు, స్నేహితులను సంప్రదించేవారిని, వారి సంస్కృతి, భాష, మతం కోసం వాదించే వారిని 'వేర్పాటువాదులు'గా పరిగణించి వారిపై కఠినమైన జైలు శిక్షలు విధించబడుతున్నాయి. చైనా అంతటా, ప్రభుత్వం సామాజిక నియంత్రణలను మరింత కఠినతరం చేస్తోంది. హాంకాంగ్‌లో జాతీయ భద్రతా చట్టం ద్వారా నగరంపై పూర్తి నియంత్రణను చేపట్టింది. అక్కడి నివాసితుల కనీస హక్కులు లేకుండా చేస్తున్నది.

ప్రధానమంత్రి మోదీ నేతృత్వంలోని భారత ప్రభుత్వంలో మతపరమైన, ఇతర మైనారిటీల పట్ల వివక్ష, కళంకం కలిగించే విధానాలు కొనసాగుతున్నాయి. దేశంలోని అనేక ప్రాంతాలలో మతపరమైన హింసాత్మక సంఘటనలు జరిగినాయి. మణిపూర్ రాష్ట్రంలో వందల సంఖ్యలో జాతి ఘర్షణల్లో ప్రజలు చనిపోయారు. జమ్మూ, కశ్మీర్‌లో భావ ప్రకటనా స్వేచ్ఛ, శాంతియుత సమావేశం, ఇతర హక్కులపై ఆంక్షలు కొనసాగాయి. ఏడాది పొడవునా భద్రతా బలగాలు జరిపిన చట్టవిరుద్ధ హత్యల నివేదికలు వచ్చాయని హ్యూమన్ రైట్స్ వాచ్ నివేదిక తెలిపింది. అధికార పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుడు, రెజ్లింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ శరణ్ సింగ్ లైంగిక వేధింపుల ఆరోపణలపై అథ్లెట్లు వారాల తరబడి నిరసన వ్యక్తం చేసినప్పటికీ అధికారులు విచారణ ఆలస్యం చేశారు. పౌర సమాజ కార్యకర్తలు, స్వతంత్ర పాత్రికేయులు, రాజకీయ ప్రత్యర్థులపై బెదిరింపులు, ఆరోపణల ద్వారా వారిని నిశ్శబ్దపరచడానికి అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారని నివేదిక పేర్కొంది. మణిపూర్‌లో జాతుల హింసలో రాష్ట్ర నాయకత్వం పాత్ర పోషించిందని ఎడిటర్స్ గిల్డ్ ఆఫ్ ఇండియా ఒక నివేదికను ప్రచురించిన తర్వాత పోలీసులు దానిపై క్రిమినల్ కేసులు పెట్టారని అది గుర్తుచేసింది.

పాకిస్థాన్‌లో మహిళలు, బాలికలపై హింస–అత్యాచారం, హత్య, యాసిడ్ దాడులు, గృహ హింస, విద్య తిరస్కరణ, పని వద్ద లైంగిక వేధింపులు, బలవంతపు వివాహాలు ఆ దేశమంతటా ఉన్న తీవ్రమైన సమస్య అని నివేదిక పేర్కొంది. పాకిస్థాన్‌లో ప్రతి ఏటా 1000 మహిళలు 'గౌరవ హత్యలకు' బలైపోతున్నారు. యునైటెడ్ నేషన్స్ చిల్డ్రన్స్ ఫండ్ (UNICEF) అంచనా ప్రకారం 18ఏళ్ల లోపు గల 18.9 మిలియన్ల బాలికలు, 15ఏళ్ల లోపు గల 4.6 మిలియన్ల బాలికల వివాహాలు చేస్తున్నారు. ముఖ్యంగా మతపరమైన మైనారిటీలు ఎక్కువగా బలవంతపు వివాహాలకు గురతున్నారు.

యూరోపియన్ యూనియన్ తన మానవ హక్కుల బాధ్యతలను తప్పించుకుంది, శరణార్థులను ఇతర దేశాలకు వెనక్కి నెట్టింది. శరణార్థులను దూరంగా ఉంచడానికి లిబియా, టర్కీ వంటి హక్కుల దుర్వినియోగ ప్రభుత్వాలతో ఒప్పందాలు కుదుర్చుకుంది. జపాన్, దక్షిణ కొరియా, ఆ[illegible]యాతో సహా ఆసియా–పసిఫిక్ ప్రాంతంలోని ప్రజాస్వామ్య ప్రభుత్వాల సైనిక పొత్తులు, వాణిజ్య హామీల ఒప్పందాలు మానవ హక్కులకు ఘాతుకంగా మారుతున్నాయి. అమెరికాలో ఆర్థిక, జాతిపరమైన అసమానతలు కొనసాగుతున్నాయి. పేదరికం పెరుగుదలకు దారితీస్తున్నది. ప్రపంచంలోనే అత్యధిక ఖైదీల రేటును అమెరికా కలిగివుంది. ముఖ్యంగా నల్ల జాతీయులు అసమానంగా ఖైదు చేయబడుతున్నారు. 2023లో పోలీసులు చంపిన 800 మందిలో శ్వేత జాతీయుల కంటే మూడు రెట్లు ఎక్కువ నల్ల జాతీయులు ఉన్నారు. అబార్షన్ హక్కులు, LGBTQ+ హక్కులను పరిమితం చేస్తూ రాష్ట్రాలు చట్టాలను ఆమోదించడంతో వారి హక్కులు మరింత క్షీణిస్తున్నాయని నివేదిక పేర్కొన్నది.

నివేదికలో కొన్ని ఆశల సంకేతాలు కూడా ఉన్నాయి. గత నవంబర్‌లో, హింస, ఇతర దుర్వినియోగాలను నిరోధించాలని అంతర్జాతీయ న్యాయస్థానం సిరియా ప్రభుత్వాన్ని ఆదేశించింది. లెస్బియన్, గే, ద్విలింగ, లింగమార్పిడి వ్యక్తులను 'అన్యాయమైన వివక్ష' నుంచి రక్షించడానికి జపాన్ పార్లమెంట్ తన మొదటి చట్టాన్ని ఆమోదించింది. అంతర్జాతీయ క్రిమినల్ కోర్టు గత మార్చిలో, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌కు, ఆ దేశ బాలల హక్కుల కమీషనర్‌కు ఉక్రెయిన్ ఆక్రమిత భూభాగాల నుంచి రష్యాకు పిల్లలను బలవంతంగా తరలిస్తున్న యుద్ధ నేరాలపై అరెస్ట్ వారెంట్లు జారీ చేసింది. ఈ కొన్ని సంఘటనలు వదిలి, మొత్తంగా చూస్తే, అత్యధిక ప్రభుత్వాలు అంతర్జాతీయ రంగంలో మానవ హక్కుల సమస్యలను విస్మరించడాన్ని సులభతరం చేశాయి. ఎందుకంటే స్వదేశంలో వారి మానవ హక్కుల ఉల్లంఘనలు అంతర్జాతీయ సమాజం సవాలు చేయడం లేదు.

● చెన్న బసవయ్య మఠపతి
విశ్రాంత ఆచార్యులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం

పేదల అక్కరకు రాని 2013 భూసేకరణ చట్టం

బ్రిటిష్ వాళ్లు రూపొందించిన భూ సేకరణ చట్టం 'ల్యాండ్ అక్విజిషన్ యాక్ట్–1894' కి మనకు స్వాతంత్ర్యం సిద్ధించాక రెండు మూడు చిన్న సవరణలు జరిగినప్పటికీ 'భూసేకరణ చట్టం–2013' వచ్చే వరకు దాదాపు 120 సంవత్సరాలు అదే అమల్లో ఉంది. ఆ చట్టం పరిధిలోనే ప్రజాప్రయోజనాల పేరిట ప్రైవేట్ వారి కోసం కొన్ని వేలు, లక్షల ఎకరాల భూ సేకరణ జరిగింది. జాతీయ స్థాయిలో టాటా సంస్థ కార్ల తయారీ కోసం నందిగ్రామ్, సింగూర్‌లలో భూసేకరణకు నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత ప్రజలు బెంగాల్ ప్రభుత్వంపై ఎన్నో పోరాటాలు చేశారు. ఫలితంగా పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం దిగిపోవలసి వచ్చింది. గుజరాత్‌లో నర్మదా నదిపై నిర్మించిన సర్దార్ సరోవర్ ప్రపంచంలోనే అతిపెద్ద నీటి ప్రాజెక్టు. దీని వల్ల 17 జిల్లాలు, 15 వ్యవసాయ డివిజన్లు, 3550 గ్రామాలు పూర్తిస్థాయి విస్తాపనకు గురైనాయి. కొన్ని లక్షల మందికి జరుగుతున్న అన్యాయం పట్ల మేధా పాట్కర్ చేసిన ఉద్యమం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. ఈ కోవకు చెందినవే భాక్రానంగల్, హీరాకుడ్, నాగార్జునసాగర్, పోలవరం ప్రాజెక్టులు. తర్వాత కూడా సెజ్‌లకు, ప్రాజెక్టులకు, ఫార్మాసిటీలకు వేలాది ఎకరాలు భూ సేకరణలు జరుగుతూనే వచ్చాయి.

ఈ భూసంతర్పణను వ్యతిరేకిస్తూ చాలా ఏళ్ళ నుంచి ఎందరో శాసనకర్తలు, న్యాయాధీశులు, రైతు సంఘాలు, హక్కుల సంఘాలు, ప్రజా సంఘాలు, మీడియా చేసిన విజ్ఞప్తులు, ఇంకా సమకాలీన అవసరాల దృష్ట్యా గత యూపీఏ ప్రభుత్వం రెండవసారి ఎన్నికైన తర్వాత అంటే 2013లో కొత్త భూ సేకరణ చట్టం రూపుదిద్దుకుంది. ఈ కొత్త చట్టానికి హక్కు అనే పదం జోడించి 'భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణం, న్యాయమైన పరిహారం, పారదర్శకత 2013 చట్టం'గా తయారు చేసారు. ఇది జనవరి 2014 నుంచి అమలుపరిచేలా కేంద్రం నిర్ణయించింది. ఈ చట్టాన్ని రూపొందించి రాష్ట్రాల అభిప్రాయం కోరినప్పుడు ఇంతటి ఖర్చుతో కూడిన భూ సేకరణ చేయడం మా వల్ల కాదంటూ రాష్ట్రాలు చేతులెత్తేశాయి. అందుకు అప్పటి కేంద్ర ప్రభుత్వం 'మీ ప్రాంతాలవారీగా ఉండే భూ సంబంధిత ఒడిదుడుకులను అధిగమించేలా మీకు నచ్చిన సవరణలను, మీ రాష్ట్ర పరిధిలో మీకు అవసరమైన చట్టాలను చేసుకోవచ్చు' అనే వెసులుబాటు ఇచ్చింది. అందులో భాగంగా తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన జీఓ 123 కొత్త చట్టం స్ఫూర్తిని దెబ్బతీసింది. ఇందులో సోషల్ అసెస్మెంట్ అంటూ సామాజిక అంచనాలను కూడా రికార్డు చేసి వారి ఇబ్బందులను తెలుసుకోమంది చట్టం. రెండు పంటలు పండే పొలాలను వదిలేయడం, అత్యధిక సంఖ్యలో రైతులు మేము ఒప్పుకోము అంటే ఆ భూమిని వదిలేయడం, భూమికి భూమి ఇచ్చే పరిస్థితి లేదు కాబట్టి కుటుంబానికి నమ్మకాన్ని కల్పించడం ఇవన్నీ ఉన్నప్పుడే అభ్యంతరం లేని భూసేకరణలు జరుగుతాయి. కొత్త చట్టంలో గ్రామంలో నివాసముంటున్న వృత్తిపనివార్లకు, భూమి లేకుండా కేవలం వృత్తి ఆధారంతో బతుకుతున్న వారికి ఏ రకమైన హామీ లేదు. ముఖ్యంగా ఊళ్లో ఉండే కమ్మరి, వడ్రంగి, అవుసుల, కంచర, శిల్పి, గౌడ్, గొల్ల కురుమ, కుమ్మరి, రజక, క్షౌర, ఖాజీ, వడ్డెర, బ్రాహ్మణ... వీరికి ఏ రకమైన పునరావాసం, పునర్నిర్మాణం ఆలోచన చట్టంలో లేదు.

ఈ భూసంతర్పణను సమర్థించుకోవడానికి ప్రభుత్వం– 'ఫ్యాక్టరీలకు, ఓడరేవులకు, రహదారులకు, విమానాశ్రయాలకు, భూములు కావాలి. అభివృద్ధికి ఇవన్నీ కావాలి' అని వాదిస్తున్నది. కానీ, వ్యవసాయానికి, పశువులకు, సముద్రంలో చేపల వేటకు తీరం వెంబడి భూములు కావాలి. ఇంటి గోడల కోసం కూడా మట్టి కావాలి, బంజర్లు కావాలి. వీటి మీద బతికుండే ప్రజలు కూడా బాగుండాలి. ఇవన్నీ అభివృద్ధిలో భాగం కావాలి.

ప్రకృతి నుంచి ప్రజలు పొందే జీవనానికి బదులుగా నామమాత్ర నష్టపరిహారం ఇస్తే ఎలా సరిపోతుంది? ఎంత భూమి కావాలంటే అంత పరిశ్రమలు వగైరాలకు ఇచ్చుకోవచ్చునని భావించే పాలనా నీతిని ఏమనాలి? వీరిచ్చే పరిహారంతో ఆ ప్రజలు కోల్పోయిన దానిలో నాల్గవ వంతు భూమి కొనుక్కోలేరు. ఇంకొకచోట స్థిరపడి ఊరుమ్మడి బతుకు సాగించడానికి అవసరమైన పునరావాసం గాని, భూములు లేని వారికి ఇచ్చే నష్టపరిహారంగానీ కొత్త చట్టంలో ఒక హక్కుగా చేర్చబడలేదు. ఎంతసేపూ నష్టపరిహారం, పునర్నిర్మాణం, పునరావాసం గురించే కాక అభివృద్ధి విధానాల గురించి కూడా పునరాలోచించాలి. అమలు లక్ష్యాన్ని కోల్పోయిన కొత్త భూసేకరణ చట్టం వల్ల విస్తాపనకు గురి అవుతున్న ప్రజల అవసరాలకు, వారి ఆందోళనలకు అండగా ఉందాం.

దేశవ్యాప్తంగా భూ సేకరణ విధానాన్ని ప్రశ్నిద్దాం, లేదంటే ప్రజలు ఉన్న భూములను కూడా కోల్పోతారు. భూ సేకరణ జరగకపోతే అభివృద్ధి ఆగిపోతుందని భావిస్తే ఆ ప్రజలకు రెండు తరాలకు సరిపడా జీవనభృతిని హామీగా ఇస్తూ అమలు చేయాలి. ప్రజల సొమ్మును ప్రజలకు ఇవ్వడానికి ఏ చట్టాలు అడ్డు రాకుండా చూడాల్సిన బాధ్యత మనందరిదీ.

— వి. బాలరాజు, తహశీల్దార్ రిటైర్డు

సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 34.0 కనిష్ఠం 20.8

నేడు జీహెచ్ఎంసీలో అఖిలపక్ష సమావేశం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నేడు అఖిలపక్ష సమావేశం జరగనుంది. బీఆర్ఎస్, బీజేపీ, ఎంఐఎం, కాంగ్రెస్ కార్పొరేటర్లు మంగళవారం ఉదయం 11 గంటలకు సమావేశం కానున్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారిన అనంతరం తొలి సమావేశం కావడంతో ప్రాధాన్యం ఏర్పడింది. కౌన్సిల్ మీటింగ్ ఎలా నిర్వహించాలనే దానిపై సమావేశంలో సభ్యుల అభిప్రాయాలు తీసుకోవాలని మేయర్ భావిస్తున్నట్టు తెలిసింది.



శునకంపై ప్రేమతో..

ద్విచక్ర వాహనంపై బయటకు వెళ్తూ ఓ మహిళ తన పెంపుడు శునకాన్ని ఇలా ప్రత్యేకమైన బ్యాగులో తీసుకెళ్లడం అందరినీ ఆకర్షించింది. కేబీఆర్ పార్క్ జంక్షన్ వద్ద 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్‌మనిపించింది.

మీటర్లు గిరగిరా..

ఎండలకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్

- గ్రేటర్‌లో ప్రస్తుతం 60 మిలియన్ యూనిట్ల వినియోగం
- ఫ్రీ కరెంట్‌తో మరింత పెరగనున్న డిమాండ్
- 32 - 33 డిగ్రీలకు చేరిన పగటి ఉష్ణోగ్రతలు

గ్రేటర్‌లో ఎండల తీవ్రత పెరుగుతోంది. పగటి ఉష్ణోగ్రతలు 33 డిగ్రీలకు చేరాయి. కూలర్లు, ఏసీలు, ఫ్యాన్ల వాడకం పెరగడంతో విద్యుత్ వినియోగమూ పెరుగుతోంది. గతేడాది ఫిబ్రవరి మొదటి వారంలో 52 - 54 మిలియన్ యూనిట్ల (ఎంయూ) విద్యుత్ డిమాండ్ నమోదైతే, ఈ ఏడాది 58 - 60 ఎంయూలుగా ఉంది. ఉష్ణోగ్రతలు మరింత పెరిగితే మార్చి మొదటి వారానికే గ్రేటర్ జోన్‌లో విద్యుత్ డిమాండ్ 70 మిలియన్ యూనిట్లకు చేరుతుందని ఆ శాఖ అంచనా వేస్తోంది.



హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గతేడాదితో పోల్చితే విద్యుత్ వినియోగం ఇప్పటి వరకు 6-8 ఎంయూలు పెరిగినట్లు లెక్కలు చెబుతున్నాయి. దీని ప్రకారం వేసవిలో 85 ఎంయూలకు చేరుతుందని టీఎస్ఎస్పీడీసీఎల్ ఆపరేషన్ వింగ్ అధికారులు అంచనా వేస్తున్నారు. సాధారణ వినియోగం కంటే వేసవిలో విద్యుత్ డిమాండ్ 15-20 శాతం ఎక్కువగా ఉంటుంది. అధిక ఉష్ణోగ్రతల నేపథ్యంలో గృహాలు కార్యాలయాల్లో ఏసీలు, కూలర్లు, ఫ్యాన్ల వినియోగం పెరగడమే ఇందుకు కారణం.

200 యూనిట్ల ఉచితంతో..

200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అమల్లోకి వస్తే ఈ వేసవిలో విద్యుత్ వినియోగం మరింత పెరుగుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గ్రేటర్ జోన్‌లో మొత్తం 60.35 లక్షల కనెక్షన్లు ఉన్నాయి. వాటిలో 50 లక్షల గృహ వినియోగ కనెక్షన్లు ఉన్నాయి. గృహ వినియోగదారుల్లో 30 లక్షల మంది 200 యూనిట్ల లోపు వినియోగించేవారే. అయినప్పటికీ గృహ జ్యోతి పథకానికి 19.85 లక్షల మంది మాత్రమే దరఖాస్తు చేశారు. ప్రభుత్వం స్పష్టమైన విధివిధానాలు ప్రకటించకపోవడంతో అద్దె ఇళ్లల్లో ఉండేవారు దరఖాస్తు చేయలేదు. తెల్లరేషన్ కార్డుదారులకు మాత్రమే 200యూనిట్ల ఉచితవిద్యుత్ అందిస్తారా? లేదా ప్రతి కనెక్షన్‌కూ అవకాశమిస్తారా అనే అంశంపై స్పష్టత వస్తే గృహజ్యోతి లబ్ధిదారుల సంఖ్య పెరిగే అవకాశముంది. 120 - 150 యూనిట్లు వినియోగించే వారు కూడా ఉచిత విద్యుత్‌తో 200 యూనిట్ల వరకు వాడే అవకాశం ఉందని, దీంతో డిమాండ్ మరింత పెరుగుతుందని విద్యుత్ రంగ నిపుణులు సూచిస్తున్నారు.

33 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు

గ్రేటర్‌లో పెరుగుతున్న ఉష్ణోగ్రతల ప్రభావం విద్యుత్ డిమాండ్‌పై పడుతోంది. నాలుగు రోజులుగా నగరంలో 31-33 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మధ్యాహ్నం వేడిగాలుల ప్రభావం ఉంటోంది. గృహాలు, కార్యాలయాల్లో ఏసీల వినియోగం పెరుగుతోంది. ఏటా ఫిబ్రవరి చివరివారంలో నమోదయ్యే ఉష్ణోగ్రతలు ఈ ఫిబ్రవరి రెండో వారం నుంచే నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

ఆరు రోజుల్లో నగరంలో నమోదైన ఉష్ణోగ్రతలు (డిగ్రీ సెల్సియస్‌లో)

వారం	గరిష్ఠం	కనిష్ఠం
సోమవారం	34.0	20.8
ఆదివారం	32.1	20.1
శనివారం	30.8	21.7
శుక్రవారం	32.4	20.0
గురువారం	32.2	19.4
బుధవారం	30.3	18.6



సిటీ కమిషనరేట్ పరిధిలో 17 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

6

జైళ్ల శాఖ స్థలం.. ప్రైవేటుపరం!

- ఓ మాజీ మంత్రి అండ
- పోలీసుల సహకారం?
- యథేచ్ఛగా అక్రమ నిర్మాణం
- కళ్లెదుటే నిర్మిస్తున్నా పట్టించుకోని వైనం



జైళ్లశాఖ స్థలంలో కొనసాగుతున్న నిర్మాణం

సైదాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జైళ్ల శాఖ స్థలంలో ఓ ప్రైవేటు వ్యక్తి నిర్మాణం చేపడుతున్నా అధికారులు చేష్టలుడిగి చూస్తున్నారు. రూ.4 కోట్ల విలువైన స్థలం కబ్జాపరం అవుతున్నా పట్టించుకోవడం లేదు. దీని వెనుక ఓ మాజీ మంత్రి అండ ఉన్నట్టు తెలుస్తోంది. సైదాబాద్ చౌరస్తాలోని సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయం పక్కన జైళ్లశాఖకు చెందిన సుమారు 600 గజాల స్థలం ఆక్రమణకు గురైంది. ఆ విషయాన్ని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల 2022లో అసెంబ్లీలో ప్రస్తావించి, ఆ స్థలాన్ని సంరక్షించాలని డిమాండ్ చేశారు. నాటి హోంమంత్రి ఆదేశాలతో అధికారులు ఆ స్థలాన్ని కబ్జాదారుల నుంచి రక్షించి జైళ్ల శాఖకు అప్పగించారు. దీంతో కబ్జాదారులు కోర్టుకు వెళ్లారు. అనంతరం రాజకీయ ఒత్తిళ్లు తెచ్చి 300, 323 గజాల చొప్పున తమకు అప్పగించేలా అధికారులతో మౌఖికంగా ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ స్థలంపై కోర్టులో స్టేటస్ కో ఉండగానే.. జీహెచ్ఎంసీ అనుమతి లేకుండా బహుళ అంతస్తుల నిర్మాణం ప్రారంభించారు. దీనిపై 2023 జూన్ 26న 'మంత్రి అండ.. జైళ్ల శాఖ స్థలం కబ్జా' పేరుతో 'ఆంధ్రజ్యోతి' వరుస కథనాలు రాయడంతో పోలీసులు నిర్మాణదారుడిపై కేసు నమోదు చేశారు. జీహెచ్ఎంసీ సర్కిల్ - 6 అధికారులు నోటీసులు జారీ చేశారు. కొన్ని నెలలు నిర్మాణాలు ఆపేసిన కబ్జాదారులు ఎన్నికల సమయంలో నిర్మాణాలు ప్రారంభించి ప్రస్తుతం కొనసాగిస్తున్నారు. అయినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. ఓ మాజీ మంత్రి, ప్రజాప్రతినిధుల ఒత్తిళ్లతో తాము ఏమీ చేయలేకపోతున్నామని టౌన్ ప్లానింగ్ సిబ్బంది చెబుతున్నారు. సౌత్-ఈస్ట్ జోన్ డీసీపీ కార్యాలయం నిర్మాణానికి కబ్జాదారులు సహాయ సహకారాలు అందించినట్లు పోలీస్‌వర్గాల్లో చర్చ జరుగుతోంది.



నల్లకుంటలోని ఫీవర్ ఆస్పత్రికి రోగులు క్యూ కడుతున్నారు. జ్వరం, దగ్గు, జలుబుతో చికిత్స కోసం ఇక్కడికి తరలివస్తున్నారు. సోమవారం ఒక్కరోజే 530 మంది ఓపీలో చికిత్స పొందారు. వీరిలో జ్వరం బాధితులే 82 మంది ఉన్నారు. డెంగీ కేసులు కూడా పెరుగుతున్నాయని, అనుమానం ఉంటే ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. - బర్కత్‌పుర, (ఆంధ్రజ్యోతి)

రాత్రి రూ. 1,400.. ఉదయానికి 2,200

- భారీగా పెరిగిన ఇసుక ధరలు
- నిర్మాణరంగంపై భారం



నార్సింగ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇసుక ధర భారీగా పెరిగింది. ఆదివారం రాత్రి టన్ను రూ. 1400 నుంచి 1500 ఉంటే.. సోమవారం ఉదయానికి 2,200 పలికింది. ఫైన్ సాండ్ (ప్లాస్టరింగ్‌కు వాడే సన్నని ఇసుక) అయితే రూ.1800 నుంచి రూ.3000 పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు. ఒక్కసారిగా పెరిగిన ధరలతో నిర్మాణదారులు బెంబేలెత్తుతున్నారు. భవన నిర్మాణాలకు కీలకమైన ఇసుక ధరలు ఆకాశాన్ని అంటాయి. ర్యాంపులు (ఇసుక సరఫరా కేంద్రాలు) బంద్ ఉండడం, నగరానికి రావాల్సిన లారీలు 80 శాతం ఆగిపోవడంతో ధరలు పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు. నగరానికి భద్రాచలం, వరంగల్, మెదక్, ఖమ్మం, మహబూబాబాద్, జయశంకర్ భూపాలపల్లి తదితర జిల్లాల నుంచి ఇసుక లారీల ద్వారా వస్తుంది. రోజూ సుమారు 500 నుంచి 600 లారీలు వస్తాయి. లారీని బట్టి ఒక్కో దాంట్లో 30 నుంచి 40 టన్నుల ఇసుక రవాణ చేస్తారు. ప్రస్తుతం ర్యాంపులు మూసి ఉండడంతో కేవలం 100 నుంచి 150 లారీల ఇసుక మాత్రమే నగరానికి వస్తోంది. దిగుమతి తక్కువ.. డిమాండ్ ఎక్కువ ఉండడంతో వ్యాపారులు అమాంతం రేటు పెంచారు. కాగా, ఇసుక కృత్రిమ కొరత సృష్టించి కొత్తగా కొలువుదీరిన ప్రభుత్వాన్ని బద్నాం చేసేందుకు ప్రయత్నిస్తున్నారని కొందరు బిల్డర్లు ఆరోపిస్తున్నారు.



రాతి శాసనం

శాసనాల నిలయం.. భాగ్యనగరం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): వందల ఏళ్ల చరిత్ర, సంస్కృతులను సజీవంగా కళ్లకు కట్టే సాక్ష్యాలు శాసనాలు. అలాంటి అరుదైన శాసనాలకు భాగ్యనగరం వేదిక కానుంది. సాలార్‌జంగ్ మ్యూజియం ప్రాంగణంలో జాతీయ శాసనాల ప్రదర్శన శాల నిర్మాణం ప్రారంభమైంది. దేశంలోనే మొట్టమొదటి శాసనాల మ్యూజియం ఇదే కావడం విశేషం. ప్రతిష్ఠాత్మక ప్రదర్శనశాల నగరంలో ఏర్పాటు కావడం పట్ల చరిత్ర అధ్యయనకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఇది నగర పర్యాటకాభివృద్ధికి తోడ్పడుతుందని ఆనందిస్తున్నారు.

శాసనాలన్నింటినీ ఒకచోటకు చేర్చి..

భారతదేశ చరిత్రకు మైలురాళ్లుగా అభివర్ణించే అశోకుడి శాసనాలు, సముద్రగుప్తుని సైనిక విజయాలను తెలిపే అలహాబాద్ ప్రశస్తి శాసనం, గౌతమీ పుత్రశాతకర్ణి విజయాలను ప్రకటిస్తూ అతడి తల్లి గౌతమీ బాలశ్రీ వేయించిన నాసిక్ శాసనం, తనిష్కుడి మధుర శాసనం, బాదామీ చాలుక్య పాలకుడైన రెండో పులకేశి ఐహోల్ శాసనం, బెజవాడ పాండురంగని అద్దంకి 'తరువోజ శాసనం', ఇక్ష్వాకుల

మిగతా 6వ పేజీలో..



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ నుంచి ప్రత్యేకరైలు (07221)లో 1346 మంది అయోధ్యకు బయలుదేరారు. సికింద్రాబాద్ పార్లమెంట్ బీజేపీ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ రైలును పార్టీ సీనియర్ నాయకులు చింతల రాంచంద్రారెడ్డి, మాజీ ఎమ్మెల్యే గౌతమ్‌రావు, సెంట్రల్ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు ప్రేమోందర్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటరమణ రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి ప్రారంభించారు. నల్లకుంట డివిజన్ నుంచి కూడా 15 మంది బీజేపీ నాయకులు, కార్యకర్తలు అయోధ్యకు బయలుదేరారు. - సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ (ఆంధ్రజ్యోతి)

మా పేర్లు తీసేయండి!

ఓటరు జాబితా నుంచి తమ పేర్లు తొలగించాలంటూ అధిక సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. నమోదు కంటే తొలగింపు కోసం వచ్చిన దరఖాస్తులు రెట్టింపు సంఖ్యలో ఉండడం చర్చనీయాంశమైంది. జనవరి 6న ఓటరు ముసాయిదా జాబితా ప్రకటించిన జీహెచ్ఎంసీ దీనిపై అభ్యంతరాలు, ఫిర్యాదులు స్వీకరించింది. వివిధ అంశాలకు సంబంధించి 94 వేలకుపైగా దరఖాస్తులు వచ్చాయి. ఇందులో సుమారు 55 వేల మంది ఓటరు జాబితా నుంచి పేర్లు తొలగించేందుకు ఫారం-7 సమర్పించారు.



- 54,976 మంది ఓటర్ల దరఖాస్తు
- ఈ స్థాయిలో ఎప్పుడూ రాలేదన్న అధికారులు

దరఖాస్తులు ఇలా..	నమోదు	తొలగింపు
	25,007	54,976
చిరునామా మార్పు - 13,982		

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే నగరంలో ఓటర్ల సంఖ్య తగ్గనుందా? అంటే అవుననే అంటున్నారు అధికారులు. పార్లమెంటు ఎన్నికల వేళ ఎందుకీ పరిస్థితి అంటే ఎప్పుడూ లేని విధంగా ఓటరు జాబితా నుంచి పేర్ల తొలగింపునకు ఎక్కువ దరఖాస్తులు వచ్చాయని చెబుతున్నారు. ఒక వ్యక్తికి ఒకే నియోజకవర్గంలో ఒకటి కంటే ఎక్కువ నమోదులను గుర్తించి అధికారులు తొలగిస్తారు. అలా నగరంలో దాదాపు 2.30 లక్షల ఓటర్లను తొలగించారు. దీంతో అంతకుముందుతో పోలిస్తే ఓటర్ల సంఖ్య భారీగా తగ్గింది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మళ్లీ కొత్త దరఖాస్తులు

మిగతా 6వ పేజీలో..

శాసనాల నిలయం భాగ్యనగరం

(5వ పేజీ తరువాయి)

వంశీకుడు రుద్రపురుషదత్తుని శాసనం, రాష్ట్రకూటుల మొదటి కృష్ణుడి ఎల్లోరా శాసనం, దంతిదుర్గుని ఖాజీపేట దర్గాశాసనం, కళ్యాణిచాళుక్యుల మొదటి సోమేశ్వరుని అలంపూర్ శాసనం, కాకతీయ రుద్రదేవుని వెయ్యిస్తంభాలగుడి శాసనం, రుద్రమదేవి మల్కాపురం శాసనం, రాజరాజనరేంద్రుని నందంపూడి శాసనం, శ్రీకృష్ణదేవరాయల పొందూరు విజయ స్తంభం, ఎరికల్ ధనంజయుడి కలమళ్ల శాసనం.. ఇలా వివిధ రాజవంశాలకు చెందిన ప్రముఖ రాయి, రాగి శాసనాల ప్రతికృతులను ఒకచోటకు తీసుకొచ్చే ప్రయత్నానికి అడుగులు పడ్డాయి.

పరిశోధకులకు తెరిచిన పుస్తకం

దేశాన్ని ఏలిన వివిధ రాజవంశాలు, సంస్థానాధీశులు ఆవిష్కరించిన శిలా, లోహ, టెర్రాకోట, జంతుచర్మ, దంత తదితర మాధ్యమాల ఆధారంగా వెలుగులోకి వచ్చిన శాసనాలు లక్షకుపైగా ఉంటాయని పురాతత్వ శాస్త్రవేత్తల అభిప్రాయం. అవన్నీ భారతీయ భాషల


శిలా శాసనం

చరిత్ర, లిపి పరిణామాలను కళ్లకు కడతాయి. ఈ నేల సంస్కృతి వికాసాన్ని తెలియజేస్తాయి. ప్రధానంగా మౌర్య, శుంగ, శాతవాహన, కుషాన, ఇక్ష్వాక, గుప్త, విష్ణుకుండిన, కాలంకాయన, బాదామీచాళుక్య, వేంగి చాళుక్య, రేనాటిచోళ, తూర్పుగాంగ, వర్ధన, పల్లవ, చోళ, పాండ్య, విజయనగర, గజపతి, పాల, సేన తదితర రాజవంశాల చరిత్రకు చెందిన శాసనాలు దేశంలోని వివిధ మ్యూజియంలలో ఉన్నాయి. వాటిల్లోని కొన్ని శాసనాల నకళ్లను, మరికొన్ని ఒరిజినల్ శాసనాలను సాలార్‌జంగ్ మ్యూజియంలోని నూతన ప్రదర్శనశాలలో ఉంచనున్నట్లు సమాచారం. "శాసనాలకు ప్రత్యేకంగా మ్యూజియం ఏర్పాటు చేయడం మంచి నిర్ణయం. దేశంలోనే ఇది మొట్టమొదటి ఎపిగ్రఫీ మ్యూజియం అవుతుంది. శాసనాలను చారిత్రక ఆధారాలుగా పరిశోధన చేసేవారికి ఇదొక తెరిచిన పుస్తకంగా ఉపయోగపడుతుంది. భారతీయ భాషల చరిత్ర, లిపి పరిణామ క్రమం, వాటి అభివృద్ధిని అర్థం చేసుకోవడానికి ఎంతో తోడ్పడుతుంది" అని ప్రముఖ చరిత్ర పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి చెబుతున్నారు.

సిటీ కమిషనరేట్ పరిధిలో
17 మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీ

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సిటీ కమిషనరేట్ పరిధిలో 17 మంది ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ సీపీ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. సెక్రటేరియట్ ఎస్‌హెచ్‌వోగా ముత్తినేని సత్యనారాయణ, ఐఎస్ సదన్‌కు మాగంటి వెంకటరామయ్య, గోపాలపురానికి టి.నర్సింగరావు నియమితులయ్యారు. ఎస్‌ఆర్ నగర్ డీఐ రఘురాములును ఫిలింనగర్‌కు, మల్టీజోన్ 2కు చెందిన జానకీ రాములును ఎస్‌ఆర్‌నగర్‌కు, డీకే లక్ష్మీరెడ్డిని ఆసిఫ్‌నగర్‌కు నియమించారు. సీసీసీలో ఉన్న ఇన్‌స్పెక్టర్ సత్రి సుధీర్‌కుమార్‌ను వెస్ట్ జోన్ సీపీఆర్‌గా, మల్టీజోన్-2కు వచ్చిన సోమనర్సయ్యను బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఎస్‌హెచ్‌వోగా, రమాదేవ్‌రెడ్డిని ఛత్రినాక డీఐగా నియమించారు. మరో ఏడుగురు ఇన్‌స్పెక్టర్లు ఈశ్వర్‌గౌడ్, నల్లమోతు జయరామ్, మొగిలిచర్ల రవి, కృష్ణ, ధరావత్తు నగేష్, వర్సె నాగయ్య, ఎస్.సంజయ్‌కుమార్‌లను మల్టీజోన్-2కు సరెండర్ చేస్తున్నట్లు ఉత్తర్వులు జారీ చేశారు.


మాసబ్‌ట్యాంక్‌లోని సమాచార భవన్‌లో సోమవారం సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న హనుమంతరావు

మా పేర్లు తీసేయండి!

(5వ పేజీ తరువాయి)

భారీగా రావడంతో ఆ సంఖ్య మళ్లీ పెరిగి 45.36 లక్షలకు చేరింది. మరోసారి లోక్‌సభ ఎన్నికలకు ముందు పేర్ల తొలగింపునకు 54,976 దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో అందులో ఎందరి పేర్లు తొలగిస్తారు? ఎందరివి యథాతథంగా కొనసాగిస్తారన్నది తుది జాబితా విడుదల అనంతరం తేలనుంది. ఓటరు నమోదు ప్రక్రియ ప్రస్తుతం ఇంకా కొనసాగుతోంది.

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారా?

ఓటర్లుగా దరఖాస్తు చేసుకున్న వారి విషయంలో జీహెచ్‌ఎంసీ సిబ్బంది ఎప్పటిలాగానే కార్యాలయాల్లో కూర్చుని నిర్ణయం తీసుకుంటారా? లేక క్షేత్రస్థాయిలో పరిశీలిస్తారా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఓటరు నమోదు, తొలగింపు దరఖాస్తు ఏదైనా ఆ చిరునామాకు వెళ్లకుండానే ఆమోదం/తిరస్కరించడం వంటివి చేయడం సిబ్బందికి అలవాటుగా మారింది. ఈ క్రమంలో కొందరి పేర్లు జాబితా నుంచి కార్డుదారులకు తెలియకుండానే గల్లంతవుతున్నాయి. ఇంత జరుగుతున్నా ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడంతో తుది ఓటరు జాబితా తప్పుల తడకగా ప్రకటించడం సాధారణమై పోయింది.



పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేస్తున్న యాదవ సంఘం నాయకులు

హైకోర్టు ఉత్తర్వుల బేఖాతరు సమంజసం కాదు

కార్వాన్ యాదవ సంఘం

కార్వాన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కార్వాన్ యాదవ సంఘం స్థలానికి సంబంధించి హైకోర్టు నుంచి స్టేటస్ కో ఉన్నప్పటికీ లెక్క చేయకుండా ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ తమ స్థలంలోని నిర్మాణాన్ని కూల్చడం ఎంత వరకు సమంజసమని కార్వాన్ యాదవ సంఘం అధ్యక్షుడు బోడి అశోక్‌కుమార్ యాదవ్ ప్రశ్నించారు. తమకు ప్రభుత్వం 25ఏళ్ల క్రితం కేటాయించిన స్థలానికి ప్రహరీ నిర్మించి తమ ఆధీనంలో ఉంచుకున్నామని, ఇందుకు సంబంధించి స్థలం అలాట్మెంట్ కాపీ కూడా తమ వద్ద ఉందని ఆమన తెలిపారు. గతంలో రెవెన్యూ అధికారులు కొందరు ఈ స్థలం విషయంలో తమ వద్దకు వస్తే ఆధారాలు చూపామని, వారు అంతా సవ్యంగానే ఉందని చెప్పారని తెలిపారు. ప్రస్తుతం ఆసిఫ్‌నగర్ తహసీల్దార్ జ్యోతిని కూడా తాము కలిసి స్థలానికి సంబంధించిన ఆధారాలు చూపామన్నారు. అందుకు ఆమె కూడా ఎలాంటి ఇబ్బందీ లేదని చెప్పి, ఇప్పుడు ఆకస్మాత్తుగా వచ్చి తమ నిర్మాణాన్ని కూల్చివేయడం వెనుకున్న మతలబు ఏంటో తెలపాలని అశోక్ యాదవ్ ప్రశ్నించారు. తమ వద్ద ఉన్న కోర్టు ఉత్తర్వులను లెక్క చేయకుండా తనతోపాటు తన కుల సంఘం ప్రతినిధులందరినీ అరెస్టు చేయించి, తమ యాదవ సంఘం నిర్మాణాన్ని తొలగించడం అన్యాయమని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యాదవ్ సంఘం సభ్యులు పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేశారు.



కలెక్టర్‌తో మాట్లాడుతున్న దార్గుపల్లి రేఖయాదిగిరి, ఉషారాణి

డ్వాక్రా మహిళా సమస్యలను పరిష్కరించాలి

నార్సింగ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నార్సింగ్‌లోని డ్వాక్రా సంఘాల మహిళల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్‌ను సోమవారం చైర్మన్ దార్గుపల్లి రేఖయాదిగిరి, కౌన్సిలర్ కోటిగారి ఉషారాణి కోరారు. ఈ సందర్భంగా రేఖయాదిగిరి మాట్లాడుతూ నార్సింగ్ గ్రామంలో దాదాపు150 డ్వాక్రా గ్రూప్‌లు ఉన్నాయని, మహిళలు కూర్చోవడానికి డ్వాక్రా బిల్డింగ్‌లు లేవని, దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆమె కలెక్టర్‌కు తెలిపారు. అంతేకాకుండా నార్సింగ్‌లో 17వ వార్డులో ఎలక్షన్‌కి సంబంధించిన బ్యాలెట్ బాక్సులు ఉన్నాయని వాటిని సత్వరమే వేరే ప్రదేశానికి తరలించాలని ఆమె కలెక్టర్‌ను కోరారు. మీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు.



సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

రాష్ట్రంలో పది ఎంపీ స్థానాలు గెలుస్తాం : లక్ష్మణ్

నార్సింగ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గావ్ చలో... ఘర్ చలో కార్యక్రమాన్ని హైదర్షాకోట్ మైత్రీవనంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఓబీసీ మోర్చా అధ్యక్షుడు లక్ష్మణ్ హాజరై మాట్లాడుతూ తెలంగాణలో 10 పార్లమెంట్ సీట్లను కైవశం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం 142 సంక్షేమ పథకాలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు అకౌంట్‌లోకి జమ చేస్తామని ఆయన తెలిపారు. బీజేపీ, కాంగ్రెస్ మధ్యనే ప్రధాన పోరు ఉంటుందన్నారు. తెలంగాణలో బీఆర్ఎస్‌ను ఎవరూ నమ్మడం లేదన్నారు. 370 ఆర్టికల్స్ రామాలయం, త్రిబుల్ తలాక్ వంటి అనేక కార్యక్రమాలు ప్రధాని మోదీ విజయవంతం చేశారని ఆయన అన్నారు. అయోధ్య ప్రపంచ ఆధ్యాత్మిక దేవాలయంగా మారుస్తున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓబీసీ మోర్చా నాయకులు ఏపీఎస్ రెడ్డి, విశ్వేశ్వర్ రెడ్డి, కసిరెడ్డి భాస్కర్‌రెడ్డి, ఎస్.రత్నం, సామ రంగారెడ్డి, సునీత, మల్లారెడ్డి, మహేశ్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తనిఖీలు చేస్తున్న అధికారులు

యునానీ ఫార్మసీపై దాడులు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కిడ్నీలో రాళ్లు తొలగిస్తామంటూ... కిడ్నీ సంబంధిత వ్యాధులకు నిషేధిత ప్రకటనలిచ్చి చికిత్స చేస్తున్న ఆర్ఎస్ యునానీ ఫార్మసీ కేంద్రంపై డ్రగ్స్ కంట్రోల్ అధికారులు దాడులు నిర్వహించారు. సోమవారం బహదూర్‌పురాలో ఉన్న ఆర్ఎస్ యునానీ ఫార్మసీలో సోదాలు నిర్వహించి భారీగా మందులు, రెనోనిప్ డ్రాప్స్ స్వాధీనం చేసుకున్నారు. యునానీ ఫార్మసీ పేరిట తయారు చేస్తున్న 'యూనీ స్టోన్స్' పౌడర్ ప్రకటనలో కిడ్నీ సమస్యలను దూరం చేస్తోందని తప్పుడు ప్రచారం చేస్తున్నారని గుర్తించారు.



సమ్మెనోటీసును అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశా వర్కర్లు

ఆశావర్కర్ల డిమాండ్లను పరిష్కరించాలి

నార్సింగ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఆశావర్కర్లు, సీఐటీయూ ఆధ్వర్యంలో నార్సింగ్ పీహెచ్‌సీలోని అధికారిణికి సమ్మె నోటీసును సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో గండిపేట్ మండల కన్వీనర్ డప్పు ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ ఆశావర్కర్లకు రూ.18వేల వేతనం పెంచాలని, వారికి తగిన బెనిఫిట్స్‌ను ప్రభుత్వం కల్పించాలని సూచించారు. ఈ నెల 16న సమ్మె నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

మరిన్ని మెహిదీపట్నం జోన్ వార్తల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/oETkAOr **లో చదవండి. Note:** Andhrajyothi.com/editions/hyd/set-6 abids, mehadipatnam, charminar**లో చూడగలరు. నోట్:** htpps://epaper.andhrajyothy .com**లో లాగిన్ అయిన తరువాత క్యూఆర్‌కోడ్‌ని స్కాన్ చేయగలరు.**

గౌలిపురా మేకలమండి కమేళాను ప్రారంభించాలి

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గౌలిపురా అనగానే ముందుగా గుర్తుకొచ్చేది మేకల మండి. నగరంలో అనేక మండీలున్నా గౌలిపురా మేకల మండికి ప్రత్యేక స్థానముంది. వందల కుటుంబాలకు జీవనోపాధిని అందించిన మేకలమండి 2003 డిసెంబర్‌లో న్యాయస్థానం తీర్పుతో మూతపడింది. దీంతో మండిపై ఆధారపడ్డ కుటుంబాలు రోడ్డున పడ్డాయి. పెద్ద మొత్తంలో మాంసం కొనుగోలుకు, మేకల కొనుగోలుకు ప్రజలు నగరశివారు చర్లపల్లికి తరలిపోవాల్సి వచ్చింది.

స్లాటర్ హౌస్ ఆధునికీకరణ

ప్రజల సౌకర్యార్థం 2010లో ఆనాటి కార్పొరేటర్ ఆలే జితేంద్ర చొరవతో సుమారు రూ.8 కోట్ల వ్యయంతో రాంకీ సంస్థ నిర్మాణ బాధ్యతలు స్వీకరించి, 2014లో 80 శాతం వరకు నిర్మాణం పూర్తి చేసింది. మండికి సంబంధించిన భూమిపై కొందరు హైకోర్టులో కేసు దాఖలు చేశారు. దీంతో ప్రజలకు, ఆరె కటిక కులస్తులకు నిరాశే మిగిలింది.

సంవత్సరాలపాటు నిరీక్షణ

సుమారు 10 సంవత్సరాలపాటు హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండడం వల్ల నిర్మించిన స్లాటర్ హౌస్ బూత్ బంగ్లాగా మారింది. స్లాటర్ హౌస్ లోకినెదర్లాండ్ నుంచి తెప్పించిన మిషనరీ కాస్తా తుప్పు పట్టిపోయింది. సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి స్లాటర్‌హౌస్ పెండింగ్ పనులు పూర్తి చేసి అందుబాటులోకి తేవాలని ప్రజలు, ఆరెకటికలు కోరుతున్నారు.

జోనల్ కమిషనర్ పర్యటన

చార్మినార్ జోనల్ కమిషనర్ టి.వెంకన్న సోమవారం గౌలిపురా కమేళాను సందర్శించారు. కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, వెటర్నరీ విభాగం అధికారులతో కలసి కమేళాను పరిశీలించి సమస్యలపై అధికారులతో ఆరా తీశారు. ఆధునికీకరించిన గౌలిపురా కమేళా విషయం వెటర్నరీ అధికారులతో చర్చించి అవసరమైన చర్యలు తీసుకుంటానన్నారు. ఈ పర్యటనలో జీహెచ్ఎంసీ ప్రధానవెటర్నరీ అధికారి డాక్టర్ మహ్మద్‌అబ్దుల్ వకీల్, చార్మినార్ జోన్‌వెటర్నరీ డిప్యూటీడైరెక్టర్ డాక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, పలువురు అధికారులు పాల్గొన్నారు.



గౌలిపురా కమేళాను సందర్శించిన జోనల్ కమిషనర్ టి.వెంకన్న



కమేళా బయట బోటి, లివర్ విక్రయిస్తున్న దృశ్యం

బల్దియా అధికారులు స్పందించాలి

స్లాటర్ హౌస్ ప్రారంభానికి నోచుకోక కులవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న ఆరె కటిక కులస్తులు తీవ్రఇబ్బందులు పడుతున్నారు. సరైన వసతులులేక ఆరుబయటనే మాంసం విక్రయాలు సాగిస్తున్నారు. అధికారులు స్పందించి కమేళాను ప్రారంభించాలి. బల్దియాకు ఆదాయం రావడమేకాకుండా ప్రజలకు, ఆరెకటిక కులస్తులకు మేలు జరుగుతుంది.

- యు.యశ్వంత్‌రావు, గౌలిపుర ఆరె కటిక సంఘం అధ్యక్షుడు; ఎం.రమేశ్, ప్రధాన కార్యదర్శి

నెలరోజుల్లో అందుబాటులోకి తేవాలి



ప్రారంభానికి నోచుకోని గౌలిపురా స్లాటర్‌హౌజ్‌లో పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తిచేసి, తుప్పు పట్టిపోయిన మిషనరీని బాగు చేయించి నెలరోజుల్లో అందుబాటులోకి తేవాలి.

- ఆలే భాగ్యలక్ష్మి, కార్పొరేటర్

'బాస్ అన్నదాన' బ్రోచర్ ఆవిష్కరణ

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అయోధ్యలోని రామ మందిరం ప్రాంగణంలో భాగ్యనగర్ అయ్యప్ప సేవా సమితి(బాస్) ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి మార్చి 2వ తేదీ వరకు ప్రతిరోజూ 30 వేల మంది రామ భక్తులకు ఉచితంగా అల్పాహారం, అన్నదానం, మంచినీటి సేవ కార్యక్రమాలను అందించేందుకు ఏర్పాట్లను పూర్తి చేస్తున్నామని బాస్ అధ్యక్షులు కె.రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి విజయ్ భాస్కర్, కోశాధికారి మెడిశెట్టి రాకేశ్ అన్నారు. ఈ మేరకు సోమవారం బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో అన్నదాన బ్రోచర్, అన్నప్రసాద వెబ్‌సైట్‌లను వీహెచ్‌పీ తెలంగాణ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యాదిరెడ్డి, సాస్ ఆలిండియా ఆర్గనైజింగ్ సెక్రటరీ నాయిని బుచ్చిరెడ్డి, బాస్ గౌరవ సలహాదారులు దేవ రాజేశ్వర్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ... బాల రామున్ని తిలకించడానికి దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి ప్రతిరోజూ అయోధ్యకు వేలాదిగా రామ భక్తులు తరలివస్తున్నారని... వారందరికీ బాస్ తమ వంతు సహాయంగా అన్నదానం చేయడానికిముందుకు రావడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో శివశంకర్, నాగరాజు గౌడ్, వెంకటేశం గుప్తా గురుస్వామి, హనుమంత్ తదితరులు పాల్గొన్నారు. మరిన్ని వివరాల కోసం 9848083376, 9396601234 నంబర్లలో సంప్రదించాలన్నారు.



అన్నదాన బ్రోచర్ ఆవిష్కరణలో వీహెచ్‌పీ రాష్ట్ర నాయకులు యాదిరెడ్డి, నాయిని బుచ్చిరెడ్డి, కె.రాధాకృష్ణ, విజయ్ భాస్కర్, రాకేశ్

వర్సిటీలో గజం స్థలం కూడా వదులుకోం

- విద్యార్థులకు మద్దతు పలికిన బీజేవైఎం
- 4 రోజుల అల్టిమేటం ఇచ్చిన అధ్యక్షుడు మహేందర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాజేంద్రనగర్‌లోని అగ్రికల్చరల్ యూనివర్సిటీ స్థలాన్ని ఇతర సంస్థలకు అప్పగించడం పట్ల కొనసాగుతున్న విద్యార్థుల నిరసనకు బీజేవైఎం మద్దతు పలికింది. యూనివర్సిటీలోని 100 ఎకరాల స్థలాన్ని హైకోర్టుకు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 55ని ప్రతిపాదించిన సందర్భంగా యూనివర్సిటీ విద్యార్థులు 28 రోజులుగా ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. వారి నిసరనలకు సంఘీభావంగా బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మహేందర్‌తో పాటు ఇతర కార్యకర్తలు సోమవారం నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేందర్ మాట్లాడుతూ... విద్యార్థుల నిరసన కార్యక్రమాలను, ఉద్యమాన్ని అభినందిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. యూనివర్సిటీలో ఒక్క ఇంచు జాగాను కూడా వదులుకోమని... బుల్డోజర్ యూనివర్సిటీలో అడుగుపెట్టాలంటే ముందు విద్యార్థుల మీద నడిపించాల్సి ఉంటుంది అన్ని హెచ్చరించారు. రక్తాన్నైనా చిందిస్తాం కానీ యూనివర్సిటీ భూములు వదులుకోమన్నారు. తెలంగాణకే తలమానికమైన ప్రొఫెసర్ జయశంకర్ యూనివర్సిటీ కేవలం విద్యార్థులకు మాత్రమే కాదు...రాష్ట్రంలోని అనేక మంది రైతులకు ఆధారంగా నూతన వంగడాలకు, నూతన వ్యవసాయ విధానాలకు ఓ ప్రధాన కేంద్రంగా ఉందని అన్నారు. అనంతరం ప్రభుత్వానికి నాలుగు రోజుల అల్టిమేటం ఇస్తున్నట్లు ప్రకటించి... జీఓ నెంబర్ 55ని రద్దు చేయకపోతే ఉద్యమం రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తామని ఆ తర్వాత జరిగే పరిణామాలకు ఈ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి వస్తుందని మహేందర్ హెచ్చరించారు.



నిరసన తెలుపుతున్న విదార్థులు, బీజేవైఎం కార్యకర్తలు

ముగిసిన సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్

తిరుమలగిరి, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తిరుమలగిరి విలేజ్‌లోని ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన సీఎం కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ముగిసింది. ఫైనల్ మ్యాచ్‌లో హైదరాబాద్ గ్లోబ్ వర్సెస్ హైదరాబాద్ స్పోర్టింగ్ క్లబ్‌లు పోటీ పడ్డాయి. ఫైనల్లో హైదరాబాద్ గ్లోబ్ టీం విజయం సాధించింది. విజేతకు 50వేల ప్రైజ్ మనీ, రన్నర్ అప్‌కు 25 వేల ప్రైజ్ మనీని సికింద్రాబాద్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు అనిల్ కుమార్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఫిరోజ్‌ఖాన్, కాంగ్రెస్ పార్టీ మైనారిటీ కన్వీనర్ రేమండ్ హార్వర్డ్, ప్యారసాని రామ్‌కుమార్‌లు అందజేశారు. యూనిటీ స్పోర్ట్స్ అకాడమీ ప్రధాన కార్యదర్శి మైఖెల్ అబ్రహంలు పాల్గొన్నారు.



క్రీడాకారులతో అనిల్ కుమార్ యాదవ్



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి

నూతన పైప్‌లైన్ పనులు ప్రారంభం

నార్సింగ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనగర్ కాలనీ నుంచి భాగ్యనగర్ కాలనీ ఎర్రకుంట కట్ట వరకు నూతనంగా పైప్‌లైన్ పనులను సోమవారం 16వ వార్డు కార్పొరేటర్ పుష్ప శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగ్యనగర్ కాలనీవాసులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

221.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కాటేదాన్ నుంచి రవాణా...

తూప్రాన్, ఫిబ్రవరి 5 : భారీ ఎత్తున రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసు, సివిల్ సప్లయ్ అధికారులు మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం, సివిల్ సప్లయ్ అధికారుల కథనం ప్రకారం.. హైదరాబాద్ కాటేదాన్ నుంచి మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రానికి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ శివానందం, పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ సాదిక్ ఆధ్వర్యంలో తూప్రాన్ టోల్‌ప్లాజ్ వద్ద కాపుకాశారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్(పీడీఎస్) బియ్యం లారీని పట్టుకున్నారు. 221.40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీడ్రైవర్ సలీమ్ మియాను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. కాటేదాన్ నుంచి నార్సింగి మండల కేంద్రానికి చెందిన బాబిసెట్ అలియాస్ శ్రావణ్ కుమార్‌కు ఈ బియ్యం సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. లారీడ్రైవర్ సలీం మియా, లారీ యజమాని ఖాన్‌సాబ్, కాటేదాన్ నుంచి బియ్యం పంపిస్తున్న వాజిద్‌అలీ, నార్సింగికి చెందిన బియ్యం కొనుగోలుదారు బాబీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం వివరించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వానికి సీఎస్ఆర్ కింద అందజేసేందుకు ఈ బియ్యం కొనుగోలు చేసినట్టు తెలిసింది.



తూప్రాన్ వద్ద పట్టుబడిన రేషన్ బియ్యం లారీ వద్ద పోలీసులు

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరిస్తున్నాం : జెడ్‌సీ



ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

మదీన, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారానికి ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటున్నామని దక్షిణ మండలం జోనల్ కమిషనర్ వెంకన్న అన్నారు. సోమవారం సర్ది పూల్‌బాగ్‌లోని జీహెచ్ఎంసీ జోనల్ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించారు. ఉదయం 10-30గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఫలక్‌నుమా సర్కిల్‌లో పారిశుధ్య సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయి. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ మాట్లాడుతూ, ప్రజావాణిలో పలు సమస్యల పట్ల ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. త్వరలోనే ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ జాయింట్ కమిషనర్ శైలజ, జోన్ టౌన్‌ప్లానింగ్ విభాగం సిటీ ప్లానర్ శ్యామ్‌కుమార్, డిప్యూటీ డైరెక్టర్ (యూబీడీ) అమీనాబీ, ఏఎంసీ రాజారావు, ఎలక్ట్రికల్ ఈఈ రామారావు, బిల్ కలెక్టర్ రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

నల్లవాగు ప్రహరీపై కంచె, విద్యుద్దీపాలకు నిధులు

చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నల్లవాగు ప్రహరీమీద ఇనుప కంచె, విద్యుత్ స్తంభాలు, వీధిదీపాల ఏర్పాటుకు అధికారులు నిధులు మంజూరు చేయడం సంతోషకరమని కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ ఉపాధ్యక్షుడు కాశమోని శ్యాంరావు ముదిరాజ్, భ్యాగరి సంఘం నాయకుడు పేరోజి సాయినాథ్ అన్నారు. అధికారులు రూ.7.64 లక్షలు మంజూరు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా జోనల్ కమిషనర్ టి.వెంకన్న, ఈఈ సనావుద్దీన్, ఏఈ కుమార్, ఈఈ శ్రీకాంత్‌లకు ధన్యవాదాలు తెలియజేశారు.

మహాశివరాత్రిని వైభవంగా నిర్వహిస్తాం



మాడిశెట్టి సదానంద్ గుప్తాను సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

గోషామహల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రహీంపురా సత్యన్న గల్లీ జాగరణ సేవా సమితి ఆధ్వర్యంలో మహా శివరాత్రి జాగరణ వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని జాగరణ సేవా సమితి అధ్యక్షులు మాడిశెట్టి సదానంద్‌గుప్తా అన్నారు. సోమవారం ఈ మేరకు జాగరణ సేవా సమితి నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా ఎన్నికైన మాడిశెట్టి సదానంద్ గుప్తా మాట్లాడుతూ... ఈసారి జాగరణ వేడుకలు అత్యంత కనులపండువగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తామన్నారు. నూతన కమిటీ చైర్మన్‌గా జి.ఎస్‌ప్రకాశ్‌రావు, ప్రధానకార్యదర్శి రాజన్‌కుమార్, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి.రంజిత్‌కుమార్, కోశాధికారిగా బి.లక్ష్మీనారాయణవర్మ, రాజేందర్‌సింగ్, ఉపాధ్యక్షులు తోట శ్రావణ్‌కుమార్, నవీన్‌సింగ్, తాడె రాజ్‌కుమార్, జనగామ పాండు, తాడిశెట్టి నవీన్‌కుమార్, బూడిద రాజేందర్, లక్ష్మీనారాయణ, భాగ్యశ్రీ, బాలనర్సింగ్ రావులు ఎన్నికయ్యారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి



మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి ఫిర్యాదు చేస్తున్న బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఆర్.లక్ష్మణ్ రావు

అఫ్జల్‌గంజ్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): గోషామహల్ ఫిల్‌ఖానాలోని చారిత్రాత్మకమైన మహాదేవ్ దేవాలయానికి చెందిన ఖాళీ స్థలంలో కొందరు బిల్డర్లు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని వెంటనే వాటిని కూల్చివేయాలని బజరంగ్ సేన రాష్ట్ర అధ్యక్షులు ఎన్ఆర్.లక్ష్మణ్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో మహాదేవ్ దేవాలయ ప్రాంగణంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల్ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశారు. అనంతరం లక్ష్మణ్ మాట్లాడుతూ.. ఇటీవల దేవాదాయ శాఖకమిషనర్ అనిల్‌ను కలిసి ఈ అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఫిర్యాదు చేశానని తెలిపారు. జీహెచ్ఎంసీ అధికారులు తూతూ మంత్రంగా వచ్చి నోటీసులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని ఆయన ఆరోపించారు. వెంటనే స్పందించి అక్రమ నిర్మాణాలను కూల్చివేసి మహాదేవ దేవాలయ స్థలాన్ని దేవాదాయ శాఖ అధీనంలోకి తీసుకోవాలని కోరారు.

ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయాలి

గోషామహల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు మోసపూరిత ఆరు గ్యారెంటీ పథకాల ఆశ చూపి అధికారం వచ్చాక ప్రజల నుంచి తూతూ మంత్రంగా ఆరు గ్యారెంటీ పథకాల ఫారాలను తీసుకొని వాటిని అమలు చేయకుండా గాలికి వదిలేశారని గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ మేరకు సోమవారం గోషామహల్ నియోజకవర్గానికి చెందిన అర్హులైన పేదప్రజలు ఆరు గ్యారెంటీ పథకాల దరఖాస్తుల పత్రాలను అమలు చేసే విధంగా తమ వంతు సహాయం చేయాలని గడ్డం గంగాధర్ యాదవ్ ఫౌండేషన్ కార్యాలయాన్ని సందర్శించారన్నారు. ఈ సందర్భంగా గడ్డం శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పథకాలను తప్పకుండా అమలుచేసి అవి అర్హులైన పేదలకు అందించే వరకు విశ్రమించనని బాధితులకు హామీ ఇచ్చానని ఆయన తెలిపారు.

సీఎంఓహెచ్ పద్మజపై ఉద్యోగుల ఫిర్యాదు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జీహెచ్ఎంసీలో చీఫ్ మెడికల్ ఆఫీసర్ హెల్త్(సీఎంఓహెచ్) డాక్టర్ పద్మజ తీరుపై అదే విభాగంలోని ఉద్యోగులు ఫిర్యాదు చేశారు. విధి నిర్వహణలో ఇబ్బందులు కలిగించడంతోపాటు.. వేధిస్తోందని ఆరోపించారు. ఈ మేరకు సోమవారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మితో పాటు కమిషనర్ పేషీలో సదరు అధికారిణిపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అకారణంగా సతాయిస్తోందని, అసభ్య పదజాలంతో ఉద్యోగులను దూషిస్తోందని ఆరోపించారు.

12న మహాధర్నా



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మధుసూదనాచారి, జూలూరి గౌరీశంకర్, గట్టు రాంచందర్ రావు, తదితరులు

● అసెంబ్లీ ఆవరణలో పూలే విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని డిమాండ్..
● బీసీల హక్కుల సాధన కోసం యునైటెడ్ పూలే ఫ్రంట్

పంజాగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సంఘ సంస్కర్త, మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహాన్ని అసెంబ్లీ ఆవరణలో ప్రతిష్ఠించాలని డిమాండ్ చేస్తూ భారత్ జాగృతితో కలిసి ఈనెల 12న ఇందిరాపార్కు వద్ద మహాధర్నాను నిర్వహిస్తున్నట్లు యునైటెడ్ పూలే ఫ్రంట్ సభ్యులు తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆవిర్భావ పోస్టర్‌ను రాష్ట్ర సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్, ఫ్రంట్ సభ్యులతో కలిసి ఎమ్మెల్సీ మధుసూదనాచారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మధుసూదనాచారి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా బీసీ కులజనగణనను వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని, రాష్ట్ర బడ్జెట్లో బీసీల సంక్షేమానికి 20వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. మహాత్మా జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలేల చరిత్రలను పాఠ్యాంశాలుగా చేర్చాలని డిమాండ్ చేశారు.

● యునైటెడ్ పూలే ఫ్రంట్ కార్యవర్గం

రాష్ట్రంలో బీసీల హక్కుల సాధన కోసం వివిధ సంఘాలన్నీ కలిసి ఏర్పడిన యునైటెడ్ పూలే ఫ్రంట్ కార్యవర్గాన్ని ప్రకటించారు. సలహాదారులుగా రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్, కన్వీనర్‌గా గట్టు రామచంద్రరావు, కో కన్వీనర్లుగా తాడూరి శ్రీనివాస్, కాసాని వీరేష్ ముదిరాజ్, ఆర్.జె.సి కృష్ణ, రాజారామ్ యాదవ్, బోళ్ల శివశంకర్, కోలా శ్రీనివాస్, ముప్పు భిక్షపతి, ఆర్.బాలకృష్ణ, ఆర్.రవీంద్ర చారి, ఆర్.వి మహేందర్, ప్రచార కార్యదర్శిగా వై. నరసన్న, యూత్ వింగ్ కన్వీనర్‌గా ఆలకుంట హరిబాబు, విద్యార్థి విభాగం కన్వీనర్‌గా ఎల్చాల దత్తాత్రేయ, మహిళా వింగ్ కన్వీనర్‌గా బాలమనమ్మ, గీతా గౌడ్, బొమ్మ ప్రవళ్లిక నియమితులయ్యారు.

జేఎన్‌టీయూలో ఐదుగురు ప్రొఫెసర్లకు బదిలీలు

● అర్ధరాత్రి ఉత్తర్వులతో ఉన్నతాధికారుల హల్‌చల్

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో బదిలీల పరంపర కొనసాగుతోంది. గతవారం ఐదుగురు ప్రొఫెసర్లకు డిప్యుటేషన్/బదిలీలు చేసిన ఉన్నతాధికారులు, తాజాగా శనివారం అర్ధరాత్రి మరో ఐదుగురిని వివిధ జేఎన్‌టీయూ కళాశాలలకు బదిలీ చేశారు. పనిదినాలలో కాకుండా సెలవు దినాలు, రాత్రివేళల్లో ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేస్తుండడం, సెలవురోజుల్లోనే విధుల్లో చేరాలని ఆదేశించడంపై వర్సిటీలోని సీనియర్ ప్రొఫెసర్లు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. తాజా బదిలీల్లో భాగంగా పరీక్షల విభాగంలో అదనపు కంట్రోలర్ డాక్టర్ కేపీ సుప్రీతిని కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతిగా, కంప్యూటర్ సైన్స్ హెచ్‌వోడీ చంద్రమోహన్‌ను సిరిసిల్ల జేఎన్‌టీయూ కాలేజీ ప్రిన్సిపాల్‌గా డిప్యుటేషన్‌పై పంపారు. సిరిసిల్ల జేఎన్‌టీయూలో ప్రిన్సిపాల్‌గా ఉన్న జీఎన్ శ్రీనివాస్‌ను హైదరాబాద్ క్యాంపస్ కళాశాల ఈఈఈ విభాగానికి బదిలీ చేశారు. మరోవైపు డిప్యుటేషన్‌పై ఫారెన్ రిలేషన్స్ విభాగం డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్న కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్ పి.సమ్మూలాల్‌కు పరీక్షల విభాగంలో అదనపు కంట్రోలర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. మంథని జేఎన్‌టీయూ కాలేజీలో ప్రొఫెసర్‌గా డిప్యుటేషన్‌పై పనిచేస్తున్న డాక్టర్ శ్రీనివాసులును డిప్యుటేషన్ మీదే సుల్తాన్‌పూర్ జేఎన్‌టీయూ కళాశాల సివిల్ విభాగాధిపతిగా బదిలీ చేశారు. రెండు వారాల్లో జరిగిన 10మంది ప్రొఫెసర్ల బదిలీల్లో పెద్దఎత్తున సొమ్ము చేతుల మారినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. కీలక స్థానాల్లో పోస్టింగులు కోరుకున్న కొందరు ప్రొఫెసర్ల నుంచి రూ.5లక్షల చొప్పున వసూలు చేశారని, ఈ వసూళ్ల వ్యవహారంలో సివిల్ ఇంజనీరింగ్ విభాగానికి చెందిన ఓ ఉన్నతాధికారి రింగ్‌మాస్టర్‌గా వ్యవహరించారని సమాచారం.

కేంద్రబడ్జెట్‌లో బీసీలకు అన్యాయం: ఆర్.కృష్ణయ్య

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో బీసీలకు మోదీ ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేసిందని రాజ్యసభ ఎంపీ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య ఆరోపించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో సోమవారం జాతీయ బీసీ సంక్షేమ సంఘం మహా ధర్నా నిర్వహించింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ మోదీ సర్కారు బీసీ వ్యతిరేక వైఖరిని విడనాడాలన్నారు. వచ్చే పార్లమెంటు ఎన్నికల్లో బీసీలకు అన్ని పార్టీలు 50 శాతం టికెట్లు కేటాయించాలని, కులాల వారీగా జనాభాను లెక్కించాలని, బీసీ ఉద్యోగులకు రిజర్వేషన్ల ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లు ప్రవేశపెట్టాలని అన్నారు.

ప్రస్తుత సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలి



వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టాలని, లేనట్లయితే బీజేపీకి పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు ద్వారా బుద్ధి చెబుతామని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. సోమవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కమిటీలతో కాలయాపన చేయకుండా ప్రస్తుత సమావేశంలో బిల్లు పెట్టి ఆమోదించి తమ చిత్తశుద్ధిని చాటుకోవాలన్నారు. పార్లమెంట్ ద్వారానే ఎస్సీ వర్గీకరణ సాధ్యమవుతుందన్నారు. మందకృష్ణమాదిగ బీజేపీ ప్రభుత్వానికి వత్తాసు పలుకుతుండడం వల్లే వర్గీకరణ బిల్లు ఆమోదంలో జాప్యం జరుగుతోందన్నారు. ప్రస్తుత సమావేశంలో బిల్లు ఆమోదించకపోతే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని మాదిగలు చిత్తుగా ఓడిస్తారని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు గణేష్, ఉపాధ్యక్షుడు రాందాస్, మహిళా ఇన్‌చార్జి వరలక్ష్మి, ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకట్, నాయకులు పాల్గొన్నారు.

నిర్వాసితులకు నష్ట పరిహారం చెల్లించాలి

● మానవ హక్కుల వేదిక

కుషాయిగూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను శాటిలైట్ టర్మినల్‌గా మారుస్తూ చేపట్టిన ఆధునికీకరణ పనులతో ఇళ్లు, స్థలాలు కోల్పోతున్న వారికి నష్ట పరిహారం ఇవ్వాలని మానవ హక్కుల వేదిక ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మానవ హక్కుల వేదిక ఉభయ రాష్ట్రాల సమన్వయ కమిటీ సభ్యుడు ఎస్.జీవన్ కుమార్ సోమవారం ప్రకటన విడుదల చేశారు. భారీ ప్రాజెక్టు చేపట్టడానికి ముందుగా రైల్వే అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ చేయలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రైల్వే, జీహెచ్ఎంసీ, రాష్ట్ర ప్రభుత్వ విభాగాలు పారదర్శకంగా వ్యవహరిస్తూ టర్మినల్ నిర్మాణ సమాచారాన్ని ప్రజలకు వివరించాలని ఆయన డిమాండ్ చేశారు. కాగా, రెండు రోజులుగా చర్లపల్లి రైల్వే స్టేషన్‌ను సందర్శించి అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులతోపాటు పరిసర కాలనీలలో తమ 'వేదిక' సభ్యులు పర్యటించినట్లు ఆయన వెల్లడించారు. వారిలో సామాజిక కార్యకర్త పి.శంకర్, మానవ హక్కుల వేదిక నగర కమిటీ సహాయ కార్యదర్శి టి.రోహిత్, నగర కమిటీ సభ్యులు వెంకట నారాయణ, సురేష్ బాబు తదితరులు ఉన్నారు.

ఘరానా మోసగాడి అరెస్ట్

● అధిక లాభాల పేరుతో ప్రజలకు.. రుణాల తీసుకొని బ్యాంకులకు కుచ్చుటోపీ..
● దేశవ్యాప్తంగా 30కి పైగా కేసులు



పోలీసుల అదుపులో చదలవాడ రవీందర్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): అధిక లాభాలు ఇస్తామంటూ ఆశపెట్టి పెట్టుబడుల పేరుతో రూ.కోట్లలో డబ్బులు దోచుకోవడం.. బ్యాంకుల నుంచి రుణాలు తీసుకొని తిరిగి చెల్లించకుండా తప్పించుకుతిరుగుతున్న ఘరానా ఆర్థిక మోసగాన్ని సీసీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. సీసీఎస్ (ఈవోడబ్ల్యూ) ఏసీపీ అశోక్‌కుమార్ వివరాలు వెల్లడించారు. చదలవాడ రవీంద్రబాబు శ్రీనగర్ కాలనీలో చదలవాడ ఇన్‌ఫ్రాటెక్ లిమిటెడ్ పేరుతో కంపెనీ పెట్టాడు. తనవద్ద పెట్టుబడులు పెడితే అధిక లాభాలు ఇస్తామంటూ ఆకర్షించి తెలిసిన వారు, స్నేహితుల వద్ద రూ. కోట్లు కొల్లగొట్టాడు. బ్యాంకుల్లో రూ.కోట్లలో రుణాలు తీసుకొని ఒకటి రెండు వాయిదాలు చెల్లించి తప్పించుకునేవాడు. ఆ డబ్బును తన సొంత అవసరాలకు వినియోగించుకొని కనిపించకుండా పారిపోయేవాడు. సబ్‌స్టేషన్ నిర్మాణ కాంట్రాక్టులు నిర్వహించే చదలవాడ రవీందర్ పశ్చిమబెంగాల్, బిహార్, కర్ణాటక, రాజస్థాన్, ఏపీ తదితర రాష్ట్రాల్లో పలు ఆర్థిక మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఇలా ఇతనిపై హైదరాబాద్ సిటీతోపాటు.. కోల్‌కతా, బెంగళూరు, జైపూర్, ముంబై, నెల్లూరు, ప్రకాశం నగరాల్లో సుమారు 30 వరకు కేసులు నమోదై ఉన్నట్లు పోలీసులు తెలిపారు. 18 వరకు నాన్‌బెయిలబుల్ వారెంట్లు పెండింగ్‌లో ఉన్నట్లు వెల్లడించారు. పోలీసుల కళ్లుగప్పి తప్పించుకు తిరుగుతున్న రవీందర్‌ను సోమవారం అరెస్టు చేసి న్యాయస్థానంలో హాజరుపరిచినట్లు ఏసీపీ తెలిపారు.

జేఎన్‌టీయూ డైరెక్టర్‌కు బ్రెయిన్ స్ట్రోక్..!

● సకాలంలో స్పందించిన కారు డ్రైవర్
● స్థానిక ఆస్పత్రి నుంచి ఏఐజీకి తరలింపు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూలో అకడమిక్ ఆడిట్ అఫైర్స్ విభాగం డైరెక్టర్‌గా పనిచేస్తున్న ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. సాయంత్రం 4గంటల వరకు ఆఫీసు సిబ్బందితో ఉల్లాసంగా మాట్లాడిన డైరెక్టర్ శ్రీనివాసరావు, కారులో ఈసీఈ విభాగానికి వెళ్తుండగా.. ఒక్కసారిగా పక్కకు ఒరిగిపోతూ అపస్మారక స్థితిలోకి వెళ్లారు. దీనిని గమనించిన కారు డ్రైవర్.. సకాలంలో స్పందించి ఆయన్ను దగ్గర్లోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. మార్గమధ్యలో డిప్యూటీ డైరెక్టర్ రవీంద్రారెడ్డికి ఫోన్‌చేసి సమాచారం అందించారు. ఆపై శ్రీనివాస్‌రావు కుటుంబ సభ్యులకు విషయాన్ని తెలిపారు. వారు ఆస్పత్రికి చేరుకునేసరికి, డైరెక్టర్‌ను పరీక్షించిన వైద్యులు ఆయన బ్రెయిన్‌స్ట్రోక్‌కు గురైనట్లుగా తెలిపారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం శ్రీనివాసరావును గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి తరలించారు. ఆయన త్వరగా కోలుకోవాలని అధికారులు, ఉద్యోగులు ఆకాంక్షించారు. సకాలంలో స్పందించి డైరెక్టర్‌ను ఆస్పత్రికి తీసుకువెళ్లిన డ్రైవర్‌ను వారు అభినందించారు.

నేడు జేఎన్‌టీయూ పాలకమండలి సమావేశం

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): జేఎన్‌టీయూ పాలక మండలి(ఈసీ) సమావేశం మంగళవారం మాసబ్‌ట్యాంక్‌లోని ఉన్నత విద్యామండలి కార్యాలయంలో జరగనుంది. వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ కట్టా నర్సింహారెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి బుర్రా వెంకటేశంతోపాటు పాలకమండలిలో సభ్యులైన పలు ప్రైవేటు కళాశాలలకు చెందిన ప్రతినిధులు, జేఎన్‌టీయూ ఉన్నతాధికారులు హాజరకానున్నారు. పలు ప్రవేశ పరీక్షల కమిటీల సమావేశాల నేపథ్యంలో జేఎన్‌టీయూ పాలక మండలి సమావేశాన్ని కూడా ఉన్నత విద్యామండలికి మార్చినట్లు తెలిసింది. వర్సిటీలో ఖాళీగా ఉన్న రిజిస్ట్రార్, రెక్టార్ పోస్టుల్లో రెగ్యులర్ అధికారులను నియమించే అంశంపైనా పాలకమండలి నిర్ణయం తీసుకోనుంది.

రాజ్యాంగ హక్కులను హరిస్తున్న మోదీ : ఏఐవైఎఫ్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీ పాలన అంతా రాజ్యాంగ హక్కులను హరించడమే అని, మోదీ హఠావో.. దేశ్ కో బచావో నినాదంతో దేశమంతా ప్రచారం నిర్వహిస్తామని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలైరామన్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ తెలంగాణ రాష్ట్ర సమావేశం సోమవారం హిమాయత్‌నగర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో మోదీ అధికారంలోకి వచ్చాక 16 శాతం నిరుద్యోగం పెరిగిందన్నారు. ప్రధాని చెప్పినట్లు ఏటా 2 కోట్ల ఉద్యోగాలు ఇవ్వడం లేదని విమర్శించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కే. ధర్మేంద్రలు మాట్లాడారు.

అత్తింటివారే చంపి.. ఆత్మహత్యగా చిత్రీకరించారు

● కేసును పునర్విచారించి న్యాయం చేయాలి ● మీడియాతో గోడు వెల్లబోసుకున్న తల్లిదండ్రులు



మృతురాలు జ్యోతి తల్లిదండ్రులు వెంకటస్వామి, లలిత, కుటుంబ సభ్యులు

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగస్తురాలు, అత్యంత ధైర్యవంతురాలైన మా కుమార్తెకు ఆత్మహత్య చేసుకునేంత పిరికితనం లేదని, అత్తింటివారే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని బాధితురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. వెస్ట్ జోన్ బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలో గత అక్టోబర్‌లో ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చి ఆత్మహత్య చేసుకున్న ప్రభుత్వ ఉపాధ్యాయురాలు జ్యోతి (32) ఘటన సంచలనం సృష్టించిన సంగతి విదితమే. ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం జరగలేదని, కేసును పునర్విచారించి తగిన న్యాయం చేయాలని కోరారు. సోమవారం ఎస్సీఆర్‌హిల్స్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మృతరాలి తల్లిదండ్రులు వెంకటస్వామి, లలిత, కుటుంబ సభ్యులు తమ గోడు వెల్లబోసుకున్నారు. తమ కూతురిని హత్య చేసి, ఆత్మహత్యగా చిత్రీకరించి తప్పుదోవ పట్టించిన భర్తను, అత్తింటివారిని కఠినంగా శిక్షించాలని పోలీసులను, ఉన్నతాధికారులను వేడుకున్నారు. ఎన్‌బీటీ నగర్ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా జి.జ్యోతి పని చేస్తుండేది. బోరబండ రాజ్‌నగర్‌లో ఉంటున్న మేనమామ బాలరాజ్ (లలిత అన్న) కుమారుడు ఎ.విజయ్‌కు ఇచ్చి వివాహం చేశామన్నారు. పెళ్లైన నాటినుంచి వేధించేవారని, ఇద్దరు అబ్బాయిలు పుట్టిన తర్వాత కూడా వారి ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. గతేడాది అక్టోబర్ 13న రాత్రి జ్యోతి ఉరేసుకుని మృతిచెందిందని మరుసటిరోజు (14వతేదీ) ఉదయం 9.30గంటలకు తెలిపారని ఆవేదన వ్యక్తం చేశారు.

మేము దిగ్భ్రాంతిలో ఉండగానే హుటాహుటిన పోస్టుమార్టం కోసమని సంతకాలు తీసుకుని వాటినే ఫిర్యాదు కాగితాలుగా మార్చి ఎలాంటి విచారణ లేకుండా ఆత్మహత్యగా చిత్రీకరించారని వాపోయారు. ఇంటి నిర్మాణం కోసం రూ.1.05కోట్లు లోను తీసుకోవాలని ఒత్తిడి చేశారని, లేదంటే ఉద్యోగం మానేయాలని కండీషన్ పెట్టి రకరకాలుగా హింసించారని.. వారి కండీషన్స్‌కు జ్యోతి ఒప్పుకోకపోవడంతో పిల్లలతోపాటు ఆమెను కూడా హత్యచేసి, ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. ఈ మేరకు ముఖ్యమంత్రితో పాటు డీజీపీ, హైదరాబాద్ సీపీ, వెస్టుజోన్ డీసీపీ, ఏసీపీ, హ్యూమన్‌రైట్స్ కమిషన్‌కు వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. హత్యలు చేసి ఆత్మహత్యగా చిత్రీకరించిన దోషులకు శిక్ష పడే వరకు తాము పోరాడతామని వారు తెలిపారు.

సీఆర్వోగా ఫణీంద్రారెడ్డి బాధ్యతల స్వీకరణ



ఫణీంద్రారెడ్డి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ చీఫ్ రేషనింగ్ ఆఫీసర్(సీఆర్వో)గా జి.ఫణీంద్రారెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ పని చేసిన బాలమాయదేవిని బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా నియమించడంతో ఫణీంద్రారెడ్డిని సీఆర్వోగా నియమించారు.

సమస్యను పరిష్కరించని అధికారులను ఉపేక్షించం



ప్రజావాణిలో ఫిర్యాదు స్వీకరిస్తున్న మేయర్ విజయలక్ష్మి, కమిషనర్ రోనాల్ రోస్

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు ఎన్ని రోజుల్లో పరిష్కారమవుతుందో పౌరులకు లిఖితపూర్వకంగా తెలియజేయాలని, తిరిగి అదే సమస్యపై ఫిర్యాదుచేసిన పక్షంలో సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని కమిషనర్ రోనాల్డ్ రోస్ హెచ్చరించారు. సోమవారం కేంద్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, రోనాల్డ్‌రోస్ వినతులు స్వీకరించారు. గ్రేటర్ వ్యాప్తంగా 188 వినతులు/ఫిర్యాదులు వచ్చాయని, ఫోన్‌ఇన్ ద్వారా 18 ఫిర్యాదులు స్వీకరించినట్లు అధికారులు ప్రకటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసి అర్జీదారునితోపాటు సంబంధిత శాఖ హెచ్ఓడీకి మెస్సేజ్ వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు.

కలెక్టరేట్‌లో..



ప్రజావాణిలో కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ప్రజావాణి దరఖాస్తుల్లో జాప్యాన్ని నివారించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై 66మంది దరఖాస్తులు అందజేశారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటాచారి, ఆర్డీఓలు సూర్యప్రకాష్, రవికుమార్, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలన..

చాదర్‌ఘాట్‌లోని విక్టరీ ప్లే గ్రౌండ్‌లో భద్రపరిచిన ఈవీఎంలు, వీవీప్యాట్స్, సీయూ, బీయూలను సోమవారం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి పరిశీలించారు.

ఇంటర్ పరీక్షలను విజయవంతం చేయాలి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలను విజయవంతం చేసేందుకు అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్ సూచించారు. ఇంటర్ పరీక్షల నిర్వహణపై సోమవారం కలెక్టరేట్‌లో ఆయన వివిధ శాఖల అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఫిబ్రవరి 28నుంచి మార్చి 19 వరకు జరుగనున్న పరీక్షలకు సంబంధించి జిల్లాలో 242 కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఫస్టియర్, సెకండియర్‌లో కలిపి 1,74,368 మంది హాజరవుతున్నారని తెలిపారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా స్పెషల్ బస్సులను నడిపించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఎండలు సమీపిస్తున్నందున పరీక్షా కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని, విద్యుత్ అంతరాయాలు, తాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డీసీపీ బాబురావు, జిల్లా ఇంటర్ అధికారి వడ్డెన్న, డీఈఓ రోహిణి, జిల్లా వైద్యాధికారి వెంకటి, తదితరులు పాల్గొన్నారు.

రేపు నిమ్స్‌మేలో లోన్ మేళా

యూసుఫ్‌గూడ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): సూక్ష్మ చిన్నతరహా పరిశ్రమలు ప్రారంభించాలనుకునే వారి కోసం యూసుఫ్‌గూడలోని కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నిమ్స్‌మేలో ఈనెల 7న లోన్‌మేళా నిర్వహిస్తున్నారు. ఉదయం 9.30గంటలకు ప్రారంభమయ్యే ఈ లోన్ మేళాలో అన్ని ప్రభుత్వ ప్రైవేట్ బ్యాంకుల ప్రతినిధులు పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ నివేదిక తయారీ, రుణం పొందే ప్రక్రియ అందుకు కావాల్సిన ధ్రువపత్రాల గురించి వివరిస్తారు. ఇతర వివరాలకు, రిజిస్ట్రేషన్ కోసం ఫోన్‌నెంబర్లు 040236 33244, ఎక్స్‌టెన్షన్ 218, 261లలో సంప్రదించాలని సూచించారు.

విద్యార్థులకు విద్యతోపాటు నైపుణ్యం ముఖ్యం

● డా.బీఆర్ఏయూ వీసీ ప్రొ.కె.సీతారామారావు

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు అకాడమిక్ విద్యతో పాటు తాము చదువుకునే అంశాలపై వృత్తి నైపుణ్యం ముఖ్యమని డా.బీఆర్ అంబేడ్కర్ వర్సిటీ వీసీ ప్రొ.కె.సీతారామారావు అన్నారు. నైపుణ్యాభివృద్ధి వృత్తి ప్రణాళికా కేంద్రం (సీఎస్డీసీపీ), మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సంయుక్తంగా 'స్టాఫ్ స్కిల్స్ ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ అసిస్టెన్స్' అంశంపై వర్సిటీలో నిర్వహిస్తున్న నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమాన్ని సోమవారం వీసీ ప్రారంభించారు. విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ అకాడమిక్ డైరెక్టర్ ప్రొ.జి.పుష్ప చక్రపాణి, రిజిస్ట్రార్ ప్రొ.ఎ.వి.ఆర్.ఎన్ రెడ్డి, మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, ప్రోగ్రాం మేనేజర్ టి.వెంకట్‌రావు మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు మారితే మంచి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. విశ్వవిద్యాలయ నైపుణ్యాభివృద్ధి వృత్తి ప్రణాళికా కేంద్రం ఇన్‌చార్జ్ డైరెక్టర్ డా.డి.రవీంద్రనాథ్ సోలమన్, పలు విభాగాల అధిపతులు, తదితరులు పాల్గొన్నారు.

'రిజర్వేషన్ల పేరుతో మోసం చేస్తోన్న బీజేపీ'

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో మహిళా రిజర్వేషన్ల బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన వెంటనే అమలు చేయకుండా బీజేపీ మహిళలను మోసం చేస్తోందని భారత మహిళా సమాఖ్య కార్యదర్శి అన్నీ రాజా ఆరోపించారు. ప్రధాని మోదీకి మహిళలపై గౌరవం ఉంటే 2024 ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లో సోమవారం నిర్వహించిన భారత జాతీయ మహిళా సమాఖ్య తెలంగాణ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో అన్నీ రాజా మాట్లాడారు. జాతీయ ఉపాధ్యక్షురాలు పి.దుర్గాభవానీ తదితరులు పాల్గొన్నారు.

శాంతి కోసం అందరూ కృషి చేయాలి

ప్రపంచ వ్యాప్తంగా యుద్ధ వాతావరణం పెరుగుతోందని, ప్రపంచ శాంతి కోసం పార్టీలకు అతీతంగా విద్యార్థులు, మేధావులు, కవులు శాంతి ఉద్యమాన్ని బలోపేతం చేయాలని అఖిల భారత సంఘీభావ సంఘం జాతీయ అధ్యక్షులు డి.సుధాకర్ పిలుపునిచ్చారు. సోమవారం హిమాయత్‌నగర్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఈనెల11న అఖిల భారత శాంతి సంఘీభావ జాతీయసమావేశాలు ఢిల్లీలో జరుగుతున్నాయన్నారు.

హైదరాబాద్ గోల్ఫ్ క్వార్టర్స్‌లో 'ఏంజెల్స్'



క్వార్టర్స్‌లో ప్రవేశించిన ఏంజెల్స్ టీమ్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): వరల్డ్ హైదరాబాద్ ప్రీమియర్ గోల్ఫ్ లీగ్‌లో సామ ఏంజెల్స్, డీఎస్ఆర్ జట్లు క్వార్టర్స్‌లో ప్రవేశించాయి. సోమవారం గోల్కొండలోని హైదరాబాద్ గోల్ఫ్ కోర్సులో జరిగిన లీగ్ దశ ఐదో రౌండ్ పోటీల్లో ఏంజెల్స్ జట్టు 175 పాయింట్లతో అగ్రస్థానంలో నిలవగా, డీఎస్ఆర్ జట్టు ద్వితీయ స్థానంలో నిలిచింది. ఓవరాల్‌గా గ్రూప్-ఎ టాపర్ ఏంజెల్స్ జట్టు (804 పాయింట్లు), గ్రూప్-బి టాపర్ ఆల్ఫా (742), గ్రూప్-సి టాపర్ డీఎస్ఆర్ (814), గ్రూప్-డి టాపర్ హైలాండర్స్ (755) క్వార్టర్స్‌లో ప్రవేశించాయి.

నవ్య
కుటుంబ కదంబం

డాక్టర్



బ్రెయిన్ ట్యూమర్స్

మెదడు, వెన్నుపాములో ట్యూమర్ల లక్షణాలు వ్యాధి నిర్ధారణను తప్పు దారి పట్టిస్తాయి. దాంతో మొదట్లోనే వాటిని కచ్చితంగా గుర్తించి, చికిత్స అందించడం ఆలస్యమవుతూ ఉంటుంది. ఇలా జరగకుండా ఉండాలంటే ఈ ట్యూమర్ల లక్షణాల పట్ల లోతైన అవగాహన పెంచుకోవాలి.

మెదడు కణితులకు సమర్థమైన చికిత్సలు

వెన్నుపాములో ట్యూమరు వల్ల మూత్రవిసర్జన క్రమం తప్పవచ్చు. మెదడులో కణితుల వల్ల చేతులు, కాళ్లలో నిస్సత్తువ తగ్గవచ్చు. కానీ మనం ఈ లక్షణాలు తలెత్తే అవయవాల్లోనే సమస్య ఉందని భావిస్తాం. సదరు వైద్యులను సంప్రదిస్తూ ఉంటాం. కానీ నిజానికి మెదడు, వెన్నుపాము, ఇతరత్రా నాడీసంబంధ సమస్యలన్నీ ఇతరత్రా శారీరక వ్యవస్థలతో ముడిపడి ఉంటాయి. మెదడు సంబంధ ట్యూమర్లలో మెనింజియోమా, మెటాస్టాసిస్ అనే రెండు రకాల ట్యూమర్లు ప్రధానంగా కనిపిస్తూ ఉంటాయి. ఈ ట్యూమర్లను కేన్సర్ వైద్యులు చికిత్స చేయరు. ఎమ్మారైలో గడ్డ ఉందని కనిపెట్టినప్పుడు న్యూరాలజిస్టుల దగ్గరకే పంపిస్తూ ఉంటారు. అయితే మెదడు లేదా వెన్నుపాములో పెరిగే గడ్డలన్నీ కేన్సర్ గడ్డలే అయి ఉండవలసిన అవసరం లేదు. 12 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో లేదా 55 నుంచి 60 ఏళ్ల పెద్దల్లో బ్రెయిన్ ట్యూమర్లు తలెత్తవచ్చు. పిల్లల్లో పుట్టుకతోనే మెదడు కణాల్లో సమస్యల కారణంగా ట్యూమర్లు తలెత్తితే, పెద్దల్లో మెటాస్టాసిస్‌లు, మెనింజియోమాల తరహా ట్యూమర్లు తలెత్తుతూ ఉంటాయి. మెనింజియోమా బినైన్ ట్యూమరు. అప్పుడప్పుడూ తలనొప్పితో వేధించే ఈ ట్యూమర్లతో ప్రమాదం ఉండదు. అరుదుగా కొందర్లో 70 ఏళ్ల వయసుకు అవే ట్యూమర్లు పెరిగి ఫిట్స్ రావడం, మాట పడిపోవడం లాంటి లక్షణాలు కనిపించవచ్చు. అప్పుడు సర్జరీతో సమస్యను పూర్తిగా సరిదిద్దవచ్చు. ట్యూమర్లలో నాలుగు గ్రేడ్లు ఉంటాయి. మొదటి, రెండవ గ్రేడ్‌కు చెందిన ట్యూమర్లను సర్జరీతో తొలగిస్తే, సమస్య సమసిపోతుంది. కానీ మూడు లేదా నాల్గవ గ్రేడ్‌లో ఉన్న ట్యూమర్లు కేన్సర్ ట్యూమర్లు. సర్జరీ చేసినా ఇవి తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది. కాబట్టి సర్జరీ తర్వాత రేడియేషన్, కీమోథెరపీలు అవసరమవుతాయి.

> మూడు లేదా నాల్గవ గ్రేడ్‌లో ఉన్న ట్యూమర్లు కేన్సర్ ట్యూమర్లు. సర్జరీ చేసినా ఇవి తిరగబెట్టే ప్రమాదం ఉంటుంది. కాబట్టి సర్జరీ తర్వాత రేడియేషన్, కీమోథెరపీలు అవసరమవుతాయి.

ఈ లక్షణాల పట్ల అప్రమత్తం

మెదడు ట్యూమర్ల ప్రధాన లక్షణం తలనొప్పి. దీంతో పాటు గడ్డ తలెత్తిన ప్రదేశాన్ని బట్టి లక్షణాలు మారుతూ ఉంటాయి. తలనొప్పి, ఫిట్స్, కాళ్లు చేతులు మొద్దుబారడం, స్పర్శ కోల్పోవడం ప్రధాన లక్షణాలు. అలాగే...

- **మెదడులోని ఇన్సులార్ ప్రాంతం:** తలనొప్పి, కడుపులో తిప్పడం
- **మెదడు ముందు లేదా మధ్య ప్రాంతం:** జ్ఞాపకశక్తి తగ్గడం, ప్రవర్తనలో మార్పులు, చూపు మందగించడం
- **మెదడు వెనక భాగం:** రుచి, వాసన, స్పర్శలో సమస్యలు తలనొప్పితో పాటు ఇతరత్రా లక్షణాలు కూడా వేధిస్తూ ఉంటే ఆలస్యం చేయకుండా నాడీసంబంధ వైద్యులను కలవాలి.

ఈ పరీక్షలతో...

ఎమ్మారై స్కాన్‌తో నాడీసంబంధ ట్యూమర్లను కచ్చితంగా కనిపెట్టవచ్చు. ఈ స్కాన్‌లోనే యాంజియోగ్రామ్, వీనోగ్రామ్, కాంట్రాస్ట్ స్టడీలను చేపట్టి, ట్యూమర్‌ను కచ్చితంగా అంచనా వేసి, చికిత్సను నిర్ధారించడం జరుగుతుంది.

చికిత్స ఇలా...

క్లిష్టమైన ప్రాంతంలో లేని, రెండు సెంటీమీటర్ల కంటే చిన్న గడ్డలకు సర్జరీ అవసరం ఉండదు. ఫాలోఅప్‌లో గమనించుకుంటూ పెరుగుతుందనుకున్నప్పుడు రేడియేషన్‌తో చికిత్స చేయవచ్చు. క్లిష్టమైన ప్రాంతంలో ఉన్న గడ్డలకు రేడియేషన్‌తో హాని ఎక్కువ కాబట్టి వాటిని సర్జరీ చేసి తొలగించవలసి వస్తుంది. సర్జరీ తర్వాత గడ్డను అనాలసిస్ చేసి, గ్రేడ్‌ను బట్టి రేడియేషన్ లేదా కీమోథెరపీని వైద్యులు సూచిస్తారు. మొదటి రెండు దశల ట్యూమర్లకు, ప్రతి మూడు, ఆరు, 12 నెలలకోసారి ఎమ్మారై చేసుకుంటూ గడ్డను గమనిస్తూ ఉండాలి. పెరుగుతూ ఉంటే సర్జరీ చేయక తప్పదు. మూడు, నాలుగు దశల్లోని ట్యూమర్లను సర్జరీతో తొలగించిన తర్వాత, రేడియేషన్ కూడా అవసరమవుతుంది. తర్వాత కూడా వైద్యులను తరచూ కలుస్తూ ఉండాలి.

> మెదడు సర్జరీపరంగా అత్యాధునిక సాంకేతికతలు అందుబాటులోకొచ్చాయి. వీటితో 80 నుంచి 90% మేరకు విజయవంతమైన ఫలితాలను రాబట్టుకోవచ్చు. ప్రస్తుతం మైక్రోస్కోపిక్ సర్జరీలో భాగంగా ఇమ్యునోఫ్లోరసెంట్ విధానాన్ని అనుసరిస్తూ, రక్తనాళం ద్వారా రంగు పదార్థాన్ని మెదడులోకి పంపించి, ట్యూమర్‌ను స్పష్టంగా చూడగలిగే చికిత్సలు ప్రస్తుతం అందుబాటులో ఉన్నాయి. న్యూరో మానిటరింగ్ ద్వారా క్లిష్టమైన ప్రదేశాల్లోని గడ్డలను కూడా జాగ్రత్తగా తొలగించే వీలుంది. అలాగే చిన్న ట్యూమర్లను తొలగించే క్యూసా మిషన్లు కూడా ఇప్పుడు అందుబాటులో ఉన్నాయి. కాబట్టి ఇలాంటి ఆధునిక చికిత్సలతో మెదడులోని ఇతర ప్రాంతాలు దెబ్బతినకుండా ట్యూమర్‌ను సమర్థంగా తొలగించడం వల్ల మరింత మెరుగైన ఫలితాలను సాధించవచ్చు.



డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి
కన్సల్టెంట్ న్యూరో అండ్ స్పైన్ సర్జన్,
మెడికవర్ హాస్పిటల్స్,
హైటెక్ సిటీ, హైదరాబాద్.



మీకు తెలుసా?



బ్రేక్‌ఫాస్ట్ మానేయడం మంచిదే!

రోజు మొత్తంలో అత్యంత ముఖ్యమైన భోజనం, బ్రేక్‌ఫాస్ట్ అని మనం చిన్నప్పటి నుంచీ వింటూ ఉన్నాం. కానీ బ్రేక్‌ఫాస్ట్‌ను స్కిప్ చేయడం వల్ల ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలున్నాయని తాజా అధ్యయనాలు చెప్తున్నాయి.

రాత్రి భోజనం తినడానికీ ఉదయం నిద్ర లేవడానికీ మధ్య ఉండే విరామ సమయంలో మన శరీరం రాత్రి తిన్న భోజనం ద్వారా అందిన క్యాలరీలను ఖర్చు చేసుకుంటుంది. అయితే అదే విరామ సమయాన్ని మరికొంత పొడిగిస్తే, ఖర్చు చేయడానికి సరిపడా క్యాలరీలు లేక మన శరీరం కొవ్వును కరిగించుకోవడం మొదలు పెడుతుంది. అయితే ఆ విరామ సమయంలో ఆకలితో కలిగే పదార్థ వ్యామోహాలు, ఎమోషనల్ ఈటింగ్‌లకు చెక్ పెడుతూ ఉండాలి. దీర్ఘ సమయాల పాటు శరీరానికి ఆహారం అందించకపోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు ఇవే!

- **వ్యాధుల నుంచి రక్ష:** టైప్2 మధుమేహం, గుండె జబ్బులు, వయసుతో సంబంధం ఉన్న న్యూరోడీజెనరేటివ్ డిజార్డర్లు, ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్, పలు రకాల కేన్సర్ల నుంచి రక్షణ పొందవచ్చు. ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో అధిక రక్తపోటు అదుపులోకొస్తుంది. విరామ సమయంలో గుండె కొట్టుకునే వేగం తగ్గుతుంది.
- **బరువు తగ్గొచ్చు:** మెటబాలిజంను పెంచడం ద్వారా బరువు తగ్గడం మీ లక్ష్యమైతే, దీనికీ ఉదయం బ్రేక్‌ఫాస్ట్ తినకపోడానికీ ఎటువంటి సంబంధం ఉండదు. ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌తో మెటబాలిజం కిక్‌స్టార్ట్ అవుతుందనేది అపోహ మాత్రమే!
- **శక్తి పెరుగుతుంది:** బ్రేక్‌ఫాస్ట్‌తో అందే క్యాలరీల మీద కోత విధిస్తే, నీరసం బదులుగా శక్తి సమకూరుతుంది. ఇందుకు కారణం శరీరం సురక్షితమైన కీటోజెనిక్ స్థితిలోకి ప్రవేశించడమే!
- **ఆటోఫజీ:** కణాల వ్యర్థాలను శుభ్రం చేసే ప్రక్రియ ఆటోఫజీ. ఈ ప్రక్రియ జరగనప్పుడు పైబడే వయసుతో ముడిపడి ఉండే ఆరోగ్య సమస్యలు మొదలవుతాయి. ఆహారం తీసుకోనప్పుడు, ఆటోఫజీ వల్ల కణ శుభ్రత పెరుగుతుంది.
- **అప్రమత్తత:** ఉదయం బ్రేక్‌ఫాస్ట్ మానేయడం వల్ల మానసిక అప్రమత్తత, ఏకాగ్రతలు పెరుగుతాయి.
- **ఇన్సులిన్ సెన్సిటివిటీ:** ఫాస్టింగ్ గ్లూకోజ్, ఫాస్టింగ్ ఇన్సులిన్, లెప్టిన్‌లు తగ్గి ఫలితంగా ఇన్సులిన్ రెసిస్టెన్స్ కూడా తగ్గుతుంది.
- **ఇన్‌ఫ్లమేషన్:** మధుమేహం, మల్టిపుల్ స్క్లెరోసిస్, ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ సిండ్రోమ్‌లతో ముడిపడి ఉండే ఇన్‌ఫ్లమేషన్ ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్‌తో తగ్గుతుంది.

ఈ వ్యాయామంతో గుండె పదిలం

ఫిట్‌నెస్



గుండె వేగం పెంచే వ్యాయామాలతోపాటు గుండెకు విశ్రాంతినిచ్చే వ్యాయామాలు చేయడమూ అవసరమే! నిత్యం శరీరమంతా రక్తాన్ని పంప్ చేస్తూ అలసిపోయే గుండెకు నిద్రలో తప్ప విశ్రాంతి దొరకదు. ఆ భంగిమలో కూడా గుండె మీద అంతో కొంత ఒత్తిడి ఉంటూనే ఉంటుంది. అయితే రక్తప్రసార వేగాన్ని తగ్గించి గుండెకు సాధ్యమైనంత ఎక్కువ విశ్రాంతినిచ్చే భంగిమలూ ఉన్నాయి. వాటితో గుండెకు ఉపశమనం కలుగుతుంది. కాబట్టి ఇదిగో ఈ వ్యాయామం కోసం రోజు మొత్తంలో కనీసం ఐదు నిమిషాలు కేటాయించండి. ఈ వ్యాయామం ఎలా చేయాలంటే?

- గోడకు దగ్గరగా మ్యాట్ వేసుకుని వెల్లకిలా పడుకోవాలి.
- ఇలా పడుకున్నప్పుడు మోకాళ్లను మడిచి, పైకి లేపి, పిరుదులు గోడకు తగిలేలా దగ్గరగా జరగాలి.
- చేతులను వెనక్కి వాల్చేసి, కాళ్లను నెమ్మదిగా నిటారుగా పైకి లేపాలి.
- పైకి లేపిన కాళ్లను గోడకు ఆనించి, బరువును గోడ మీదే వేయాలి.
- ఈ భంగిమలో ఉన్నప్పుడు మనసు ప్రశాంతంగా ఉంచుకుని, ఊపిరి పీల్చుకోవాలి.
- ఆ సమయంలో గుండె వేగం తగ్గడం స్పష్టంగా తెలుస్తుంది.
- ఇలా 5 నిమిషాలపాటు ఉండి నెమ్మదిగా కాళ్లను కిందకి దించి, చేతులు నేల మీద ఉంచి, లేచి నిలబడాలి.

ఆయుర్వేదం

అశ్వగంధతో ఆరోగ్యం

అశ్వగంధ వేరు చూర్ణంతో ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు దక్కుతాయి. అవేంటంటే...

- **ఒత్తిడి, ఆందోళన దూరం:** ఈ చూర్ణం పాలతో కలిపి తీసుకుంటే ఒత్తిడి తగ్గి చక్కటి నిద్ర పడుతుంది. అంతేకాదు. ఒత్తిడి, ఆందోళనల ప్రభావం మూలంగా తలెత్తే ఆరోగ్య ఇబ్బందులను అధిగమించే శక్తిని సమకూరుస్తుంది.
- **బరువు తగ్గిస్తుంది:** ఇతర బరువు తగ్గించే మందులతో కలిపి ఈ చూర్ణాన్ని వాడితే ప్రభావం ఎక్కువగా ఉంటుంది. స్ట్రెస్ మూలంగా హెచ్చుతగ్గులకు గురయ్యే మెటబాలిజంను సరిచేసే శక్తి ఈ చూర్ణానికి ఉంటుంది. కాబట్టి బరువు తగ్గే వేగం పెరుగుతుంది.



- **మధుమేహం అదుపు:** నోటి మాత్రలకంటే ప్రభావవంతంగా ఈ చూర్ణం రక్తంలోని గ్లూకోజ్ లెవెల్స్‌ను తగిస్తుంది. రక్తంలోని గ్లూకోజ్ లెవెల్స్‌ను సమం చేసి ఇన్సులిన్ సెన్సిటివిటీని పెంచుతుంది.
- **కేన్సర్ నుంచి రక్షణ:** పెద్దపేగు, రొమ్ములు, ఊపిరితిత్తుల కేన్సర్‌ల నుంచి రక్షణ కల్పిస్తుంది.
- **బొల్లి:** అశ్వగంధ చూర్ణానికి బొల్లి మచ్చలు చక్కగా స్పందిస్తాయి. కెరటోసిస్ అనే చర్మ చికిత్సకు అశ్వగంధ చూర్ణంతో తయారుచేసిన పేస్ట్ వాడతారు. అశ్వగంధ అద్భుతమైన స్కిన్ టోనర్‌గా కూడా పని చేస్తుంది.

వెజైనల్ హెల్త్‌ను పరిరక్షించుకోవడమనేది మహిళల పూర్తి ఆరోగ్యంలో కీలక పాత్ర పోషిస్తుంది. వెజైనా సమస్యలు మహిళలను మానసికంగా శారీరకంగా కుంగదీయడమే కాకుండా, వైవాహిక జీవితంలో ఒత్తిడి, ఆందోళనలకూ లోను చేస్తాయి. కాబట్టి వెజైనల్ హెల్త్ గురించి ప్రతి మహిళా అవగాహన ఏర్పరుచుకోవడం అవసరం.

ఆ ఇబ్బందులు తొలగాలంటే...

విమెన్స్ హెల్త్

వెజైనాకు సంబంధించి స్వల్ప సమస్యలు మొదలు తీవ్రమైన సమస్యల వరకూ ఉంటాయి.

వెజినైటిస్

వెజైనా ఇన్‌ఫ్లమేషన్‌కు గురి కావడమే వెజినైటిస్. సాధారణంగా వెజైనాలో బ్యాక్టీరియా, ఈస్ట్‌ల మధ్య ఆరోగ్యకరమైన సంతులనం ఉంటుంది. ఈ సహజసిద్ధ సంతులనం దెబ్బతిన్నప్పుడు, మహిళలు అసౌకర్యాన్ని ఎదుర్కొంటారు. అలాగే అసాధారణమైన వాసన కూడా మొదలవుతుంది. ఈస్ట్ ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా వెజినైటిస్ రావచ్చు. లేదా కొత్త రకాల సబ్బులు, పలు రకాల ఫ్యాబ్రిక్స్‌తో తయారైన లోదుస్తుల వాడకం వల్ల కూడా ఈ సమస్య తలెత్తవచ్చు. నెలసరి తర్వాత కొందర్లో అట్రోఫిక్ వెజినైటిస్ వస్తూ ఉంటుంది. ఈ సమస్యలో వెజైనా పొడిబారడం, ఇన్‌ఫ్లమేషన్‌లు ఉంటాయి.

బ్యాక్టీరియల్ వెజినోసిస్

వెజైనాలో బ్యాక్టీరియా గ్రోత్ పెరిగిపోయినప్పుడు ఈ సమస్య తలెత్తుతుంది. దురద, అసౌకర్యం, దుర్వాసన ఈ సమస్య ప్రధాన లక్షణాలు. ఈ సమస్య లైంగిక వ్యాధులు, హెచ్‌ఐవి సోకే ముప్పును కూడా పెంచుతుంది.

ట్రైకోమోనియాసిస్

ఇదొక లైంగిక వ్యాధి. పరాన్నజీవుల ద్వారా సంక్రమిస్తుంది. వెజైనా ఎర్రబారడం, దురద, మూత్రవిసర్జన సమయంలో అసౌకర్యం, యోని నుంచి స్రావం, దుర్వాసనలు ఉంటాయి.

వల్వోడైనియా

యోని ప్రవేశద్వారం దగ్గర నొప్పి ఈ సమస్య ప్రధాన లక్షణం. మంట, గుచ్చినట్టు అనిపించడం, కందిపోవడం, వాపు లాంటి లక్షణాలు కూడా ఉంటాయి. ఈ సమస్యను నిర్లక్ష్యం చేస్తే, లైంగిక కలయిక ఇబ్బందిగా మారి అనవసరపు సమస్యలకు దారి తీస్తుంది.

ఎస్‌టిఐ

లైంగిక వ్యాధులన్నీ యోని ఆరోగ్యాన్ని దెబ్బ తీసేవే! క్లమీడియా, గొనోరియా, జెనైటల్ హెర్పిస్ ప్రధాన లైంగిక వ్యాధులు. జెనైటల్ హెర్పిస్‌లో యోని నుంచి స్రావం, రక్తస్రావం, నొప్పి ఉంటాయి.

పొడిబారడం

యోని పొడిబారడానికి పలు కారణాలుంటాయి. ఈస్ట్రోజన్ హార్మోన్ లోపం, ఒత్తిడి ప్రధాన కారణాలు. అయితే శారీరకంగా కలిసే సమయంలో ఈ సమస్య మరింత ఎక్కువగా ఇబ్బంది పెడుతూ ఉంటుంది.

యోని ఆరోగ్యం కోసం...

- యోని ప్రదేశాన్ని శుభ్రంగా ఉంచుకోవాలి. నీళ్లు, ఘాటైన వాసనలు వెదజల్లని సబ్బును ఉపయోగించి శుభ్రం చేసుకోవాలి.
- శరీరానికి సౌకర్యంగా ఉండే లోదుస్తులు, శానిటరీ న్యాప్కిన్స్ ఎంచుకోవాలి. ధరించే ప్యాంటీ తడిని పీల్చేదై ఉండాలి. రాత్రివేళ ప్యాంటీ ధరించకపోవడమే మేలు. నెలసరి సమయంలో సెంటెడ్ ట్యాంపూన్లు, ప్యాడ్స్, లైనర్స్ వాడకూడదు.
- బిగుతైన దుస్తులు ధరించకూడదు. బిగుతుగా ఉండే జీన్స్, షేప్‌వేర్‌లను ఎక్కువ సమయం పాటు ధరించడం వల్ల వెజైనల్ ఇన్‌ఫెక్షన్స్ పెరుగుతాయి.
- తడిచిన స్విమ్‌వేర్, అండర్‌ప్యాంట్స్ ఎక్కువ సమయం పాటు ధరించి ఉండిపోకూడదు. ఇలా చేస్తే ఈస్ట్ ఇన్‌ఫెక్షన్ సోకే అవకాశాలు పెరుగుతాయి.
- వాష్‌రూమ్‌ను ఉపయోగించిన ప్రతిసారీ వెజైనల్ ఏరియాను పొడిగా తుడుచుకోవాలి. వాష్‌రూమ్ ఉపయోగించిన తర్వాత యోని, మూత్రనాళం, పురీష నాళాల్లో సూక్ష్మజీవులు, ఈస్ట్ పెరిగిపోకుండా ఉండాలంటే యోనిని ముందు నుంచి వెనకకు శుభ్రం చేసుకోవాలి.

చికిత్సలు ఉన్నాయి



తక్కువ పొటెన్సీని కలిగి ఉండే పైపూత స్టిరాయిడ్లు, నోటి ద్వారా వాడుకునే యాంటీబయాటిక్స్, యాంటీ ఫంగల్స్, యాంటీబ్యాక్టీరియల్ లోషన్లు ఉంటాయి. యోని సమస్యలకు సాధారణంగా వైద్యులు క్లోట్రిమజోల్, బ్యూటోకోనజోల్ మందులనే సూచిస్తూ ఉంటారు. క్లిండామైసిన్ లేదా మెట్రోనిడజోల్‌లను బ్యాక్టీరియల్ వెజినైటిస్‌కూ సూచిస్తూ ఉంటారు. అయితే సమస్యను కచ్చితంగా కనిపెట్టి, ప్రభావవంతమైన మందులను వైద్యులే సూచించగలుగుతారు కాబట్టి యోనిలో ఎటువంటి సమస్య తలెత్తినా ఆలస్యం చేయకుండా వైద్యులను సంప్రతించాలి.


ఆంధ్రజ్యోతి
నవ్య | చిత్రజ్యోతి
మంగళవారం • 6 ఫిబ్రవరి 2024
cinema@andhrajyothy.com



నాకు నచ్చిన గెటప్‌లో కనిపిస్తా

రవితేజ

"ఈగల్ సినిమా అద్భుతంగా వచ్చింది. ప్రేక్షకుల స్పందన కోసం ఎదురుచూస్తున్నాను. ఈ సినిమాలో నాకు విపరీతంగా నచ్చిన గెటప్‌లో కనిపిస్తాను' అని రవితేజ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన యాక్షన్ ఎంటర్టైనర్ 'ఈగల్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. అనుపమా పరమేశ్వరన్, కావ్యాథాపర్ హీరోయిన్లు. టీజీ విశ్వప్రసాద్ నిర్మాత. ఫిబ్రవరి 9న ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించింది. రవితేజ మాట్లాడుతూ "ఈగల్‌లో నా పాత్ర కోసం మేకోవర్ అవ్వడానికి మూడు నెలలు పట్టింది. నాకు చాలా బాగా నచ్చింది. అనుపమ పాత్రే 'ఈగల్' సినిమాను నడిపిస్తుంది. కావ్య లవ్లీ క్యారెక్టర్ చేశారు. మా దర్శకుడు కార్తీక్‌కు చాలా స్పష్టత ఉంది. సినిమాను ఎక్స్‌ట్రార్డినరీగా తీశాడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నాకు హోమ్ ప్రొడక్షన్ లాంటిది. ఈ బేనర్‌లో ఎన్ని సినిమాలు చేయడానికైనా సిద్ధమే. నవదీప్‌కు ఈ సినిమాతో నటుడిగా మంచి పేరు వస్తుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ఈగల్ స్టైలిష్ మాస్ యాక్షన్ ఎంటర్టైనర్. క్లైమాక్స్ అద్భుతంగా ఉంటుంది. నాకు అవకాశం ఇచ్చిన రవితేజకు ధన్యవాదాలు. ఇందులో నటీనటుల కాంబినేషన్ కూడా కొత్తగా ప్రయత్నించాం' అన్నారు. విశ్వప్రసాద్ మాట్లాడుతూ 'కార్తీక్‌తో మరో సినిమా చేస్తున్నాం. మంచి సందేశం ఉన్న చిత్రమిది' అన్నారు. అనుపమా పరమేశ్వరన్ మాట్లాడుతూ 'పీపుల్ మీడియా ఫ్యాక్టరీలో నాకు ఇది రెండో చిత్రం. 'ఈగల్‌'లో నాకు అద్భుతమైన పాత్ర ఇచ్చారు. తప్పకుండా ఈ సినిమా బ్లాక్‌బస్టర్ అవుతుంది. రవితేజతో మరిన్ని సినిమాల్లో నటించాలనుంది' అని చెప్పారు. సరికొత్త ప్రేమకథా చిత్రంలో భాగమైనందుకు ఆనందంగా ఉందని కావ్యాథాపర్ తెలిపారు. రవితేజ అన్నయ్యతో పనిచేయడం ఆనందాన్నిచ్చిందని నవదీప్ తెలిపారు.



పద్దెనిమిదేళ్ల తర్వాత మళ్లీ..

మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న తాజా చిత్రం 'విశ్వంభర' షూటింగ్ హైదరాబాద్‌లో జరుగుతోంది. ఈ మెగా ఫాంటసీ అడ్వెంచర్ కోసం 13 భారీ సెట్స్ వేశారు. వశిష్ట దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ సంస్థ అత్యంత భారీ వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తోంది. మెగాస్టార్ కెరీర్‌లోనే క్లాస్టీయస్ట్ ఫిల్మ్ ఇది. ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం రకరకాలు పేర్లు వినిపించాయి. అయితే మెగాస్టార్ సరసన నటించడం కోసం త్రిషను కథానాయికగా ఎంపిక చేశారు దర్శకనిర్మాతలు. 2006లో 'స్టాలిన్' చిత్రంలో చిరంజీవి సరసన త్రిష నటించారు. మళ్లీ పద్దెనిమిదేళ్ల అనంతరం ఆమె మెగాస్టార్‌తో కలసి నటిస్తున్నారు. సోమవారం సెట్‌లోకి అడుగుపెట్టిన త్రిష్‌కు చిరంజీవి, దర్శకుడు వశిష్ట, నిర్మాతలు స్వాగతం పలికారు. చాలా గ్రాండియర్‌గా, విజువల్ వండర్‌గా రూపుదిద్దుకుంటున్న 'విశ్వంభర' చిత్రానికి సంగీతం: కీరవాణి, ఛాయాగ్రహణం: చోటా కె నాయుడు, కాస్ట్యూమ్స్ డిజైనర్: సుస్మిత కొణిదెల.



పంతులమ్మ పోరాటం

జ్యోతిక ప్రధాన పాత్ర పోషించిన తమిళ చిత్రం 'రాక్షసి' తెలుగులో 'అమ్మ ఒడి'పేరుతో విడుదలవుతోంది. ఎస్ వై గౌతమ్‌రాజ్ దర్శకత్వంలో ఎస్ ఆర్ ప్రకాశ్, ఎస్ ఆర్ ప్రభు నిర్మించారు. నాగినీడు, హరీశ్ పేరడి, పూర్ణిమ భాగ్యరాజ్, సత్యన్ కీలకపాత్రలు పోషించారు. సోమవారం చిత్రబృందం 'అమ్మ ఒడి' ట్రైలర్‌ను విడుదల చేసింది. ఈ చిత్రంలో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చే బాధ్యతాయుతమైన టీచర్ పాత్రలో జ్యోతిక కనిపించారు. విద్యా వ్యవస్థను నాశనం చేసేవారి పాలిట ఆమె ఓ రాక్షసి అంటూ జ్యోతిక పాత్రను పరిచయం చేయడం సినిమాపై ఆసక్తిని పెంచింది. ఈ చిత్రాన్ని తెలుగులో విడుదల చేస్తున్న వడ్డి రామానుజం, వల్లెం శేషారెడ్డి మాట్లాడుతూ "అమ్మఒడి' చిత్రం తెలుగులోనూ హిట్ అవుతుందనే నమ్మకం ఉంది. విద్యావ్యవస్థ లోపాలను దర్శకుడు ఎత్తిచూపారు. త్వరలోనే రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తామ'న్నారు.



తండేల్ ప్రయాణం... కీలక ఘట్టం ముగిసింది

అక్కినేని నాగచైతన్య కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్'. సాయిపల్లవి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి చందు మొండేటి దర్శకుడు. గీతా ఆర్ట్స్ బేనర్‌పై బన్నీ వాస్ నిర్మిస్తున్నారు. శరవేగంగా చిత్రీకరణ సాగుతోంది. ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించేందుకు రియల్ లొకేషన్లలో షూటింగ్ చేస్తున్నారు. సుదీర్ఘ షెడ్యూల్‌ను యూనిట్ పూర్తి చేసింది. నాగచైతన్య, సాయిపల్లవి ఇతర తారాగణంపై కీలక సన్నివేశాలను యూనిట్ తెరకెక్కించింది. ఈ సందర్భంగా మేకర్స్ వర్కింగ్ స్టిల్స్‌ను విడుదల చేశారు. రాజు అనే మత్స్యకార యువకుడిగా నాగచైతన్య, అతని ప్రేయసి పాత్రలో సాయిపల్లవి కనిపించనున్నారు. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో నాగచైతన్య సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. దేవిశ్రీ ప్రసాద్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శ్యామ్‌దత్

మంచి దర్శకుడు దొరికితే మా తాత బయోపిక్

ఉపాసన

అపోలో హాస్పిటల్స్ వ్యవస్థాపకుడు డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి బయోగ్రఫీ ఆధారంగా సినిమాను తెరకెక్కించే విషయంపై ఆయన మనవరాలు, హీరో రామ్ చరణ్ సతీమణి ఉపాసన స్పందించారు. మంచి దర్శకుడు దొరికితే దాని గురించి ఆలోచన చేస్తామన్నారు. డాక్టర్ ప్రతాప్ సి.రెడ్డి 91వ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని 'ది అపోలో స్టోరీ ది అమర చిత్ర కథ' (కామిక్స్) పేరుతో ముద్రించిన పుస్తకాన్ని సోమవారం చెన్నైలో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రతాప్ సి రెడ్డితో పాటు ఆయన కుమార్తెలు సంగీతారెడ్డి, శోభనా కామినేని, సునీతారెడ్డి తదితరులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాసన విలేకరులతో మాట్లాడుతూ.. 'ది అపోలో స్టోరీ - అమర చిత్ర కథ' పుస్తకాన్ని రూపొందించడానికి హీరో రానా దగ్గుబాటి ఎంతగానో సహాయం చేశారు. హెల్త్ కేర్ గురించి యువతకు తెలియజెప్పాలన్న ఉద్దేశంలో ఈ పుస్తకాన్ని ముద్రించాం. మా తాత నాకు స్ఫూర్తి, ప్రేరణ. ఆయన నుంచి అనేక విషయాలు నేర్చుకున్నాను. ఆయన మా గ్రాండ్‌మా, నలుగురు కుమార్తెల జీవితాలను తీర్చిదిద్దారు. ఏదైనా సమస్య ఎదురైతే పురుషులతో సమానంగా ధీటుగా ఎదుర్కోవాలని తాత మాలో ధైర్యాన్ని నింపి, అలా మమ్మల్ని తయారు చేశారు' అన్నారు.



-చెన్నై (ఆంధ్రజ్యోతి)

కమర్షియల్ లవ్‌స్టోరీ



రుత్విక్ కొండకింది, విశాఖ ధిమాన్ హీరో హీరోయిన్లుగా తెరకెక్కుతున్న నూతన చిత్రం 'రాజా ది రాజా'. మణికాంత్ గెల్లి దర్శకత్వంలో చాణక్య అద్దంకి, నిహారికా రెడ్డి నిర్మిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం షూటింగ్ ప్రారంభమైంది. తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి, దర్శకులు రవిబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ కలగలిసిన లవ్ స్టోరీ ఇది. కమర్షియల్ హంగులతో రూపొందిస్తున్నాం' అన్నారు. నిర్మాత మాట్లాడుతూ 'ప్రకృతికి సంబంధించిన ఒక అంశం చుట్టూ అల్లుకున్న ఆసక్తికర కథతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాం. రెండు నెలల్లో షూటింగ్ పూర్తి చేస్తాం. జూన్‌లో విడుదల చేస్తామ'ని చెప్పారు. ఈ సినిమాలో తన పాత్ర ఎగ్జైటింగ్‌గా ఉంటుందని రుత్విక్ చెప్పారు.హీరోయిన్ అవ్వాలనే తన కల 'రాజా ది రాజా' చిత్రంతో తీరుతోందని విశాఖ ధిమాన్ తెలిపారు.



యూనిక్ కాన్సెప్ట్

టాలీవుడ్‌లో దాదాపు స్టార్ హీరోలందరితో పని చేసిన చైల్డ్ ఆర్టిస్ట్ దీపక్ సరోజ్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'సిద్దార్థ్ రాయ్' ఈ నెల 23న విడుదల కానుంది. హరీశ్‌శంకర్, వంశీ పైడిపల్లి వంటి దర్శకుల దగ్గర పనిచేసిన యశస్వీ ఈ సినిమాతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. యూనిక్ కాన్సెప్ట్‌తో, మంచి కంటెంట్‌తో రూపొందిన ఈ చిత్రంలో తన్వి నేగి కథానాయిక. ఇప్పటికే విడుదలైన సినిమా టీజర్, ట్రైలర్, పాటలు బాగా వైరల్ అయ్యాయనీ, సినిమా కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందనీ నిర్మాతలు జయ అడపాక, ప్రదీప్ పూడి, సుధాకర్ బోయిన చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: రథన్, ఫొటోగ్రఫీ: శ్యామ్ కె నాయుడు, ఎడిటింగ్: ప్రవీణ్ పూడి, సహ రచయితలు: అన్వర్ మహ్మద్, లుధీర్ బైరెడ్డి.

ప్రాణం గడ్డిపోస అనుకో..



బాబీ సింహా, వేదిక, అనన్య త్రిపాఠి, ప్రేమ, ఇంద్రజ, మకరంద్ దేశ్‌పాండే ముఖ్య పాత్రలు పోషించిన 'రజాకార్' చిత్రం త్వరలో విడుదల కానుంది. యాటా సత్యనారాయణ దర్శకత్వంలో గూడూరు నారాయణరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ సినిమా నుంచి 'ప్రాణం గడ్డిపోస అనుకో..' అనే పాటను విడుదల చేశారు. సుద్దాల అశోక్‌తేజ రాసిన ఈ పాటను శంకర్ మహదేవన్ పాడారు. భీమ్స్ సిసిరోలియో సంగీత దర్శకుడు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ 'మా సినిమాలోని ఎమోషన్‌ను అర్థం చేసుకుని సుద్దాల అద్భుతంగా పాట రాశారు. మన పూర్వీకులను గుర్తు చేసుకుంటూ నివాళులు అర్పిస్తూ తీస్తున్న సినిమా' అని చెప్పారు. 'రజాకార్లను ఉద్దేశించి మాత్రమే ఈ సినిమా తీశాం. త్వరలోనే విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చెప్పారు నిర్మాత.

మా నమ్మకాన్ని ప్రేక్షకులు నిజం చేశారు

సుహాస్



'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్ చిత్రంతో హిట్ కొడతాం అనుకున్నాం. అది నిజమైంది. నాకు హ్యాట్రిక్ విజయాన్ని అందించిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఈ సినిమాను ఇంకా పెద్ద హిట్ చేయాలని ప్రేక్షకులను కోరుతున్నాను' అని హీరో సుహాస్ అన్నారు. ఆయన కథానాయకుడిగా నటించిన 'అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్' చిత్రం ఇటీవలే విడుదలై చక్కటి ప్రేక్షకాదరణతో కొనసాగుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం సోమవారం సక్సెస్‌మీట్‌ను నిర్వహించింది. సుహాస్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో మిగిలిన పాత్రలకు కూడా సమాన పాధాన్యత ఉంది. అదే ఈ సినిమా స్క్రిప్ట్‌కు బలం. మా సినిమా కోసం పని చేసిన ప్రతి ఒక్కరి కృషి వల్లే ఈ సక్సెస్ వచ్చింది' అని చెప్పారు. నిర్మాత ధీరజ్ మొగిలినేని మాట్లాడుతూ 'అంబాజీపేట మ్యారేజి బ్యాండ్ నిజాయితీతో చేసిన ప్రయత్నం. సుహాస్ అయితే ఈ కథకు న్యాయం చేయగలడని నమ్మాం. ప్రేక్షకులు మా నమ్మకాన్ని నిజం చేశార'న్నారు. దర్శకుడు దుశ్యంత్ మాట్లాడుతూ 'గీతాఆర్ట్స్, బన్నీవాసు గారు ధైర్యం చేయడం వల్లే ఈ సినిమా తీయగలిగాం. ప్రేక్షకుల నుంచి వస్తున్న ఆదరణకు చాలా సంతోషంగా ఉందని చెప్పారు. దుష్యంత్ నన్ను హిట్ సినిమాతో హీరోయిన్‌గా పరిచయం చేశారని శివాని తెలిపారు.

రైతుల ఆవేదనకు అద్దం పట్టేలా



రాజధాని ఏర్పాటు కోసం తమ వ్యవసాయ భూములు త్యాగం చేసిన వేలాదిమంది రైతుల ఆవేదనకు అద్దం పడుతూ తెరకెక్కిన చిత్రం 'రాజధాని ఫైల్స్'. వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన ఈ చిత్రంలో వినోద్ కుమార్, వాణీ విశ్వనాథ్ కీలకపాత్రలు పోషించారు. అఖిలన్, వీణ జంటగా నటించారు. చిత్రబృందం సోమవారం ట్రైలర్‌ను విడుదల చేసింది. 'ఆరుకోట్ల జనాభా ఉన్న రాష్ట్రానికి నాలుగు రాజధానులా, ఇది రాజ్యాంగబద్ధమా, వ్యక్తిగత ద్వేషమా' అనే ప్రశ్నతో మొదలైన ట్రైలర్ ఆలోచన రేకెత్తించింది. 'మనం ఒక పాదయాత్ర చేయబోతున్నాం. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకూ...మహా పాదయాత్ర' అంటూ పలికిన సంభాషణలు సినిమాపై ఆసక్తిని పెంచాయి. ఈ చిత్రాన్ని తెలుగు వన్ ప్రొడక్షన్స్ బేనర్‌పై హిమబిందు సమర్పణలో కంఠంనేని రవిశంకర్ నిర్మించారు. భాను దర్శకుడు. సంగీతం: మణిశర్మ. సినిమాటోగ్రఫీ: రమేశ్

వ్యూహం సర్టిఫికెట్‌పై ఈనెల 9లోగా నిర్ణయం తీసుకోండి

సెన్సార్ బోర్డుకు హైకోర్టు ఆదేశాలు



రామ్‌గోపాల్ వర్మ దర్శకత్వంలో రూపొందిన 'వ్యూహం' సినిమాకు సెన్సార్ సర్టిఫికెట్ జారీచేసే అంశంపై మరోసారి నిర్ణయం తీసుకోవాలని.. ఇందుకోసం రివైజింగ్ కమిటీని మళ్లీ ఏర్పాటు చేయాలని హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. ఈ సినిమాకు సెన్సార్ బోర్డు జారీచేసిన సెన్సార్ సర్టిఫికెట్‌ను సింగిల్ జడ్జి రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ నిర్మాత దాసరి కిరణ్‌కుమార్, దర్శకుడు రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన అప్పీళ్లపై చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్ ధర్మాసనం సోమవారం తీర్పు వెలువరించింది. తాజాగా మళ్లీ నియామకమయ్యే రివైజింగ్ కమిటీ ఈ సినిమాను వీక్షించి.. ఈనెల 9లోగా సర్టిఫికెట్ జారీచేసే అంశంపై నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు సింగిల్ జడ్జి తీర్పుతో ఏకీభవించింది. ప్రజాస్వామ్య వ్యవస్థలో భావప్రకటనా స్వేచ్ఛ ప్రాథమిక హక్కు అని.. కానీ అది చట్టబద్ధమైన పర్యవేక్షణలో కొనసాగుతుందని వ్యాఖ్యానించింది. ఆర్టికల్ 19 కల్పించిన స్వేచ్ఛ ప్రకారం వాస్తవ ఘటనలను తమ తమ కోణాల్లో ప్రస్తావించుకునే ప్రాథమిక హక్కు అందరికీ ఉంటుందని తెలిపింది. రివైజింగ్ కమిటీని పునర్నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) చైర్మన్ చెప్పారని పేర్కొంది. ఒకవేళ ఇప్పటికీ ఏర్పాటు చేయకపోయినా రివైజింగ్ కమిటీని మళ్లీ ఏర్పాటు చేయాలని తాము ఆదేశాలు జారీచేస్తున్నామని స్పష్టం చేసింది. ఆ కమిటీ సినిమాను వీక్షించి.. ఈనెల 9లోగా నిర్ణయం తీసుకోవాలని.. ఆ నిర్ణయాన్ని అప్పీలుదారులకు తెలియజేయాలని పేర్కొంది. ఈ మేరకు పిటిషన్‌లలో విచారణను ముగించింది. తొలుత ఈ సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వడానికి సెన్సార్ బోర్డు ఎగ్జామినేషన్ కమిటీ తిరస్కరించింది. ఆ తర్వాత ఏర్పాటైన రివైజింగ్ కమిటీ పలు సవరణలు సూచిస్తూ సర్టిఫికెట్ జారీచేసింది. ఒకసారి తిరస్కరించిన తర్వాత మళ్లీ సర్టిఫికెట్ ఇవ్వడంపై టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ సినిమా ప్రతిపక్ష నాయకులను కించపర్చేలా.. కోర్టు ధిక్కారణకు దారితీసేలా ఉందని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి ధర్మాసనం.. సదరు సినిమాకు జారీచేసిన సెన్సార్ సర్టిఫికెట్‌ను కొట్టేస్తూ.. చట్టప్రకారం మూడువారాల్లో మళ్లీ నిర్ణయం తీసుకోవాలని ఆదేశాలు జారీచేసింది. సింగిల్ జడ్జి ఆర్డర్‌పై దర్శక నిర్మాతలు డివిజన్ బెంచ్‌లో అప్పీళ్లు దాఖలు చేశారు. వీటిపై విచారణ చేపట్టిన డివిజన్ బెంచ్.. ఈనెల 1న తీర్పు రిజర్వు చేసి.. సోమవారం తుది తీర్పు వెలువరించింది.



విందు భోజనం లాంటి సినిమా

సాయిరోనక్, గనవి లక్ష్మణ్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'లగ్గం'. 'భీమదేవరపల్లి బ్రాంచి' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు తెచ్చుకున్న రమేశ్ చెప్పాల ఈ సినిమాకు దర్శకుడు. రాజేంద్రప్రసాద్ కీలకపాత్ర పోషిస్తున్నారు. సోమవారం ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ "లగ్గం' విందు భోజనం లాంటి సినిమా. ప్రేక్షకులు ఎప్పటికీ మర్చిపోలేని విధంగా నా పాత్ర ఉంటుంది. నా కెరీర్‌లో 'పెళ్లి పుస్తకం' తర్వాత అంత గొప్ప పాత్ర ఈ సినిమాలో చేస్తున్నాను. తెలుగు వారందరికీ ఈ కథ నచ్చుతుంది' అన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'పెళ్లి అంటే రెండు కుటుంబాల కలయిక మాత్రమే కాదు రెండు మనసుల కలయిక అని చెప్పే చిత్రమిది. గట్టి దావత్ ఇవ్వబోతున్నాం' అన్నారు. 'వినోదంతో పాటు భావోద్వేగాల సమాహారంగా ఈ చిత్రం ఉండబోతోంది, తెలంగాణలో వివాహ సంస్కృతిని కళ్లకు కడుతుంది' అని సాయిరోనక్ చెప్పారు. ఈ చిత్రానికి చరణ్ అర్జున్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: బాల్‌రెడ్డి

మ్యూజిక్ షాప్ మూర్తి కథ



విలన్ పాత్రలతోనే కాదు కామెడీ రోల్స్‌తో కూడా ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న నటుడు అజయ్ ఘోష్. ఆయన కీలక పాత్రధారిగా 'మ్యూజిక్ షాప్ మూర్తి' చిత్రం తయారవుతోంది. చాందినీ చౌదరి ప్రధాన పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి శివ పాలడుగు దర్శకుడు. హర్ష గారపాటి నిర్మాత. షూటింగ్ పార్ట్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ పోస్టర్‌ను సోమవారం విడుదల చేశారు. ఇందులో అజయ్ ఘోష్ డిఫరెంట్ లుక్‌లో కనిపిస్తున్నారు. ఆయన పాత్ర వినోదభరితంగా ఉంటుందని పోస్టర్ చూస్తే అర్థమవుతుంది. చాందినీ చౌదరి పాత్రకు, అజయ్ ఘోష్ పాత్ర ఉండే సంబంధం ఏమిటి, అసలు వీరిద్దరి కథ ఏమిటనేది ఆసక్తికరం అని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: పవన్, ఛాయాగ్రహణం: శ్రీనివాస్ బెజుగమ్, ఎడిటింగ్: బొంతల నాగేశ్వరరెడ్డి.

విశాఖలో విజయభేరి

రెండో టెస్టులో 106 రన్స్‌తో భారత్ భారీ గెలుపు

- ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్ 292 ఆలౌట్
- బుమ్రా, అశ్విన్ విజృంభణ


అశ్విన్


స్కోరుబోర్డు

టెస్టుల్లో ఇంగ్లండ్‌పై ఎక్కువ వికెట్లు (97) తీసిన భారత బౌలర్‌గా అశ్విన్. **1**

టెస్టుల్లో తన రెండో ఉత్తమ గణాంకాలు (9/91) నమోదు చేసిన బుమ్రా. అలాగే భారత్ నుంచి మాజీ పేసర్ చేతన్ శర్మ (10 వికెట్లు) తర్వాత ఇంగ్లండ్‌పై ఇదే బెస్ట్ షో. **2**

భారత్‌లో నాలుగో ఇన్నింగ్స్‌లో రెండో అత్యధిక స్కోరు (292) చేసిన జట్టుగా ఇంగ్లండ్. శ్రీలంక (299/5) టాప్‌లో ఉంది. **1**

1996లో సచిన్, గంగూలీ తర్వాత 25 ఏళ్లలోపున్న ఇద్దరు భారత బ్యాటర్లు (జైస్వాల్, గిల్) ఒకే టెస్టులో సెంచరీలు చేయడం ఇదే తొలిసారి.

యువ ఆటగాళ్లు భేష్

'ఇంగ్లండ్‌లాంటి పటిష్ట జట్టుపై యువ ఆటగాళ్లు చూపిన ప్రతిభ అమోఘం. వారిని చూస్తే గర్వంగా ఉంది. అయితే తమ స్కోర్లను భారీగా మల్చుకోలేకపోయారు. టెస్టులకు కొత్త కావడంతో అనుభవం ద్వారా ఆ లోటును భర్తీ చేస్తారని భావిస్తున్నాం. వారిలో ఆత్మవిశ్వాసాన్ని కలిగిస్తూనే, ఒత్తిడి లేకుండా స్వేచ్ఛగా ఆడనీయడం ముఖ్యం. బుమ్రా ఓ చాంపియన్ ప్లేయర్.
- రోహిత్

గిల్ ఓకే..


రెండో రోజు ఆటలో ఫీల్డింగ్ చేసేటప్పుడు గిల్ కుడిచేతి చూపుడు వేలికి గాయమైంది. దీంతో అతను సోమవారం పెవిలియన్‌కే పరిమితమయ్యాడు. అలాగే గిల్‌కు చేసిన స్కానింగ్‌లో పెద్దగా ఆందోళనపడాల్సిన అవసరం లేదని, మరికొద్ది రోజుల్లో అతను పూర్తిగా కోలుకోనున్నట్టు తేలింది.

అబుధాబికి ఇంగ్లండ్ జట్టు

భారత్‌తో రాజ్‌కోట్‌లో జరిగే మూడో టెస్ట్‌కు పది రోజులు సమయం ఉండడంతో..ఇంగ్లండ్ జట్టు అబుదాబి వెళ్లనుంది. భారత్ పర్యటనకు ముందు ఆ జట్టు అక్కడే శిబిరంలో పాల్గొంది. ఈనెల 15న మూడో టెస్టు మొదలవనుండడంతో..అప్పటివరకు అబుదాబి వెళ్లి స్వోక్స్ సేన విశ్రాంతి తీసుకోనుంది.

సంచలనమేమీ లేదు.. ఇంగ్లండ్ బజ్‌బాల్ గేమ్‌కు భారత బౌలర్లు సమర్థవంతంగా చెక్ పెట్టారు. ఆటకు ఇంకా రెండు రోజుల సమయం ఉండగా, 399 పరుగుల లక్ష్యాన్ని స్టోక్స్ సేన దూకుడుగా ఛేదిస్తుందేమోనని అనుకున్నా.. పేసర్ బుమ్రా, స్పిన్నర్ అశ్విన్ వారి ఆటలను సాగనివ్వలేదు. ఛేదన ఎంతైనా 60-70 ఓవర్లలోనే ముగిస్తామని ప్రగల్భాలు పలికిన పర్యాటక జట్టును రెండు సెషన్లలోపే భారత్ ప్యాకప్ చేసేసింది. ఫలితంగా.. ఐదు టెస్టుల సిరీస్‌ను టీమిండియా ప్రస్తుతానికి 1-1తో సమం చేసింది.

విశాఖపట్నం (స్పోర్ట్స్): ఇంగ్లండ్ చేతిలో ఎదురైన తొలి టెస్టు పరాజయానికి భారత జట్టు గట్టిగానే బదులిచ్చింది. తమపై పెట్టుకున్న అంచనాలను నిజం చేస్తూ బౌలర్లు సమష్టిగా రాణించారు. తద్వారా ఆటకు నాలుగోరోజైన సోమవారమే ముగిసిన రెండో టెస్టులో 106 పరుగుల తేడాతో భారత్ ఘనవిజయం సాధించింది. అటు తగిన సమయం ఉన్నప్పటికీ ఇంగ్లండ్ వేగంగా ఆడే ప్రయత్నంలో వికెట్లను చేజార్చుకుని మూల్యం చెల్లించుకుంది. 399 పరుగుల ఛేదనలో ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్‌లో 69.2 ఓవర్లలో 292 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్ క్రాలే (73), బెన్ ఫోక్స్ (36), హార్ట్‌లీ (36) మాత్రమే ఆకట్టుకున్నారు. బుమ్రా, అశ్విన్‌కు మూడేసి వికెట్లు దక్కాయి. ఓవరాల్‌గా 9 వికెట్లతో రాణించిన బుమ్రాకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్ దక్కింది. ఈ ఫలితంతో ఐదు టెస్టుల సిరీ‌స్‌లో భారత్ 1-1తో నిలిచింది. మూడో టెస్టు ఈనెల 15 నుంచి రాజ్‌కోట్‌లో జరుగుతుంది.


మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ ట్రోఫీతో బుమ్రా

తొలి సెషన్‌లోనే ఖాయమైంది: ఓవర్‌నైట్ స్కోరు 67/1తో ఇంగ్లండ్ తొలి సెషన్‌ను ఆరంభించింది. మరో 332 పరుగులు కావాల్సిన వేళ.. భారత బౌలర్లపై ఎదురుదాడికి దిగిన ఇంగ్లండ్ బ్యాటర్లు సెషన్ ముగిసేసరికి 127 పరుగులు జత చేశారు. కానీ ఈ క్రమంలో ఏకంగా ఐదు వికెట్లు కోల్పోవడంతో మ్యాచ్ ఫలితం ఎలా ఉండబోతోందో అవగతమైంది. స్పిన్ త్రయం కుల్దీప్, అశ్విన్, అక్షర్ మిడిలార్డర్‌ను ఇబ్బందిపెట్టారు. తొలి టెస్టులో స్పిన్‌ను రివర్స్ స్వీప్‌తో ఎదుర్కొన్న ప్రత్యర్థి వ్యూహం ఈసారి పనిచేయలేదు. అయితే క్రాలే మాత్రం దూకుడుగా వెళ్లాడు. ఆరంభంలో ఫోర్లతో ఆకట్టుకున్న రెహాన్ అహ్మద్ (23)ను తొలి గంటలోపే అక్షర్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 45 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు పోప్ (23) కూడా ఎక్కువ సేపు క్రీజులో నిలవలేకపోయాడు. అశ్విన్ ఓవర్‌లో స్లిప్‌లో అతడిచ్చిన క్యాచ్‌ను రోహిత్ మెరుపు వేగంతో అందుకున్నాడు. అశ్విన్ బౌలింగ్‌లోనే జో రూట్ (16) అనవసర షాట్‌కు వికెట్ చేజార్చుకున్నాడు. అయితే క్రాలేకు జతగా బెయిర్‌స్టో (26) క్రీజులో ఉండడంతో అప్పటికీ ఇంగ్లండ్ విజయంపై ఆశలు కోల్పోలేదు. కానీ అర్ధసెంచరీతో ఊపు మీదున్న క్రాలేను కుల్దీప్, బెయిర్‌స్టోను బుమ్రా వరుస ఓవర్లలో అవుట్ చేయడంతో ఇంగ్లండ్‌కు గట్టి దెబ్బ తగిలింది.

చివర్లో పోరాటం: రెండో సెషన్‌ను కెప్టెన్ స్టోక్స్ (11), ఫోక్స్ ఆరంభించడంతో అప్పటికీ ప్రమాదం లేకపోలేదనిపించింది. అత్యంత గడ్డు పరిస్థితిల్లోనూ ఒంటిచేత్తో మ్యాచ్‌లను గెలిపించిన అనుభవం స్టోక్స్‌కు ఉంది. కానీ, ఈసారి అతను చేజేతులా వికెట్‌ను సమర్పించుకుని భారత్‌ను సంబరాల్లో ముంచాడు. అశ్విన్ ఓవర్‌లో ఫోక్స్ సింగిల్ కోసం పరిగెత్తాడు. అటు నుంచి స్టోక్స్ కాస్త బద్ధకంగా కదలడంతో మిడ్ వికెట్‌లో బంతిని అందుకున్న శ్రేయాస్ మెరుపు వేగంతో వేసిన త్రోకు వికెట్లు నేలకూలాయి. అప్పటికి స్టోక్స్ బ్యాట్ వెంట్రుకవాసి తేడాతో క్రీజుకు దూరంగా ఉండడంతో రనౌట్ కాకతప్పలేదు. ఈ దశలో ఫోక్స్, హార్ట్‌లీ పోరాడారు. ఇద్దరూ స్పిన్నర్ల ఓవర్లలో చెరో సిక్సర్‌తో వేగం పెంచేందుకు చూశారు. అలాగే అడపాదడపా ఫోర్లతో ఆకట్టుకుంటూ ఎనిమిదో వికెట్‌కు 55 పరుగులు జోడించారు. ఫోక్స్‌ను రిటర్న్ క్యాచ్‌తో బుమ్రా అవుట్ చేయడంతో ఇంగ్లండ్ ఆశలు అడుగంటాయి. మరో ఐదు ఓవర్లలో చివరి రెండు వికెట్లు కూడా నేలకూలడంతో ఇంగ్లండ్ ఓటమి పాలైంది.

స్కోరుబోర్డు

భారత్ తొలి ఇన్నింగ్స్: 396; ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్: 253; భారత్ రెండో ఇన్నింగ్స్: 255

ఇంగ్లండ్ రెండో ఇన్నింగ్స్: క్రాలే (ఎల్బీ) కుల్దీప్ 73; డకెట్ (సి) భరత్ (బి) అశ్విన్ 28; రెహాన్ (ఎల్బీ) అక్షర్ 23; పోప్ (సి) రోహిత్ (బి) అశ్విన్ 23; రూట్ (సి) అక్షర్ (బి) అశ్విన్ 16; బెయిర్‌స్టో (ఎల్బీ) బుమ్రా 26; స్టోక్స్ (రనౌట్) 11; ఫోక్స్ (సి అండ్ బి) బుమ్రా 36; హార్ట్‌లీ (బి) బుమ్రా 36; బషీర్ (సి) భరత్ (బి) ముకేశ్ 0; అండర్సన్ (నాటౌట్) 5; **ఎక్స్‌ట్రాలు: 15; మొత్తం: 69.2 ఓవర్లలో 292 ఆలౌట్. వికెట్ల పతనం:** 1-50, 2-95, 3-132, 4-154, 5-194, 6-194, 7-220, 8-275, 9-281, 10-292. **బౌలింగ్:** బుమ్రా 17.2-4-46-3; ముకేశ్ 5-1-26-1; కుల్దీప్ 15-0-60-1; అశ్విన్ 18-2-72-3; అక్షర్ 14-1-75-1.

ప్రసాద్ జోడీకి ఇరాన్ టైటిల్

మిక్స్‌డ్ రన్నరప్‌గా సిక్కి జంట

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడా ప్రతినిధి): ఇరాన్ ఫజర్ ఇంటర్నేషనల్ చాలెంజ్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌లో తెలుగు షట్లర్లు సత్తా చాటారు. ఇరాన్‌లోని యాజ్డ్‌లో జరిగిన ఈ పోటీల్లో పురుషుల డబుల్స్‌లో కృష్ణ ప్రసాద్ గరగ-సాయి ప్రతీక్ ద్వయం విజేతగా నిలవగా, మిక్స్‌డ్‌లో సిక్కి-సుమిత్ రెడ్డి జంట రన్నరప్ టైటిల్‌తో సరిపెట్టుకుంది.

న్యూజెర్సీలో ఫిఫా కప్ ఫైనల్

2026 వరల్డ్‌కప్ షెడ్యూల్ విడుదల

న్యూయార్క్: 2026 ఫుట్‌బాల్ వరల్డ్‌కప్ ఫైనల్‌కు న్యూజెర్సీలోని మెట్‌లైఫ్ స్టేడియం వేదిక కానుంది. 20వ ప్రపంచకప్ జరిగే వేదికలు, మ్యాచ్‌ల షెడ్యూల్‌ను ఫిఫా విడుదల చేసింది. అమెరికా, మెక్సికో, కెనడా సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ టోర్నీ 2026 జూన్ 11 నుంచి జూలై 19 వరకు జరగనుంది. జూన్ 11న మెక్సికోలోని అజ్‌టెకా స్టేడియంలో ఆరంభ మ్యాచ్ జరగనుంది.

అండర్-19 వరల్డ్‌కప్ సెమీఫైనల్ నేడు

భారత్ X దక్షిణాఫ్రికా

మధ్యాహ్నం 1.30 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో

డబ్ల్యూటీసీలో రెండో స్థానానికి టీమిండియా

దుబాయ్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ) పట్టికలో భారత్ రెండో స్థానానికి చేరుకుంది. ఇంగ్లండ్‌తో జరిగిన రెండో టెస్టులో ఘనవిజయం సాధించడంతో టీమిండియా 4 స్థానాలు ఎగబాకింది. భారత్ 52.77 పాయింట్ల శాతంతో రెండోస్థానంలో ఉండగా, స్వల్ప తేడా(55.00)తో ఆస్ట్రేలియా టాప్‌లో కొనసాగుతోంది. ఇక, తొలి ఐదు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య 5 శాతం తేడానే ఉండడం విశేషం.

క్వార్టర్స్‌లో నిఖత్

లవ్లీనాపై అనర్హత వేటు

స్ట్రాంజా బాక్సింగ్

బల్గేరియా: స్ట్రాంజా ఇంటర్నేషనల్ బాక్సింగ్ టోర్నమెంట్‌లో తెలంగాణ స్టార్ బాక్సర్, డిఫెండింగ్ చాంపియన్ నిఖత్ జరీన్ క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. సోమవారం జరిగిన 50 కిలోల విభాగంలో నిఖత్ 3-2తో ఒయున్‌సెట్‌గ్ యెసుజెన్ (మంగోలియా)పై నెగ్గింది. ఇదే టోర్నీలో 75 కిలోల విభాగంలో పోటీపడ్డ టోక్యో ఒలింపిక్స్ కాంస్య పతక విజేత లవ్లీనా అనూహ్యంగా అనర్హత వేటుకు గురైంది. ఐర్లాండ్ బాక్సర్ రౌర్కీ అయోఫేతో జరిగిన ఆరంభ బౌట్‌లో మూడో రౌండ్‌లో ఇద్దరి మధ్య తీవ్రమైన పెనుగులాట జరగగా, మూడు హెచ్చరికల అనంతరం లవ్లీనాను రెఫరీ డిస్‌క్వాలిఫైగా ప్రకటించాడు.

రచిన్ 'డబుల్'

- కివీస్ తొలి ఇన్నింగ్స్ 511
- దక్షిణాఫ్రికా 80/4



మౌంట్‌మాంగనుయ్: రచిన్ రవీంద్ర (240) ద్విశతకంతో చెలరేగిన వేళ..దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు మొదటి ఇన్నింగ్స్‌లో న్యూజిలాండ్ భారీస్కోరు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 258/2తో సోమవారం ఆట కొనసాగించిన కివీస్ 511 పరుగులకు ఆలౌటైంది. కిందటి రోజు 112 పరుగులతో ఆడుతున్న కేన్ విలియమ్సన్ తన స్కోరుకు మరో 6 రన్స్ జోడించి అవుటవగా..118తో నాటౌట్‌గా ఉన్న రచిన్ దానిని 'డబుల్‌'గా మలచి 240 పరుగుల వద్ద నిష్క్రమించాడు. ఇక..తొలి ఇన్నింగ్స్‌లో దక్షిణాఫ్రికా రెండోరోజు ఆఖరికి 80/4 స్కోరుకే పరిమితమై తీవ్ర ఇక్కట్లలో పడింది. కివీస్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు సఫారీ జట్టు 431 రన్స్ వెనుకంజలో నిలిచింది.



ఖేలో ఇండియాలో తెలంగాణకు 3 పతకాలు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): లదాఖ్‌లో జరుగుతున్న ఖేలో ఇండియా వింటర్ గేమ్స్‌లో తెలంగాణకు మూడు పతకాలు లభించాయి. ఐస్ స్పీడ్ స్కేటింగ్ బాలికల అండర్-17 షార్ట్‌ట్రాక్ 300 మీటర్లు, 500 మీటర్ల విభాగాల్లో తాళ్లూరి నయనశ్రీ స్వర్ణాలు సాధించింది. బాలుర అండర్-17 షార్ట్ ట్రాక్ 500 మీటర్ల కేటగిరీలో నూరపనేని ప్రణవ్ మాధవ్ రజతం సాధించాడు.

అఫ్ఘాన్‌పై లంక విజయం

కొలంబో: అఫ్ఘానిస్థాన్‌తో ఏకైక టెస్టులో శ్రీలంక పది వికెట్లతో ఘన విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 199/1తో సోమవారం, నాలుగో రోజు రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన అఫ్ఘాన్ 296 పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్ జయసూర్య ఐదు వికెట్లతో ప్రత్యర్థిని వణికించాడు. ఇక.. 56 పరుగుల స్వల్ప లక్ష్యాన్ని వికెట్ కోల్పోకుండా లంక ఛేదించింది. తొలి ఇన్నింగ్స్‌లో అఫ్ఘాన్ 198, శ్రీలంక 439 పరుగులు చేశాయి.

బిజినెస్

లాభాల స్వీకారంతో నష్టాలు

ముంబై: స్టాక్‌మార్కెట్ సోమవారం నష్టాలతో ముగిసింది. ఆటుపోట్లతో సాగిన ట్రేడింగ్‌లో చివరి గంటలో లాభాల స్వీకరణ అమ్మకాలు హోరెత్తాయి. దీంతో సెన్సెక్స్ 354.21 పాయింట్ల నష్టంతో 71,731.42 వద్ద, నిఫ్టీ 82.10 పాయింట్ల నష్టంతో 21,771.70 వద్ద క్లోజయ్యాయి.

రూ.1,000 పైకి ఎల్ఐసీ షేరు: ఎల్ఐసీ షేర్లలో సోమవారం మంచి కదలిక కనిపించింది. బీఎస్ఈలో ఈ షేర్లు 5.90 శాతం లాభంతో రూ.1,000.35 వద్ద ముగిశాయి. దీంతో ఎల్ఐసీ మార్కెట్ క్యాప్ సోమవారం ఒక్కరోజే రూ.35,230.25 కోట్లు పెరిగి రూ.6,32,721.15 కోట్లకు చేరింది. ఇంట్రాడేలో ఒక దశలో ఎల్ఐసీ షేర్లు 8.81 శాతం లాభంతో రూ.1,027.95కు చేరి 52 వారాల గరిష్ఠ స్థాయిని తాకాయి. లిస్టింగ్ తర్వాత మదుపరులకు చుక్కలు చూపించిన ఎల్ఐసీ షేర్లు రూ.1,000 మార్క్‌ను అధిగమించడం ఇదే మొదటిసారి.


'హ్యుండయ్' నుంచి రూ.46,513 కోట్ల ఐపీఓ!: హ్యుండయ్ మోటార్ ఇండియా లిమిటెడ్ (హెచ్ఎంఐఎల్) భారీ ఐపీఓకు సిద్ధమవుతోంది. కంపెనీ ఈ ఏడాది చివర్లో 330 నుంచి 560 కోట్ల డాలర్ల (సుమారు రూ.27,409 కోట్ల నుంచి రూ.46,513 కోట్లు) సమీకరణ కోసం ఐపీఓకు వస్తుందని సమాచారం. ఇదే జరిగితే భారత ఐపీఓ మార్కెట్‌లో ఇదే అతి పెద్ద ఐపీఓ అవుతుంది. అయితే ఈ వార్తలపై హుండయ్ మోటార్ ఇండియా అధికారికంగా నోరు మెదపడం లేదు.

కీయస్ స్మార్ట్ హోమ్‌కు రూ.100 కోట్ల ఫండింగ్

హైదరాబాద్: నగరానికి చెందిన స్మార్ట్ హోమ్ ఆటోమేషన్ స్టార్టప్ కీయస్ స్మార్ట్ హోమ్‌కు రూ.100 కోట్ల ఫండింగ్ లభించింది. ప్రైవేట్ ఈక్విటీ సంస్థ ఓపీకేఎస్ అసెట్ మేనేజ్‌మెంట్ సహా ఇతరుల నుంచి ఈ నిధులను సమీకరించింది. ఢిల్లీ-ఎన్‌సీఆర్, బెంగళూరు, పుణె, ముంబై వంటి ప్రధాన నగరాల్లో ఎక్స్‌పీరియెన్స్ సెంటర్ల ఏర్పాటుతో పాటు హైదరాబాద్ మార్కెట్లో అగ్రగామి స్మార్ట్ హోమ్ ఆటోమేషన్ ప్లేయర్‌గా ఎదిగేందుకు, ప్రథమ, ద్వితీయ శ్రేణి నగరాల్లోకి విస్తరించేందుకు ఈ నిధులను వినియోగించనున్నట్లు కంపెనీ తెలిపింది.

అంబానీ చేతికి పేటీఎం వాలెట్!





రేసులో హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సైతం..

న్యూఢిల్లీ: పేటీఎం మాతృసంస్థ వన్97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ తన వాలెట్ బిజినెస్‌ను విక్రయించేందుకు ముకేశ్ అంబానీకి చెందిన జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌తో పాటు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌తో చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. పేటీఎం వాలెట్ సేవలు.. ఆర్‌బీఐ నిషేధం విధించిన పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ పరిధిలోకే వస్తాయి. పేటీఎం మేనేజ్‌మెంట్ గత నవంబరు నుంచే జియో ఫైనాన్షియల్‌తో చర్చలు జరుపుతున్నదని, హెచ్‌డీఎఫ్‌సీతో చర్చలు ఆర్‌బీఐ నిషేధానికి కొన్ని రోజుల ముందే ప్రారంభించినట్లు సమాచారం. కాగా, అంబానీకి చెందిన ఈ నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ (ఎన్‌బీఎఫ్‌సీ).. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్‌ను మొత్తంగా కొనుగోలు చేసేందుకు ఆసక్తిగా ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు పేర్కొన్నాయి. హెచ్‌డీఎఫ్‌సీకి చెందిన డిజిటల్ వాలెట్ పేజాప్‌కు ఇప్పటికే 1.4 కోట్ల మంది కస్టమర్లున్నారు. పేటీఎం వాలెట్‌ను దక్కించుకోగలిగితే ఈ సెగ్మెంట్లో అగ్రగామి కంపెనీ కాగలదు. ప్రస్తుతానికి ఈ సేవల్లో అంతగా ప్రభావం చూపలేకపోయిన జియో ఫైనాన్షియల్స్‌కు పేటీఎంతో డీల్ బాగా కలిసిరావచ్చని ఇండస్ట్రీ వర్గాలన్నాయి.

ఫిబ్రవరి 29 తరువాత నుంచి పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ లిమిటెడ్ (పీపీబీఎల్) డిపాజిట్లు స్వీకరించకుండా గతవారం ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. కస్టమర్ల సేవింగ్, కరెంట్ అకౌంట్లతో పాటు ప్రీ-పెయిడ్ సాధనాలైన వాలెట్లు, నేషనల్ కామన్ మొబిలిటీ కార్డులు(ఎన్‌సీఎంసీ) ఫాస్టాగ్ అకౌంట్లలోకి డిపాజిట్లు లేదా టాప్-అప్‌లను స్వీకరించవద్దని బ్యాంక్‌ను ఆదేశించింది. అయితే, అకౌంట్లలోకి వడ్డీ, కాష్‌బ్యాక్ లేదా రిఫండ్ సొమ్మును మాత్రం జమచేయవచ్చని స్పష్టం చేసింది. అంతేకాదు, కస్టమర్లు తమ అకౌంట్‌లో ఉన్న నగదును ఉన్నంతవరకు వినియోగించుకునేందుకు, ఉపసంహరించుకునేందుకూ ఎలాంటి ఆంక్షలుండవని తెలిపింది. ఇవి తప్ప మార్చి 1 నుంచి ఐఎంపీఎస్, ఏఈపీఎస్ వంటి నగదు బదిలీ లావాదేవీలు, భారత్ బిల్ పేమెంట్ లావాదేవీలు, యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) సేవలను అందించడానికి వీల్లేదని పీపీబీఎల్‌ను ఆదేశించింది. దీంతో ఈ నెలాఖరు నుంచి పీపీబీఎల్ సేవలు దాదాపుగా నిలిచిపోనున్నాయి. 2022 మార్చిలోనే పీపీబీఎల్ కొత్త కస్టమర్లను చేర్చుకోకుండా ఆర్‌బీఐ ఆంక్షలు విధించింది. పీపీబీఎల్ లైసెన్సును వచ్చే నెలలో రద్దు చేసే దిశగా ఆర్‌బీఐ యోచిస్తున్నదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. తొలుత డిపాజిటర్ల సొమ్ముకు రక్షణ కల్పించాక బ్యాంక్‌పై వేటు వేయవచ్చన్నారు. కాగా, పీపీబీఎల్‌లో మనీలాండరింగ్ జరిగినట్లు ఆర్‌బీఐ గుర్తిస్తే, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) దర్యాప్తు చేస్తుందని రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా అన్నారు.

పేటీఎం షేరు మరో 10 శాతం డౌన్

పేటీఎం బ్రాండ్ యాజమాన్య సంస్థ వన్ 97 కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేరు వరుసగా మూడో రోజూ లోయర్ సర్క్యూట్‌ను తాకింది. సోమవారం బీఎస్ఈలో ఈ షేరు ధర మరో 10 శాతం క్షీణించి రూ.438.35 వద్దకు పతనమైంది. గత మూడు ట్రేడింగ్ సెషన్లలో ఈ షేరు 42 శాతం క్షీణించింది. ఫలితంగా కంపెనీ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) రూ.20,471.25 కోట్లు తగ్గి రూ.27,838 కోట్ల స్థాయికి జారుకుంది.

పీపీబీఎల్ కస్టమర్లకు ప్రత్యామ్నాయాలు..

ఆర్‌బీఐ నిషేధం నేపథ్యంలో పీపీబీఎల్ కస్టమర్లు తమ ఖాతాలోని సొమ్మును యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), ఇమ్మీడియేట్ పేమెంట్ సర్వీస్ (ఐఎంపీఎస్), రియల్ టైం గ్రాస్ సెటిల్‌మెంట్ (ఆర్‌టీజీఎస్) ద్వారా ఇతర అకౌంట్లోకి బదిలీ చేసుకోవచ్చు. కానీ, మీ పీపీబీఎల్ అకౌంట్లోకి మాత్రం మార్చి ఒకటి నుంచి సొమ్ము జమ చేయలేరు. పేటీఎం వాలెట్‌లోని సొమ్మును కూడా ఇతర అకౌంట్లోకి ట్రాన్స్‌ఫర్ చేసుకోవచ్చు. అయితే, పేటీఎం వాలెట్‌పై ఒక లావాదేవీ ద్వారా గరిష్ఠంగా రూ.25,000, రోజుకు గరిష్ఠంగా రూ.లక్ష బదిలీ చేసుకోగలుగుతారు. అయితే, ఇందుకు 3 శాతం లావాదేవీ రుసుము చెల్లించాల్సి ఉంటుంది. ఉదాహరణకు రూ.25,000 బదిలీకి రూ.750 రుసుము చెల్లించాలి. పీపీబీఎల్ వాలెట్, ఫాస్టాగ్, ఎన్‌సీఎంసీ సేవలను ఇతర బ్యాంక్‌లకు బదిలీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు బ్యాంక్ ఇప్పటికే వెల్లడించింది.

పీపీబీఎల్‌కు ప్రత్యామ్నాయంగా ఇతర సంస్థల వాలెట్, ఫాస్టాగ్ సేవలకు మారవచ్చు. దేశంలో 20కి పైగా బ్యాంకింగ్, ఎన్‌బీఎఫ్‌సీలు వాలెట్ సేవలందిస్తున్నాయి. మొబీక్విక్, ఫోన్‌పే, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, అమెజాన్ పే అందులో కొన్ని. అలాగే, ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, ఐడీఎఫ్‌సీ, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్ వంటి 37 ప్రభుత్వ, ప్రైవేట్ రంగ బ్యాంక్‌లు ఫాస్టాగ్ సేవలందిస్తున్నాయి. కస్టమర్లు తమ ఫాస్టాగ్‌ను మొబైల్ బ్యాంకింగ్, ఆన్‌లైన్ బ్యాంకింగ్ లేదా గూగుల్ పే, ఫోన్‌పే వంటి థర్డ్ పార్టీ యాప్‌ల ద్వారా ఆన్‌లైన్‌లో రీచార్జ్ చేసుకునే వీలుంటుంది.

ఆర్‌బీఐ ఆదేశాలతో తమ రుణ, బీమా పంపిణీ, ఈక్విటీ బ్రోకింగ్ వ్యాపారాలకు పీపీబీఎల్‌తో సంబంధం లేదు కాబట్టి వాటిపై ఎలాంటి ప్రభావం ఉండదని పేటీఎం ఇప్పటికే స్పష్టం చేసింది. అంతేకాదు, కంపెనీకి చెందిన ఆఫ్‌లైన్ మర్చంట్ పేమెంట్ నెట్‌వర్కింగ్ సేవలైన పేటీఎం క్యూఆర్, పేటీఎం సౌండ్‌బాక్స్, పేటీఎం కార్డ్ మెషీన్ యథాతథంగా కొనసాగనున్నాయి. ఈ సేవల్లో కొత్త కస్టమర్లను చేర్చుకునేందుకు ఎలాంటి ఆంక్షల్లేవని పేటీఎం వెల్లడించింది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	63,220 ▼	57,950 ▼	76,700 ▼
ముంబై	62,510 ▼	57,260 ▼	70,420 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



5వ తేదీ		విజయవాడ	543
హైదరాబాద్	540	విశాఖపట్నం	555
6వ తేదీ		వరంగల్	542
చిత్తూరు	583		
గోదావరి	543	డజను గుడ్లు రూ.72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	111	గోదావరి	113
వరంగల్	111	విజయవాడ	113
కరీంనగర్	111	గుంటూరు	117
మహబూబ్‌నగర్	111	ఒంగోలు	117
కర్నూలు	111	చిత్తూరు	123
విశాఖపట్నం	107		

ఎల్ఐసీ కొత్త ప్లాన్ ఇండెక్స్ ప్లస్

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఇండెక్స్ ప్లస్ పేరిట వ్యక్తిగత జీవిత బీమా ప్లాన్‌ను విడుదల చేసింది. ఇది యూనిట్ లింక్డ్, రెగ్యులర్ ప్రీమియం పాలసీ. ఇది అమలులో ఉన్న కాలం అంతా జీవితబీమా కవరేజితో పాటుగా పొదుపు అవకాశం కూడా కల్పించే పాలసీ అని ఎల్ఐసీ ఒక ప్రకటనలో తెలిపింది. నిర్దిష్ట గడువు ముగిసిన అనంతరం వార్షికంగా చెల్లించే ప్రీమియంలో కొంత శాతాన్ని గ్యారంటీ జోడింపుగా యూనిట్ ఫండ్‌కు జమ చేస్తారు. ఈ సొమ్మును యూనిట్లు కొనుగోలు చేసేందుకు వినియోగించవచ్చు. ఐదు సంవత్సరాల లాకిన్ గడువు ముగిసిన అనంతరం ఆ యూనిట్లను పాక్షికంగా ఉపసంహరించుకునే అవకాశం కూడా కల్పిస్తారు.

ప్లాన్ ముఖ్యాంశాలు...

- ప్లాన్‌లో చేరేందుకు కనీస వయసు 90 రోజులు. గరిష్ఠ వయో పరిమితి హామీ మొత్తం ఆధారంగా 50 లేదా 60 సంవత్సరాలు.
- కనీస హామీ మొత్తం వార్షిక ప్రీమియంకు 7 నుంచి 10 రెట్లు.
- మెచ్యూరిటీకి కనీస వయసు 18 సంవత్సరాలు కాగా గరిష్ఠ వయసు 75 లేదా 85 సంవత్సరాలు.
- కనీస కాలపరిమితి 10 లేదా 15 సంవత్సరాలు.
- కనీస ప్రీమియం రూ.30000 (ఏడాదికి), రూ.15000 (అర్ధసంవత్సరానికి), రూ.7500 (త్రైమాసికానికి), రూ.2500 (నెలవారీగా)
- ఎన్ఎస్ఈ 100 ఇండెక్స్ లేదా ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 ఇండెక్స్‌లలోని ఎంపిక చేసిన షేర్లలో పెట్టుబడులు పెట్టే ఫ్లెక్సీ గ్రోత్ ఫండ్ లేదా ఫెక్సీ స్మార్ట్ గ్రోత్ ఫండ్‌లో ఏదైనా ఎంచుకునే అవకాశం
- మెచ్యూరిటీ సమయానికి పాలసీదారుడు జీవించి ఉన్నట్టయితే యూనిట్ ఫండ్ విలువతో సమానమైన మొత్తం చెల్లిస్తారు.

యూనియన్ బ్యాంక్‌కు పీసీఐ పిన్ సర్టిఫికేషన్



హైదరాబాద్: ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా పేమెంట్ కార్డు పరిశ్రమ పిన్ లావాదేవీ భద్రత (పీసీఐ పిన్) సర్టిఫికేషన్‌ను సాధించింది. బ్యాంక్ వ్యవస్థల ద్వారా నిర్వహించే అన్ని రకాల లావాదేవీల గోప్యత, సమగ్రత సంరక్షణ విషయంలో పరిశ్రమ అగ్రశ్రేణి ప్రమాణాలకు దీటుగా పటిష్ఠమైన భద్రత కల్పిస్తున్నందుకు ఇది గుర్తింపు అని బ్యాంక్ తెలిపింది. రోజురోజుకీ పెరుగుతున్న పలు ముప్పులను నిరోధించేందుకు నిరంతరాయంగా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టడం ద్వారా కస్టమర్ల విశ్వాసం పొందడం బ్యాంకు లక్ష్యమని పేర్కొంది.

అరబిందో అనుబంధ సంస్థ విక్రయం

హైదరాబాద్: నష్టాల్లో ఉన్న అమెరికాలోని తన అనుబంధ కంపెనీ 'యుజియా యూఎస్ మాన్యుఫ్యాక్చరింగ్ ఎల్ఎల్‌సీ'ని అరబిందో ఫార్మా విక్రయించింది. ఈ కంపెనీ వ్యాపార ఆస్తులు, అప్పులు, ఉద్యోగులతో కలిపి ఎంపవర్ క్లినిక్ సర్వీస్ న్యూజెర్సీ అనే కంపెనీకి 5.2 కోట్ల డాలర్లకు (సుమారు రూ.432 కోట్లు) విక్రయించింది. దీనికి తోడు 'యుజియా యూఎస్ మాన్యుఫ్యాక్చరింగ్ ఎల్ఎల్‌సీ, దాని అనుబంధ సంస్థల ఉత్పత్తి యూనిట్లను 20 సంవత్సరాల పాటు లీజుకు ఇవ్వడం ద్వారా మరో 5.8 కోట్ల డాలర్లు (సుమారు రూ.482 కోట్లు) అరబిందో ఫార్మాకు లభిస్తాయి.

ఎయిర్‌టెల్ లాభం రూ.2,442.2 కోట్లు

న్యూఢిల్లీ: భారతీ ఎయిర్‌టెల్ మూడో త్రైమాసికానికి మంచి ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. కంపెనీ ఈ కాలానికి రూ.37,899.5 కోట్ల ఆదాయంపై రూ.2,442.2 కోట్ల నికర లాభం ఆర్జించింది. 2022 డిసెంబరు త్రైమాసికంతో పోలిస్తే ఆదాయం 5.8 శాతం, నికర లాభం 54 శాతం పెరిగాయి.

చార్జీల దరువు తప్పదు: ఒక్కో ఖాతాదారుడి నుంచి లభించే సగటు ఆదాయం (ఏఆర్‌పీయూ) 7.7 శాతం పెరిగి రూ.208కి చేరింది. అయితే ఇది ఏ మాత్రం గిట్టుబాటు కాదని, చార్జీలు మరింత పెంచక తప్పదని కంపెనీ ఎండీ గోపాల్ విఠల్ ఈ సందర్భంగా చెప్పారు.

కేసీఆర్, జగన్ కలిసి.. రాష్ట్రాన్ని సర్వ నాశనం చేశారు

» కేసీఆర్ నల్లగొండకు వస్తే జనం తరిమేస్తారు: కోమటిరెడ్డి



నల్లగొండ, ఫిబ్రవరి 5: మాజీ సీఎం కేసీఆర్, ఏపీ సీఎం జగన్ కుమ్మక్కై తెలంగాణను సర్వనాశనం చేశారని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించారని చెప్పడానికి కేసీఆర్‌కు సిగ్గుండాలని మండిపడ్డారు. తాము వచ్చి రెండు నెలలు కాలేదని, ప్రాజెక్టులు అప్పగించేందుకు ఎవరితో కుమ్మక్కయ్యామో చెప్పాలని డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండలో కోమటిరెడ్డి మాట్లాడారు. కేసీఆర్ హయాంలోనే ప్రాజెక్టులన్నీ కేఆర్ఎంబీకి అప్పగించారని తెలిపారు. కృష్ణా జలాల విషయంలో అప్పటి సీఎం కేసీఆర్ తెలంగాణకు 299 టీఎంసీలు, ఆంధ్రాకు 512 టీఎంసీలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారని, దీంతో మహబూబ్‌నగర్, నల్లగొండ, ఖమ్మం జిల్లాలు తీవ్రంగా నష్టపోయాయని వెల్లడించారు. ప్రస్తుతం శ్రీశైలం, నాగార్జునసాగర్‌లో తాగునీరు లేని దుస్థితికి కేసీఆరే కారణమని ధ్వజమెత్తారు. కేసీఆర్ నల్లగొండకు వస్తే ప్రజలు తరిమి కొడతారని చెప్పారు. రిటైర్డ్ సీఎస్ సోమేశ్ కుమార్ ధరణిని అడ్డం పెట్టుకుని ఐదు వేల ఎకరాల భూ దందాకు పాల్పడ్డారని, వారం రోజుల్లో ఆయన బాగోతం బయటపెడతామన్నారు. మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి యాదాద్రి థర్మల్ పవర్ ప్రాజెక్టులో సబ్ కాంట్రాక్టర్‌గా మారి రూ.వందల కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. నాగారంలో రూ.50 కోట్లతో ఇల్లు, హైదరాబాద్ సమీపంలో ఫాంహౌస్ నిర్మించుకున్నారని, ఆయన ఆస్తులపై డ్రోన్ కెమెరాలతో రికార్డు చేయించి త్వరలో బండారం బయట పెడతామన్నారు.

కేంద్ర తీరుపై 8న నిరసనలు: తమ్మినేని

కేంద్రప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తోందని సీపీఎం నేత తమ్మినేని వీరభద్రం మండిపడ్డారు. కేంద్ర, రాష్ట్రాల మధ్య పన్నుల పంపిణీలో రాష్ట్ర వాటాలను 41 శాతానికి తగ్గించి రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర విధానాల వల్లే కేరళలో ఆర్థిక సంక్షోభం ఏర్పడిందని దుయ్యబట్టారు. అలాగే ప్రతిపక్ష నేతలపై ఈడీ, సీబీఐ, ఆదాయ పన్ను విభాగాలను ప్రయోగించి వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రప్రభుత్వం అనుసరిస్తున్న వివక్షాపూరిత విధానాలను వ్యతిరేకిస్తూ సీపీఎం కేంద్ర కమిటీ పిలుపు మేరకు ఈ నెల 8న నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించండి

» డిప్యూటీ సీఎం భట్టికి ఎమ్మెల్సీ కవిత లేఖ



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి):వచ్చే బడ్జెట్‌లో బీసీలకు రూ.20 వేల కోట్లు కేటాయించాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కోరారు. ఈ మేరకు భట్టికి సోమవారం ఆమె లేఖ రాశారు. బీసీల ఉద్ధరణ కోసం కాంగ్రెస్ పార్టీ తన మేనిఫెస్టోలో పలు హామీలు ఇచ్చిందని గుర్తు చేశారు. మహాత్మ జ్యోతిబా పూలే బీసీ సబ్ ప్లాన్ తెస్తామంటూ కాంగ్రెస్ హామీ ఇచ్చిందని తెలిపారు. అత్యంత వెనుకబడిన తరగతుల వారికి ఎంబీసీ శాఖను ఏర్పాటు చేయడంతో పాటు బీసీల సంక్షేమానికి రానున్న ఐదేళ్లలో లక్ష కోట్లు వెచ్చిస్తామంటూ ప్రకటించిందన్నారు.

ఆదిలాబాద్ జిల్లాకు నర్సారెడ్డి పేరు పెట్టాలి: వీహెచ్

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): పీసీసీ మాజీ చీఫ్ నర్సారెడ్డి పేరును ఆదిలాబాద్ జిల్లాకు పెట్టాలంటూ కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు ప్రతిపాదించారు. గాంధీభవన్‌లో సోమవారం జరిగిన నర్సారెడ్డి సంస్మరణ సభలో ఆయన ఈ సూచన చేశారు. దీనిపై సభలో పాల్గొన్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పందిస్తూ సీఎం రేవంత్‌రెడ్డితో మాట్లాడి తగిన కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మాజీ మంత్రి కె.జానారెడ్డి మాట్లాడుతూ ఆయన సొంత జిల్లా అయిన నిర్మల్‌కు నర్సారెడ్డి పేరు పెడితే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. టీపీసీసీ ఆధ్వర్యంలో జరిగిన ఈ సంస్మరణ సభలో కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు కోదండరెడ్డి, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్, టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు నిరంజన్, ఆదిలాబాద్, నిజామాబాద్ నియోజకవర్గాలకు చెందిన పలువురు నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా నర్సారెడ్డి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు.

బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా బాలమాయాదేవి

రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా బాలమాయాదేవి బాధ్యతలు చేపట్టారు. సంక్షేమ భవన్‌లోని కార్యాలయంలో ఆమె సోమవారం ఈ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు శాఖ జాయింట్ డైరక్టర్ చంద్రశేఖర్, బీసీ గురుకులాల సెక్రటరీ మల్లయ్య బట్టు, ఫైనాన్స్ మేనేజర్ ఝాన్సీ, డిప్యూటీ డైరక్టర్ సంధ్య, పలువురు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సచివాలయంలో బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరి బుర్రా వెంకటేశంను ఆమె మర్యాదరపూర్వకంగా కలిశారు.

నేడు మేడిగడ్డకు కర్ణాటక ఎమ్మెల్యేలు!

మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 5 : కర్ణాటక అసెంబ్లీ స్పీకర్‌తో పాటు 11మంది ఎమ్మెల్యేల బృందం నేడు మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనున్నట్లు తెలిసింది. ఈ మేరకు విశ్వసనీయవర్గాల ద్వారా సమాచారం అందింది. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. విచారణలో భాగంగానే మేడిగడ్డ బ్యారేజీతో పాటు కన్నెపల్లి పంప్‌హౌస్, మహదేవపూర్ ఇరిగేషన్ సబ్ డివిజన్ కార్యాలయాల్లోనూ ఇప్పటికే రెండు విడతలుగా విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ తనిఖీలు నిర్వహించింది. కాగా, విజిలెన్స్ ఇంకా ప్రభుత్వానికి నివేదిక అందించకముందే కర్ణాటక స్పీకర్, ఎమ్మెల్యేలు మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు రానుండడం చర్చనీయాంశంగా మారింది.జ

ఏపీ ఈసీలో దొంగలు పడ్డారు!

» ఐ-ప్యాక్‌తో సంబంధాలున్నవారి చొరబాటు

» కీలకమైన డేటా మొత్తం కాపీ చేసిన వైనం

అమరావతి, ఫిబ్రవరి5 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కార్యాలయంలో 'దొంగలు' పడ్డారు! అత్యంత విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. వైసీపీకి ఎన్నికల వ్యూహాలు రూపొందించే ఐ-ప్యాక్ టీమ్‌తో సంబంధాలున్న కొంత మంది ఏపీ సీఈవో ఆఫీసులో కీలక స్థానాల్లో ఉద్యోగాలు సంపాదించారు. వారి ద్వారా ఈసీ వద్ద ఉన్న డేటా మొత్తం వైసీపీ సేకరించినట్టు తెలుస్తోంది. గత ఏడాది అక్టోబరులో మహబూబ్‌నగర్‌కు చెందిన ఒక వ్యక్తి ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్‌గా ఈసీలోకి ప్రవేశించారు. ఆ తర్వాత మరొకరు కూడా చేరారు. వీరిద్దరికీ ఐ-ప్యాక్ టీమ్‌తో అత్యంత దగ్గర సంబంధాలున్నాయి. వారిద్దరూ తమకు సంబంధం లేని విభాగాల్లో కూర్చోవడం, అక్కడ ఏం జరుగుతుందో తెలుసుకోవడం వంటివి చేశారు. ఈసీలోని కీలక విభాగాల నుంచి డేటా మొత్తం సేకరించారు. వారిలో ఐటీ ప్రాజెక్టు మేనేజర్‌గా చేసిన వ్యక్తిని నమ్మిన ఉన్నతాధికారులు.. కీలక వ్యవహారాలన్నీ అతడికే అప్పగించారు. ఈఆర్వోలు, ఈఈఆర్వోల లాగిన్‌లతోపాటు.. ఈసీ డేటా మొత్తం సేకరించాక అతడు అకస్మాత్తుగా ఉద్యోగం మానేశాడు. నవంబరు, డిసెంబర్ నెలల్లో మాత్రమే ఈసీలో సదరు వ్యక్తి విధులు నిర్వహించాడు. ఈ రెండు నెలల వ్యవధిలోనే ఈసీ సర్వర్‌లో ఉన్న డేటా, హార్డ్‌డిస్క్‌ల్లో ఉన్న డేటా మొత్తం కాపీ చేసుకున్నాడు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ వ్యవహారం ఈసీలో చర్చనీయాంశంగా మారింది. కాగా.. 2021లో జరిగిన తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో దొంగ ఓట్ల వ్యవహారంపై దృష్టి పెట్టిన కేంద్ర ఎన్నికల సంఘం.. వెంటనే దర్యాప్తు రిపోర్టులు ఇవ్వాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారిని గట్టిగానే ఆదేశించింది. కానీ ఆ సమాచారమేదీ ఇప్పుడు కనిపించట్లేదని.. దాన్ని అప్పటి ఉన్నతాధికారులు మాయం చేశారని తెలుస్తోంది. దీనికి ఒక ఔట్‌సోర్సింగ్ ఉద్యోగి సహకరించినట్లు తెలుస్తోంది. సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగి ప్రభుత్వంలోని కీలకమైన ఉన్నతాధికారులతో టచ్‌లో ఉంటూ, తిరుపతి ఉప ఎన్నికల్లో అనేక అరాచకాలు చేశాడు. ఈ విషయాలు బయటకు వస్తాయన్న ఉద్దేశంతో ఈసీ ప్రధాన కార్యాలయంలోకి దూరి డేటా మొత్తం మాయం చేసినట్లు తెలుస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. 2021, 2022 ఏడాదికి సంబంధించిన డేటా ప్రస్తుతం కనిపించడం లేదు. దీంతో సీఈసీ అడిగిన సమాచారం ఏదీ ఈసీ ఇవ్వలేని పరిస్థితి. ఫలితంగా ఈసీ దొంగ ఓట్ల వ్యవహారంపై దర్యాప్తు టీమ్ నుంచి వచ్చిన రిపోర్టు మీదనే ఆధారపడాల్సిన పరిస్థితి ఉంది.

బాల్క సుమన్‌పై కేసు నమోదు

» సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ పోలీస్‌స్టేషన్లలో కాంగ్రెస్ ఫిర్యాదులు

» ఒళ్లు దగ్గర పెట్టుకొని మాట్లాడు: వివేక్

» స్థాయి మరిచి మాట్లాడుతున్నడు: సంపత్

» తన్ని తరిమే పరిస్థితి తెచ్చుకోవద్దు: అద్దంకి

» గుండు కొట్టి ఊరేగిస్తాం: దయాకర్ గౌడ్

దిల్‌సుఖ్‌నగర్/మంచిర్యాల/దండేపల్లి/హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదైంది. బాల్క సుమన్‌పై చర్యలు తీసుకోవాలంటూ కాంగ్రెస్ నాయకుడు పూదరి తిరుపతి నేతృత్వంలో సోమవారం రాత్రి మంచిర్యాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన పోలీసులు.. బాల్క సుమన్‌పై 294-బి, 504, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. మరోవైపు.. హైదరాబాద్‌లోని చైతన్యపురి పోలీస్ స్టేషన్‌లోనూ రెడ్డి సంఘం కన్వీనర్ బద్దూరి వెంకటేశ్వర్‌రెడ్డి ఆయనపై ఫిర్యాదు చేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న వ్యక్తిని కించపరిచే విధంగా వ్యాఖ్యానించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా, బాల్క సుమన్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు ఫైర్ అయ్యారు. సుమన్ సంస్కారం లేకుండా మాట్లాడారని ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ ధ్వజమెత్తారు. కేటీఆర్.. తన వెంట తిరిగే కుక్కను సీఎంపై ఉసిగొల్పాడని మండిపడ్డారు. బీఆర్ఎస్‌ను ప్రజలు ఇప్పటికే మడతపెట్టారన్నారు. ఓటమి మంచికేనంటూ కేటీఆర్ మాట్లాడుతున్నారని, ఆయనకు జీవితకాలం మంచే జరగాలని ఆ దేవుడిని కోరుకుంటున్నానన్నారు. బీఆర్ఎస్ నేతలు ఓటమి ఫ్రస్టేషన్‌లో మాట్లాడుతున్నారని, తన్ని తరిమేసే పరిస్థితి తెచ్చుకుంటున్నారని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి అద్దంకి దయాకర్ అన్నారు. ఇలాంటి చిల్లరగాళ్ల మాటలను పట్టించుకోవద్దని ప్రజలకు సూచించారు. కేటీఆర్ అండ్ టీమ్.. ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడాలని హెచ్చరించారు. బాల్క సుమన్ ఒళ్లు దగ్గర పెట్టుకుని మాట్లాడితే మంచిదని.. రేవంత్‌రెడ్డిపై మరోసారి అనుచిత వ్యాఖ్యలు చేస్తే గుండు కొట్టించి గాడిదపై ఊరేగిస్తామని టీపీసీసీ అధికార ప్రతినిధి చనగాని దయాకర్ హెచ్చరించారు. అమాయక విద్యార్థుల జీవితాలతో ఆడుకున్న నీచుడు బాల్క సుమన్ అంటూ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చారుగొండ వెంకటేష్ అన్నారు. తెలంగాణ ఉద్యమంలో శ్రీకాంతా చారి, వేణుగోపాల్‌రెడ్డి చావుకు ఆయనే కారణమన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పున్నా కైలాశ్ నేత మాట్లాడుతూ సీఎం రేవంత్‌కు బాల్క సుమన్ చెప్పు చూపిస్తే.. తెలంగాణ ప్రజలు ఆయన్ను బట్టలూడదీసి కొడతారన్నారు. కాగా, ముఖ్యమంత్రి రేవంత్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ ఒళ్లు దగ్గర పెట్టుకోవాలని చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ సూచించారు. దిగజారి మాట్లాడటం సరైందికాదని హితవు పలికారు. మంచిర్యాల జిల్లా దండేపల్లిలో బాల్క సుమన్ దిష్టిబొమ్మతో ర్యాలీ నిర్వహించి, దహనం చేశారు. అలాగే, చెన్నూరు పట్టణంలో మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు చెప్పుల దండ వేసి నిరసన తెలిపారు.

రేవంత్ ఝూటా సీఎం

(మొదటిపేజీ తరువాయి)

సమావేశంలో రాష్ట్ర అధికారులే చెప్పారు. అదే విషయాన్ని ఈఎన్‌సీ ప్రకటించారు. నెల రోజుల్లో ప్రాజెక్టులను అప్పగించాలని, సీఆర్పీఎఫ్ అనుమతితోనే ప్రాజెక్టుల వద్దకు ఇంజినీర్లు వెళ్లాలని, నిర్వహణ బాధ్యత రెండు రాష్ట్రాలదని పేర్కొంటూ ఆ తర్వాత కేంద్రం వెల్లడించిన మినిట్స్‌లోనూ ఉంది. దీనిపై 19న నేను ప్రెస్‌మీట్ పెట్టి ప్రశ్నించే వరకూ మంత్రులకు సోయి లేదు. ప్రాజెక్టులను అప్పగిస్తే రాష్ట్రానికి నష్టం కలుగుతుందని.. అప్పుడు గుర్తించారు. పదేళ్లలో కేఆర్ఎంబీకి తాము ఏ ప్రాజెక్టునూ అప్పగించలేదు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం రెండు నెలల్లోనే ప్రాజెక్టులను ఢిల్లీ చేతిలో పెట్టి అడుక్కు తినే పని చేశారు"అని విమర్శించారు. ఇదంతా నిజం కాకుంటే ఉద్యోగులు, వారి జీతాల చెల్లింపు వరకు చర్చ ఎందుకు వచ్చిందో చెప్పాలని డిమాండ్ చేశారు. కేఆర్ఎంబీకి చెందిన 16, 17వ సమావేశాల్లో తెలంగాణ ఒప్పుకోలేదని మినిట్స్ కాపీలోనే ఉందంటూ.. అందులోని అంశాలను చదివి వినిపించారు. ఆ సమావేశానికి హాజరు కాని అప్పటి సీఎం కేసీఆర్ స్వయంగా ఎలా సంతకాలు చేస్తారని ప్రశ్నించారు. తప్పును ఒప్పుకోకుండా.. గత ప్రభుత్వమే ఒప్పుకొందంటూ అబద్ధాలు చెబుతున్నారని.. ఇంతకన్నా ఝూటా సీఎం ఎవరైనా ఉంటారా? అని ప్రశ్నించారు. సీఎం రేవంత్‌కు స్క్రిప్ట్ రాసిస్తున్న వారు అబద్ధాలనే రాసిస్తున్నారని, ఆయన్ను తప్పుదోవ పట్టించకుండా సరైన సమాచారం ఇస్తే బాగుటుందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించి రాష్ట్ర ప్రజల భవిష్యత్తును తాకట్టు పెట్టొద్దని కోరారు. రేవంత్ అబద్ధాలకు తాను ఇస్తున్న వివరణ శాంపిల్ మాత్రమేనని, అసెంబ్లీ వేదికగా ప్రజలకు వాస్తవాలు చెబుతామని, పూర్తి సినిమా ముందుందన్నారు. కాంగ్రెస్ నేతలు కూడా ప్రిపేర్ అయి రావాలని, గతంలో మాదిరిగా అడ్డంగా దొరికిపోయే పరిస్థితి తెచ్చుకోవద్దని సూచించారు.



రాయలసీమ లిఫ్టును వ్యతిరేకించాం

పోతిరెడ్డిపాడు విషయంలో పదవులకు ఆశపడి పెదవులు మూసుకున్నారంటూ రేవంత్ చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని హరీశ్ స్పష్టం చేశారు. 2005 జూలై 4న తాము మంత్రి పదవులకు రాజీనామా చేసి కాంగ్రెస్ సర్కారు నుంచి బయటకు వచ్చామని, అదే ఏడాది సెప్టెంబర్ 13న అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పోతిరెడ్డి పాడుపై జీవో తెచ్చిందన్నారు. పదవుల కోసం పార్టీలు మారిన చరిత్ర రేవంత్‌దని, ఉల్టా చోర్ కొత్వాల్ కే డాంటే లాగా తమపై నిందలు వేయడం తగదన్నారు. రాయలసీమ లిఫ్టును కేసీఆర్ వ్యతిరేకించారని, రెండో అపెక్స్ కవున్సిల్ మీటింగ్‌లోనూ ఈ అంశాన్ని ప్రస్తావించారని గుర్తు చేశారు. ప్రాజెక్టులు ఇచ్చింది ఎవరు.. ఎవర్ని చెప్పులతో కొట్టాలో రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. నాడు కేంద్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పెద్దలే విభజన చట్టం రూపొందించారని, బిల్లులోని అంశాల గురించి తెలుసుకోకుండా వితండవాదం చేయడం తగదన్నారు. మితిమీరిన అహంకారం, అబద్ధాలు, సంస్కారం లేని భాష, వికారమైన ధోరణి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో కనిపించాయని హరీశ్ ధ్వజమెత్తారు. కేసీఆర్ పట్ల నీచమైన భాషలో దూషణలకు పాల్పడ్డారన్నారు. ఆయన ధోరణి చూసి ఒక సీఎం ఇలా మాట్లాడతారా? అని తెలంగాణ ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. కాగా, ఉమ్మడి రాష్ట్రంలోనే నీళ్లు బాగుండేవని, తెలంగాణ వచ్చాక అన్యాయం జరిగిందని మంత్రి ఉత్తమ్ చేసిన వ్యాఖ్యలు అమరుల త్యాగాలను తప్పుపట్టేలా ఉన్నాయని హరీశ్ ఆరోపించారు. నాడు కాంగ్రెస్ పాలనలో జరిగిన అన్యాయాలను తమ ప్రభుత్వం సరి చేసిందని పేర్కొన్నారు.

చెత్త సీఎంను చెప్పుతో కొడతా

» మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

» చెప్పు చూపిస్తూ పరుష పదజాలంతో దూషణ

» మాకూ ముతక కూతలు వస్తాయి: జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



రండ పనులు చేసింది మీరు.. అంటూ కేసీఆర్‌ను ఉద్దేశించి సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై బీఆర్ఎస్ నేతలు ఘాటుగా స్పందించారు. రేవంత్‌ను ఉద్దేశించి ప్రచురించలేని భాషలో దుర్భాషలాడారు. మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు పరుష పదజాలంతో దూషించారు. చెత్త సీఎం రేవంత్‌ను చెప్పుతో కొడతానంటూ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. చెప్పు చూపిస్తూ తీవ్ర పదజాలంతో దుర్భాషలాడారు. మంచిర్యాల, పెద్దపల్లిలో ఆయన మాట్లాడారు. "కాలం కలిసొచ్చి అందలమెక్కావ్.. నీ అదృష్టమో, తెలంగాణ ప్రజల దురదృష్టమో ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చున్నవ్. గతంలో చిల్లర మాటలు మాట్లాడిన నువ్వు.. ఇప్పుడు ముఖ్యమంత్రి స్థాయిలో పద్ధతిగా మాట్లాడాలె. పదేళ్లపాటు తెలంగాణను బ్రహ్మాండంగా అభివృద్ధి చేసిన నాయకుడు కేసీఆర్‌ను తిడితే ఊరుకోం.. చెప్పుదీసి కొడుతా.. ఖబడ్దార్" అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీలో పది మంది ముఖ్యమంత్రులు ఉన్నారని, ఎప్పుడు ఎవడు కుర్చీ లాగుతాడో, ఎవరు అంగీ లాగు లాగుతాడో తెలియని పరిస్థితి ఉందన్నారు. అదానీని రాహుల్ గాంధీ విమర్శిస్తే, రేవంత్ రెడ్డి దావోస్ వెళ్లి రూ.12 వేల కోట్ల పెట్టుబడులకు ఎలా అంగీకరించారని ప్రశ్నించారు. ఇప్పటిదాకా రైతు బంధు డబ్బులు వేయని ప్రభుత్వం.. కాంట్రాక్టర్లకు బిల్లులు మాత్రం చెల్లించిందని మండిపడ్డారు. మంత్రి శ్రీనివాస్‌రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌కు సైతం పెద్ద మొత్తంలో బిల్లులు చెల్లించారన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాల గూడలో మాజీ మంత్రులు జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ హామీలు అమలు చేయలేని రేవంత్‌రెడ్డి.. కేసీఆర్‌పై నెపం వేసి తప్పించుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. 100 రోజుల్లో ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ నాయకులను ప్రజలే వెంటబడి చెప్పులతో కొడతారన్నారు. నిండా మూడు ఫీట్లు లేని సీఎం.. ఎమ్మెల్యే కంటే హీనంగా మాట్లాడుతున్నారన్నారు. తిట్టదలుచుకుంటే.. తమకూ మరిన్ని ముతక కూతలు వస్తాయని హెచ్చరించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాగార్జున సాగర్ ప్రాజెక్టుపైకి ఏపీ పోలీసులు దండెత్తి వచ్చారని, కోడ్ అమలులో ఉండడంతో అప్పటి సీఎం కేసీఆర్ అధికారులకు ఆదేశాలు ఇవ్వలేకపోయారని తెలిపారు. యాదగిరిగుట్టలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి సీఎం అనే విషయాన్ని మరిచిపోయారని, ఇంకా టీపీసీసీ అధ్యక్షుడిలాగే వ్యవహరిస్తునానరని ఎమ్మెల్యే కడియం శ్రీహరి విమర్శించారు. "ప్రభుత్వ అసమర్థతను, చేతగానితనాన్ని ప్రశ్నిస్తే వంద గజాల లోతున బీఆర్ఎస్‌ను బొంద పెడతావా? బీఆర్ఎస్‌ను బొంద పెట్టేటోళ్లు.. ఇకపైనా పుట్టబోరు. కేసీఆర్‌నే అసభ్య పదజాలంతో దూషిస్తావా.. బుద్ధి ఉందా నీకు" అని నిలదీశారు. రేవంత్ మాట తీరు ఇలాగే ఉంటే తెలంగాణ ప్రజలు ఆయనకు ఘోరీ కట్టడం ఖాయమన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన కొన్ని రోజుల్లోనే ప్రాజెక్టుల అప్పగింతకు ఒప్పందం చేసుకున్నారని, వచ్చే ఐదేళ్లలో తెలంగాణను ఏపీలో కలిపినా కలిపేస్తారని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. పెద్దపల్లిలో ఆయన మాట్లాడుతూ శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఒప్పుకోలేదని స్పష్టం చేశారు.

నేడు తెలంగాణభవన్‌కు మాజీ సీఎం కేసీఆర్

» కృష్ణానది పరివాహక జిల్లాల నేతలతో సమావేశం

» కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగించడంపై చర్చ



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల ముందు పార్టీ కార్యాలయానికి వచ్చిన బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖర్‌రావు.. ఫలితాల వెల్లడి తర్వాత తొలిసారి మంగళవారం రానున్నారు. ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో కాలు జారడంతో ఆయనకు తుంటి శస్త్రచికిత్స చేసిన విషయం విదితమే. దాన్నుంచి కోలుకున్న కేసీఆర్.. ఈ నెల 2న గజ్వేల్ ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు. అదేరోజు నందినగర్‌లోని తన నివాసంలో పార్టీ నేతలతో సమావేశమయ్యారు. మంగళవారం తెలంగాణ భవన్‌కు రానున్నారు. ఈ సందర్భంగా కృష్ణానది పరివాహక జిల్లాలకు చెందిన వారితోపాటు బీఆర్ఎస్ పార్టీ ముఖ్య నేతలతో కేసీఆర్ సమావేశమవుతారు. నాగార్జున సాగర్, శ్రీశైలం సహా కృష్ణానది మీద ఉన్న ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించడాన్ని ఖండిస్తూ.. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న రైతు వ్యతిరేక నిర్ణయాలను ప్రజల్లో ఎండగట్టేందుకు ఏం చేయాలన్న దానిపై ఆయన చర్చిస్తారు. అంతేకాకుండా కేఆర్ఎంబీ పరిధిలోకి ప్రాజెక్టులను తీసుకువెళ్లడాన్ని నిరసిస్తూ.. త్వరలోనే నల్గొండలో చేపట్టనున్న భారీ బహిరంగ సభకు ఏర్పాట్లు, ఇతర కార్యాచరణపై పార్టీ నేతలకు కేసీఆర్ దిశానిర్దేశం చేయనున్నారు.

700 కళాశాలల్లో నైపుణ్యాభివృద్ధి శిక్షణ

» 2030 నాటికి 10 లక్షల మంది యువతకు ట్రైనింగ్

» 1యం1బి ఫౌండేషన్‌తో ప్రభుత్వ ఒప్పందం

రాష్ట్రంలో 2030 నాటికి 10 లక్షల మంది యువతకు నైపుణ్య శిక్షణ అందిస్తామని వన్ మిలియన్ వన్ బిలియన్ (1యం1బి) ఫౌండేషన్ తెలిపింది. అలాగే 700 కళాశాలల్లో గ్రీన్ స్కిల్స్, ఏఐ నైపుణ్యాలపై శిక్షణ అందించనున్నట్లు వెల్లడించింది. సోమవారం సచివాలయంలో ఐటీ, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేష్ రంజన్ కార్యాలయంలో జరిగిన ఓ కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వంతో ఫౌండేషన్ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సందర్భంగా సంస్థ వ్యవస్థాపకుడు మానవ్ సుబోధ్ మాట్లాడుతూ.. తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) సహకారంతో 700 కళాశాలల్లో స్కిల్ ట్రైనింగ్ అందిస్తామన్నారు. విజయవంతంగా ట్రైనింగ్ పూర్తి చేసిన లక్ష మంది యువతకు ఇంటర్న్‌షిప్‌లు అందించనున్నట్లు తెలిపారు.

కేసీఆర్, జగన్ కుట్రతోనే సాగర్ ఆక్రమణ

పోలింగ్‌ను ప్రభావితం చేసే కుట్ర దాగుంది..కృష్ణా ప్రాజెక్టుల్ని బోర్డుకు అప్పగించే ప్రసక్తేలేదు: ఉత్తమ్



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేయాలన్న కేసీఆర్-జగన్ కుట్రలో భాగంగానే.. తెలంగాణలో పోలింగ్ రోజున నాగార్జున సాగర్ డ్యామ్‌ను ఏపీ పోలీసులు ఆక్రమించారని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆరోపించారు. జగన్, కేసీఆర్ మాట్లాడుకున్నాకే.. ఎన్నికల్లో కేసీఆర్‌కు రాజకీయ ప్రయోజనం కల్పించడానికే గత ఏడాది నవంబరు 29న సాగర్ ఆక్రమణ జరిగిందని ఆయన ఆక్షేపించారు. సచివాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడిన మంత్రి.. కృష్ణా ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించబోమని, అలాంటి ఆలోచనే లేదని తేల్చిచెప్పారు. హరీశ్‌రావులాగా పెట్రోల్ పోసుకొని నాటకాలాడి.. ఇంకొకరి ఆత్మహత్యకు తామెప్పుడూ కారణం కాలేదని స్పష్టంచేశారు. "మీరు ఉద్యమ సమయంలోనే బ్లాక్‌మెయిలర్లు. ఆ లెక్కలు బయటపెట్టాలా?" అన హరీశ్‌రావును ఉద్దేశించి మంత్రి నిప్పులు చెరిగారు. తెలంగాణ రావడానికి నాడు కేంద్ర హోం మంత్రిగా చిదంబరం నిర్వహించిన అఖిలపక్ష సమావేశమే కారణమని, ఆ భేటీ అనంతరం కేంద్రాన్ని ఒప్పించి, తెలంగాణ ఏర్పడటానికి చిదంబరం చేసిన ప్రయత్నాలు కీలకమని గుర్తుచేశారు. "ఈ విషయం నీకు (హరీశ్‌రావు) తెలియకుంటే.. నీ మామను అడుగు" అని మండిపడ్డారు. ఉమ్మడి రాష్ట్రంలో కన్నా తెలంగాణ ఏర్పడ్డాక, టీఆర్ఎస్ పాలనలోనే తెలంగాణకు కృష్ణా జలాల విషయంలో అన్యాయం జరిగిందని మంత్రి ధ్వజమెత్తారు. సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను అప్పగించడానికి తమకు ఎలాంటి అభ్యంతరాలూ లేవని 16వ కృష్ణాబోర్డు సమావేశంలో చెప్పింది టీఆర్ఎస్ ప్రభుత్వమేనని.. తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దెబ్బతీసే నిర్ణయాలన్నీ టీఆర్ఎస్ ఒప్పందం చేసుకుందని, రైతాంగానికి, ప్రజలకు అన్యాయం చేసిందే టీఆర్ఎస్ అని మంత్రి దుయ్యబట్టారు. ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీల కృష్ణా జలాలను కేటాయించగా.. అందులో ఏపీకి 66 శాతం(512 టీఎంసీలు), తెలంగాణకు 34 శాతం(299 టీఎంసీలు) కేటాయింపుపై 2015లో టీఆర్ఎస్ ప్రభుత్వమే ఒప్పందం చేసుకుందని, ఆ అన్యాయం పదేపదే కొనసాగిందని మండిపడ్డారు. 2023-24 బడ్జెట్ డిమాండ్ బుక్‌లో తెలంగాణ పాలసీ ప్రకటనలో భాగంగా శ్రీశైలం, నాగార్జునసాగర్‌ను కృష్ణాబోర్డుకు, పెద్దవాగు ప్రాజెక్టును గోదావరి బోర్డుకు అప్పగించడానికి నిర్ణయం తీసుకున్నట్లు శాసనసభలో ప్రకటించిందని గుర్తుచేశారు. అంతేకాక.. ఆయా ప్రాజెక్టుల నిర్వహణ కోసం సీడ్ మనీ కింద బోర్డులకు చెరో రూ.200 కోట్లను ఇవ్వాలనే నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించిందని.. ఇప్పుడు అబద్ధాలతో ప్రజలను మోసం చేస్తోందని ఆక్షేపించారు. తాము మంత్రులుగా ప్రమాణస్వీకారం చేసి 56 రోజులైందని.. ఈ 56 రోజుల్లో ప్రాజెక్టుల అప్పగింతపై ఎలాంటి నిర్ణయమూ తీసుకోలేదని స్పష్టం చేశారు. నీటిపారుదల శాఖపై శ్వేతపత్రం విడుదల చేయడంతో పాటు అన్ని అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామన్నారు.

ఏకాంత చర్చల ఫలితమే..

కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు జగన్‌తో జరిపిన ఏకాంత చర్చల తర్వాతే.. శ్రీశైలం నుంచి రోజూ 8 టీఎంసీల తరలింపుపై రాయలసీమ ఎత్తిపోతల పథకం జీవో విడుదలయిందని ఉత్తమ్ గుర్తుచేశారు. అపెక్స్ కౌన్సిల్ సమావేశానికి హాజరు కాకుండా.. రాయలసీమ టెండర్లు ఖరారయ్యాకే కేసీఆర్ అపెక్స్ కౌన్సిల్‌కు వెళ్లారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే.. పదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ కృష్ణా బేసిన్‌లోని పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయలేదని, పాలమూరు-రంగారెడ్డి నిర్మాణ అంచనాలు పెంచుకుంటూ పోయారని, ఈ ప్రాజెక్టులో రూ.27500 కోట్లు ఖర్చుపెట్టినా ఒక్క ఎకరాకు నీళ్లివ్వలేదని నిప్పులు చెరిగారు. కల్వకుర్తి, భీమా, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్‌తో పాటు శ్రీశైలం లెఫ్ట్ బ్యాంక్ కెనాల్ (ఎస్ఎల్‌బీసీ) టన్నెల్ ప్రాజెక్టులను కూడా పూర్తిచేయలేదని ఉత్తమ్ మండిపడ్డారు.

ఆర్టీసీ ఆదాయానికి గండి!

కొన్నేళ్లుగా పేరుకుపోయిన లీజు బకాయిలు

» ఏటా రావాల్సింది 100కోట్లపైనే

» సగం కూడా వసూలు చేయని పరిస్థితి

» బీఆర్ఎస్ హయాంలో ఒత్తిళ్లే కారణం

» కాంగ్రెస్ వచ్చాక లీజుదారులకు నోటీసులు

» లీజులు రద్దు, స్థలాల స్వాధీనానికి యత్నం

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్యానికితోడు రాజకీయ ఒత్తిళ్ల కారణంగా ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండి పడింది. లీజు బకాయిల వసూళ్లు చేపట్టకుండా అధికారులను నియంత్రించడంతో ఆర్టీసీ ఖజానాకు రావాల్సిన కోట్లాది రూపాయల నిధులు నిలిచిపోయాయి. టికెట్ చార్జీల చెల్లింపుల్లో కేవలం రూ.10 వ్యత్యాసం వస్తేనే కండక్టర్లను సస్పెండ్ చేసే యాజమాన్యం.. లీజుదారుల నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేయకుండా ఏళ్ల తరబడి నుంచి చోద్యం చూడడంలో అంతర్యమేమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్లలోని స్టాళ్లను అద్దెకు ఇవ్వడం, స్థలాలను లీజుకు ఇవ్వడం ద్వారా ఆర్టీసీకి ఏటా 100 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. కానీ, గత బీఆర్ఎస్ పాలకుల నిర్లక్ష్య ధోరణి... కారణంగా సగానికిపైగా ఆదాయం నిలిచిపోయినట్టు తెలిసింది.

కొన్ని ఉదాహరణలు..

గ్రేటర్ హైదరాబాద్ రీజియన్‌లో సిటీ బస్సుల్లో వాణిజ్య ప్రకటనల కోసం ఆర్టీసీతో గో రూరల్ ఇండియా సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. 2015 సెప్టెంబరు నుంచి 2021 సెప్టెంబరు వరకు రూ.22కోట్లు చెల్లించాలి. కానీ, గడువులోగా బకాయిలను వసూలు చేయడంలో ఆర్టీసీ అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలున్నాయి. హైదరాబాద్ రీజియన్‌కు రూ.10.75 కోట్లు, సికింద్రాబాద్ రీజియన్‌కు రూ.10.98 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. గడువులోగా చెల్లించని పక్షంలో ఒప్పందాన్ని రద్దు చేసుకునే అవకాశం ఉన్నప్పటికీ ఆర్టీసీ అధికారులు చర్యలు తీసుకోకుండా అప్పటి అధికారపార్టీ నేతలు అడ్డుపడినట్టు తెలిసింది. ఇక, ఎంజీబీఎస్‌లో స్టాళ్ల కేటాయింపులో సైతం అవకతవకలు జరిగినట్టు ఫిర్యాదులున్నాయి. ఆర్టీసీ కళామండపం లీజు విషయంలోనూ ఇదే తంతు చోటు చేసుకుంది. ఏళ్ల తరబడి నిర్వహణ బాధ్యతలు పొందిన అధికార పార్టీ నేతలు సుమారు రూ.8కోట్లకుపైగా ఎగవేసినట్టు అధికారులు తెలిపారు. ఇక, నిజామాబాద్‌లో ఆర్టీసీ స్థలాన్ని లీజుకు తీసుకుని వాణిజ్య సముదాయాన్ని నిర్మించి, అద్దెకు ఇచ్చి ఆదాయం పొందుతున్న రాజకీయ నాయకుడిపై చర్యలు తీసుకోవడంలో ఆర్టీసీ విఫలమైందన్న ఆరోపణలున్నాయి. కరీంనగర్, నల్లగొండ, రాణిగంజ్, మియాపూర్, దిల్‌సుఖ్‌నగర్ ప్రాంతాల్లోని స్థలాలు, భవనాల లీజుదారుల నుంచి భారీ మొత్తంలో బకాయిలు రావాల్సి ఉన్నట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. తాజాగా బీఆర్ఎస్ గద్దె దిగి కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆర్టీసీ అధికారులు రంగంలోకి దిగారు. బకాయిల వసూళ్ల కోసం లీజుదారులకు నోటీసులు జారీ చేస్తున్నారు. లీజుదారులు స్పందించని పక్షంలో ఒప్పందాలను రద్దు చేసి, స్థలాలు, నిర్మాణాలను తిరిగి స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.



తన గురువు, మార్గదర్శకుడు అయిన ఎల్‌కే అద్వానీకి ప్రభుత్వం భారతరత్న ప్రకటించిన నేపథ్యంలో.. ఢిల్లీలో ఆయన్ను కలిసి శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

8 నుంచి ఉభయ సభలకు గవర్నర్ అనుమతి

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 8 నుంచి రాష్ట్ర శాసన సభ, శాసన మండలి సమావేశాల నిర్వహణకు గవర్నర్ తమిళిసై అనుమతించారు. ఈ మేరకు గవర్నర్ అనుమతితో శాసన సభ కార్యదర్శి వి.నర్సింహాచార్యులు ఉత్తర్వులు జారీ చేశారు. మూడో శాసన సభ రెండో సమావేశం 8న ఉదయం 11.30 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. శాసన మండలి 20వ సమావేశం అదే రోజు ఉదయం 11.30 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. అయితే.. 8న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించనున్నారు. వెంటనే ఉభయ సభలు వాయిదా పడతాయి. 9న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ చేపడతారు.

ఎన్నికల సిబ్బందికి గౌరవ వేతనాలు

గతేడాది ఆఖరున జరిగిన తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల విధుల్లో పాల్గొన్నవారికి ప్రభుత్వం గౌరవ వేతనాన్ని మంజూరు చేసింది. నవంబరు పే స్లిప్‌ల ఆధారంగా సిబ్బంది, అధికారులకు ఈ గౌరవ వేతనాలు చెల్లించాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించింది. ఈమేరకు రాష్ట్ర ఎన్నిల ప్రధానాధికారి వికాస్‌రాజ్ సోమవారం ఉత్తర్వులను జారీ చేశారు.

నేడు శ్రీశైలంకు డ్యామ్ సేఫ్టీ ప్రతినిధులు

శ్రీశైలం డ్యామ్‌ను మంగళవారం జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్ఏ) ప్రతినిధులు పరిశీలించనున్నారు. వరదలతో డ్యామ్‌కు జరిగిన నష్టాన్ని అంచనా వేసి నివేదికను కేంద్రానికి సమర్పించనున్నారు. ఇప్పటికే శ్రీశైలంలో ప్లంజ్‌పూల్ (క్రెస్ట్ గేట్ల నుంచి విడుదలయ్యే వరద కింద పడే ప్రదేశం) దెబ్బతిని పెద్ద గొయ్యి ఏర్పడిందని, దీన్ని మూసివేయకపోతే క్రమంగా కట్టకు ప్రమాదమని కృష్ణా నది యాజమాన్య బోర్డు(కేఆర్ఎంబీ)కు చెందిన పూర్వ సభ్యుడు రవికుమార్ పిళ్లై నేతృత్వంలోని ప్రతినిధులు నివేదిక ఇచ్చారు. ఈ మరమ్మతులకు రూ.800 కోట్ల దాకా ఖర్చవుతుందని ఏడాదిన్నర క్రితమే నివేదికలో పేర్కొన్నారు. అయితే ఏపీ ప్రభుత్వం మరమ్మతులకు ఉపక్రమించలేదు. ఈ నేపథ్యంలో ఎన్‌డీఎస్ఏ కమిటీ డ్యామ్‌ను సమగ్ర పరిశీలన చేయనుంది. తర్వాత నాగార్జునసాగర్ డ్యామ్‌ను ఈ నెల 13-15 తేదీల మధ్య ఎన్‌డీఎస్ఏకు చెందిన మరో కమిటీ పరిశీలించనుంది.

క్యాన్సర్ బారిన పడ్డ కింగ్ చార్లెస్-3

లండన్, ఫిబ్రవరి 5: బ్రిటన్ రాజు చార్లెస్-3 (75) ఏళ్ల వయసులో క్యాన్సర్ బారిన పడ్డారు. ఈ విషయాన్ని బంకింగ్ హామ్ ప్యాలెస్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపింది. ఆయనకు చికిత్స ప్రారంభించినట్లు తెలిపింది. అయితే క్యాన్సర్ ఏ స్టేజికి చేరిందన్నది వెల్లడించలేదు.

షర్మిలపై దుష్ప్రచారం సిగ్గుచేటు: వైఎస్సార్టీపీ నేతలు

పంజాగుట్ట, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డిపై వైసీపీ మంత్రులు, నాయకులు చేస్తున్న అసత్యప్రచారం, సామాజిక మాధ్యమాల్లో ఆమెపై పలువురు చేస్తున్న ఆరోపణలు, దూషణలు సిగ్గుచేటని, దీనిని తీవ్రంగా ఖండిస్తున్నామని వైఎస్సార్టీపీ మాజీ నాయకులు, ఆమె అభిమానులు అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో వైఎస్సార్టీపీ మాజీ నాయకులు పిట్ట రాంరెడ్డి, ఖమ్మం జెడ్పీ మాజీ చైర్మన్ జి.కవిత, తదితరులు మీడియాతో మాట్లాడారు. ఏపీలో జగన్ పాలనలో వైఫల్యాలను ప్రశ్నిస్తే తట్టుకోలేక పోతున్నారని, అందుకే కొంత మంది విలువలు లేని నాయకులు ఆమె వ్యక్తిగత జీవితంపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

సగటు ఆడబిడ్డ రూపురేఖలే

తెలంగాణ తల్లి విగ్రహానికి ప్రతిరూపం: సీఎం



హైదరాబాద్, జనవరి 5(ఆంధ్రజ్యోతి): సగటు ఆడబిడ్డ రూపు రేఖలే తెలంగాణ తల్లి విగ్రహానికి ప్రతిరూపంగా ఉండాలని, రాచరికపు పోకడలు లేని చిహ్నమే రాష్ట్ర అధికారిక చిహ్నంగా ఉండాలన్నది ప్రజల ఆకాంక్ష అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఒక జాతి అస్తిత్వానికి చిరునామా.. ఆ జాతి భాష, సాంస్కృతిక వారసత్వమేనని, దానిని సమున్నతంగా నిలబెట్టాలన్న సదుద్దేశంతోనే 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర అధికారిక గీతంగా కేబినెట్ నిర్ణయించిందని వెల్లడించారు. వాహన రిజిస్ట్రేషన్లలో టీఎస్‌కు బదులుగా.. ఉద్యమ సమయంలో ప్రజలు నినదించిన టీజీ అనే అక్షరాలు ఉంటే బాగుంటుందన్న ఉద్దేశంతోనే మార్చాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం 'ఎక్స్' వేదికగా ఆయన వెల్లడించారు. కాగా, రూ.500 కే గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల లోపు విద్యుత్తు ఉచితం పథకాల అమలుకు కేబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో మహిళా కాంగ్రెస్ నాయకులు గాంధీభవన్‌లో సంబరాలు నిర్వహించారు. ప్రభుత్వానికి అనుకూలంగా మహిళా నినాదాలు చేశారు.

రాజ్‌భవన్‌కు చేరిన క్షమాభిక్ష ఫైల్

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీల విడుదలకు సంబంధించిన ఫైల్ రాజ్‌భవన్‌కు చేరింది. గాంధీ జయంతి, స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాలు, ప్రభుత్వాలు మారినప్పుడు, ఇతర ప్రత్యేక సందర్భాల్లో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేస్తుంటారు. ఈసారి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ జనవరి 26న ఖైదీల విడుదలకు చర్యలు చేపట్టింది. అనివార్య కారణాల వల్ల ఆ ప్రక్రియ ఆలస్యమైంది. ఆదివారం జరిగిన మంత్రి మండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయం మేరకు.. ఖైదీల విడుదల ఫైల్‌ను ప్రభుత్వం రాజ్‌భవన్‌కు పంపింది. గవర్నర్ పరిశీలన అనంతరం ప్రభుత్వ జీవో మేరకు సత్ప్రవర్తన కలిగిన ఖైదీలను విడుదల చేస్తారు. ఈసారి రాష్ట్రవ్యాప్తంగా అన్ని జైళ్లల్లో ఉన్న సుమారు 231 మంది ఖైదీలు క్షమాభిక్ష కింద విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత గత బీఆర్ఎస్ ప్రభుత్వం రెండు దఫాల్లో సుమారు 400 మంది ఖైదీల్ని క్షమాభిక్షపై విడుదల చేసింది.

నీటి పారుదల శాఖలో కట్టప్పలు!

ప్రభుత్వ సమావేశాలకు హాజరవుతూ విపక్షాలకు కీలక పత్రాలు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): నీటిపారుదల శాఖలో కట్టప్పలు ఉన్నారని ప్రభుత్వం భావిస్తోందా!? ఒకవైపు ప్రభుత్వం నిర్వహించే కీలక సమావేశాలకు హాజరుకావడమే కాకుండా వాటిలో చర్చించే ప్రతి అంశాన్ని, ప్రతి పరిణామాన్ని ఎప్పటికప్పుడు పొల్లుపోకుండా విపక్షానికి అందిస్తున్నారని అనుమానిస్తోందా!? కృష్ణా నదిపై ప్రాజెక్టులు చేజారిపోయాయని ప్రచారం చేయడంలో వీరే కీలక పాత్ర పోషించారని సందేహిస్తోందా!? ఈ ప్రశ్నలకు 'ఔను' అనే అంటున్నాయి నీటిపారుదల శాఖలోని ఉన్నత స్థాయి వర్గాలు! మేడిగడ్డ వద్ద జరిగిన సమావేశంలో మంత్రులకు తప్పుడు లెక్కలు సమర్పించడం నుంచి కృష్ణా బోర్డు సమావేశాల తర్వాత దుష్ప్రచారం చేయడం వరకూ వీరే కీలక పాత్ర పోషించినట్లు సర్కారు అనుమానిస్తోంది. సదరు సమాచారాన్ని విపక్షానికి చేరవేస్తూ.. గత పదేళ్లుగా పొందిన అధికార హంగులకు మొక్కులు తీర్చుకుంటున్నారని సర్కారు భావిస్తున్నట్లు ఆ వర్గాలు తెలిపాయి. ఇందుకు కొన్ని ఉదాహరణలను వివరించాయి. కృష్ణా ప్రాజెక్టుల అప్పగింతపై జనవరి 17న సమావేశం ఉంటుందని అధికారులకు సమాచారం వచ్చింది. ఆ సమావేశం కంటే ముందే కొన్ని చర్యలు తీసుకోవాలని సర్కారు భావించింది. శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టుల అప్పగింతతో తెలంగాణకు ఏవిధంగా అన్యాయం జరుగుతుంది!? 811 టీఎంసీల కృష్ణా జలాలను పంచడానికి బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్‌కు కేంద్రం విడుదల చేసిన టర్మ్స్ ఆఫ్ రిఫరెన్స్ (టీవోఆర్) ఏమిటి!? తదితర వివరాలతో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌ను రూపొందించి, దాన్ని కేంద్ర జలశక్తి శాఖకు సమర్పించాల్సి ఉండగా.. సదరు అధికారులు ఆ పని చేయలేదు. ప్రాజెక్టులను బోర్డుకు అప్పగించలేమని తెలంగాణ నీటిపారుదల శాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా తేల్చి చెప్పినా ఆ సమాచారాన్ని కూడా పంచుకోలేదు. సమావేశంలో అసాంతం తాపీగా కూర్చున్నారు. సరికదా.. ఆ తర్వాత ప్రాజెక్టులు చేజారిపోయాయనే ప్రచారం చేయడంలో వారు కీలక పాత్ర పోషించారని ఉన్నతాధికారులు తాజాగా గుర్తించారు. అంతేనా, సమావేశం జరిగిన మర్నాడే కీలక సమాచారమంతా విపక్ష పార్టీకి చేరవేయడంలో ప్రధానంగా కొందరు అధికారులు కీలక పాత్రను



పోషించారని ప్రభుత్వం నిర్ధారణకు వచ్చింది. సోమవారం వరకూ బయటపడిన పలు రికార్డులనూ విపక్ష నేతలకు అందించారని అంచనాకు వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డితో జరిగిన పలు కీలక సమావేశాల సారాంశాన్ని.. అందులోనూ ప్రత్యేకంగా ప్రభుత్వాన్ని దెబ్బతీసే సమాచారాన్ని ఎంచుకొని వీరు చేరవేశారని నిర్ధారణకు వచ్చింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు సందర్భాల్లో మంత్రులనూ తప్పుదోవ పట్టించిందని భావిస్తోంది. మేడిగడ్డ ప్రాజెక్టు పూర్తయిన తేదీ, నిర్మాణ అంచనా వ్యయం తదితరాల విషయంలో తారుమారు చేసినట్లు అంచనాకు వచ్చింది. ఒక డాక్యుమెంట్‌లో 2019 సెప్టెంబరు 10న; మరో డాక్యుమెంట్‌లో 2020 ఫిబ్రవరి 29న; ఇంకో డాక్యుమెంట్‌లో 2021 మార్చి 15వ తేదీన పూర్తయినట్లు రికార్డుల్లో పేర్కొన్నారని, తద్వారా నిర్మాణ సంస్థకు అనుకూలంగా వ్యవహరించారని నిర్ధారణకు వచ్చింది. అంతేనా.. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ డిసెంబరు 29న మేడిగడ్డ వద్ద సమీక్షించిన విషయం తెలిసిందే. అంబట్‌పల్లి గ్రామంలో అధికారులు మంత్రులకు పవర్ పాయింట్ ప్రజంటేషన్ (పీపీటీ) ఇచ్చారు. అందులో మేడిగడ్డ నిర్మాణ వ్యయం రూ.3,625.82 కోట్లు మాత్రమేనని చెప్పారు. నిజానికి, మేడిగడ్డ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినప్పుడు అంచనా వ్యయం రూ.2,591 కోట్లు మాత్రమే. ఆ తర్వాత మూడుసార్లు అంచనాలను సవరించారు. 2018 మేలో రూ.675 కోట్లను పెంచారు. తర్వాత 2020 ఫిబ్రవరి, నవంబరుల్లో అంచనాలను సవరించాలని అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వెరసి, 2021 సెప్టెంబరు ఆరో తేదీనాటికి అంచనా వ్యయాన్ని రూ.4,613 కోట్లకు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. కానీ, గత ఏడాది డిసెంబరులో మంత్రులకు ఇచ్చిన పీపీటీలో అంచనా వ్యయం రూ.3,625.82 కోట్లు మాత్రమేనని అధికారులు చెప్పారని సర్కారు గుర్తించింది.

అన్ని పరిణామాల్లోనూ వీరే..

తెలంగాణ వచ్చిన తర్వాత కృష్ణా జలాల పంపిణీకి సంబంధించి అన్ని సందర్భాల్లోనూ సదరు అధికారులే కీలక పాత్ర పోషించారని సర్కారు నిర్ధారణకు వచ్చింది. తెలంగాణ, ఏపీల మధ్య నీటి పంపిణీకి సంబంధించి 2015లో భేటీ జరిగిన విషయం తెలిసిందే. 811 టీఎంసీల కృష్ణా జలాలను తెలుగు రాష్ట్రాలు పంచుకునేందుకు నిర్వహించిన ఆ సమావేశానికి వీరు హాజరయ్యారు. ఏపీ 63 శాతం, తెలంగాణ 37 శాతం నీటిని పంచుకోవడానికి ఆ ఒక్క ఏడాది కోసమే ఒప్పందం జరిగింది. ఆ సమావేశంలో పాల్గొని ఒప్పందానికి జైకొట్టిన అధికారులే కట్టప్పలని ప్రభుత్వం భావిస్తోంది. నిజానికి, 2015 వాటర్ ఇయర్ ఒక్క దానికే తెలంగాణకు 37% నీళ్లు పంచాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ, 2017 వరకూ ఈ నిర్ణయమే అమలైంది. అంతేనా.. ఏటా కృష్ణా జలాలను తెలంగాణ 30 శాతానికి కన్నా ఎక్కువ వినియోగించుకోవడం లేదంటూ 2018లో ఏపీ వ్యూహాత్మంగా కొత్త వాదనను తెరపైకి తెచ్చింది. దాంతో, తెలంగాణ వాటాను 37% నుంచి 34 శాతానికి కుదించుకుంటూ ప్రస్తుత అధికారులే అప్పట్లో అంగీకారం తెలిపారని సర్కారు గుర్తించింది. చివరికి, 2022-23 వాటర్ ఇయర్‌లో 50:50 శాతం నీటిని పంపిణీ చేయాలని పట్టుబట్టి, చివర్లో వర్కింగ్ అరేంజ్‌మెంట్ కింద కృష్ణా బోర్డే తుది నిర్ణయం తీసుకునే అధికారం అప్పటి ప్రభుత్వం ఇచ్చిందని, ఈ నిర్ణయంలో ప్రస్తుతం కట్టప్పలుగా మారిన అధికారులే సూత్రధారులని నిర్ధారణకు వచ్చింది. ఈ నేపథ్యంలో, సదరు అధికారులపై ఎటువంటి చర్యలు తీసుకోవాలనే అంశంపై సర్కారు మల్లగుల్లాలు పడుతోందని తెలుస్తోంది.

శ్రీశైలం, సాగర్ అప్పగించడమే మేలు

- కీలక అధికారి నోట మళ్లీ అదే పాట
- సీఈల భేటీలో కంగుతిన్న అధికారులు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీ యాజమాన్య బోర్డుకు ప్రాజెక్టుల అప్పగింతపై ఓవైపు వివాదం రగులుతుండగా.. సదరు సమావేశంలోనే నీటి పారుదల శాఖ ఉన్నతాధికారి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు మరింత వివాదాస్పదంగా మారాయి. 'శ్రీశైలం, సాగర్‌లను కృష్ణా బోర్డుకు అప్పగించడమే మేలు. లేకపోతే భవిష్యత్తులోనూ సమస్యలు తప్పవు' అని వ్యాఖ్యానించడం అగ్గి రాజేస్తోంది. నిజానికి, 2011 ఆగస్టు ఒకటి నుంచి నీటి పారుదల శాఖలో కీలక స్థానంలో పని చేస్తున్న ఆయన.. 2013లోనే పదవీ విరమణ చేశారు. అప్పటి కిరణ్‌కుమార్ రెడ్డి ప్రభుత్వం ఆయనను కొనసాగించింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా పదేళ్ల పాటు ఆయన కీలక పాత్ర పోషించారు. విచిత్రం ఏమిటంటే.. ఉమ్మడి రాష్ట్రంలో ప్రాణహిత-చేవెళ్ల పథకం అద్భుతమని కితాబు ఇవ్వడమే కాకుండా ఆ ప్రాజెక్టు చేపట్టడానికి సమ్మతి తెలిపిన ఆయన.. తెలంగాణ ఏర్పడగానే ఆ ప్రాజెక్టు దండగమారిదని రద్దు చేయించారు. దాని స్థానంలో వివాదాస్పద ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చారు. తాజాగా ఇప్పుడు మళ్లీ ప్రాణహిత-చేవెళ్లకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఇక, ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఆయనను మరికొంత కాలంపాటు కొనసాగించాలని నిర్ణయం తీసుకుంది. కృష్ణా ప్రాజెక్టులను కేంద్రానికి అప్పగించాల్సిందేనని స్పష్టం చేస్తూ జనవరి 17న కేంద్రం మినిట్స్ విడుదల చేసిన విషయం తెలిసిందే. దీనిపై పెద్ద దుమారమే రేగింది. దాంతో, నష్టనివారణ చర్యల్లో భాగంగా జనవరి 27న కేంద్ర జలశక్తి శాఖకు తెలంగాణ సర్కారు లేఖ రాసింది. ఆ లేఖలోని అంశాలకే కట్టుబడి ఉండాలని సదరు అధికారికి ప్రభుత్వం తేల్చి చెప్పింది. కానీ, ఈనెల 1న జరిగిన కృష్ణా బోర్డు సమావేశంలో తెలంగాణ లేఖ రాసిన విషయాన్ని ప్రస్తావిస్తూనే.. దానికి విరుద్ధంగా ఆయన ప్రకటన చేశారు. కృష్ణా ప్రాజెక్టులను అప్పగించే ప్రసక్తే లేదని ఈనెల 4న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్ ప్రకటించగా.. ఆ మరుసటి రోజే సోమవారం జలసౌధలోని వివిధ ప్రాజెక్టుల చీఫ్ ఇంజనీర్ల (సీఈ)తో జరిగిన సమావేశంలో ప్రభుత్వ విధాన నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రకటన చేసి సంచలనం సృష్టించారు. నవంబరు 29న సాగర్ డ్యామ్ ఆక్రమణ వంటి సంఘటనలు భవిష్యత్తులోనూ పునరావృతం కాకూడదంటే శ్రీశైలం, సాగర్‌లను బోర్డుకు అప్పగించడమే మేలని ప్రకటించి.. కలకలం సృష్టించారు.

సోనియాజీ..

తెలంగాణలో పోటీ చేయండి

(మొదటిపేజీ తరువాయి)

చేయాలని కోరుతున్నట్లు చెప్పారు. దీనికి స్పందించిన సోనియా.. సరైన సమయంలో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. సోమవారం సాయంత్రం, న్యూఢిల్లీలోని సోనియా గాంధీ అధికారిక నివాసం 10, జన్‌పథ్‌లో సీఎం రేవంత్ ఆమెను కలిశారు. ఆయన వెంట డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ, సమాచార, ప్రసార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు. ఈ సందర్భంగా.. ఎన్నికలకు ముందు ఇచ్చిన ఆరు హామీల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి, రాజీవ్ ఆరోగ్యశ్రీ పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంపు గురించి సోనియాకు ఆయన వెల్లడించారు. రూ.500కే గ్యాస్ సిలెండర్, 200 యూనిట్ల వరకూ విద్యుత్ ఉచిత సరఫరా అమలుకు నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. బీసీ కుల గణన చేపట్టాలని నిర్ణయించామని, ఈమేరకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో అత్యధిక స్థానాలు సాధించేందుకు ప్రయత్నిస్తున్నామని, ఆ దిశగా ఇప్పటికే అన్ని సన్నాహాలూ పూర్తి చేశామని చెప్పారు. ప్రతి లోక్‌సభ స్థానానికీ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని.. వాటిపై పూర్తిస్థాయిలో కసరత్తు చేసి బలమైన అభ్యర్థులను ఎంపిక చేస్తామని రేవంత్ సోనియాకు తెలిపారు. అలాగే.. రాజ్యసభలో తెలంగాణ నుంచి ఖాళీ కాబోతున్న స్థానాలకు కాంగ్రెస్ తరఫున అభ్యర్థుల ఎంపిక గురించి కూడా సీఎం ఆమె దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. అలాగే, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న కార్పొరేషన్ పదవులను భర్తీ చేసే అంశాన్ని కూడా ఆమె వద్ద రేవంత్ ప్రస్తావించినట్లు సమాచారం.



రాంచీలో రాహుల్‌ను కలిసిన సీఎం రేవంత్, భట్టి, పొంగులేటి

భారత్ న్యాయ్ యాత్రలో రాహుల్‌తో..

కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ భారత్ న్యాయ్ యాత్రలో సీఎం రేవంత్ సోమవారం పాల్గొన్నారు. ఝార్ఖండ్ రాజధాని రాంచీలో కొనసాగుతున్న ఈ యాత్రలో రాహుల్‌ను ఆయన కలిసి మాట్లాడారు. రాష్ట్రంలో అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితి పెంపు గురించి రాహుల్‌కు వివరించారు. పార్లమెంట్ ఎన్నికల్లో సోనియా తెలంగాణ నుంచి పోటీ చేసేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. లోక్‌సభ ఎన్నికలకు పార్టీ నేతలు, శ్రేణులు సిద్ధమవుతున్న తీరును రాహుల్ గాంధీకి ముఖ్యమంత్రి వివరించారు. ముఖ్యమంత్రి వెంట ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఆ గ్రాంటు విడుదలకు సహకరించండి

కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు రావల్సిన గ్రాంటు రూ.1800 కోట్లు వెంటనే విడుదలయ్యేలా సహకరించాలని నీతీఆయోగ్ వైస్ చైర్మన్ సుమన్ భేరీకి సీఎం విజ్ఞప్తి చేశారు. సోమవారం, నీతీఆయోగ్ వైస్ చైర్మన్‌ను కలిసిన ఆయన.. హైదరాబాద్‌లో మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధికి అవసరమైన నిధులు ఇప్పించాలని కోరారు. ఇందుకు అవసరమైన ప్రపంచబ్యాంకు ఎయిడ్ విడుదలకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. రాష్ట్రంలో తాగునీటి సరఫరాకు అవసరమైన నిధులతో ఇవ్వడంతో పాటు.. వైద్య, ఆరోగ్య, విద్యా రంగాల్లో తమ ప్రభుత్వం తీసుకురానున్న సంస్కరణలకు మద్దతు ఇవ్వాలని కోరారు.

నేడు కాంగ్రెస్ లోక్‌సభ అభ్యర్థుల

దరఖాస్తుల పరిశీలన

హైదరాబాద్, ఫిబ్రవరి 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 17 లోక్‌సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో మరో కీలక అడుగు పడనుంది. ఆశావహుల నుంచి వచ్చిన 309 దరఖాస్తుల పరిశీలన కోసం సీఎం రేవంత్‌రెడ్డి అధ్యక్షతన ప్రదేశ్ ఎన్నికల కమిటీ(పీఈసీ) మంగళవారం, గాంధీభవన్‌లో భేటీ కానుంది. ఈ భేటీలో నియోజకవర్గానికి మూడు నుంచి ఐదు పేర్ల వరకు షార్ట్ లిస్ట్ చేయనున్నారు. సమావేశం అనంతరం లేదా మరుసటి రోజున రేవంత్‌రెడ్డి,భట్టి విక్రమార్కలతో స్క్రీనింగ్ కమిటీ చైర్మన్, సభ్యులు భేటీయై అభిప్రాయాలు తీసుకోనున్నారు. ఈ భేటీల్లో తీసుకున్న అభిప్రాయాలు, పార్టీ సర్వేల ఆధారంగా నివేదికను రూపొందించనున్న స్క్రీనింగ్ కమిటీ.. ఆ నివేదికను ఏఐసీసీ కేంద్ర ఎన్నికల కమిటీకి సమర్పించనుంది. ఆ నివేదికల ఆధారంగా కేంద్ర ఎన్నికల కమిటీ.. అభ్యర్థులను ఖరారు చేయనుంది.

ఆరోగ్యశ్రీకి పునర్వైభవం

ఎక్మో, రోబోటిక్ సర్జరీలు 65 ప్రొసీజర్ల చేర్పు



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యశ్రీకి పునర్ వైభవం తీసుకురావాలని ప్రభుత్వం భావిస్తోంది. ఈమేరకు.. ప్రస్తుతం ఈ పథకం కింద అందిస్తున్న చికిత్సలకు అదనంగా ఆయుష్మాన్ భారత్ పథకం పరిధిలోకి రానివాటిని, అత్యంత ఖరీదైన, కీలకమైన ఎక్మో, రోబోటిక్ సర్జరీ సహా 65 ప్రొసీజర్స్‌ను జోడించాలనే సూత్రప్రాయ నిర్ణయానికి వచ్చింది. ప్రస్తుతం నిమ్స్‌లో ఎక్మో, రొబోటిక్ సర్జరీలు చేస్తున్నప్పటికీ.. అవి ఆరోగ్యశ్రీ పరిధిలోకి రావట్లేదు. ఇకపై అవి కూడా ఆరోగ్య శ్రీ పరిధిలోకి వస్తాయి. రాజీవ్ ఆరోగ్యశ్రీలో పెరగనున్న ప్రొసీజర్స్, తీసుకురానున్న మార్పుల గురించి శాసనసభ బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వం అధికారికంగా ప్రకటించనుంది. కాగా కొత్తగా కలిపే ఈ 65 ప్రొసీజర్స్‌తో పాటు ఇంకేవైనా చికిత్సలను ఆరోగ్యశ్రీ పరిధిలోకి తేవచ్చా అనే అంశంపై నివేదిక రూపొందించి ఇవ్వాలని వైద్య, ఆరోగ్య మంత్రి దామోదర రాజనర్సింహ అధికారులను ఆదేశించారు. సోమవారం సచివాలయంలో ఆయన ఈ పథకంపై సమీక్ష నిర్వహించారు. గత ప్రభుత్వ తీరుతో ఆరోగ్యశ్రీ పథకం పూర్తిగా దెబ్బతిన్నదని సర్కారు భావిస్తోంది. సకాలంలో ఆస్పత్రులకు బిల్లులు చెల్లించకపోవడం, పాతకాలం నాటి ప్యాకేజీ ధరలనే కొనసాగించడం వల్ల ప్రైవేటు ఆస్పత్రులు ఈ పథకం కింద చికిత్సలు అందించడం నిలిపివేశాయి. కార్పొరేట్ ఆస్పత్రులైతే ఆరోగ్యశ్రీ వార్డులనే ఎత్తివేశాయి. ఆస్పత్రులకు ఇచ్చే పెండింగ్ బకాయిలు రూ.వందల కోట్లకు చేరాయి. ఈ నేపథ్యంలోనే సర్కారు ఆరోగ్యశ్రీపై దృష్టి సారించింది.

ప్యాకేజ్ ధరల మార్పు...

గత సర్కారు హయంలో ఆరోగ్యశ్రీ పరిమితి ఒక్కో కుటుంబానికీ ఏడాదికి రూ.5 లక్షల దాకా ఉండేది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రాజీవ్ ఆరోగ్య శ్రీ వైద్య సాయం కింద దాన్ని రూ.10 లక్షలకు పెంచింది. ప్రస్తుతం రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్, ఆరోగ్యశ్రీ రెండింటిని కలిపి అమలుచేస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 1399 నెట్‌వర్క్ ఆస్పత్రులున్నాయి. వాటిలో ఎక్కువ భాగం ప్రభుత్వ ఆస్పత్రులే. ప్రైవేటు ఆస్పత్రులు దాదాపు 400 దాకా ఉన్నాయి. ఆరోగ్యశ్రీ కింద 1670 రకాల వైద్య చికిత్సలను అందిస్తున్నారు. అయితే.. ఈ పథకం ప్రారంభించినప్పుడు ఖరారు చేసిన ప్యాకేజ్ ధరలనే సర్కారు ఇప్పటికీ ఇస్తోంది. మధ్యలో కొన్నింటికి 10% మేర ధరలు పెంచినప్పటికీ.. మిగతావాటికి పాత రేట్లే ఇస్తున్నారు. దీంతో ప్రైవేటు ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలను దూరం పెడుతున్నాయి. ప్రజలకు సైతం ఆరోగ్యశ్రీపై నమ్మకం పోయింది. తిరిగి వారిలో నమ్మకం కల్పించాలనే యోచనలో ఉన్న సర్కారు.. సేవల సంఖ్యను, ప్యాకేజ్ రేట్లను పెంచాలనే నిర్ణయానికి వచ్చింది. అలాగే.. రాష్ట్రంలో కొన్ని ప్రాంతాల్లో ఒక తరహా జబ్బులు ఎక్కువగా ఉంటున్నాయి. ఏయే వ్యాధులు ఏయే ప్రాంతాల్లో ఎక్కువగా నమోదు అవుతున్నాయో గుర్తించేందుకు డిసీజ్ మ్యాపింగ్ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఎక్కువగా ఒకే తరహా జబ్బులు నమోదయ్యే చోట చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేయాలని చూస్తోంది. దీంతో పాటు సర్కారీ దవాఖానాల్లో ఎలాంటి చికిత్సలు అందుబాటులో ఉన్నాయో ప్రజలకు తెలిపే కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని వైద్యశాఖ ఉన్నతాధికారులను సర్కారు ఆదేశించింది. ఏ ఆస్పత్రిలో ఏ సేవ అందుబాటులో ఉందో తెలియడం వల్ల స్థానికంగా ఉండేవారంతా అక్కడే చికిత్స చేయించుకుంటారని.. ఫలితంగా హైదరాబాద్‌లోని నిమ్స్, ఇతర పెద్దాసుపత్రులపై భారం తగ్గుతోందని యోచిస్తోంది.

పురాతన శిలాశాసనాలను కాపాడుకోవాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

చార్మినార్ ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): ప్రాచీన శిలాశాసనాలు మన చరిత్రకు ఆయువుపట్టని, వాటిని మనం పరిరక్షించుకుంటే చరిత్రను పరిరక్షించుకున్నట్లేనని కేంద్రసాంస్కృతిక శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఆర్కియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా(ఏఎస్ఐ) హైదరాబాద్ ఆధ్వర్యంలో సాలార్‌జంగ్ మ్యూజియంలో దేశంలోనే తొలి శిలాశాసనాల మ్యూజియానికి ఆయన శంఖుస్థాపన చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... శిలాశాసనాలను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, వాటి ప్రాశస్త్యం ముందు తరాలకు తెలిసేందుకే ... నగరంలో మ్యూజియం, సైన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. దేశానికి చెందిన పురాతన వస్తువులు విదేశీ మ్యూజియాలలో ప్రదర్శిస్తున్నారని, 1947 నుంచి 2014 వరకు కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రభుత్వాలు వాటిల్లో 13 మాత్రమే స్వదేశానికి తీసుకొచ్చాయని, మోదీ ప్రభుత్వం మాత్రం 314 వస్తువులను తీసుకొచ్చిందని పేర్కొన్నారు.



సాలార్‌జంగ్ మ్యూజియంలో ఎపిగ్రఫీ మ్యూజియంకు శంఖుస్థాపన చేసి శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కిషన్‌రెడ్డి

నేడు మహేశ్వరంలో 'గావ్ చలో అభియాన్'

నేడు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం అమీర్‌పేటలో జరిగే 'గావ్ చలో అభియాన్' కార్యక్రమాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ప్రారంభిస్తారు. ఆయన అదే గ్రామంలో రాత్రి బస చేయనున్నారు. కాగా, హుజురాబాద్ నియోజకవర్గంలోని రంగాపూర్‌లో జరిగే 'గావ్ చలో అభియాన్' బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి ఎంపీ బండి సంజయ్ పాల్గొంటారు. స్థానిక కార్యకర్త ఇంట్లో భోజనం చేస్తారు. రాత్రికి అక్కడే బసచేస్తారు.

ఇంటింటికీ అయోధ్య రాముడి చిత్రపటాల పంపిణీ

తాను ప్రాతినిధ్యం వహిస్తున్న కరీంనగర్ పార్లమెంటు పరిధిలో అయోధ్య రాముడి చిత్రపటాలను పంపిణీ చేయాలని ఎంపీ సంజయ్ నిర్ణయించారు. ఏడు అసెంబ్లీ సెగ్మెంట్లలో 4 లక్షలకు పైగా హిందూ కుటుంబాలు వీటిని అందించబోతున్నట్లు తెలిసింది. మంగళవారం నుంచి హుజురాబాద్ నియోజకవర్గంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు సంజయ్ తెలిపారు. ఇప్పటికే లక్ష చిత్రపటాలు సిద్ధమయ్యాయని వాటిని పార్టీ శ్రేణులు ఇంటింటికీ పంపిణీ చేస్తారని ఆయన పేర్కొన్నారు.

శివబాలకృష్ణ పెట్టుబడులపై ఏసీబీ గురి

- నిర్మాణ సంస్థల ప్రతినిధులను విచారిస్తున్న అధికారులు
- లెక్కకు మించి శివబాలకృష్ణ ఆస్తులు..120 ఎకరాల గుర్తింపు

హైదరాబాద్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టయిన హెచ్‌ఎండీఏ మాజీ డైరెక్టర్ శివబాలకృష్ణ పెట్టుబడులు పెట్టిన నిర్మాణ సంస్థలు, అనుమతులు ఇచ్చిన దిగ్గజ రియల్‌ఎస్టేట్ కంపెనీలపై అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) గురి పెట్టింది. ఈ మేరకు ఆయా సంస్థల ప్రతినిధులను ఏసీబీ అధికారులు ప్రశ్నించినట్లు తెలిసింది. సోమవారం ఆరో రోజు కస్టడీలో నిందితుడు శివబాలకృష్ణ నుంచి ఏసీబీ అధికారులు కీలక సమాచారాన్ని రాబట్టినట్లు తెలిసింది. ఔటర్ రింగ్‌రోడ్డు పరిసరాలతోపాటు.. రంగారెడ్డి, యాదాద్రి-భువనగిరి, సిద్దిపేట, జనగాం జిల్లాలతోపాటు.. చౌటుప్పల్‌లో 120కి పైగా ఎకరాల ఆస్తులను శివబాలకృష్ణ తన స్నేహితులు, కుటుంబ సభ్యుల పేరిట కూడబెటినట్లు ఏసీబీ గుర్తించినట్లు సమాచారం. దీంతో ఏసీబీ అధికారులు శివబాలకృష్ణ పెట్టుబడులు పెట్టిన రియల్‌ఎస్టేట్ సంస్థల ప్రతినిధులు, ఆయన స్నేహితులను విచారించినట్లు తెలిసింది. అదేవిధంగా.. హెచ్‌ఎండీ డైరెక్టర్‌గా ఉన్నప్పుడు శివబాలకృష్ణ అనుమతులిచ్చిన దిగ్గజ రియల్‌ఎస్టేట్ సంస్థలపైనా దృష్టి సారించారు. ఈ క్రమంలో ఆయా సంస్థల ప్రతినిధులను విచారించారని సమాచారం. శివబాలకృష్ణ హయాంలో అనుమతులిచ్చిన ఫైళ్ల చిట్టాను అందజేయాలంటూ హెచ్‌ఎండీఏకు లేఖ రాసినట్లు తెలిసింది. ఆ ఫైళ్లు ఏసీబీ చేతికి చిక్కితే.. మరిన్ని ఆధారాలను సేకరించవచ్చని ఏసీబీ భావిస్తోంది. మంగళ, బుధవారాల్లో కూడా ఏసీబీ అధికారులు శివబాలకృష్ణను విచారించనున్నారు. ఈలోగా ఆశించిన సమాచారం రాకుంటే.. మరోసారి శివబాలకృష్ణ కస్టడీ పిటిషన్‌కు ఏసీబీ సిద్ధమవుతోంది.

పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు మృతి



హైదరాబాద్(ఆంధ్రజ్యోతి), సుల్తానాబాద్, ఫిబ్రవరి 5: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే బిరుదు రాజమల్లు(74) సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. కొంతకాలంగా ఆయన శ్వాసకోశ, గుండె సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేరి చికిత్స పొంది శస్త్ర చికిత్సలు చేయించుకున్నారు. ఈ నెల 1వ తేదీన ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయి హైదరాబాద్‌లోని తన కుమారుడి ఇంటికి చేరుకున్నారు. సోమవారం ఉదయం గుండెపోటు రావడంతో తుది శ్వాస విడిచారు. 1994లో పెద్దపల్లి నియోజకవర్గంలో టీడీపీ తరుఫున ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌లో ఉన్న రాజమల్లు కాంగ్రెస్‌లో చేరారు. ఆయన మృతదేహం వద్ద పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు, మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే చందర్, పెద్దపల్లి మాజీ ఎంపీ సుగుణకుమారి తదితరులు నివాళులర్పించారు. రాజమల్లు మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తంచేశారు. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌లోకి వచ్చిన ఆయన పార్టీ గెలుపునకు విశేషంగా కృషి చేశారని, రాజమల్లు మృతి పార్టీకి తీరని లోటన్నారు.

సికింద్రాబాద్‌లో రూ.800 కోసం హత్య

- నిజామాబాద్‌లో నిందితుడి అరెస్టు

అడ్డగుట్ట, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై.. ఫుట్‌పాత్‌లపై జీవనం గడుపుతున్న ఓ యువకుడు.. రూ.800 కోసం ఒకరిని హత్య చేసిన ఉదంతమిది. ఈ ఘటన సికింద్రాబాద్ మార్కెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగులోకి రాగా.. పోలీసులు నిందితుడిని నిజామాబాద్‌లో అరెస్టు చేశారు. నిజామాబాద్ జిల్లా బోధన్‌రోడ్డులోని సారంగపూర్‌కు చెందిన మహమ్మద్ మోసిన్ ఖాన్ అనే 25 ఏళ్ల యువకుడు హైదరాబాద్‌కు వచ్చి, గాంధీ ఆస్పత్రి సమీపంలోని ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్నాడు. మద్యానికి బానిసైన ఖాన్.. గత నెల 29వ తేదీ తెల్లవారుజామున సికింద్రాబాద్ యశోద ఆస్పత్రి వద్ద గుర్తుతెలియని వ్యక్తిపై దాడి చేశాడు. డెకరేషన్ కత్తితో గాయపరిచి, అతని జేబులోని రూ.800తో ఉడాయించాడు. సమాచారం అందుకున్న పోలీసులు, బాధితుడిని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఆ తర్వాత నిందితుడు ఖాన్.. ఘటనాస్థలికి కిలోమీటర్ దూరంలో మితేశ్‌కుమార్ యాదవ్ అనే వ్యక్తిపైనా కత్తితో దాడి చేశాడు. ఒక రోజంతా సికింద్రాబాద్ ఫుట్‌పాత్‌లపైనే ఉన్న ఖాన్.. ఆ తర్వాతి రోజు జేబీఎస్ నుంచి బస్సులో తన స్వస్థలానికి వెళ్లిపోయాడు. ఈ కేసు దర్యాప్తు ప్రారంభించిన మార్కెట్ పోలీసులు.. సీసీటీవీ ఫుటేజీలను జల్లెడపట్టారు. నిందితుడు గాంధీ ఆస్పత్రి వద్ద ఉండేవాడని తెలుసుకుని, అక్కడివారిని ఆరా తీశారు. ఖాన్ స్వస్థలం సారంగపూర్ అని తెలుసుకుని, ఓ బృందాన్ని అక్కడకు పంపారు. సారంగపూర్‌లో ఖాన్‌ను అరెస్టు చేసి, నగరానికి తీసుకువచ్చారు. ఖాన్ దాడిలో మృతిచెందిన వ్యక్తి వివరాలు ఇంకా తెలియరాలేదు.

ప్రజాభవన్ వద్ద రోడ్డు ప్రమాదం కేసు.. గుంతకల్లులో మాజీ సీఐ దుర్గారావు అరెస్టు

హైదరాబాద్ సిటీ/ గుంతకల్లు, ఫిబ్రవరి 5: ప్రజాభవన్ వద్ద బారికేడ్లను కారుతో ఢీకొట్టిన కేసులో పంజాగుట్ట మాజీ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు అరెస్టయ్యారు. ఈ కేసులో నిందితుడైన బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ కుమారుడు సాహెల్‌ను తప్పించే ప్రయత్నం చేసిన దుర్గారావును హైదరాబాద్ పోలీసు కమిషనర్ అప్పట్లోనే సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే.! ఈ కేసులో ఇటీవలే బోధన్ మాజీ ఇన్‌స్పెక్టర్ అరెస్టవ్వగా.. దుర్గారావు మాత్రం పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. దుర్గారావు అజ్ఞాతంలో ఉంటూనే.. ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించారు. దుర్గారావు జాడను గుర్తించిన దర్యాప్తు అధికారులు.. సోమవారం అనంతపురం జిల్లా గుంతకల్లు రైల్వేస్టేషన్‌లో అతణ్ని అరెస్టు చేసి, హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం దుర్గారావును హైదరాబాద్ పశ్చిమ మండలం డీసీపీ కార్యాలయంలో విచారిస్తున్నట్లు తెలిసింది.

'కుల, మత రహిత' గుర్తింపుపై మీ వైఖరేంటి?

- రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల రికార్డుల నుంచి జనాభా లెక్కల్లో నమోదు వరకు అన్ని సందర్భాల్లో తమను 'కులం, మతం రహిత వర్గం'గా గుర్తించాలని కోరే వారిపై వైఖరి ఏమిటో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి సోమవారం హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీనిపై మూడువారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని చీఫ్ జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ అనిల్‌కుమార్‌ల ధర్మాసనం పేర్కొంది. 'కులం, మతం లేదు ' అన్న గుర్తింపు ఇవ్వాలన్న తమ వినతిపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని పేర్కొంటూ డీవీ రామకృష్ణారావు, ఎస్ క్లారెన్స్ కృపాళిని తదితరులు 2017లో హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ పిటిషన్‌లో ప్రతివాదిగా ఉన్న రిజిస్ట్రార్ జనరల్ అండ్ సెన్సస్ కమిషనర్ ఆఫ్ ఇండియా తరఫున హైదరాబాద్ సెన్సస్ ఆపరేషన్స్ జాయింట్ డైరెక్టర్ ఇప్పటికే కౌంటర్ దాఖలు చేశారు. ఇది తమ పరిధిలోకి రాదని, రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు కౌంటర్ దాఖలు చేయకపోవడాన్ని గమనించిన ధర్మాసనం మూడువారాల గడువు ఇచ్చి తదుపరి విచారణను వాయిదా వేసింది.

ఎయిర్‌పోర్టు రోడ్డులో స్పీడ్ 80 దాటితే ఫైన్

- రేపటి నుంచే అమలు.. స్పీడ్ గన్‌ల ఏర్పాటు


శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం అధికారులు కీలక నిర్ణయం తీసుకున్నారు. ఎయిర్‌పోర్టు అప్రోచ్ రోడ్డులో వాహనాల వేగ నియంత్రణకు శ్రీకారం చుట్టారు. ఈ నెల 7 తేదీ నుంచి అప్రోచ్ రోడ్డులో గంటకు 80 కిలోమీటర్ల వేగం మించొద్దని ఆంక్షలు విధిస్తున్నట్లు జీఎంఆర్ అధికారులు ప్రకటించారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. అప్రోచ్ రోడ్డుపై ఆటోమేటిక్ స్పీడ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిస్టమ్‌ను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వాహనదారులందరూ బాధ్యతాయుతంగా డ్రైవింగ్ చేయాలని సూచించారు. ట్రాఫిక్ పోలీసులతో సమన్వయం చేసుకుని ఈ వేగ పరిమితిని అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఎన్ఎస్ఎస్ కాంపిటేషన్‌లో.. ప్రపంచ చాంపియన్‌గా శ్రీచైతన్య

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని నాసా నేషనల్ స్పేస్ సొసైటీ(ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా 12 నుంచి 18 ఏళ్ల విద్యార్థులకు నిర్వహించిన 'లివ్ ఇన్ ఎ హెల్దీ స్పేస్ డిజైన్' కాంపిటేషన్‌లో తమ సంస్థ ప్రపంచ చాంపియన్‌గా నిలిచిందని శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్ సీమ ప్రకటించారు. నేషనల్ స్పేస్ సొసైటీ ఫలితాల్లో ప్రపంచవ్యాప్తంగా 47 ప్రాజెక్టులు ఎంపిక కాగా, ఇందులో 28 ప్రాజెక్టులు తమ సంస్థ నుంచే ఎంపికయ్యాయని తెలిపారు. తమ సంస్థ బట్టీ పట్టే విధానానికి స్వస్తి పలికిందని, కాన్సెప్చువల్ టీచింగ్ మెథడాలజీ, యాక్టివిటీస్, ప్రాక్టికల్ ఓరియంటెడ్ టీచింగ్ ద్వారా మాత్రమే తాము ఇంతటి ఫలితాలను సాధిస్తున్నామని ఆమె వెల్లడించారు.

59 జీవో భూముల లావాదేవీలు బంద్

- రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్‌కు ఆదేశాలు
- 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన



GOVERNMENT OF TELANGANA
REVENUE DEPARTMENT

From
Sri. K. Shashanka I.A.S.,
District Collector,
Rangareddy District.

To
The District Registrar,
Ranga Reddy District.

Lr.No.E1/3583/2023, Dated: 08.01.2024.

Sir,

Sub:- Adverse News - Ranga Reddy District - News item Published in Andhra Jyothi with caption "PUTHALAKU MUNDU BHOO METHA"- on 11.12.2023 - Kept in abeyance to the conveyance deeds till further orders - Reg.

Ref:- CCLA, Telangana, Hyderabad Proceeding No. CMRO-II/2097/2023, dated:11.12.2023.

<<<0>>>

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ మహానగరంలో అత్యంత ఖరీదైన ప్రాంతంలో 59 జీవోను అడ్డుపెట్టుకొని, అక్రమంగా క్రమబద్ధీకరించుకుని, రిజిస్ట్రేషన్ పూర్తయిన రూ.కోట్ల విలువైన స్థలాలను అబయెన్స్‌లో పెట్టారు. అంటే.. ఆ స్థలాలపై ఎలాంటి లావాదేవీలు జరగకూడదు. క్రయవిక్రయాలు, రిజిస్ట్రేషన్లు జరగకూడదు. భవన నిర్మాణాలకు అనుమతులు రావు. ముఖ్యంగా.. శేరిలింగంపల్లి మండలంలోని గోపన్‌పల్లి, నానక్‌రామ్‌గూడల్లోని భూములపై అబయెన్స్ విధిస్తూ రంగారెడ్డి జిల్లా కలెక్టర్ శశాంక్ నిర్ణయం తీసుకున్నారు. ఆ మేరకు రంగారెడ్డి జిల్లా రిజిస్ట్రార్‌కు ఓ లేఖ రాశారు. ఆ లేఖలో 'ఫలితాలకు ముందు.. భూమేత' శీర్షికన డిసెంబరు 11న 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన పరిశోధనాత్మక కథనాన్ని ఆయన ప్రస్తావించారు. మాజీ మంత్రి, ఓ ఎమ్మెల్యే సహకారంతో.. ఎన్నికల ఫలితాలకు ముందు రోజు గోపన్‌పల్లిలోని సర్వే నంబర్ 74లో ఎలాంటి ఇళ్లు, ఇంటి నంబర్లు లేకున్నా.. 30 మందికి ఒక్కొక్కరికి 430 నుంచి 980 చదరపు గజాల వరకు మొత్తం 12,879 చదరపు గజాలను శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు క్రమబద్ధీకరిస్తూ చేసిన కన్వేయన్స్ డీడ్‌లను జారీ చేశారని 'ఆంధ్రజ్యోతి' స్పష్టం చేసింది. ఆ స్థలాలకు సంబంధించిన రిజిస్ట్రేషన్లను, కన్వేయన్స్ డీడ్‌లను అబయెన్స్‌లో పెట్టాలని జిల్లా రిజిస్ట్రార్‌కు రాసిన లేఖలో కలెక్టర్ ఆదేశాలు జారీచేశారు. ఆ స్థలాల్లో భవన నిర్మాణాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వొద్దంటూ జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ ఉన్నతాధికారులకు ఆదేశాలు వెళ్లాయి. సీసీఎల్‌ఏ అధికారులు కూడా రంగంలోకి దిగి, చర్యలు చేపట్టారు. అలాగే, నానక్‌రాంగూడలోని సర్వేనంబర్ 149లో 750కోట్ల విలువ చేసే ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని 15మందికి జీవో 59 కింద అక్రమంగా క్రమబద్ధీకరించడంపై 'భూంఫట్ స్వాహా' అనే శీర్షికతో జనవరి 10న 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. దీనిపైనా రంగారెడ్డి జిల్లా కలెక్టర్ స్పందిస్తూ.. సంబంధిత కన్వేయన్స్ డీడ్‌లను అబయెన్స్‌లో పెట్టాలని ఆదేశించినట్లు తెలిసింది. ఈ మేరకు రెవెన్యూ యంత్రాంగం కసరత్తు చేపట్టినట్లు సమాచారం.

దేశంలో లక్ష ఎంబీబీఎస్ సీట్లు!

మొత్తం కాలేజీలు 706... సీట్లు 1,08,940.. రాష్ట్రంలో 8,490 ఎంబీబీఎస్, 3,112 పీజీ సీట్లు

- 56 కాలేజీలతో 4వస్థానంలో రాష్ట్రం
- దక్షిణాదిలోనే 38% కళాశాలలు
- కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ వెల్లడి



హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): మన దేశంలో ఎంబీబీఎస్ సీట్ల సంఖ్య లక్ష మార్కు దాటింది. ప్రతీ ఏటా ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో మెడికల్ కాలేజీల సంఖ్య పెరుగుతున్నట్లు కేంద్రం వెల్లడించింది. ప్రస్తుతం దేశంలో ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 1,08,940 ఎంబీబీఎస్, 54,834 పీజీ సీట్లు ఉన్నట్లు తెలిపింది. అన్ని రాష్ట్రాల్లోని మెడికల్ కాలేజీలు, వాటిలో యూజీ, పీజీ సీట్ల వివరాలను కేంద్ర వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ తాజాగా విడుదల చేసింది. తెలంగాణలో 8,490 యూజీ, 3,112 పీజీ సీట్లు ఉన్నాయని తెలిపింది. యూజీ సీట్లలో మన రాష్ట్రం దేశంలో ఐదో స్థానం, పీజీ సీట్లలో ఆరో స్థానంలో నిలిచిందని పేర్కొంది. మన రాష్ట్రంలో 28 ప్రభుత్వ కాలేజీల్లో 3,890, ప్రైవేటులో 4,600 యూజీ సీట్లు ఉన్నాయి. పీజీ విషయానికొస్తే సర్కారులో 1,504, ప్రైవేటులో 1,608 సీట్లు ఉన్నాయి. తెలంగాణలో సర్కారీ కాలేజీల్లో కంటే ప్రైవేటులో యూజీ, పీజీ సీట్లు ఎక్కువ ఉన్నట్లు కేంద్ర గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

కాలేజీల్లో తమిళనాడు, సీట్లలో కర్ణాటక టాప్

దేశంలో అత్యధిక మెడికల్ కాలేజీలున్న రాష్ట్రంగా తమిళనాడు నిలిచింది. ఆ రాష్ట్రంలో ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 74 మెడికల్ కాలేజీలున్నాయి. అక్కడ 1,1650 యూజీ, 5,134 పీజీ సీట్లున్నాయి. ఇక కాలేజీలపరంగా రెండో స్థానంలో సీట్ల పరంగా మొదటి స్థానంలో కర్ణాటక నిలిచింది. అక్కడ మొత్తం 70 కాలేజీలుండగా, అందులో 11,745 యూజీ, 6,449 పీజీ సీట్లు ఉన్నాయని ఆ గణాంకాలు వెల్లడించాయి. ఆ తర్వాత ఉత్తర ప్రదేశ్‌లో 68 మెడికల్ కాలేజీలు, 9,903 యూజీ, 4,220 పీజీ సీట్లున్నాయి. మహారాష్ట్రలో కూడా 68 కాలేజీలుండగా, 10,845 యూజీ, 6,074 పీజీ సీట్లున్నాయి. యూజీ సీట్ల విషయంలో మహారాష్ట్ర దేశంలో మూడో స్థానంలో నిలిచింది. కాలేజీల విషయంలో తెలంగాణ నాలుగో స్థానంలో నిలిచింది. ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 56 మెడికల్ కాలేజీలున్నాయి. ఆరో స్థానంలో గుజరాత్ ఉండగా అక్కడ 40 వైద్య కళాశాలలు, 7,240 యూజీ, 2,910 పీజీ సీట్లున్నాయి. 37 మెడికల్ కాలేజీలతో ఆంధ్రప్రదేశ్ ఏడో స్థానంలో నిలవగా అక్కడ 6,985 యూజీ, 3,568 పీజీ సీట్లున్నాయి.

దేశవ్యాప్తంగా వైద్య కళాశాలలు, యూజీ, పీజీ సీట్ల వివరాలు

	మెడికల్ కాలేజీలు	ఎంబీబీఎస్	పీజీ
ప్రభుత్వ	389	56300	33416
ప్రైవేటు	317	52640	21418
మొత్తం	706	1,08,940	54834

దక్షిణాది రాష్ట్రాలదే హవా

మెడికల్ కాలేజీల్లో దక్షిణాది రాష్ట్రాల హవా కొనసాగుతోంది. ఉత్తరాదితో పోల్చుకుంటే దక్షిణాదిలోనే కాలేజీలు, సీట్లు ఎక్కువగా ఉన్నాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, కేరళ రాష్ట్రాల్లో మొత్తం 270 మెడికల్ కాలేజీలున్నాయి. దేశంలోని మొత్తం కాలేజీల్లో 38 శాతం ఈ ఐదు రాష్ట్రాల్లోనే ఉన్నాయి. ఎంబీబీఎస్ సీట్ల విషయానికొస్తే ఈ ఐదు రాష్ట్రాల్లో కలిపి 43,525 సీట్లున్నాయి. అంటే దేశవ్యాప్తంగా ఉన్న సీట్లలో ఇది 39.95 శాతం. మిగిలిన అన్ని రాష్ట్రాల్లో కలిపి 65,415 ఎంబీబీఎస్ సీట్లున్నాయి. మన రాష్ట్రంలో 2018-19 నాటికి ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి మొత్తం 27 కాలేజీలుండగా, ప్రస్తుతం వాటి సంఖ్య 56కు పెరిగింది. గత ఐదేళ్లలో కొత్తగా ప్రభుత్వ, ప్రైవేటులో కలిపి 29 మెడికల్ కాలేజీలు వచ్చినట్లు వెల్లడించింది.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది

- అబద్ధాలు చెప్పి పదేళ్ల తర్వాత గెలిచారు
- 2029లో కాంగ్రెస్ ముక్త భారత్ చూస్తాం
- 2024 ఎన్నికల్లో ఎక్కడ పోటీ చేసినా రాహుల్ గాంధీ ఓడిపోవడం ఖాయం
- అది వెన్నెముక లేని, మోసకారి పార్టీ
- రాజ్యసభలో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 5: రాజ్యసభలో కాంగ్రెస్ పార్టీపై తీవ్ర వ్యాఖ్యలు చేసిన వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి.. బీజేపీ పేరు ఎత్తకుండా పరోక్షంగా ఆకాశానికి ఎత్తేశారు. యాభై ఏళ్ల కాంగ్రెస్ పాలనలో దేశం వెనకపట్టుపట్టిందని, వాళ్లు అధికారంలో లేనప్పుడు మాత్రమే అభివృద్ధి జరిగిందని అన్నారు. సోమవారం రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రాజ్యసభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. 'రాష్ట్ర విభజన తరువాత కూడా తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాలేదు. పదేళ్ల తరువాత, అనేక అబద్ధాలు చెప్పి ఇప్పుడు అధికారంలోకి వచ్చారు. త్వరలోనే అక్కడి కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోతుంది. గత ఎన్నికల్లో అమేఠీలో ఓడిపోయిన రాహుల్ గాంధీ 2024లో జరిగే ఎన్నికల్లో ఎక్కడా గెలవరు. ఎక్కడ నుంచి పోటీ చేసినా రాహుల్ ఓడిపోతారు. 2029 నాటికి కాంగ్రెస్ ముక్త భారత్‌ను చూస్తాం. గ్రాండ్ ఓల్డ్ పార్టీ మాయమైపోతుంది. కాంగ్రెస్ పరిపాలించిన 50 ఏళ్లలో ఎన్నడూ అభివృద్ధి లేదు. ఆ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు వెనకబాటుతనం మనల్ని పీడించింది. కాంగ్రెస్ నిద్రాణస్థితిలో ఉన్నప్పుడు మాత్రమే దేశం అభివృద్ధి బాటలో పయనించింది. కాంగ్రెస్ వెన్నెముక లేని పార్టీ. కాంగ్రెస్‌ను నేను 'ధోకే బాజ్ పార్టీ' (మోసకారి పార్టీ) అని పిలుస్తాను. వాళ్లు కుటుంబ రాజకీయాలు నడుపుతారు. వాళ్ల డర్టీ పాలిటిక్స్ కారణంగానే ప్రజలు వాళ్లకు ఓ గుణపాఠం నేర్పారు. దాని మూలంగానే ఏపీలో 2019 ఎన్నికల్లో వారికి నోటా కన్నా తక్కువ ఓట్లు వచ్చాయి. జాతీయ స్థాయిలో కూడా కాంగ్రెస్ పార్టీ పతనం విస్పష్టంగా కనిపిస్తోంది. 2024లో కాంగ్రెస్‌కు 40 సీట్లు కూడా రావని వాళ్ల స్వంత కూటమి ఇండియా చెపుతోంది' అని విజయసాయిరెడ్డి అన్నారు.



బుధరావుపేటలో భవ్య మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న కుటుంబసభ్యులు, గ్రామస్థులు

భవ్య మృతదేహంతో కుటుంబసభ్యుల రాస్తారోకో

- మృతికి కారకులను శిక్షించాలని డిమాండ్
- బుధరావుపేటలో అరగంట ట్రాఫిక్ జామ్

ఖానాపురం/భువనగిరిటౌన్, ఫిబ్రవరి 5: వరంగల్ జిల్లా ఖానాపురం మండలంలోని బుధరావుపేట గ్రామానికి చెందిన కోడి లలిత, కృష్ణ దంపతుల కూతురు భవ్య(13) యాదాద్రి భువనగిరి జిల్లాలోని ఎస్సీ హాస్టల్‌లో ఆత్మహత్యకు పాల్పడిన విషయం విదితమే. భవ్య మృతదేహాన్ని ఆదివారం రాత్రి స్వగ్రామం బుధరావుపేటకు తీసుకువచ్చి, సోమవారం అంత్యక్రియలు నిర్వహించారు. అంతిమయాత్రలో కుటుంబసభ్యులు, బంధువులు జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. భవ్య మృతిపై తమకు అనుమానాలు ఉన్నాయని, హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని ఆరోపించారు. భవ్య అనారోగ్యంతో మృతి చెందిందని కాంగ్రెస్ నాయకులు సోషల్ మీడియాలో పోస్టులు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో అరగంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. విషయం తెలుసుకున్న ఎస్ఐ మాధవ్‌గౌడ్ అక్కడికి చేరుకుని, బాధిత కుటుంబానికి న్యాయం చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ధర్నాను విరమించి, భవ్య మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. కాగా భవ్య, వైష్ణవిల మృతికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి డిమాండ్‌చేశారు. భవ్య మృతదేహానికి ఆయన నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ తల్లిదండ్రుల అనుమతి లేకుండా మృతదేహాలను మార్చురీకి తరలించడం, ఇప్పటికీ స్పష్టమైన కేసు నమోదు చేయకపోవడంపై అనుమానం వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియాను ప్రకటించాలని డిమాండ్ చేశారు.

ఆందోళనలపై 20మందికి పైగా కేసు నమోదు

భువనగిరి హాస్టల్ విద్యార్థినులు భవ్య, వైష్ణవి ఆత్మహత్యలపై దర్యాప్తు చేసి నిందితులను శిక్షించాలని, బాధిత కుటుంబాలకు న్యాయం చేయాలంటూ ఆందోళనలు చేసిన వివిధ పార్టీల నాయకులపై పోలీసులు కేసులు నమోదు చేశారు. కేసులు నమోదైన వారిలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు భట్టుపల్లి అనురాధ, బీఎస్పీ రాష్ట్ర నాయకులు భట్టు రాంచంద్రయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు ఏవి కిరణ్‌కుమార్, రచ్చ శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ జిల్లా కార్యదర్శి రత్నపురం బలరాం, కిసాన్‌మోర్చ పట్టణ అధ్యక్షుడు పట్నం దిలీప్, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మోదీ రాందేవ్‌యాదవ్, మానవ హక్కుల సంఘం కార్యకర్త ఇష్రత్ అలీ, కుతాడి సురేశ్, మనోహర్, పెంట నితీష్, అమర్‌నాథ్, రావుల సంతోష్, శివకుమార్, తుమ్మల నగేష్, తదితరులు ఉన్నారు.

విద్యార్థినుల మృతిపై వీడని మిస్టరీ!

హత్యా? ఆత్మహత్యా? అనేదానిపై సస్పెన్స్.. ఫోరెన్సిక్ నివేదిక వస్తేనే దర్యాప్తు ముందుకు

- ఆటోడ్రైవర్ జోక్యమే ప్రాణాలు తీసిందా?
- తల్లిదండ్రుల ఫిర్యాదుతో కేసు నమోదు
- వార్డెన్, ఆటోడ్రైవర్ సహా.. ఆరుగురిపై అనుమానాలు
- పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక ప్రకారం.. బాలికల ఒంటిపై గాయాల్లేవు: పోలీసులు



విద్యార్థినులు ఆత్మహత్య చేసుకున్న హాస్టల్ గదిని పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి, బీఆర్ఎస్ నేత రామకృష్ణారెడ్డి

నల్లగొండ/భువనగిరి టౌన్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): భువనగిరి ఎస్సీ హాస్టల్ విద్యార్థినుల అనుమానాస్పద మృతిపై ఇంకా మిస్టరీ వీడలేదు. విద్యార్థినులిద్దరిది హత్యా? ఆత్మహత్యా? అనేది ఇంకా తేలలేదు. బాలికల పోస్టుమార్టం సమయంలో తీసిన నమూనాలు, వారి సూసైడ్ నోట్‌గా చెబుతున్న లేఖలకు సంబంధించి ఫోరెన్సిక్ నివేదిక వస్తేగానీ, ఏమీ చెప్పలేమని పోలీసులు స్పష్టం చేస్తున్నారు. ఫోరెన్సిక్ నివేదిక వచ్చాకే దర్యాప్తు ముందుకు సాగుతుందంటున్నారు. అయితే.. హాస్టల్ నిర్వహణలో లోపాలు.. ఆటో డ్రైవర్ మితిమీరిన జోక్యంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శనివారం రాత్రి విద్యార్థినులిద్దరూ విగతజీవులుగా కనిపించడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే.! వారి తల్లిదండ్రులు పోలీసులకు వేర్వేరుగా ఇచ్చిన ఫిర్యాదుల్లో.. ఆ మరణాలపై అనుమానాలున్నాయని, వాటిని ఆత్మహత్యలుగా చూడవద్దని కోరారు. విద్యార్థినులు రాసినట్లుగా చెబుతున్న సూసైడ్ నోట్‌పైనా అనుమానాలను వ్యక్తం చేశారు. దాంతో.. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసును దర్యాప్తు చేస్తున్నారు.

ఆటోడ్రైవర్ జోక్యమే కారణమా?

ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఆటోడ్రైవర్ అతి జోక్యం ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తల్లిదండ్రులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కూడా ఆటోడ్రైవర్ జోక్యం వల్ల ఓ సిబ్బంది బదిలీ కూడా జరిగిందని పేర్కొన్నారు. సదరు ఆటోడ్రైవర్ కూరగాయల సరఫరా మొదలు.. విద్యార్థినులను స్కూలుకు, పలు సందర్భాల్లో షాపింగ్‌కు తీసుకెళ్లడం, ఉద్యోగులు, సిబ్బందిని తరలించడం.. ఇలా హాస్టల్ విషయంలో అన్నీ తానై చూసుకునేవాడనే ఆరోపణలున్నాయి. ఈ క్రమంలో విద్యార్థినులతో ఆటోడ్రైవర్ తరచూ గొడవ పడేవాడని, అతనిపై ఫిర్యాదు చేసినా.. అధికారులు చర్యలు తీసుకునేవారు కాదని తెలుస్తోంది. ఆటో డ్రైవర్‌తోపాటు.. వార్డెన్, ట్యూటర్, పీఈటీ, వంటమనిషి, నైట్ వాచ్‌మన్.. ఇలా సిబ్బందిని విచారిస్తున్నట్లు పోలీసులు వివరించారు. పోస్టుమార్టం ప్రాథమిక నివేదిక మేరకు చనిపోయిన బాలికల ఒంటిపై గాయాలు లేవని చెప్పారు. ఈ ఘటన జరిగాక.. హాస్టల్‌లోని వందమందికి పైగా విద్యార్థినులు తమ ఇళ్లకు వెళ్లిపోయారు. అదే భవన సముదాయంలో ఉన్న బీసీ హాస్టల్‌లోని విద్యార్థినులు కూడా ఖాళీ చేయడంతో.. ప్రస్తుతం ఆ ప్రాంగణమంతా బోసిపోయి కనిపిస్తోంది. విద్యార్థినుల అనుమానాస్పద మృతిపై అధికారులు సమగ్ర దర్యాప్తు చేయాలని జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్ రెడ్డి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం వారు విద్యార్థినుల హాస్టల్ గదిని పరిశీలించారు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

ముగ్గురు సభ్యులతో సెర్చ్ కమిటీ!

- ప్రభుత్వ పరిశీలనలో పలువురి పేర్లు
- ఎంపిక చేసేందుకు కసరత్తు షురూ
- యూనివర్సిటీల వీసీ పోస్టులకు 10 దరఖాస్తులు

హైదరాబాద్, ఫిబ్రవరి 5 (ఆంధ్రజ్యోతి): యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్ల నియామకానికి సంబంధించి సెర్చ్ కమిటీ ఏర్పాటుపై ప్రభుత్వం కసరత్తును మొదలు పెట్టింది. ఈ సెర్చ్ కమిటీలో ఎవరిని నియమించాలనే అంశంపై అధికారులు పలువురి పేర్లను పరిశీలిస్తున్నారు. ఈ విషయంలో యూజీసీకి కూడా లేఖను రాయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు వైస్ చాన్సలర్లను నియమించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ మేరకు నోటిఫికేషన్‌ను కూడా జారీ చేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న వీసీల పదవి కాలం ఈ ఏడాది మే 21వ తేదీతో ముగియనుంది. అప్పటి వరకు కొత్త వీసీల నియామక ప్రక్రియను పూర్తి చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అందులో భాగంగా వీసీల పదవులకు పోటీ పడే అభ్యర్థుల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తోంది. ఈ పదవుల కోసం ఇప్పటి వరకు సుమారు 10 మంది ప్రొఫెసర్లు దరఖాస్తు చేసుకున్నట్టు సమాచారం. ఈ దరఖాస్తులను సమర్పించడానికి ఈ నెల 12వ తేదీ వరకు గడువు ఉండగా.. అప్పటి వరకు మరిన్ని దరఖాస్తులు రావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, ఆయా యూనివర్సిటీలకు వీసీల పేర్లను సెర్చ్ కమిటీ ఖరారు చేయనుంది. ఈ సెర్చ్ కమిటీ సూచించే పేర్లను ప్రభుత్వం ఆమోదించి, గవర్నర్ ఆమోదానికి పంపించాల్సి ఉంటుంది. ప్రభుత్వం పంపే పేర్లను గవర్నర్ ఆమోదించిన తర్వాత వారిని వీసీలుగా నియమించనున్నారు. కాగా, సెర్చ్ కమిటీలో ముగ్గురు సభ్యులు ఉంటారు. వీరిలో ఒకరిని యూజీసీ నామినేట్ చేయాల్సి ఉండగా, మిగిలిన ఇద్దరిలో ఒకరిని రాష్ట్రప్రభుత్వం నామినేట్ చేస్తుంది. ఇంకో సభ్యుడిని యూనివర్సిటీల నుంచి ఎంపిక చేయాల్సి ఉంటుంది. అయితే.. సెర్చ్ కమిటీలో ఎవరిని నామినేట్ చేయాలన్న విషయంపై ప్రభుత్వ పరిధిలో కసరత్తు మొదలైంది. ఇందుకోసం పలువురి పేర్లను పరిశీలిస్తున్నట్టు సమాచారం. అలాగే ఒక పేరును నామినేట్ చేయడం కోసం యూజీసీకి లేఖను రాయాలని అధికారులు నిర్ణయించారు.

ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశాలు ప్రారంభం

ఆయా యూనివర్సిటీల ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశాలు ప్రారంభమయ్యాయి. ప్రతీ నాలుగు మాసాలకు ఒక సారి భేటీ కావాల్సి ఉన్న ఈ సమావేశాలు సోమవారం నిర్వహించారు. పాలమూరు, మహాత్మ గాంధీ, కాకతీయ, బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీలకు సంబంధించిన ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశాలను నిర్వహించారు. పరిపాలన పరమైన పలు అంశాలపై చర్చించి, నిర్ణయాలను తీసుకున్నారు.

ఈనెల 21వరకు.. టాస్ పరీక్ష ఫీజు గడువు

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ(టాస్) పరిధిలో టెన్త్, ఇంటర్ వార్షిక పరీక్షలు రాసే అభ్యర్థులకు పరీక్ష ఫీజు గడువును ప్రకటించారు. ఈ నెల 12 నుంచి 21వ తేదీ వరకు అభ్యర్థులు పరీక్ష ఫీజును చెల్లించవచ్చు. రూ.25 లేట్ ఫీజుతో 27వ తేదీ వరకు, రూ.50 లేట్ ఫీజుతో మార్చి 4వ తేదీ వరకు ఫీజును చెల్లించడానికి అవకాశం ఉంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., printed at Aamoda Press, H.No.5-9-287/10 & 11, Plot No. 53 & 54, Prasanth Towers, Rajeev Gandhi Nagar, Moosapet, Kukatpally (Mandal), Kukatpally Municipality, Ranga Reddy District and Published at Plot No.76, Ashwini Layout, Huda Heights, Road No.70, Jubilee Hills, Hyderabad-500033. Editor: K. Srinivas. Fax No. 23558288, Phone No: 23558233 / 44 / 55, Regd. No.H/HD 674, RNI No.44903 / 86. Managing Director: Vemuri Radha Krishna, Founder: K.L.N.Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
హైదరాబాద్ ● మంగళవారం 6 ఫిబ్రవరి 2024
diksuchi@andhrajyothy.com

సీసీఎంబీలో సమ్మర్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్



హైదరాబాద్ సీఎస్ఐఆర్ ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులార్ బయాలజీ(సీసీఎంబీ)- సమ్మర్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ 2024నకు దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి 60 రోజులు(ఎనిమిది వారాలు). ఇది మేలో ప్రారంభమౌతుంది. ప్రోగ్రామ్ ఫీజు లేదు. అకడమిక్ మెరిట్, స్టేట్‌మెంట్ ఆఫ్ పర్పస్‌ల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ఎంపికైన అభ్యర్థులు ఓ సైంటిస్ట్ ఆధ్వర్యంలో ప్రాజెక్ట్ వర్క్ పూర్తిచేయాల్సి ఉంటుంది. సీసీఎంబీ స్టాఫ్ సైంటిస్ట్‌లు మెంటార్లుగా వ్యవహరిస్తారు. పాపులర్ సైన్స్ టాపిక్స్, సైంటిఫిక్ ఎథిక్స్, ల్యాబరేటరీ ప్రాక్టీసెస్, లైఫ్ సైన్సెస్ అంశాలపై లెక్చర్స్ ఉంటాయి. ప్రోగ్రామ్ చివరలో ప్రాజెక్ట్ రిపోర్ట్ సబ్మిషన్, పోస్టర్ ప్రజంటేషన్ ఉంటాయి.

అర్హత

- మొదటి ఏడాది పూర్తిచేసిన ఎమ్మెస్సీ/ఎంటెక్/ఎంఫార్మసీ అభ్యర్థులు; మూడో ఏడాది పూర్తి చేసిన బీటెక్/ బీఫార్మసీ/ఎంబీబీఎస్/బీడీఎస్/నాలుగేళ్ల బీఎస్సీ-బయో సైన్సెస్ అభ్యర్థులు; ఎనిమిదో సెమిస్టర్ లేదా నాలుగో సంవత్సరం పూర్తి చేసిన ఇంటిగ్రేటెడ్ బీటెక్-ఎంటెక్/ బీఎస్సీ-ఎమ్మెస్సీ/ బీవీఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. మూడేళ్ల వ్యవధి గల బీఎస్సీ ప్రోగ్రామ్ చేస్తున్న అభ్యర్థులు దరఖాస్తుకు అనర్హులు.
- అభ్యర్థులు తమ ఇన్‌స్టిట్యూట్/యూనివర్సిటీ/కళాశాలకు చెందిన హెచ్ఓడీ లేదా డీన్ నుంచి ఆథరైజేషన్ లెటర్‌ను ఆన్‌లైన్ ద్వారా సబ్మిట్ చేయాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 15
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** ఏప్రిల్ 1
- **అభ్యర్థులు తమ అనుమతి తెలిపేందుకు చివరి తేదీ:** ఏప్రిల్ 15
- **ప్రోగ్రామ్‌లో జాయినింగ్ తేదీలు:** మే 15 నుంచి జూన్ 14 వరకు
- **వెబ్‌సైట్:** www.ccmb.res.in

మోతీలాల్ నెహ్రూ ఇన్‌స్టిట్యూట్‌లో ఎంబీఏ



అలహాబాద్‌లోని మోతీలాల్ నెహ్రూ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎన్ఎన్ఐటీ) ఆధ్వర్యంలోని స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఏడాదికి రెండు సెమిస్టర్లు ఉంటాయి.

మొత్తం 77 సీట్లు ఉన్నాయి. జనరల్ అభ్యర్థులకు 29, జనరల్ కేటగిరీ దివ్యాంగులకు 2, ఓబీసీ అభ్యర్థులకు 20, ఓబీసీ దివ్యాంగులకు 1, ఎస్సీ అభ్యర్థులకు 10, ఎస్సీ కేటగిరీ దివ్యాంగులకు 1, ఎస్టీ అభ్యర్థులకు 6, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 8 సీట్లు ప్రత్యేకించారు. గుర్తింపు పొందిన కళాశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు క్యాట్ 2023 స్కోర్ ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంపిక: అడ్మిషన్ కమిటీ నిర్ణయం ప్రకారం క్యాట్ 2023 స్కోర్ ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. వీటిలో సాధించిన స్కోర్, అకడమిక్ మెరిట్, అనుభవం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేసి అడ్మిషన్స్ ఇస్తారు.

- **దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం:** ఫిబ్రవరి 8 నుంచి
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 11
- **అభ్యర్థుల షార్ట్‌లిస్ట్ విడుదల:** జూన్ 20
- **గ్రూప్ డిస్కషన్, పర్సనల్ ఇంటర్వ్యూలు:** జూన్ 29, 30
- **ఎంపికైన అభ్యర్థుల లిస్ట్ విడుదల:** జూలై 16
- **వెబ్‌సైట్:** mnnit.ac.in

ఎన్ఐబీఎంలో పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్

పుణెలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్యాంక్ మేనేజ్‌మెంట్(ఎన్ఐబీఎం)- పీజీ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్(పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ ప్రోగ్రామ్ స్పెషలైజేషన్ 'బ్యాంకింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్'. దీనికి ఏఐసీటీఈ గుర్తింపు ఉంది. మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్ వర్తిస్తుంది.

ప్రోగ్రామ్ వివరాలు: ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో ఆరు టర్మ్‌లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, సమ్మర్ ఇంటర్న్‌షిప్, బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ ప్రాజెక్ట్, సోషల్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ ఉంటాయి. ఫైనాన్స్, ఎకనామిక్స్, ఆపరేషన్స్, క్వాంటిటేటివ్ అనాలిసిస్, ఆర్గనైజేషనల్ బిహేవియర్, జనరల్ మేనేజ్‌మెంట్ ఇన్ బ్యాంకింగ్ సిస్టమ్స్, అసెట్స్ అండ్ లయబిలిటీ మేనేజ్‌మెంట్, క్రెడిట్ అప్రైజల్ అండ్ మేనేజ్‌మెంట్, రిస్క్ మేనేజ్‌మెంట్, ట్రెజరీ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్, బ్యాంక్ రెగ్యులేషన్, లీడర్‌షిప్, స్ట్రాటజిక్ మేనేజ్‌మెంట్ అంశాలు బోధిస్తారు. క్లాస్‌రూం లెక్చర్స్, కేస్ స్టడీస్, ఇండివిడ్యువల్ అండ్ గ్రూప్ అసైన్‌మెంట్స్, సిమ్యులేషన్ ఆఫ్ బిజినెస్ ఆపరేషన్స్ ఫీల్డ్ విజిట్స్ రీసెర్చ్ స్టడీస్ ఉంటాయి.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. ప్రస్తుతం చివరి సంవత్సర పరీక్షలకు సన్నద్ధమౌతున్నవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2024 అక్టోబరు 31 నాటికి డిగ్రీ సర్టిఫికెట్, మార్కుల పత్రాలు సబ్మిట్ చేయాలి. క్యాట్ 2023/ఎక్స్ఏటీ 2024/సీమ్యాట్ 2024 స్కోర్ లేదా జీమ్యాట్/జీఆర్ఈ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

ఎంపిక: జాతీయ పరీక్ష స్కోర్‌కు 35 శాతం, అకడమిక్ ప్రతిభకు 25 శాతం, ఆన్‌లైన్ ఓరల్ కమ్యూనికేషన్ టెస్ట్‌కి 10 శాతం, ఆన్‌లైన్ పర్సనల్ ఇంటర్వ్యూకి 25 శాతం, అనుభవం సహా క్రీడలు తదితర అదనపు అర్హతలకు 5 శాతం వెయిటేజీ ఇస్తూ అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జాతీయ పరీక్ష స్కోర్ కటాఫ్: జనరల్ అభ్యర్థులకు 75; ఓబీసీ అభ్యర్థులకు 65; ఎస్సీ అభ్యర్థులకు 60; దివ్యాంగులు, ఎస్టీ అభ్యర్థులకు 50; ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 65గా నిర్దేశించారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మార్చి 20
- **వెబ్‌సైట్:** www.pgdm.nibmindia.org

జాబ్ కార్నర్

పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఖాళీలు 1025

న్యూఢిల్లీలోని పంజాబ్ నేషనల్ బ్యాంక్(పీఎన్‌బీ) ప్రధాన కార్యాలయం, మానవ వనరుల విభాగం... దేశ వ్యాప్తంగా వివిధ శాఖల్లో కింద పేర్కొన్న స్పెషలిస్ట్ ఆఫీసర్ల నియామకానికి ప్రకటన విడుదల చేసింది.

1. ఆఫీసర్-క్రెడిట్(జేఎంజీ స్కేల్-1): **1000 పోస్టులు**
2. మేనేజర్- ఫారెక్స్(ఎంఎంజీ స్కేల్-2): **15 పోస్టులు**
3. మేనేజర్ - సైబర్ సెక్యూరిటీ(ఎంఎంజీ స్కేల్-2): **5 పోస్టులు**
4. సీనియర్ మేనేజర్ సైబర్ సెక్యూరిటీ(ఎంఎంజీ స్కేల్-3): **5 పోస్టులు**

విద్యార్హత: ఖాళీలను అనుసరించి బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, ఎంసీఏ, ఎంబీఏ, సీఏ, ఐసీడబ్ల్యూఏఐ, సీజీఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.

వయోపరిమితి: 2024 జనవరి 1 నాటికి ఆఫీసర్ పోస్టులకు 21-28 ఏళ్లు; మేనేజర్ పోస్టులకు 25-35 ఏళ్లు; సీనియర్ మేనేజర్ పోస్టులకు 27-38 ఏళ్ల మధ్య ఉండాలి.

జీతభత్యాలు: నెలకు ఆఫీసర్‌కు రూ.36,000 - రూ.63,840; మేనేజర్‌కు రూ.48,170 - రూ.69,810; సీనియర్ మేనేజర్‌కు రూ.63,840 - రూ.78,230.

ఎంపిక ప్రక్రియ: ఆన్‌లైన్ రాత పరీక్ష, ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు రూ.59, మిగతా అభ్యర్థులకు రూ.1180.

తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాలు: విజయవాడ, వైజాగ్, హైదరాబాద్

ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రారంభం: ఫిబ్రవరి 7
ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ: ఫిబ్రవరి 25
ఆన్‌లైన్ పరీక్ష తేదీ: 2024 మార్చి/ఏప్రిల్‌లో
వెబ్‌సైట్: https://www.pnbindia.in/

భారత్ - ఫ్రాన్స్ ద్వైపాక్షిక సంబంధాలు

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

(నిన్నటి తరువాయి)

భద్రత-రక్షణ రంగాల్లో సహకారం: భారతదేశానికి రెండో అతిపెద్ద ఆయుధ ఎగుమతిదారు ఫ్రాన్స్. ఒక్క ఫ్రాన్స్ నుంచే భారతదేశానికి 30 శాతం ఆయుధాలు దిగుమతి అవుతున్నాయి. రఫెల్ ఫైటర్ జెట్స్, మిరేజ్ ఫైటర్ ఎయిర్‌క్రాఫ్ట్, స్కార్పీన్ జలాంతర్గాములు వంటి వాటిని వీటిలో ప్రధానమైనవిగా పేర్కొనవచ్చు. సాంకేతిక బదిలీ ఒప్పందం ద్వారా భారత్‌లోని మజ్‌గావ్ డాక్‌యార్డ్‌లో ఫ్రాన్స్ సహకారంతో ఆరు స్కార్పీన్ తరహా జలాంతర్గాములను నిర్మిస్తున్నారు. వీటిలో ఒకటైన 'ఐఎన్ఎస్ కల్వరి' సబ్‌మెరైన్ జలప్రవేశం ఇప్పటికే(2017) పూర్తయింది. ఫ్రాన్స్-భారత్ హిందూ మహాసముద్ర ప్రాంతం(ఐఓఆర్)లో ఉమ్మడి గస్తీ నిర్వహణతో పాటు, త్రివిధ దళాల్లోనూ ఉమ్మడి సైనిక విన్యాసాలు తరచూ చేపడుతున్నాయి. (నావికాదళ విన్యాసాలు- 'వరుణ', వైమానిక విన్యాసాలు- 'గరుడ', ఆర్మీ విన్యాసాలు- 'శక్తి').

శక్తి, పర్యావరణ రంగాల్లో సహకారం: 1984లో తారాపూర్ అణువిద్యుత్ కేంద్రానికి అణు ఇంధనాన్ని అందించాల్సిన అమెరికా అర్ధాంతరంగా తప్పుకొంది. దాంతో ఫ్రాన్స్ ఆ ఇంధనాన్ని అందించి సహకరించింది.

- 2008లో న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూప్(ఎన్ఎస్‌జీ) మినహాయింపులను భారత్‌కు అందించడంలో ఫ్రాన్స్ పాత్ర ఎనలేనిది. అదేవిధంగా ఎన్ఎస్‌జీలో భారత్ చేరికకు ఫ్రాన్స్ మద్దతు ప్రకటిస్తోంది. భారతదేశంలో జైతాపూర్(మహారాష్ట్ర)లో ఆరు న్యూక్లియర్ పవర్ రియాక్టర్ల స్థాపనకు 2018లో ఇరుదేశాల మధ్య ఒప్పందం కుదిరింది. ఇంటర్నేషనల్ సోలార్ అలయన్స్(ఐఎస్ఏ)స్థాపనలో భారత్-ఫ్రాన్స్ ప్రముఖపాత్ర పోషించాయి.

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో సహకారం: భారత అంతరిక్ష పరిశోధన కేంద్రం(ఇస్రో) తొలినాళ్లలో నిర్మించిన శ్రీహరికోటలోని లాంచ్‌ప్యాడ్/సైట్ నిర్మాణంలో, రాకెట్ టెక్నాలజీలో తొలి నుంచి ఫ్రాన్స్ భారత్‌కు సహకరిస్తూ వచ్చింది.

- 2018లో ఇస్రో, ఫ్రాన్స్ అంతరిక్ష సంస్థ సీఎన్ఈఎస్ మధ్య ఉమ్మడి లక్ష్యాల్లో సహకారం కోసం ఒప్పందం కుదుర్చుకున్నాయి.
  - అంతరిక్ష వ్యర్థాలు(స్పేస్ డెబ్రిస్) తొలగింపు, జాయింట్ మార్స్ మిషన్‌ను ఉమ్మడిగా చేపట్టనున్నాయి.
  - అదేవిధంగా 'జాయింట్ ఎర్త్ అబ్జర్వేషన్ మిషన్'ను చేపట్టనున్నాయి.
  - హిందూ మహాసముద్ర ప్రాంతంలో నిఘా, పర్యవేక్షణకు పది ఉపగ్రహ సమూహాన్ని ఇండియా-ఫ్రాన్స్ సంయుక్తంగా ప్రయోగించనున్నాయి.
  - భారత్ యూపీఐ పేమెంట్ సిస్టమ్‌ను తమ దేశంలో అనుమతించిన తొలి యురోపియన్ దేశం ఫ్రాన్స్.
  - ఇదేవిధంగా కృత్రిమమేధ, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, క్వాంటమ్ టెక్నాలజీ, కంప్యూటింగ్ వంటి సాంకేతికపరంగా పరస్పర సహకార ఒప్పందాలు కుదిరాయి.

ఇండో-ఫ్రాన్స్ సత్సంబంధాల ఆవశ్యకత

1. బహుళ ధ్రువ ప్రపంచ సాధన దిశగా రెండు శక్తిమంతమైన దేశాలు ఫ్రాన్స్, భారత్ ఒక మధ్యేమార్గాన్ని ప్రపంచానికి చూపుతున్నాయి. అమెరికా, పాశ్చాత్య దేశాల కూటమి, చైనా, రష్యా కూటములకు ప్రత్యామ్నాయంగా, అలీన మార్గాన్ని ఏర్పర్చడానికి ఇండో-ఫ్రాన్స్ ఒక తాటిపై ఉండటం ఎంతో అవసరం.
2. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో చైనా ఆధిపత్యాన్ని, చొరబాటును నిలువరించడానికి ఆ ప్రాంతంలో భద్రత, స్థిరత్వాలను కాపాడటానికి భారత్-ఫ్రాన్స్ చేస్తోన్న కృషి కొనసాగింపునకు ఈ దేశాల మధ్య సత్సంబంధాలు మరింతగా బలపడాలి.
3. 1998 పోఖ్రాన్ అణు పరీక్ష సమయంలో అగ్రరాజ్యాలన్నీ భారత్‌పై ఆంక్షలు విధించినా ఫ్రాన్స్ అలాంటి చర్యలకు పాల్పడలేదు. పైగా భారతదేశ శాంతికాముకత్వాన్ని గుర్తిస్తూ భద్రతామండలి శాశ్వత సభ్యత్వానికి, న్యూక్లియర్ సప్లయర్స్ గ్రూపులో ప్రవేశానికి తన మద్దతును భారత్‌కు ప్రకటిస్తూనే వస్తోంది.

- ఫ్రాన్స్-భారత్ చిరకాల స్నేహానికి గుర్తుగా 1970వ దశకం నుంచి ప్రతి దశకంలోనూ ఫ్రాన్స్ అధ్యక్షుడిని భారత గణతంత్ర దినోత్సవాలకు ముఖ్యఅతిథిగా ఆహ్వానిస్తున్నారు.
- ఇటీవల భారత ప్రధాని ఫ్రాన్స్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా అక్కడి ప్రభుత్వం తమ అత్యున్నత పౌర, మిలిటరీ పురస్కారమైన 'గ్రాండ్ క్రాస్ ఆఫ్ ద లీజియన్ ఆఫ్ హానర్'ను ప్రధానికి ప్రదానం చేసింది.

4. 2047 వరకు భారత్-ఫ్రాన్స్ క్వాంటమ్ టెక్నాలజీస్, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, క్లౌడ్ కంప్యూటింగ్, సూపర్ కంప్యూటింగ్ వంటి వాటిపై పరస్పరం సహకరించుకోనున్న నేపథ్యంలో... ఫ్రాన్స్ సాంకేతికతకు, భారత్ మేథ సంపదకు ఈ చొరవ ఇతోధికంగా సహకరిస్తుంది.


భారత్-ఫ్రాన్స్ సంబంధాల పటిష్టతకు ఎదురవుతున్న సవాళ్లు

1. భారత్-ఫ్రాన్స్ మధ్య రిపబ్లిక్ డే సందర్భంగా కుదిరిన అనేక ఒప్పందాలు, బలపడుతున్న మైత్రి చైనాను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఫ్రాన్స్-చైనా దౌత్య సంబంధాల 60వ వార్షికోత్సవం సందర్భంగా చైనా అధ్యక్షుడు, ఫ్రాన్స్‌తో స్నేహ సంబంధాలను బలపరుచుకొనే దిశగా అనేక కీలక వ్యాఖ్యలు చేశారు. ఫ్రాన్స్‌తో స్నేహబంధాన్ని పెంచుకోవాలని ఆశిస్తున్నట్టు ప్రకటించారు. భారత్‌కు ప్రత్యక్షంగా ఈ సంఘటన వల్ల నష్టం లేకపోయినా... భారత్ సరిహద్దు దేశాల్లో, ముఖ్యంగా మిత్ర దేశమైన మాల్దీవుల విషయంలో చైనా వ్యూహాత్మక ఎత్తుగడలపై భారత్‌కు అనుభవం ఉంది.

- ఈ నేపథ్యంలో భారత్ సమయానుసారం మరింత జాగరూకతతో వ్యవహరించాల్సిన అవసరం ఉంది. 'చైనా బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్'కు ఫ్రాన్స్ మద్దతు తెలపడం, ఫ్రాన్స్- అమెరికా మధ్య చిరకాల మైత్రి... భారత్, ఫ్రాన్స్ సంబంధాల్లో కొన్ని బలహీన అంశాలుగా చెప్పుకోవచ్చు.

2. భారతదేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తోన్న ఫ్రెంచ్ వ్యాపార సంస్థలకు చెందిన మేథా సంపత్తి హక్కుల పరిరక్షణ విషయంలో ఫ్రాన్స్ తరచూ భారత్‌పై అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. భారతదేశం ఫ్రాన్స్ మధ్య విదేశీ వాణిజ్యంలో ఫ్రాన్స్ ఎగుమతులు ఎక్కువగా ఉంటున్నాయి. దాంతో వ్యాపార అసమతౌల్యానికి గురవుతున్నామన్న అసంతృప్తి భారత్‌కు ఉంది.
3. అదేవిధంగా ఇరుదేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం భారత్-జర్మనీ వంటి ఇతర దేశాల ద్వైపాక్షిక వాణిజ్యంతో పోల్చితే చాలా తక్కువస్థాయిలోనే ఉంది.

- బీటీఐఏ(ఇండియా - యురోపియన్ యూనియన్ బేస్డ్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ అగ్రిమెంట్)లో పురోగతి కనిపించకపోవడం వల్ల ఫ్రాన్స్‌తో మరింత భారీ స్థాయిలో వాణిజ్య నిర్వహణకు భారత్‌కు అవకాశం ఉండటం లేదు.
- జైతాపూర్ న్యూక్లియర్ ప్రాజెక్టు దిశగా పురోగతి లేకపోవడం కూడా ఈ దేశాల మధ్య వాణిజ్య బంధాన్ని బలహీన పరుస్తోంది. అయితే ఎన్ని అవరోధాలు ఉన్నప్పటికీ చిరకాల మైత్రి, అనేక వ్యూహాత్మక అంశాల దృష్ట్యా... భారత్ - ఫ్రాన్స్ మధ్య సత్సంబంధాలు కొనసాగించాలి. ఇరు దేశాలు తమ మధ్య ఉన్న చిన్నపాటి సమస్యలను పరిష్కరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఫ్రాన్స్ అధ్యక్షుని భారత్ పర్యటనలో కుదిరిన కొన్ని కీలక ఒప్పందాలు, సంయుక్త ప్రకటనలు-

1. భారత్-ఫ్రాన్స్ రక్షణ రంగానికి సంబంధించిన పరిశ్రమలు, అంతరిక్ష సంబంధిత రక్షణరంగ అంశాల్లో సహకారానికి రోడ్‌మ్యాప్‌నకు అంగీకారం.
2. న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్, ఎరియన్ స్పేస్(ఎస్ఏఎస్)(ఫ్రాన్స్) మధ్య అంతరిక్ష రంగంలో ఎర్త్ మానిటరింగ్, రిమోట్ సెన్సింగ్, ప్రివెంటింగ్ సొల్యూషన్స్ పరంగా సహకారం.
3. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్ లిమిటెడ్(టీఏఎస్ఎల్), ఎయిర్‌బస్ సంస్థల మధ్య భారత్‌లో పౌరవిమానయానానికి హెచ్125 హెలికాప్టర్ల అసెంబ్లీ లైన్ నిర్మాణ సహకారానికి ఒప్పందం.
4. ఇరుదేశాల శాస్త్ర, సాంకేతికరంగ ప్రభుత్వ సంస్థల మధ్య సహకారానికి ఒప్పందం. సంయుక్త పరిశోధన ప్రాజెక్టులకు ఆర్థిక, సాంకేతిక సహకారానికి ఫ్రేమ్‌వర్క్ ఏర్పాటుకై నిర్ణయం.
5. ఆరోగ్యం, ఔషధరంగంలో సహకారానికి భారత ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ, మినిస్ట్రీ ఆఫ్ లేబర్, హెల్త్ అండ్ సాలిడారిటీ ఆఫ్ ఫ్రాన్స్ మధ్య ఒప్పందం.
6. ప్రభుత్వ పాలన, పాలన సంస్కరణల పరంగా ఇరు దేశాల మధ్య సహకారానికి సంబంధిత ఇరుదేశాల మంత్రిత్వశాఖల మధ్య ఒప్పందం.
7. సుస్థిర పట్టణాల అభివృద్ధిపరంగా ఇరుదేశాల మధ్య ఇప్పటికే ఉన్న ఒప్పందాలను మరింత పొడిగించారు.
8. 2026ను ఇండియా-ఫ్రాన్స్ 'ఇయర్ ఆఫ్ ఇన్నోవేషన్'గా ప్రకటించారు.
9. ఈఫిల్ టవర్ వద్ద భారత్ నగదురహిత చెల్లింపుల వ్యవస్థ యూపీఐను అమలులోకి తెస్తున్నట్టు ఫ్రాన్స్ ప్రకటించింది.
10. ఇంటర్నేషనల్ సోలార్ అలయెన్స్‌కు సంబంధించిన స్టార్-సి ప్రోగ్రామ్ కింద సెనెగల్‌లో 'సోలార్ అకాడమీ'ని ఏర్పాటు చేయనున్నారు.
11. భారత కాన్సులేట్‌ను ఫ్రాన్స్‌లోని మార్సైల్లీలో, ఫ్రాన్స్ కాన్సులేట్‌ను హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడానికి అంగీకారం కుదిరింది.
12. 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ పార్ట్‌నర్‌షిప్' ఒప్పందం కింద 'యంగ్ ప్రొఫెషనల్ స్కీమ్' ఏర్పాటు.
13. ఫ్రెంచ్ ఉన్నత విద్యాసంస్థల్లో చదివిన భారతీయులకు అయిదు సంవత్సరాల వ్యవధి కలిగిన 'షెన్ జెన్' వీసా సౌలభ్యం.
14. ఫ్రాన్స్‌లోని నైస్ పట్టణంలో 2025లో జరగనున్న 'యునైటెడ్ నేషన్స్ ఓషన్ కాన్ఫరెన్స్'కు భారత్ మద్దతు.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

లిటిల్స్



సింహం- చిట్టెలుక


అడవిలో మృగరాజు సింహం. రాజు వస్తున్నాడంటే హడలు. అయితే అదే అడవిలో ఓ చిట్టెలుక ఉండేది. ఆ చిట్టెలుక సోమరి. ఎంత సోమరి అంటే శత్రువు వచ్చినా పరిగెత్తకుండా సోమరిగా ఉండేంత సోమరి. ప్రాణాలు పోతాయని మిత్రులు హెచ్చరించినా పట్టించుకునేది కాదు. దాని తీరే అంత.


ఒకరోజు సింహం దారింటా వెళ్తోంది. దానికి నిద్ర వస్తోంది. పడుకుందామని పొదలచాటుకు వెళ్లింది. ఆ పొదల చాటునే అనుకోకుండా చిట్టెలుక ఇల్లు ఉంది. ఆ సింహం పడుకుంది. నిద్రలో ఉంది. చిట్టెలుక బొరియలోంచి బయటకు రావాలి ఆహారం కోసం. సింహం ఉందని పట్టించుకోకుండా సింహాన్ని ఎక్కి తన పనికి వెళ్లిపోయింది. మళ్లీ అర గంట తర్వాత బొరియ దగ్గరకు వచ్చింది. సింహం మీద తిరుగుతూ ఉంది. మృగరాజు ఆ సింహమే అని దానికి తెలీదు. మిగతా జంతువులు దాని దరిదాపుల్లో లేవు. సింహం చిట్టెలుక చేష్టలకు చూసింది. పంజా దగ్గరకు వస్తూనే చిట్టెలుకను పట్టేసుకుంది సింహం. చిట్టెలుక ప్రాణం పోయినట్లు విలవిల్లాడింది. మృగరాజునే అవమాన పరుస్తావా? అన్నట్లు చూసింది సింహం. వదిలేయండి రాజా.. మీరనుకోలేదు. మీకు తప్పకుండా ఏదో సాయం చేస్తాను అన్నది చిట్టెలుక.

సింహానికి కోపం వచ్చింది. 'అసలే తప్పు చేశావు. పైగా నాకు సాయం చేస్తానని నోటికి మాట్లాడుతున్నావు' అంటూ చేతిని అదిమిపట్టింది. చిట్టెలుక కళ్లు బయటకి వచ్చాయి. క్షణాల్లో ఓ చిలుక వచ్చి.. 'చిట్టెలుక మీదనా మీ ప్రతాపం' అన్నది. వెంటనే చిట్టెలుకను సింహం వదిలేసింది. భయంతో వణికిపోయింది. బొరియలోపలికి పారిపోయింది.

ఒక రోజు చిట్టెలుక బొరియలో ఉన్నది. ఓ సింహం అరుపు వినపడింది. బయటకు వచ్చి చెట్టెక్కి చూసింది. సింహం వలలో ఇరుక్కుపోయింది. వేటగాడి వలకు చిక్కిన సింహం దగ్గరకు వెళ్లింది. క్షణం కూడా ఆలస్యం చేయకుండా ఆ వలను తన పొడవైన పళ్లతో కొరికేసింది. ఆ చిట్టెలుక మంచితనంతో పాటు ఇచ్చిన మాట నెరవేర్చుకునే తత్వానికి పొంగిపోయింది సింహం. ఎంత గొప్ప మనసో అంటూ చిట్టెలుకను కీర్తించింది. 'ఇది సాయమే కదా' అన్నది చిట్టెలుక.


దారి కనుక్కోండి





చుక్కలు కలిపి రంగులు వేయండి

సరైన నీడ ఏది?





డైలీ సుడోకు - 222

				6			8	7
			1				9	
		8						2
4	5	1	6					3
		2				8		
8					2	6	4	5
9						7		
	7				3			
2	4			5				

సుడోకు - 221 సమాధానం

9	5	2	8	6	1	4	3	7
3	7	6	4	5	2	8	9	1
4	8	1	9	7	3	6	5	2
8	3	4	2	1	5	9	7	6
5	6	9	3	4	7	2	1	8
2	1	7	6	9	8	5	4	3
1	9	8	7	2	4	3	6	5
6	2	5	1	3	9	7	8	4
7	4	3	5	8	6	1	2	9

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.